Estd. 1938

ఆంధ్రప్రభ

www.prabhanews.com

Journalism first!

సంపుటి:57 • సంచిక:291 • మంగళవారం 5 ఫిబ్రవరి 2019 • హైదరాబాద్ * పేజీలు:12+4 • వెల: 5.00 • Published from: Hyderabad | Karimnagar | Nizamabad | Suryapet | Vijayawada | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Kurnool | Anantapur | Nellore

ముహూర్తం

శ్రీ విళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం; తిథి: శుద్ధ పాడ్యమి తె.3.20 వరకు, అనంతరం విదియ; నక్షత్రం: ధనిష్ఠ (పూర్తి); అమృతకాలం: రా.8.15 నుండి 10.05వరకు; వర్జ్యం: ఉ.9.25 నుండి 11:11 వరకు; దుర్ముహూర్తం: ఉ.8.24 నుండి 9.12 వరకు, రా. 10.48 నుండి 11.36 వరకు; రాహుకాలం: మ.3.00 నుండి 4.30 వరకు; యమగండం: ఉ.9.00 నుండి 10.30 వరకు



ఒక్కరోజే 100 మంది విద్యార్థులు ఇంటిదారి

- నేటితో ముగుస్తున్న గడువు
- అమెరికా సర్కార్ హెచ్చరికల జారీ
- విద్యార్థుల తాకిడితో విమానాలు ఫుల్
- విమాన ఛార్జీలకు రెక్కలు

70 వేల నుంచి లక్ష పలుకుతున్న ఛార్జీలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : వీసా గడువు ముగిసి అగ్రరాజ్యం అమెరికాలో అక్రమంగా తల దాచుకుంటున్న తెలుగు రాష్ట్రాల విద్యార్థులు, ఉద్యోగాల కోసం నిరీక్షిస్తున్న టెక్కీలు ఒక్కరొక్కరిగా ఇంటిదారి పడుతున్నారు. వలసదారులు ఫిబ్రవరి 5వ తేదీ సాయంత్రానికల్లా దేశం విడిచి వెళ్లాలని అమెరికా ప్రభుత్వం ఆరు మాసాల క్రితమే హుకుం 3వ పేజీలో...

కేబినెట్‌పై కసరత్తు కొలిక్కి...

కొత్త నీరు!

ఆరు కొత్త ముఖాలకు అవకాశం

- ఆది, సోమ వారాల్లో విస్తరణ
- గోప్యంగా సమాచారం
- ఖమ్మం జిల్లా కోటాలో ఎమ్మెల్సీ రాజేశ్వరరెడ్డికి అవకాశం
- వేముల, నిరంజన్, ఎర్రబెల్లి, రేఖా నాయక్‌లకు ఛాన్స్
- ఉపసభాపతిగా వినయ భాస్కర్?

హైదరాబాద్, ఆంధ్రప్రభ : మంత్రివర్గ విస్తరణపై సీఎం కేసీఆర్ చేస్తున్న కసరత్తు కొలిక్కి వచ్చినట్టు అత్యంత విశ్వసనీయంగా తెలిసింది. ఈ దఫా మంత్రివర్గంలో ఆరుగురు కొత్త మొహాలు ఉండే అవకాశం ఉందని ఆ దిశగా కేసీఆర్ కీలక నిర్ణయం తీసుకోబోతున్నారని తెరాస వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఇదివరకు ప్రభుత్వంలో మంత్రులుగా ఉన్న వారిలో ఎక్కువ మందికి ఈ దఫా అవకాశం ఉండదన్న అభిప్రాయం పార్టీలో వ్యక్తమవుతోంది. తొలిసారి ఎమ్మెల్యేలుగా గెలిచిన వారిలో ఇద్దరు లేదా ముగ్గురికి విస్తరణలో ఛాన్స్ దక్కవచ్చన్న ప్రచారం ఉంది. ఆయా జిల్లాల పరిస్థితి, సామాజిక సమీకరణాలు, తెలంగాణ ఉద్యమం నుంచి పార్టీలో ఉండి పోరాడిన వారు, స్వరాష్ట్రం సిద్ధించాక జరిగిన ఎన్నికల్లో నేతలు వ్యవహరించిన శైలి, విధానం, ఎమ్మెల్యేలుగా గత నాలుగున్నరేళ్ళలో నియోజక వర్గ ప్రజలకు అందుబాటులో ఉన్న అంశాలను పరిగణలోకి తీసుకుని మంత్రివర్గ జాబితాను రూపొందించేపనిలో కేసీఆర్ నిమగ్నమైనట్టు తెలుస్తోంది. మంత్రివర్గ విస్తరణకు ముహూర్తాన్ని ఖరారు చేసినా ఆ తేదీని మాత్రం కేసీఆర్ గోప్యంగా ఉంచుతున్నట్టు సమాచారం. సీఎం కార్యాలయ ఉన్నతాధికారుల కథనం ప్రకారం.. విస్తరణ 3వ పేజీలో...



యాదాద్రిపై ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్ సమీక్ష

యాదాద్రికి మరిన్ని నిధులు?

నెల్లూరు, తంజావూరు, అక్షరధామ్ లాంటి ప్రసిద్ధ ఆలయాలపై అధ్యయనం చేయండి • ఉన్నతస్థాయి సమీక్షలో సీఎం కేసీఆర్ సూచనలు.. ఆదేశాలు 2లో



మల్కపేటలో కాళేశ్వరం పనులను పరిశీలిస్తున్న కేటీఆర్

కేసీఆర్ దార్శనికతకు నిదర్శనం కాళేశ్వరం

90% పనులు పూర్తి

- అధికారుల నైపుణ్య ఫలితమిది
- సొరంగంలోకి దిగి పురోగతి తెలుసుకున్న కేటీఆర్
- సెప్టెంబర్ నాటికి సిరిసిల్ల జిల్లా సస్యశ్యామలమని ప్రకటన

కోనరావుపేట, హైదరాబాద్: కాళేశ్వరం భూగర్భ సొరంగం పనులను టీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీమంత్రి కల్వకుంట్ల తారక రామారావు సోమవారం ఆకస్మికంగా పరిశీలించారు. చీకటి గుహలోకి చకచకాదిగిన యువనేత, అధికారులకు ముందస్తు సమాచారం లేకుండానే రాజన్న సిరిసిల్ల జిల్లాలోని తన నియోజకవర్గంలోని వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటూ కోనరావు పేట మండలం మల్కపేటలో నిర్మిస్తున్న రిజర్వాయర్ పనులను, అండర్ టన్నెల్ పనులను పరిశీలించాలని నిర్ణయించారు. అండర్‌టన్నెల్ లోకి దిగి ఎంతవరకు పనులు పూర్తయ్యాయో తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ దార్శనికతకు ఈ కాళేశ్వరం ప్రాజెక్టు నిదర్శనమన్నారు. సీఎం కేసీఆర్ పట్టుదల, నీటిపారుదల శాఖలోని అనుభవజ్ఞులైన నిపుణుల సహకారంతో 90శాతం పనులు పూర్తయ్యాయని, ఆగస్టు సెప్టెంబర్ నాటికి మొత్తం పనులు పూర్తవుతాయని ఆయన 2వ పేజీలో...

ప్రపంచ మార్కెట్లోకి తెలంగాణ బియ్యం



- ఇక వ్యాపార రంగంలోకి పౌరసరఫరాల సంస్థ
- త్వరలో ప్రత్యేక బిజినెస్ విభాగం
- ధాన్యం కొనుగోలుకు యాక్షన్ ప్లాన్
- 24 గంటల విద్యుత్తుతో భారీగా సాగు విస్తీర్ణం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ప్రపంచ మార్కెట్లోకి తెలంగాణ బియ్యాన్ని ప్రవేశపెట్టేందుకు టీఆర్ఎస్ సర్కారు మార్కెటింగ్ వ్యూహాలను సిద్ధం చేస్తోంది. రైతుబంధ పథకం అమలు ద్వారా ఇప్పటికే అంతర్జాతీయస్థాయి ఖ్యాతిని గడించిన ప్రభుత్వం ఇక ఆహారోత్పత్తులు 2వ పేజీలో...

కుంభమేళాలో తెలుగుల వేళ..!



అలహాబాద్ (ప్రయాగరాజ్)లో మౌని అమావాస్య తెల్లవారుజామున కుంభమేళా భక్తుల పుణ్యస్నానాలు

కోల్‌కతా ప్రకంపనలు

సుప్రీంకోర్టు తలుపు తట్టిన సీబీఐ.. నేడు విచారణ

- దీక్షలోనే మమత
- వేదిక పైనే వాకింగ్
- అక్కడే సమీక్షలు
- ట్రాఫిక్ ఔట్‌పోస్ట్‌లో కేబినెట్ మీటింగ్
- ధర్నా వేదిక మీదే పోలీసు అవార్డుల ప్రదానం
- పార్లమెంటులో బెంగాల్ రగడ
- మమతకు అండగా ప్రతిపక్షాలు



11

ఔరా..!



లీనా ఎర! చిక్కిన జయరాం

- పక్కాప్లాన్‌తో రప్పించుకున్న రాకేష్
- ఒకరోజు నిర్బంధం.. టార్చర్.. కొంత డబ్బు వసూలు
- రెండోరోజు మరికొందరితో కలిసి హత్య

8లో



రాకేష్ (ఫైల్)

రాకేష్ కాల్‌లిస్ట్‌లో ఓ సీఐ ఫోన్ నెంబర్!

- నల్లకుంట సీఐ శ్రీనివాస్‌పై బదలీ వేటు
- పోలీసుల పాత్రపై అనుమానాలు



6

మాల్యా అప్పగింతకు లైన్‌క్లియర్

భారత్ విజయం

ఆ చేప వస్తే చేటేనట!



సముద్రంలో వేటకు వెళ్లినపుడు వలలో భారీ చేపలు చిక్కితే ఇక ఆ మత్స్యకారులకు పెద్దపండగే. కానీ జపాన్‌లో అలా ఓ రకానికి చెందిన పెద్ద చేపలు చిక్కితే వాటిని చూసి జనం హడలిపోతున్నారట. ఎందుకంటే.. అవి కనిపిస్తే...భూకంపాలు, సునామీవంటి ప్రకృతి విపత్తులు వస్తాయని మూఢనమ్మకం వారిని వెంటాడుతోంది. సముద్రం అడుగున ఉండే అవి ఏదైనా విపత్తు వస్తుందని గ్రహిస్తే... ఉపరితలానికి వస్తాయట. తొయామా తీరంలోని ఓ పోర్టు జలాల్లో ఈమధ్యకాలంలో తరచూ ఓర్ ఫిష్ చిక్కుతోంది. నాలుగు నెలల క్రితం 3.2 రెండు మీటర్ల పొడవైన ఓ చేప వలలో చిక్కితే తాజాగా 4 మీటర్ల పొడవున్న మరో చేప దొరికింది. దీంతో దీవిలోని ప్రజలు భయపడుతున్నారు. ఏదో ఒక విపత్తు రాబోతోందని ఆందోళన చెందుతున్నారు.

బొద్దింకలకు మాజీ ప్రియుల పేర్లు..

మీ మాజీ ప్రియుడు లేదా ప్రియురాలిపై పీకలవరకు కోపం ఉందా.. అయితే మాదగ్గర ఉన్న బొద్దింకల్లో ఓ దానికి వారి పేరు పెట్టండి... కక్షతీర్చుకోండి... కాకపోతే కాస్తంత రుసుం చెల్లించాలి అంటూ లండన్‌లోని ఓ జూ సరికొత్త పథకాన్ని ప్రకటించింది. ఫిబ్రవరి 14న ప్రేమికుల దినోత్సవం సందర్భంగా ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. లండన్‌కు సమీపంలోని ది హెమ్స్‌లీ కన్సర్వేషన్ ఈ ఆఫర్‌ను ప్రకటించింది. రెండు డాలర్ల మొత్తాన్ని చెల్లిస్తే మాజీ ప్రియుడు లేదా ప్రియురాలి పేరు ఒక బొద్దింకకు పెడతారు. పైగా జూ పేరుతో ఓ సర్టిఫికెట్ కూడా ప్రదానం చేస్తారు. ఆ సర్టిఫికెట్ చూపించి ఎప్పుడైనా మళ్లీ జూ సందర్శించినప్పుడు ప్రవేశ రుసుములో రాయితీ కూడా ఇస్తారు .



యాదాద్రికి మరిన్ని నిధులు?

- చరిత్రలో నిలిచేలా శిల్ప కళానైపుణ్యం
- అవసరాన్ని బట్టి వచ్చే బడ్జెట్‌లో నిధుల ప్రాధాన్యత
- పునరుద్ధరణ పనులు పూర్తయ్యాక సహస్రాష్టక కుండయాగం
- 11 రోజులపాటు అత్యంత వైభవంగా మహాయాగం
- రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, ప్రధాని, కేంద్రమంత్రులు, ముఖ్యమంత్రులకు ఆహ్వానం
- నెల్లూరు, తంజావూరు, అక్షరధామ్ లాంటి ప్రసిద్ధ ఆలయాలపై అధ్యయనం
- యాదాద్రి పనులపై సీఎం సమీక్షా సమావేశం



హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడేలా అద్భుతమైన ఆలయ శిల్ప కళానైపుణ్యంతో యాదాద్రి క్షేత్రాన్ని తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు సంబంధిత యంత్రాంగాన్ని ఆదేశించారు. ఆలయ ప్రాశస్త్యం, వైభవం, ప్రస్ఫుటమయ్యేలా పునరుద్ధరణ పనులు జరగాలన్నారు. నిర్మాణ పనులకు నిధుల కొరత లేదని, అవసరాన్ని బట్టి బడ్జెట్‌లో ప్రాధాన్యత పెంచుతామని స్పష్టంచేశారు. ఈ అంశంపై సోమవారం ప్రగతి భవన్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. పునరుద్ధరణ పనులన్నీ పూర్తయిన తర్వాత 1,008యాగ గుండాలతో సహస్రాష్టక కుండయాగం నిర్వహించనున్నట్టు వెల్లడించారు. 11 రోజులపాటు నిర్విఘ్నంగా, వైభవోపేతంగా జరగనున్న ఈ మహా యాగానికి రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, ప్రధానమంత్రి, కేంద్రమంత్రులు, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, గవర్నర్ల ను ఆహ్వానించనున్నట్లు పేర్కొన్నారు. ఆధ్యాత్మిక శోభ వెల్లివెరిసేలా నిర్మించిన వెల్లూరు, తంజావూరు, అక్షరధామ్ లాంటి సుప్రసిద్ధ దేవాలయాలను సందర్శించి అక్కడి నిర్మాణాలపై అధ్యయనం చేయాలని దేవాదాయశాఖ అధికారులను ఆదేశించారు. ప్రతి ఒక్కరూ తమ జీవితంలో ఒక్కసారైనా యాదాద్రిని సందర్శించుకోవాలన్న తపన, ఉత్సుకత కలిగేలా ఆలయ ప్రాంగణాన్ని తీర్చిదిద్దాలని చెప్పారు. శివరాత్రి ఉత్సవాలు, తెప్పోత్సవం నిర్వహించేందుకు తలనీలాల సమర్పణకు, మండ ల దీక్ష భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు శాశ్వత ప్రాతిపదికన ఉండాలన్నారు.

పనులన్నీ సమాంతరంగా సాగాలి

ఒకదాని తర్వాత మరొకటి కాకుండా యాదాద్రి నిర్మాణ పనులన్నీ సమాంతరంగా సాగాలని, అందుకోసం ఏ పనికి ఆ పనిగా వేర్వేరు ప్రణాళికలు సిద్ధంచేసుకుని అమలు చేయాలని కేసీఆర్ సూచించారు. ప్రధాన ఆలయం గుట్ట పైభాగంలో ఇంకా ఎలాంటి నిర్మాణాలు అవసరం? కింది భాగంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టాలి? టెంపుల్ సిటీకి ఏయే నిర్మాణాలు అవసరం? మొత్తం యాదాద్రి క్షేత్రం ఎలా ఉండాలి అనే అంశాలపై చర్చించిన కేసీఆర్ కొన్ని నిర్ణయాలు తీసుకున్నా రు. మాడవీధులు, ప్రాకారాలు కలుపుకుని 4.5 ఎకరాల విస్తీర్ణంలో ప్రధాన దేవాలయం నిర్మించాలన్నారు. మొత్తం 302 ఎకరాల విస్తీర్ణంలో దేవాలయ ప్రాంగణం ఉంటుందని సీఎం వెల్లడించారు.

సకల సౌకర్యాలు

లక్ష్మీనరసింహస్వామి కొలువుదీరే గుట్ట పైభాగంలో ప్రధాన దేవాలయంతో పాటు గోపురాలు, ప్రాకారాలు, మాడవీధులు, శివాలయం, ఆంజనేయస్వామి విగ్రహం, ఈవో కార్యాలయం, వీవీఐపీ గెస్ట్‌హౌస్, అర్చక నిలయం, నైవేధ్యపు వంటశాల, ప్రసాద మండపం, రథశాల, వ్రత మండపం, స్వామి పుష్కరిణి, క్యూ కాంప్లెక్స్, మెట్లదారి, బస్టాండ్, పోలీస్ ఔట్‌పోస్టు, హెల్త్ సెంటర్ తదితర అనేక నిర్మాణాలు ఉండాలని అధికారులను సీఎం ఆదేశించారు. ఏ నిర్మాణం ఎక్కడ ఉండాలనే అంశంపై దిశానిర్దేశం చేశారు.

బస్వాపూర్ నుంచి గండి చెరువుకు నీరు

గుట్ట కిందిభాగంలో గండిచెరువును తెప్పోత్సవం నిర్వహించేందుకు అనువుగా తీర్చిదిద్దాలని సూచించారు. బస్వాపూర్ రిజర్వాయర్ నుంచి నిత్యం ఈ చెరువుకు నీటి సరఫరా జరిగేలా చూడాలన్నారు. గండి చెరువుకు అనుబంధంగా కళ్యాణకట్ట నిర్మించాలన్నారు. గుట్ట కింది భాగంలోనే ఆలయ ప్రధాన బస్టాండ్ నిర్మించాలని, అక్కడి నుంచి భక్తులను ప్రత్యేక వాహనాల ద్వారా గుట్టపైకి వెళ్ళేందుకు రవాణా సదుపాయం కల్పించాలని స్పష్టంచేశారు. గుట్ట కింద మండల దీక్ష చేపట్టిన భక్తుల కోసం ప్రత్యేక ఆశ్రమాన్ని నిర్మించాలన్నారు.

రింగ్‌రోడ్డు నిర్మాణం

యాదాద్రి క్షేత్రం చుట్టూ రింగ్‌రోడ్డు నిర్మించాలని కేసీఆర్ ఆదేశించారు. అందుకు అనుబంధంగా రేడియల్ రోడ్ల నిర్మాణం చేపట్టాలన్నారు. యాదాద్రి నుంచి తుర్కపల్లి వరకు నాలుగు లైన్ల రహదారులను నిర్మించాలన్నారు. నిర్మాణ పనులన్నీ అత్యంత పటిష్టంగా ఉండాలన్నారు. నాణ్యత విషయంలో ప్రభుత్వం రాజీ పడబోదని స్పష్టంచేశారు.

యాగానికి దేశ, విదేశాల నుంచి ప్రముఖులు

పునరుద్ధరణ పనుల తర్వాత పరిపూర్ణ ఉపాసకులతో అతిపెద్ద యాగం నిర్వహిస్తామ న్నారు. దేశ, విదే శాల నుంచి ప్రముఖులను ఈ యాగానికి ఆహ్వా నిస్తామని చెప్పారు. లక్షలాది మంది భక్తులు పాల్గొనే ఈ యాగం కోసం ఇప్పటి నుంచే ఏర్పాట్లు చేయ డానికి కమిటీని నియ మిస్తున్న ట్లు సీఎం ప్రకటించారు.

భక్తులు బస చేసేందుకు 340 క్వార్టర్లు

భక్తులు బస చేసేందుకు వీలుగా టెంపుల్ సిటీగా 340 క్వార్టర్ల నిర్మాణ పనులను వేగంగా నిర్వహించాలని ఆదేశించారు. టెంపుల్‌సిటీలో రోడ్లు, మంచినీరు, విద్యుత్, డ్రైనేజీ లాంటి కనీస వసతులన్నీ ఉండాలన్నారు. యాదాద్రిలోని ప్రతి బ్లాకుకు దేవుళ్ళు, దేవతల పేర్లు పెడతామని ఈ సందర్భంగా సీఎం చెప్పారు. యాదాద్రి టెంపుల్‌సిటీ అంతా ప్రకృతి రమణీయత గోచరించేలా, ఆహ్లాదం వెల్లివిరిసేలా ఉద్యానవనాలు, పౌంటేన్లు నిర్మించాలని ఆదేశించారు. ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్ శర్మ, ఆర్అండ్‌బి, ఈఎన్సీలు గణపతిరెడ్డి, రవీందర్‌రావు, ఈఈ వసంత నాయక్, ఎస్ఈ లింగారెడ్డి, వైటీడీఏ ప్రత్యేక అధికారి కిషన్‌రావు, ఆలయ ఈవో గీత, నిర్మాణ నిపుణుడు ఆనంద్ సాయి, స్ట్రక్చర్ ఇంజనీర్ వెంకటేశ్వర్లు, అర్కిటెక్టులు మధుసూదన్, వాసుకి, సీఎంవో ప్రత్యేక కార్యదర్శి భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



90 శాతం పనులు పూర్తి

(మొదటిపేజీ తరువాయి)

అన్నారు. ప్రాజెక్టు పూర్తయితే సిరిసిల్ల జిల్లాలోని 2లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. రిజర్వాయర్ల ద్వారా చిన్ననీటివనరులను నింపి తెలంగాణను సస్యశ్యామలం చేయాలని లక్ష్యంగా నిర్ణయించారన్నారు. రిజర్వాయర్ పనులు పూర్తి చేసి రైతులకు, ప్రజలకు త్వరగా అందుబాటులోకి తీసుకువచ్చే ప్రయత్నం చేస్తామన్నారు. మారుమూల గ్రామాల ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే తెరాస పార్టీ ధ్యేయమన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రిజర్వాయర్ పనులను అర్హులైన ప్రతి ఒక్కరికి తెలంగాణ రాష్ట్ర ప్రవేశపెడుతున్న ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందుతాయన్నారు. నూతనంగా సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, వార్డుసభ్యులుగా ఎన్నికైన వారికి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని సమస్యలను ప్రజాప్రతినిధులు కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని కేటీఆర్ అన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, తెరాస నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

కొత్త పంథాలో పల్లెపాలన



- సర్పంచ్‌లకు చట్టాలపై అవగాహన
- అందుకోసం 300 మంది మాస్టర్ ట్రైనీలు
- గ్రామాల అభ్యున్నతే లక్ష్యం.. సర్పంచే కీలకం
- రేపు సీఎం కేసీఆర్ దిశానిర్దేశం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: గ్రామ స్వరాజ్యానికి అద్దం పడుతూ రాష్ట్రంలో పంచాయతీ పాలన కొత్త పుంతలు తొక్కబోతోంది. రాష్ట్రం ఏర్పడ్డాక తొలిసారి గ్రామ పంచాయతీలకు జరిగిన సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా ముగియటంతో ఇక పాలనపై పూర్తి స్థాయిలో దృష్టిసారించింది. రాష్ట్రంలోని 12,680 గ్రామపంచాయతీలకు సర్పంచ్‌లు, వార్డు మెంబర్ల పదవీ బాధ్యతల స్వీకార కార్యక్రమం కూడా పూర్తి కావటంతో ఇక గత ఏడాది రూపొందించిన తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ చట్టాలను పూర్తిస్థాయిలో అమల్లోకి తీసుకురానున్నారు. కొత్తగా ఎన్నికైన సర్పంచ్‌లకు పంచాయతీరాజ్ చట్టాలపై అవగాహన పెంపొందించాలని ప్రభుత్వం భావిస్తోంది. అదే సమయంలో గ్రామీణాభివృద్ధి కోసం రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలు, వాటి ప్రణాళికలు, కేంద్ర ఆర్థికసంఘం ప్రణాళికలు, నిధుల లభ్యత, గ్రామ పంచాయతీల్లో వనరుల అభివృద్ధి తదితర అంశాలపై కొత్త సర్పంచ్‌లకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం పెద్దఎత్తున కార్యక్రమాలు చేపడుతోంది.

ప్రత్యేక ప్రణాళిక సిద్ధం

క్షేత్రస్థాయిలో ప్రజాస్వామ్య స్ఫూర్తికి పంచాయతీ పాలన అద్దంపట్టేలా పాలక వర్గాలను తీర్చిదిద్దబోతున్నారు. ఇందుకోసం ప్రభుత్వం ఇప్పటికే ప్రత్యేక ప్రణాళికను రూపొందించింది. పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి రంగాల్లో అపార అనుభవం గడించిన నిష్ణాతులను ఎంపిక చేసుకుంది. వీరిద్వారా తొలిదశగా రాష్ట్ర స్థాయిలో మూడు వందల మందిని మాస్టర్ ట్రైనీలుగా తయారు చేయనున్నారు. హైదరాబాద్ గ్రామీణాభివృద్ధి సంస్థ వేదికగా వీరికి ఐదు రోజులపాటు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. పంచాయతీ కార్యాలయం, రికార్డుల నిర్వహణ, బ్యాంకుల ద్వారా పంచాయతీకి సంబంధించిన ఆర్థిక లావాదేవీల నిర్వహణ, గ్రామసభల ఏర్పాటు ,తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, వీధి దీపాల నిర్వహణ, మురుగునీటి పారుదల, గ్రామాల్లో అంతర్గత రోడ్ల నిర్మాణం, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు ,పశువైద్యశాలలు , ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు వంటి వాటిపై పర్యవేక్షణ, ప్రతి పంచాయతీలో మొక్కల పెంపకం కోసం నర్సరీల ఏర్పాటు, గ్రామ పంచాయతీకి చెందిన స్థలాల్లో మొక్కలు నాటించి వాటని సంరక్షించటం ద్వారా ప్రభుత్వం పతిష్టాత్మకంగా అమలు చేస్తున్న హరితహారం కార్యక్రమాన్ని విజయవంతం చేయటం వంటి అంశాల్లో మాస్టర్ ట్రైనీలకు శిక్షణ ఇప్పించనున్నారు.

రెండవ దశలో జిల్లాల వారీగా శిక్షణ

రాష్ట్ర స్థాయి మాస్టర్ ట్రైనీల శిక్షణ పూర్తయ్యాక జిల్లాస్థాయిలో శిక్షణా కార్యాక్రమాలను ప్రారంభించనున్నారు. రాష్ట్రంలో 30 జిల్లాల పరిధిలో ఈ శిక్షణా కార్యాక్రమాలను ఏర్పాటు చేసి సర్పంచ్‌లకు , ఉప సర్పంచ్‌లకు మాస్టర్ ట్రైనీల ద్వారా పంచాయతీ పాలనా వ్యవహారాలపై శిక్షణ ఇవ్వనున్నారు. ఒక్కో జిల్లాకు పది మంది మాస్టర్‌ట్రైనీలను కేటాయించ నున్నట్టు అధికారులు పేర్కొన్నారు.

ఆర్థిక వ్యవహారాలపైనా శిక్షణ

గ్రామ పంచాయతీల్లో ఇంటి పన్నుల వసూళ్లు, సంతలు , మార్కెట్ల నిర్వహణ, పంచయాతీ స్థలాల్లో షాపింగ్ కాంప్లెక్సుల నిర్మాణం,ఖాళీగా ఉన్న ఆరు బయలు స్థలాలను లీజకు ఇవ్వటం తదితర కార్యక్రమా లు ద్వారా గ్రామ పంచాయతీ ఆర్థిక వనరులను ఏవిధంగా పెంచుకోవాలన్న అంశాలపై మాస్టర్‌ట్రైనీలకు శిక్షణ ఇవ్వనున్నారు. గ్రామ పంచాయతీలో భవన నిర్మాణాలకు అనుమతుల మంజూరు, లేఅవుట్ల ఏర్పాటులో పాటించాల్సిన నిభంధనలు అమలు చేయిచంటం. అక్రమ నిర్మాణాలను అడ్డుకోవటం అంశాలపై కూడా అవగాహన కల్పించనున్నారు. తెలంగాణ రాష్ట్ర నూతన పంచాయతీరాజ్ చట్టం గ్రామ పంచాయతీ పాలనలో సర్పంచ్‌నే సుప్రీంగా నిలిపింది. పంచాయతీ పరిధిలో ఏవైనా నియమ నిబంధనలు పాటించని వారిపై నేరుగా సర్పంచే పోలీసు కేసు పెట్టే అధికారాన్ని కల్పించింది. సబ్‌ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారి వరకూ గ్రామ సర్పంచ్ కనుసన్నల్లోనే పనిచేసేలా కొత్తపంచాయతీ చట్టం ద్వారా ప్రభుత్వం పంచాయతీ పాలకవ్యవస్థకు అధికారాలు కట్టబెట్టింది. ఈ నేపథ్యంలో సర్పంచ్‌లకు పోలీసు చట్టాల పట్ల కూడా అవగాహణ కల్పించేలా శిక్షణ కార్యక్రమాలు రూపొందిస్తున్నారు.

అధికారులతో రేపు సీఎం సమీక్ష

స్వచ్ఛమైన గ్రామీణ తెలంగాణం లక్ష్యంగా పెట్టుకున్న కేసీఆర్ సర్కారు రాష్ట్రంలో పంచాయతీ పాలనకు మెరుగులు పెట్టే కార్యాక్రమాలు చేపట్టింది. రాష్ట్ర పంచాయతీరాజ్ , గ్రామీణాభివృద్ధి శాఖల ఉన్నతాధికారులతోపాటు, పంచాయతీ పాలనలో ముడిపడి ఉన్న ఇతర రంగాల అధికారులతో ఉన్నతస్థాయి సమీక్షను నిర్వహించనున్నట్టు సమాచారం. ఈ సమావేశంలో నూతన పంచాయతీరాజ్ చట్టాలు , వాటిని క్షేత్రస్థాయిలో అమలు చేయటం, పంచాయతీ పాలనలో గ్రామాల అభివృద్ధికి తీసుకోదగ్గ చర్యలు తదితర అంశాలపై ముఖ్యమంత్రి కేసీఆర్ సమగ్రంగా చర్చించనున్నారు. ఈ నేపథ్యంలోనే సోమవారం నుంచి ప్రారంభం కావాల్సిన మాస్టర్ ట్రైనీల శిక్షణ కార్యక్రమాన్ని ఈనెల ఆరవ తేదీకి వాయిదా వేసినట్టు అధికారులు తెలిపారు. మాస్టర్ ట్రైనీల శిక్షణ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రే స్వయంగా పాల్గొననున్నట్టు సమాచారం. ఐదురోజుల పాటు సాగే శిక్షణ కార్యక్రమంలో సీఎం తొలిరోజు మాస్టర్ ట్రైనర్స్‌ను ఉద్దేశించి ప్రసంగించనున్నారు.

కవితకు కేరళ అసెంబ్లీ ఆహ్వానం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: దేశంలోని విశ్వవిద్యాలయాల విద్యార్థులతో కేరళ అసెంబ్లీ నిర్వహిస్తున్న సదస్సులో ప్రసంగించాల్సిందిగా నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవితను కేరళ అసెంబ్లీస్పీకర్ పి.రామకృష్ణన్ కోరారు. ఈమేరకు ఆయన ఎంపీ కవితను ఆహ్వానిస్తూ లేఖ రాశారు. కేరళ అసెంబ్లీ డైమండ్ జూబ్లీ ఉత్సవాల్లో భాగంగా ఈనెల 23నుండి 25వరకు నిర్వహిస్తున్న సదస్సును ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు 23న ప్రారంభిస్తారు. అదేరోజు మధ్యాహ్నం తిరువనంతపురంలోని కేరళ అసెంబ్లీ కాంప్లెక్స్ లో జరిగే సదస్సులో క్యాస్ట్ అండ్ డిస్కటెంట్స్ అనే అంశంపై ప్రసంగించాల్సిందిగా ఎంపీ కవితను కేరళ స్పీకర్ కోరారు. కేరళ సీఎంతో పాటు దేశం నలుమూలల నుండి వివిధ రాష్ట్రాల మంత్రులు, ఎంపీలు కవితను కేరళ స్పీకర్ కోరారు. కేరళ సీఎంతో పాటు దేశం నలుమూలల నుండి వివిధ రాష్ట్రాల మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు కూడా సదస్సుకు హాజరవుతారని, దేశవ్యాప్తంగా 2వేల మంది సామాజికంగా, రాజకీయంగా క్రియాశీలకంగా ఉన్న జాతీయ విద్యార్థులు సదస్సులో పాల్గొంటారని శ్రీరామకృష్ణన్ లేఖలో పేర్కొన్నారు. ఉత్సవాల్లో భాగంగా అనేక సెమినార్లు నిర్వహించనున్నారు.ఇందులో యువతలో ప్రజాస్వామిక విలువలు, జీవన విధానం, ప్రజాస్వామిక ఆలోచన దృక్పదాన్ని పెంపొందించే లక్ష్యంతో సదస్సు నిర్వహిస్తున్నారు. కేరళ అసెంబ్లీ, ఆ రాష్ట్ర ప్రభుత్వ పార్లమెంటరీ వ్యవహారాలశాఖలు సంయుక్తంగా ఎంఐటి-వరల్డ్ పీస్ యూనివర్సిటీ, పూణె సాంకేతిక సహకారంతో ప్రజాస్వామ్యంపై ఉత్సవాలను నిర్వహిస్తున్నాయి.

ప్రపంచ తెలుగు మహిళా సదస్సుకు కవిత

నిజామాబాద్ ఎంపీ కవితకు అరుదైన గౌరవం దక్కింది. మార్చి 2,3 తేదీల్లో మలేషియా రాజధాని కౌలాలంపూర్‌లో జరిగే ప్రపంచ తెలుగుమహిళా సదస్సుకు రావాలని ఆమెకు ఆహ్వానం అందింది. ఈమేరకు తెలుగు అసోసియేషన్ ఆఫ్ మలేషియా మహిళావిభాగం, ఇంటిగ్రేటర్ రూరల్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు కవితకు ఆహ్వానపత్రం అందజేశారు.

ప్రపంచ మార్కెట్‌లోకి తెలంగాణ బియ్యం

(మొదటిపేజీ తరువాయి)

వాటి ఎగుమతులపై దృష్టి కేంద్రీకరించింది. రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న కాళేశ్వరం ,సీతారామ ఎత్తిపోతల వంటి పలు సాగునీటి ప్రాజెక్టుల పనులు చివరదశకు చేరువవుతున్నాయి. అంతే కాకుండా ఇప్పటికే వ్యవసాయ రంగానికి 24గంటల ఉచిత విద్యుత్ గత ఏడాది కాలంగా అమల్లో ఉంది. దీంతో వచ్చే ఏడాది నుంచి రాష్ట్రంలో పంటల సాగు విస్తీర్ణం భారీగా పెరగనుంది. ప్రత్యేకించి ధాన్యం ఉత్పత్తులు ఇప్పుడున్న దానికంటే రెట్టింపు కానున్నట్టు ప్రభుత్వం అంచనాలు వేస్తోంది. ధాన్యం దిగుబడులకు తగ్గట్టుగా ప్రభుత్వం మార్కెటింగ్ వ్యూహాలను కూడా సిద్ధం చేసుకుంటోంది. అందులో భాగంగానే తెలంగాణ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థలో వినూత్న మార్పులకు శ్రీకారం చుడుతోంది. ఇప్పటివరకూ రాష్ట్రంలో ధాన్యాన్ని సేకరించటం , ప్రజా పంపిణీ వ్యవస్థద్వారా రేషన్ దుకాణాలకు , ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లకు బియ్యం ఇతర ఆహారా ధాన్యాలు సరఫరా చేసేందుకు మాత్రమే పరిమితం అయిన పౌర సరఫరాల సంస్థ వినూత్న మార్కెటింగ్ స్ట్రాటజీలపై దృష్టిపెట్టింది.



మిల్లింగ్ ఇక్కడే..

తెలంగాణలో పండే సన్నబియ్యానికి మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. అయితే పెరిగే ఉత్పత్తులకు తగ్గట్టుగా రాష్ట్రమార్కెట్‌లో పరిమితంగానే అవకాశాలు ఉంటాయి. అదే ఇతర రాష్ట్రాలకు , ఇతర దేశాలకు తెలంగాణ బియ్యాన్ని ఎగుమతి చేసేందుకు మార్కెటింగ్ లక్ష్యాలను విస్తృతపరుచుకోవాలన్న నిర్ణయానికి వచ్చింది. అందులో భాగంగా ప్రత్యేక బిజినెస్ విభాగాన్ని ఏర్పాటు చేయాలన్న నిర్ణయానికి వచ్చింది. ఈ విభాగం ద్వారా రైతుల నుంచి నేరుగా ధాన్యాన్ని కొనుగోలు చేయనున్నా రు. ఈ విధంగా కొను గోలు చేసిన ధాన్యాన్ని రాష్ట్రంలోనే మిల్లింగ్ చేసి ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేయనున్నారు. ప్రపంచ బియ్యం మార్కెట్‌ను ఎప్పటి కప్పుడు అధ్యయనం చేస్తూ ఆయా దేశాల అవసరాలకు తగ్గట్టు గా తెలంగాణ సన్న బియ్యాన్ని ఇక్కడి నుంచి నేరుగా ప్రపంచ మార్కెట్‌కు ఎగుమతి చేసేందుకు ఉన్న అవకాశాలను పరిశీలిస్తున్నట్టు రాష్ట్ర పౌరసరఫాల శాఖ కమిషనర్ అకున్ సబర్వాల్ వెల్లడించారు.

అధికారులకు శిక్షణ

ధాన్యం సేకరణ, కష్టం మిల్లింగ్ రైస్, గోదాముల్లో నిల్వ బియ్యం నాణ్యత, ధాన్యం సేకరణ, గన్నీ సంచుల వినియోగం, ఆర్థికంగా రాష్ట్రంపై భారం పడకుండా నిర్దేశిత సమయంలో రేషన్ బియ్యం రవాణా, పంపిణీ, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం నిఘా, సాంకేతిక పరిజ్ఞానంతో కొత్తగా ప్రవేపెట్టిన విధానాలు, ధాన్యం చెల్లింపులకు సంబంధించి న ఓపిఎంఎస్ సాఫ్ట్‌వేర్ తదితర అంశాలపై అధికారు లకు శిక్షణ ఇచ్చారు. గత ఏడాది రాష్ట్రంలో ఖరీఫ్, రబీ సీజన్లు కలిపి పౌరసరఫరాల సంస్థ 54లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతులనుంచి కొనుగోలు చేసింది. ఈ ఏడాది ఒక్క ఖరీఫ్ సీజన్‌లోనే ఏకంగా 40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రికార్డు సృష్టించింది. రబీ సీజన్ ధాన్యం ఇంకా రావాల్సి ఉంది. ఈ నేపథ్యంలోనే వచ్చే ఏడాది రాష్ట్రంలో ఆహార ధాన్యాల పంటసాగు విస్తీర్ణంతోపాటు ధాన్యం దిగుబడులు కూడా భారీగా పెరిగే అవకాశాలు ఉన్నట్టు అంచనా వేసింది. అందుకు తగ్గట్టుగా ధాన్యం కొనుగోళ్ల లక్ష్యాలను పెంచుకుంటూ కొత్త మార్కెటింగ్ వ్యూహాలపై కసరత్తులు చేస్తోంది. పౌరసరఫరాల శాఖ కార్యాలయంలో పనిచేసే అధికారలతోపాటు జిల్లా స్థాయిలో పనిచేసే డీసీఎస్ఓ, ఏసీఎస్ఓ, జిల్లా మేనేజర్లు,అసిస్టెంట్ మేనేజర్లకు సోమవారం శిక్షణా తరగతులు కూడా నిర్వహించింది. వినూత్న వ్యూహాలతో ధాన్యం కొనుగోలు, మార్కెటింగ్ విస్తరణపై ముందస్తు ప్రణాళికలు రూపొందిస్తూ నూతన కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ అధికార యంత్రాంగ వ్యూహాలు ఫలిస్తే సన్న బియ్యం ఎగుమతులతో తెలంగాణ కీర్తిప్రతిష్టలు ప్రపంచ మార్కెట్‌కు పాకనున్నాయి.



బ్యూటీ గుండె ఆగింది

దాదాపు పదకొండేళ్లు కలిసిమెలిసి జీవించిన తన సహచరుడు కన్నుమూసిన తరువాత ఆ బెంగతో కుంగిపోయిన ఓ శునకం విరామవేదనతో కన్నుమూసింది. చనిపోయింది సాదాసీదా శునకం కాదు. ప్రపంచంలోనే అందమైన శునకంగా ఫేస్‌బుక్‌లో 1.6 కోట్లమంది ఆదరణ పొందిన 'బూ'. అమెరికా దంపతులు పెంచుకున్న బూ, బుడ్డీ శునకాల జంటలో బుడ్డీ ఏడాది క్రితం చనిపోయింది. ఆ తరువాత ఒంటరిగా ఉండిపోయిన బూ బెంగపెట్టుకుంది. గుండె సంబంధిత వ్యాధులు మొదలవడంతో నిద్రలోనే గుండెపోటుతో చనిపోయింది. పొమెరియన్ జాతికి చెందిన బూపై 2011లో 'ది లైఫ్ ఆఫ్ ది వరల్డ్ క్యూటెస్ట్ డాగ్' పేరుతో ఓ పుస్తకం విడుదలైంది. ఇకవర్జిన్ రాష్ట్రంలో దీనిని అధికారిక జంతువుల ప్రతినిధిగా ప్రకటించారు.

'ఒంటరి' బాతు ఇక లేదు..!

ఇక్కడ కనిపిస్తున్న డ్రేవర్ అనే ఈ బాతు ఓ పెద్ద సెలబ్రిటీ. ప్రపంచవ్యాప్తంగా అభిమానులను సంపాదించుకున్న ఈ బాతు ఈమధ్యే కన్నుమూసింది. ఓ కుక్కదాడి చేయడంతో అది ప్రాణాలు కోల్పోయింది. ఇంతకీ ఆ బాతు చనిపోతే పెద్ద వార్త ఎందుకయ్యిందంటే... ఓ తుఫాను సమయంలో ఈ బాతు పసిఫిక్ తీరంలోని నియు అనే ఓ చిన్నదీవికి చేరింది. అక్కడ ఇది తప్ప మరో బాతు అన్నది లేదు. ఆ దీవిలో ఎక్కడికైనా వెళ్లాలంటే... ఆ బాతుంది కదా..అక్కడి నుంచి కదిలైపు, లేదా ఎదమవైపు వెళ్లింది అని చెప్పేటంతగా జనంలో ముద్రవేసింది. అమెరికాకు చెందిన ఓ జర్నలిస్ట్ ఆ దీవిని సందర్శించినపుడు ఈ బాతును గమనించి ఓ వార్త రాశాడు. అంతే అప్పటి నుంచి సామాజిక మాధ్యమాల్లో ట్రెవోర్ సెలబ్రిటీగా మారిపోయింది.



హైదరాబాద్‌లో ఆర్గానిక్ ఫెస్టివల్



హైదరాబాద్, ఆంధ్రప్రభ: జాతీయస్థాయిలో కేంద్ర మహిళా, శిశుఅభివృద్ధి శాఖ ఉమన్ ఆఫ్ ఇండియా ఆర్గానిక్ ఫెస్టివల్‌కు ఈ సారి హైదరాబాద్ వేదికకాబోతోంది. ఇప్పటి వరకు ఉత్తరాది రాష్ట్రాలలో నిర్వహిస్తున్న ఫెస్టివల్‌ను ఈ ఏడాది దక్షిణాది రాష్ట్రాలలో నిర్వహించాలని కేంద్రం నిర్ణయం తీసుకుంది. దీనిలో భాగంగా హైదరాబాద్‌ను ఆర్గానిక్ ఫుడ్ హబ్‌గా తీర్చిదిద్దే క్రమంలో తొలిసారిగా ఇక్కడ నిర్వహిస్తున్నారు. ఈనెల 6 నుంచి 10 వరకు శిల్పారామంలో ఈ ఫెస్టివల్‌ను నిర్వహిస్తున్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి కేసీఆర్, కేంద్ర మహిళా శిశు అభివృద్ధి సంక్షేమ శాఖ మంత్రి మేనకా గాంధీ, ముఖ్య అతిథులుగా పాల్గొంటున్నారు. సోమవారం ఏర్పాటైన ప్రత్యేక మీడియా ప్రతి నిధుల సమావేశంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ఎం. జగదీశ్వర్, మహిళాభివృద్ధి శిశు సంక్షేమశాఖ డైరెక్టర్ విజేంద్ర బోయి మాట్లాడారు. దేశ వ్యాప్తంగా ఆర్గానిక్ రంగంలో ఉన్న మహిళ రైతులు, వ్యాపారవేత్తలను ప్రోత్సహించేందుకే ఈ ఫెస్టివల్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు వారు చెప్పారు. 2015 నుంచి ఉమన్ ఆఫ్ ఇండియా ఆర్గానిక్ ఫెస్టివల్‌ను ఢిల్లీలో నిర్వహిస్తున్నా మని, అయితే దక్షిణాదిరాష్ట్రాలలో ఆర్గానిక్ ఉత్పత్తుల పట్ల ప్రజల్లో పెరిగిన ఆసక్తిని గుర్తించి ఈసారి హైదరాబాద్ వేదికగా ఫెస్టివల్‌ను ఏర్పాటు చేశామన్నా రు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సహ అన్ని రాష్ట్రాల నుంచి ఆర్గానిక్ మహిళా రైతులు పాల్గొని, సహజ సిద్ధంగా డ్రై చేసిన ఫ్యాబ్రిక్, బెల్లం, విత్తనాలు, బేకరీ వంటి ఉత్పత్తులు ఉంచాయని వెల్లడించారు.

ఒక్క రోజే 100 మంది విద్యార్థుల ఇంటిదారి

(మొదటిపేజీ తరువాయి)

జారీచేసింది. అయినా అడేమీ పట్టించుకోని భారతీయులు అక్కడే ఉండేలా తమప్రయత్నాలు ప్రారంభించారు. ఈలోపు నకిలీ విశ్వవిద్యాలయ వ్యవహారం బయటపడడం, 129 మంది తెలుగు విద్యార్థులతోపాటు ఆ విశ్వవిద్యాలయంలో ప్రవేశాలు నిర్వహించిన మరో ఎనిమిది మందిని అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేయడంతో భయపడిన విద్యార్థులు, టెక్కీలు స్వరాష్ట్రాలకు పయనమయ్యారు.

అక్కడే ఎందుకు..?

సాధారణంగా భారత్‌లో ఇంజనీరింగ్ పూర్తిచేసి మాస్టర్స్ (ఎంఎస్) చదివేందుకు ఇక్కడి విద్యార్థులు అమెరికా వెళుతుంటారు. నాలుగు సెమిస్టర్ల ఎంఎస్ కోర్సును పూర్తిచేశాక వారు చదివిన విశ్వవిద్యాలయంలో ఏడాది పాటు పార్ట్‌టైమ్ ఉద్యోగం చేసే అవకాశం ఉంటుంది. అప్పటికీ ఉద్యోగం రాని పక్షంలో మరో ఏడాది పాటు ఇతర ఉపాధి అవకాశాలు చూసుకునే అవకాశం అమెరికా ప్రభుత్వం కల్పించింది. నాలుగేళ్ల తర్వాత కూడా ఆ దేశంలో కొనసాగేందుకు ప్రయత్నిస్తే అక్కడి చట్టాలు అంగీకరించవని తిరిగి స్వదేశాలకు వెళ్ళి తాజా వీసాతో అమెరికాకు చేరుకునే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. భారత్‌కు చెందిన విద్యార్థులు రెండేళ్ళ ఎంఎస్ కోర్సును పూర్తిచేసి మరో రెండు, మూడేళ్ళపాటు వీసా గడువు



ముగిసినా అక్కడే ఉండి ఉద్యో గాల కోసం ప్రయత్నాలు చేస్తార ని అప్పటికీ ఎటువంటి ఉద్యోగం దొరకని పక్షంలో మరో పీజీ కో ర్సులో చేరేందుకు ప్రణా ళికలు రూపొందిస్తారన్నారు. కొందరు విద్యార్థులు నాలుగేసి పీజీలు పూర్తి చేసినా ఉపాధి దొర కని పరి స్థితి ఉందని అటువంటి వారు అమెరికాలో వేల సంఖ్య లో ఉన్నారని అక్కడి ప్ర భుత్వాల గణాంకాలను బట్టి తెలుస్తోంది.

ముగిసిన గడువు

అమెరికాలోని ఎనిమిది రాష్ట్రాల్లో అత్యధికంగా తెలుగువారు వీసా గడువు ముగిసినా దొంగచాటున ఉంటున్నారని అటువంటి వారిని తమ దేశాలకు పంపించాలన్న లక్ష్యంతో ఆరు నెలల క్రితం అక్కడి ప్రభుత్వం నోటీసులు జారీచేసి ఫిబ్రవరి 5వ తేదీకల్లా దేశం విడిచి వెళ్ళకపోతే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీచేశారు. ఈ హెచ్చరికల గడువు మంగళవారం సాయంత్రంతో ముగుస్తోంది. అప్పటికీ అక్కడే తిష్టవేసి కాలం వెల్లబుచ్చేందుకు ప్రయత్నాలు చేసిన వారిని గుర్తించి కటకటాల వెనక్కు పంపించాలని నిర్ణయించినట్టు సమాచారం. ఎంఎస్‌తో పాటు ఇతరత్రా సాంకేతిక విద్యా కోర్సులను పూర్తిచేసిన విద్యార్థులు దాదాపు పదివేల మంది ఉంటారని అమెరికా ప్రభుత్వం అంచనా వేసింది. వీటితో పాటు వివిధ కంపెనీల తరపున అమెరికా వెళ్ళి సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల కోసం అన్వేషిస్తున్న మరో పదివేల మంది టెక్కీలు ఇంటిదారి పట్టక తప్పదని చెబుతున్నారు.

ప్రతి ఏటా తెలుగు రాష్ట్రాల్లో ఇంజనీరింగ్ పూర్తిచేసిన లక్ష మంది విద్యార్థుల్లో 15వేల నుంచి 20వేల మంది ఎంఎస్ కోర్సులను చదివేందుకు అమెరికా వెళతారని, మరో ఐదు నుంచి పదివేలు కెనడా, అదే సంఖ్యలో ఆస్ట్రేలియా ఇతరత్రా దేశాలకు వీసాలు పొందుతారని ఆయా దేశాల దౌత్యాధికారులు చెబుతున్నారు.

అమెరికాలో చదువు పూర్తయిన తర్వాత అక్కడే ఉద్యోగం చేయాలన్న ఆకాంక్షతో నిబంధనలకు విరుద్ధంగా ఉండి పోతున్నారని కొన్ని సందర్భాల్లో వారి పోషణ ఇబ్బంది అయినప్పటికీ హోటళ్లు, రెస్టారెంట్లు, మాల్‌లు ఇతర వ్యాపార, వాణిజ్య సముదాయాల్లో గంటకు ఏడు నుంచి పది డాలర్లకు చేరి వచ్చిన మొత్తంతో జీవితం వెల్లదీస్తున్నారని ఎన్ఆర్ఐలు చెబుతున్నారు. గత ఏడాది ఆగస్టు 9వ తేదీన యుఎస్ సిటిజన్ షిప్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీస్ అధికారులు జారీచేసిన పాలసీ మెమోరాండం ప్రకారం నిబంధనలకు విరుద్ధంగా అమెరికాలో ఉంటున్న జే, ఎఫ్, ఎం కేటగిరి నాన్ ఇమిగ్రెంట్ విద్యార్థులు ఆరు నెలల్లో అమెరికా వదిలివెళ్ళిపోవాలని అందులో ఆదేశించింది. ఈ గడువు (మంగళవారం)తో ముగుస్తున్న నేపథ్యంలో ఎంతోమంది తెలుగు విద్యార్థులు తిరుగు పయనమైనట్టు ఇక్కడికి అందిన సమాచారాన్ని బట్టి తెలుస్తోంది.

ఫ్లైట్ చార్జీల మోత..

సాధారణంగా అమెరికాలోని వివిధ రాష్ట్రాల నుంచి హైదరాబాద్, విజయవాడ, విశాఖ, బెంగళూరు, చెన్నై నగరాలకు రావాలంటే ముందుగానే విమాన టికెట్లను కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఉంటుంది. ఒకేసారి అనుకున్న రోజు విమాన ప్రయాణం చేయాలంటే రూ.70వేల నుంచి లక్ష రూపాయలు చెల్లించి టికెట్లను చెల్లించాల్సి ఉంటుందని అమెరికా హెచ్చరికల నేపథ్యంలో ఇంతపెద్ద మొత్తంలో డబ్బులు చెల్లించి విమాన టికెట్లు కొనుగోలు చేయడానికి కూడా తెలుగు విద్యార్థులు వెనకాడడం లేదని తెలుస్తోంది. అమెరికాలో జరుగుతున్న అరెస్టులు, అక్కడి ప్రభుత్వం జారీచేసిన ఆదేశాల నేపథ్యంలో అక్కడ ఉంటున్న వారి తల్లిదండ్రులు వెంటనే బయలుదేరి రావాలని కోరినట్లు సమాచారం. దీంతో ఇక్కడికి వస్తున్న విమానాలన్నీ నిండిపోవడంతో పాటు నేరుగా హైదరాబాద్ వచ్చే విమానాల్లో సీట్లు లభ్యం కాకపోవడంతో బెంగళూరు, చెన్నై, కోల్‌కతా, ఢిల్లీలకు చేరుకుని మరో డొమెస్టిక్ విమానంలో వారి వారి స్వస్థలాలకు వెళుతున్నట్టు సమాచారం అందుతోంది. అమెరికా ప్రభుత్వం నిషేధం విధించిన తర్వాత కూడా అక్కడ తల దాచుకునేందుకు ప్రయత్నించి పట్టుబడితే సమస్య తీవ్రతను బట్టి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు పాస్‌పోర్టును స్వాధీనం చేసుకుంటారని, మూడేళ్ల వరకు అమెరికా రాకుండా నిషేధం విధించే అవకాశాలు లేకపోలేదని చెబుతున్నారు.

వీసాల గోల

అమెరికాకు వెళ్ళే విద్యార్థుల వీసాలు మూడు విభాగాలుగా ఉంటాయని ఎఫ్ (స్టూడెంట్ వీసా), జే వీసా (ఎక్ఛేంజ్ విజిటర్స్), ఎం వీసా (ఒకేషనల్ స్టూడెంట్స్) అధికారులు చెప్పారు. ఈ వీసాల గడువు ముగిసినపుడు వారు పొందిన వీసా స్టేటస్ మార్చుకోవాలని ఒకవేళ ఏదైనా ఉద్యోగం వస్తే మరో కోర్సులో చేరడం ద్వారా వీసాలు పొందాల్సి వచ్చిందని అంటున్నారు. అమెరికా ఇమిగ్రేషన్ సర్వీసెస్ అధికారుల లెక్కల ప్రకారం 2018 ఆగస్టు నాటికి అమెరికాలో 16,62,369 మంది విదేవీ విద్యార్థులున్నారని ఇందులో ఎఫ్ కేటగిరి విద్యార్థులు దాదాపు 5 శాతం, జే కేటగిరి 4.5 శాతం, ఎం కేటగిరి 10 శాతం మంది ఉన్నారని వీరి వీసాల గడువు ముగిసిపోయిందని దాంతో స్వదేశాలకు వెళ్ళాల్సిన ఆవశ్యకత ఏర్పడిందని చెబుతున్నారు. ఇటువంటి విదేశీ విద్యార్థుల్లో తెలుగువారే అత్యధికంగా ఉన్నారని అంటున్నారు. మొత్తంమీద అమెరికాలో బయటపడ్డ నకిలీ వర్సిటీ వ్యవహారం ప్రకంపనలు సృష్టిస్తోంది. వరుస అరెస్టులతో ఖంగు తింటున్న విదేశీ విద్యార్థులు భయం గుప్పెట్లో గడుపుతున్నారు. వీసా గడువు ముగిసిన విద్యార్థులు, టెక్కీలు ఇంకెంత మాత్రం ఆలస్యం చేయకుండా ఇంటిదారి పట్టడమే మంచిదన్న అభిప్రాయానికి వచ్చి తట్టాబుట్ట సర్దుకుని పయనమవుతున్నట్టు సమాచారం.

ఒక్కరోజే వంద మంది రాక

తెలుగు రాష్ట్రాలకు చెందిన వందమంది విద్యార్థులు ఆదివారం రాత్రి నుంచి శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్ర యానికి వచ్చినట్టు అధికార వర్గాలు చెబుతున్నాయి. వచ్చే రెండు రోజుల్లో మరింత మంది విద్యార్థులు, టెక్కీలు సొంత గ్రామాలకు చేరుతారని అంచనా వేస్తున్నారు. శంషాబాద్ విమానాశ్రయ ఇమ్మిగ్రేషన్ అధికారుల కథనం ప్రకారం ఆది వారం రాత్రి నుంచి సోమవారం మధ్యాహ్నం వరకు అమెరి కా నుంచి వచ్చిన ప్రయాణీకుల్లో అత్యధికంగా మాస్టర్స్ డిగ్రీని పూర్తిచేసిన వారే ఉన్నారని, వీరంతా నాలుగేళ్ళ క్రితం అమెరికా వెళ్ళినట్లుగా వారి పాస్‌పోర్టుల ఆధారంగా తెలుస్తోందని చెప్పారు.



బ్యూరోక్రాట్లకు శర్మ ఆదర్శం

- గవర్నర్ నరసింహన్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: వినయ విధేయలతో ప్రజాసేవకు అంకితమైన రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఏపీవీఎన్ శర్మ బ్యూరోక్రాట్లకే ఆదర్శప్రాయుడని గవర్నర్ నరసింహన్ కొనియాడారు. దయ హృదయం, వ్యక్తిత్వం, పోటీతత్వంతో సేవలు అందించి సమాజంలో గౌరవం పొందిన గొప్ప అధికారి అని ఆయన ప్రశంసించారు. 1974 బ్యాచ్‌కు చెందిన రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఏపీవీఎన్ శర్మ జీవిత చరిత్రను 'నరుని సేవలో నారాయణుడు' అన్న టైటిల్‌తో డాక్టర్ అనంత పద్మనాభరావు రచించిన పుస్తకాన్ని గవర్నర్ సోమవారం రాజ్‌భవన్‌లో ఆవిష్కరించారు. గవర్నర్ మాట్లాడుతూ, కేంద్ర షిప్పింగ్ మంత్రివర్గ శాఖలో ఢిల్లీలో అదనపు కార్యదర్శిగా ఆయన పనిచేసినపుడు షిప్పింగ్ శర్మగా పేరుగాంచారని గుర్తుచేశారు. 2014లో గవర్నర్ సలహాదారుడిగా శర్మ పని చేసినపుడు ఆయన సలహాలు తనకు ఎంతగానో ఉపకరించాయని గుర్తు చేసుకున్నారు. సింగరేణి కాలరీస్ సీఎండిగా ఆయన చేసిన విశేష కృషితోనే దాన్ని పునరుద్ధరించగలిగారని చెప్పారు. కార్మికుల సంక్షేమానికి అనేక సంస్కరణలను అమలు చేశారని నరసింహన్ చెప్పారు.

దివికేగిన ఉద్యమ కెరటం

- అనారోగ్యంతో సీపీఎం సీనియర్ నాయకులు వర్ధెల్లి బుచ్చిరాములు కన్నుమూత
- నేడు సూర్యా పేటలో అంత్యక్రియలు



సూర్యాపేట, ప్రభన్యూస్: ఉద్యమ కెరటం, వామపక్ష పోరాట యోధుడు కామ్రేడ్ వర్ధెల్లి బుచ్చిరాములు నేలరాలారు. తీవ్ర అనారోగ్యంతో కొన్ని రోజులుగా హైదరాబాద్‌లో చికిత్స పొందారు. ఇటీవల నల్గొండ ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స అందిస్తుండగా సోమవారం రాత్రి కన్నుమూశారు. ఆయన మృతదేహాన్ని సీపీఎం జిల్లా కార్యాలయంలో మంగళవారం తరలించి పార్టీ కార్యకర్తలు, అభిమానులు, శ్రేయాభిలాషుల సందర్శన నిమిత్తం ఉంచి అక్కడి నుండి ఆయన ఇంటికి తరలించనున్నట్లు సీపీఎం వర్గాలు వెల్లడిస్తున్నాయి. ప్రజా ప్రతినిధులు, పట్టణ ప్రజలు బుచ్చి రాములు మృతి పట్ల విస్మయం వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం జరగనున్న అంత్యక్రియలు జరగనున్నాయి.

మాజీ మంత్రి జగదీష్ రెడ్డి సంతాపం..

సీపీఎం సీనియర్ నాయకులు, రాష్ట్ర కమిటీ సభ్యుల కామ్రేడ్ వర్ధెల్లి బుచ్చిరాములు మృతి పట్ల సూర్యాపేట శాసన సభ్యులు, మాజీ మంత్రి ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రలో బుచ్చిరాములు పాత్ర అనిర్వచనీమన్నారు. భార్య చనిపోయిన కొద్ది రోజులకే ఆయన కూడా మృతి చెందడం బాధాకరమన్నారు. జిల్లాకు ఆయన మృతి తీరని లోటు అన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు. ఆయన చూపిన మార్గంలో నేటి యువత పయనించాలన్నారు.

కేబినెట్‌పై కసరత్తు కొలిక్కి....

కొత్త నీరు!

(మొదటిపేజీ తరువాయి)

ఈనెల 10 లేదా 11 తేదీల్లో ఖచ్చితంగా ఉంటుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. పరిమిత సంఖ్యలో మంత్రివర్గ విస్తరణ ఉంటుందా లేక పూర్తిస్థాయిలో మంత్రులను తీసుకుంటారా అనే విషయంలో స్పష్టత లేదని సమాచారం. మంత్రివర్గ కూర్పుపై కేసీఆర్ ఒక్కరే కసరత్తు చేస్తున్నారని పలు సందర్భాల్లో తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అభిప్రాయాలు కూడా తీసుకుంటున్నారని అంతిమ నిర్ణయం సీఎందేనని పార్టీ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

ఒకటికి రెండుసార్లు మంత్రివర్గంలో తీసుకునే ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు సంబంధించి నిఘా వర్గాల ద్వారా సమాచారం తెప్పిస్తూ ఆ సమాచారాన్ని బేరీజు వేసుకుని కసరత్తు చేస్తున్నట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

ఈ దఫా మంత్రివర్గ విస్తరణలో మహిళతో పాటు అన్ని సామాజికవర్గాలకు చోటు కల్పించాలన్న ధ్యేయంతో కేసీఆర్ ఉన్నారు. గత మంత్రివర్గంలో మహిళకు మంత్రి పదవి ఇవ్వకపోవడంతో విపక్షాలు సమయం దొరికినప్పుడల్లా ఆ అంశాన్ని లక్ష్యంగా చేసుకుని ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడిన సంగతి తెలిసిందే.



ఈ దఫా అటువంటి ఆరోపణలకు తావు ఇవ్వకుండా మహిళ, బీసీ, ఎస్సీ, ఎస్టీతో పాటు అన్ని సామాజికవర్గాలకు న్యాయం చేయాలన్న లక్ష్యంతో కేసీఆర్ ముందుకు సాగుతున్నట్టు సమాచారం. మంత్రులతో పాటు ఈ దఫా కొత్తగా 16 మంది పార్లమెంటరీ రాజకీయ కార్యదర్శులను నియమించుకోవాలని నిర్ణయించిన కేసీఆర్ మంత్రులుగా అవకాశం దక్కని వారికి ఈ పదవుల్లో ప్రాధాన్యత కల్పించాలని ప్రతిపాదించినట్టు సమాచారం.

శాసనసభకు ముగ్గురు మహిళలు మాత్రమే ఎన్నికకావడంతో ఈ ముగ్గురికీ ఏదో ఒక పదవిని ఇవ్వాలన్న నిర్ణయానికి కేసీఆర్ వచ్చినట్టు ప్రచారం జరుగుతోంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్‌ను మహిళ, ఎస్టీ కోటాలో మంత్రిగా తీసుకునే అవకాశం ఉందని భావిస్తున్నారు. గతంలో ఉప సభాపతిగా పనిచేసిన మెదక్ ఎమ్మెల్యే పద్మా దేవేందర్‌ను విప్‌గా లేదా పార్లమెంటరీ కార్యదర్శిగా నియమించాలని ప్రతిపాదిస్తున్నట్టు తెలుస్తోంది.

గతంలో విప్‌గా ఉన్న ఆలేరు ఎమ్మెల్యే సునితకు కీలకమైన పదవి దక్కే అవకాశం కనిపిస్తోంది. ముగ్గురు మహిళల్లో ఇద్దరు ఒకే సామాజిక వర్గానికి చెందిన వారు కావడంతో రేఖానాయక్‌కే మంత్రిగా అవకాశం దక్కవచ్చన్న అభిప్రాయం పార్టీలో వ్యక్తమవుతోంది. గత ప్రభుత్వంలో ఆరుగురు మంత్రులు రెడ్డి సామాజికవర్గంవారు పనిచేశారు. సభాపతిగా పోచారం శ్రీనివాసరెడ్డిని ఎంపిక చేయడంతో ఈ సామాజికవర్గానికి గతంలోలాగా ఆరు పదవులు కాకుండా నాలుగు మంత్రి పదవులను ఇవ్వాలన్న ప్రతిపాదనపై చర్చోపచర్చలు సాగుతున్నట్టు సమాచారం.

నిజామాబాద్ జిల్లా నుంచి మిషన్ భగీరథ వైస్ చైర్మన్‌గా పనిచేసిన వేముల ప్రశాంత్‌రెడ్డికి ఈ దఫా మంత్రి పదవి ఖాయమన్న ప్రచారం సాగుతోంది. ఈ జిల్లాకు చెందిన బాజిరెడ్డి గోవర్దన్ మంత్రి పదవిపై ఆశలు పెట్టుకున్నా ఆయన సామాజికవర్గం మున్నూరు కాపుల నుంచి కూడా మరికొంత మంది మంత్రి పదవులను ఆశిస్తున్నారు. కామారెడ్డి ఎమ్మెల్యే గంప గోవర్ధన్‌ను తిరిగి విప్‌గా కొనసాగించే అవకాశాలు ఉన్నట్టు తెలుస్తోంది.

ఆశావహులు ఎక్కువే!

మహబూబ్‌నగర్ నుంచి వనపర్తి ఎమ్మెల్యే నిరంజన్‌రెడ్డి, మాజీ వైద్య ఆరోగ్యశాఖ మంత్రి చర్లకొల లక్ష్మారెడ్డి, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే శ్రీనివాస గౌడ్ మంత్రి పదవి రేసులో ఉన్నారు. నల్గొండ నుంచి మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి, నల్గొండ ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డి, నాగార్జున సాగర్ ఎమ్మెల్యే నోముల నర్సింహయ్య కూడా మంత్రి పదవులను ఆశిస్తున్నారు. ఉమ్మడి వరంగల్ నుంచి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు మంత్రి పదవి ఖాయమన్న ప్రచారం ఇప్పటికే తెరాసలో ముమ్మరంగా సాగుతోంది. మాజీమంత్రి జూపల్లి కృష్ణారావు ఓటమిపాలు కావడంతో ఆ కోటాలో ఎర్రబెల్లికి అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. ఈ జిల్లాకు చెందిన వరంగల్ వెస్ట్ ఎమ్మెల్యే వినయ భాస్కర్, సీనియర్ ఎమ్మెల్యే రెడ్యా నాయక్ మంత్రి పదవిపై ఆశలు పెట్టుకున్నారు. అయితే వినయ భాస్కర్‌ను ఉప సభాపతిగా ఎంపికచేసే అవకాశాలు మెండుగా ఉన్నాయని ఈ విషయాన్ని ఇప్పటికే పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీ రామారావు వినయ భాస్కర్‌కు చెప్పారని పార్టీలో ప్రచారం ఉంది. ఖమ్మం జిల్లా నుంచి ఎమ్మెల్సీ రాజేశ్వర్‌రెడ్డి మంత్రిగా ఎంపిక కావడం ఖాయమని తెలుస్తోంది. ఖమ్మం పట్టణ ఎమ్మెల్యే పువ్వాడ అజయ్ కూడా మంత్రి పదవిపై ఆశలు పెట్టుకున్నారు. కమ్మ సామాజికవర్గం నుంచి తనకు అవకాశం ఇవ్వాలని కోరుతుండగా శేర్లింగంపల్లి ఎమ్మెల్యే, కమ్మం సంఘం అధ్యక్షుడు అరికపూడి గాంధీ కూడా మంత్రి పదవిని ఆశిస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. రంగారెడ్డి జిల్లా నుంచి మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, కొడంగల్ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి కూడా మంత్రి పదవి కోసం ప్రయత్నిస్తున్న వారిలో ఉన్నట్టు సమాచారం. హైదరాబాద్ నుంచి మాజీమంత్రి తలసానికి మంత్రి పదవి తథ్యమని తెలుస్తోంది. మెదక్ నుంచి తన్నీరు హరీష్‌రావుకు మరో అవకాశం ఉంటుందని ఈ జిల్లా నుంచి కేసీఆర్‌తో పాటు హరీష్‌రావు కూడా ఉంటారని చెబుతున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి మాజీమంత్రులు ఈటల, కేటీఆర్, కొప్పుల ఈశ్వర్‌లకు మంత్రి పదవులు వరిస్తాయని ప్రకటనే తరువాయి అని చెబుతున్నారు. మొత్తంమీద ఈసారి ఆరుగురు కొత్త వారికి మంత్రి వర్గంలో చోటు తప్పదన్న సంకేతాలు వెలువడుతున్నాయి.

రాములోరి సన్నిధిలో విదేశీయులు

భద్రాచలం, ప్రభన్యూస్: భద్రాద్రి శ్రీసీతారామచంద్రస్వామివారి దేవస్థానాన్ని వివిధ దేశాలకు చెందిన విదేశీ భక్తులు సోమవారం దర్శించుకున్నారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని మధురానగరంలో ఉన్న భక్తి మార్క్ అనే ఆధ్యాత్మిక సంస్థ ఏర్పాటు చేసిన ఈ యాత్రలో ఇంగ్లాండ్, అమెరికా, కెనడా, జర్మనీ, పోర్చుగల్, సౌత్ ఆఫ్రికా, అర్జెంటీనా, రష్యాకు చెందిన 95 మంది భక్తులు రామయ్యను దర్శించుకున్నారు. పరమహంస విశ్వానంద గురూజీ నేతృత్వంలో భారతదేశ ఆధ్యాత్మిక ఔన్నత్యాన్ని తెలుసుకునేందుకు ఈ పర్యటన ఏర్పాటు చేయడం జరిగిందని గురూజీ తెలిపారు.



ఈ సందర్భంగా గురూజీ మట్లాడుతూ భక్తి మార్గ ప్రధాన కార్యాలయం జర్మనీలో ఉందని, దక్షిణ భారతదేశంలోని కన్యాకుమారి నుంచి యాత్ర ప్రారంభించామని తెలిపారు. ఈ క్రమంలో రామేశ్వరంలోని స్వామి ఆలయం ఇలా దక్షిణ భారతదేశంలోని రామ, క్రిష్ణ నరసింహ క్షేత్రాలను, మరికొన్ని ఆశ్రమాలను సందర్శించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా విదేశీ భక్తులు ఆయా పుణ్యక్షేత్రాల విశిష్టతను తెలుసుకుంటారని గురూజీ వెల్లడించారు. వివిధ ఆశ్రమాలను సందర్శించడం ద్వారా ఆశ్రమ నిర్వహణ గురించి అవగాహన కలుగుతుందని తెలిపారు. అనంతరం చైనాకు చెందిన హరినంద దాసి అనే భక్తురాలు మాట్లాడుతూ భారతదేశపు ఆధ్యాత్మికత ప్రపంచానికి మార్గదర్శకమన్నారు. ఈ పర్యటన ద్వారా అందరూ సమానమే అనే విషయాన్ని గ్రహించడం జరిగిందని తెలిపారు. మరో విదేశీ భక్తుడు మాట్లాడుతూ శ్రీరాముడు, శ్రీకృష్ణుడు చూపిన ఆధ్యాత్మిక మార్గం అవలంభించాలని ఈ యాత్ర అనంతరం తామంతా జర్మనీలోని ప్రధాన కార్యాలయానికి వెళ్తామన్నారు. భద్రాచలం నుంచి అన్నవరం, సింహాచలం తదితర ఆధ్యాత్మిక ప్రదేశాలను దర్శించుకుంటూ ఈ నెల 9న యాత్రను ముగిస్తామని వెల్లడించారు.



అడుగంటిన శ్రీశైలం


హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఈ ఏడాది మంచినీటి అవసరాల కోసం నీటిని మళ్లించడంతో వేసవిరాకముందే శ్రీశైలం జలాశయం అడుగంటింది. గత ఏడాది ఇదే సమయానికి 101 టీఎంసీల నీరుండగా, ఇపుడు 54.5 టీఎంసీలు మాత్రమే ఉన్నాయి. రిజర్వాయర్ పూరిమట్టం 885 అడుగులు కాగా గత ఏడాది 858.70 అడుగుల మేర, 101.92టీఎంసీల నిల్వ ఉంది. ఆంధ్రప్రదేశ్‌లోని కేసీకెనాల్, హంద్రీనీవా, పోతిరెడ్డిపాడుతోపాటు సాగర్ ఆయకట్టు అవసరాలకు శ్రీశైలం ప్రధాన నీటివనరు. రెండు తెలుగురాష్ట్రాల సాగు, తాగునీటి అవసరాలకు గణనీయంగా నీటిని మళ్ళించడంతో ఇపుడు కొరత ఏర్పడింది. దీంతో శ్రీశైలంలో కనీస నీటిమట్టాలను నీటిని వాడే పరిస్థితి లేకుండాపోయింది.

సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్
నబ్రూయాత్ సత్యమప్రియం, ప్రియంచ నానృతం బ్రూయాత్
ఆంధ్రప్రభ
మంగళవారం 5 ఫిబ్రవరి 2019

చరిత్రలో ఈ రోజు


పారమార్థిక యోగి

ధ్యానంలో సరికొత్త విధానాన్ని తీసుకొచ్చిన మహర్షి మహేష్ యోగి 12, జనవరి, 1918న జన్మించారు. 5వ తేదీ, ఫిబ్రవరి, 2008న పరమపదించారు. హిమాలయాల్లో ఆది శంకరాచార్య స్థాపించిన జ్యోతిర్‌పీఠానికి చెందిన స్వామి బ్రహ్మానంద సరస్వతి శిష్యరికంలోంచి మహేష్ యోగి.. పారమార్థిక ధ్యాన ప్రక్రియను అభివృద్ధి చేశారు. ఈ ధ్యాన విధానాన్ని బోధించడానికి ప్రపంచవ్యాప్తంగా 40 వేల మంది శిక్షకులను యోగి తయారు చేశారు. 1955లో ఈ పారమార్థికధ్యాన విధానాన్ని ప్రపంచానికి పరిచయం చేసిన మహేష్ యోగి.. 1958లో ప్రపంచ పర్యటనకి బయలు దేరారు. యాభై లక్షలమందికి పారమార్థిక ధ్యానంలో శిక్షణ ఇచ్చారు. వేల కొద్దీ బోధనా కేంద్రాలను, వందల్లో కాలేజీలు, యూనివర్శిటీలు, స్కూళ్లను స్థాపించారు. భారత్‌లోనే కాకుండా కెనడా, అమెరికా, ఇంగ్లాండ్, స్విట్జర్లాండ్ తదితర దేశాల్లో మహేష్ యోగి క్యాంపస్‌లు నెలకొల్పారు. 2008 నాటికి మహర్షి మహేషి యోగి ఆధ్యాత్మిక సంస్థ ఒక్క అమెరికాలోనే మూడు వందల మిలియన్ డాలర్లు ఉన్నట్లు తేలింది. బీటిల్స్, బీచ్ బాయ్స్ వంటి సెలబ్రిటీలకు మహేష్ యోగి గురువుగా ప్రపంచ ప్రఖ్యాతి సాధించారు. ధ్యానం ద్వారా ప్రపంచ శాంతి సాధ్యమవుతుందని యోగి విశ్వసించారు. 1992లో నేచురల్ లా పార్టీని నెలకొల్పిన మహేష్ యోగి డజన్ల కొద్దీ దేశాల్లో ప్రచారం చేశారు. రెండు వేల సంవత్సరంలో గ్లోబల్ కంట్రీ ఆఫ్ వరల్డ్ పీస్ అనే లాభరహిత సంస్థను నెలకొల్పారు. 2008లో తన ఆధ్యాత్మిక సామ్రాజ్య బాధ్యతల నుంచి విరామం తీసుకున్న మహర్షి మహేష్ యోగి.. మూడు వారాల పాటు మౌన వ్రతం పాటించి పార్థివ దేహాన్ని విడిచిపెట్టారు.



ప్లాస్టిక్ పుట్టిన రోజు!

ప్లాస్టిక లేకపోతే బాగుండు అనే స్థాయికి ఇవాళ ప్రపంచం చేరుకుంది. పర్యావరణానికి పెనుముప్పుగా మారిన ప్లాస్టిక్ లేకపోతే నిత్య జీవిత రూపు రేఖలే వేరే విధంగా ఉంటాయి. అనునిత్యం మనం ప్లాస్టిక్‌పై ఆధారపడక తప్పని పరిస్థితి ఏర్పడింది. వస్తు వినియోగం విస్తారం కావడానికి ప్లాస్టిక్ ఎంతగానో దోహదపడింది. పారిశ్రామీకరణ వేగవంతం కావడానికీ ప్లాస్టిక్ ఎంతగానో ఉపయోగపడింది. 5వ తేదీ ఫిబ్రవరి నెల, 1907 సంవత్సరం న్యూయార్క్‌లోని యాంకర్స్ ప్రాంతంలో లియో బేక్‌లాండ్ అనే బెల్జియన్-అమెరికన్ కెమిస్ట్ తొలి సింథటిక్ ప్లాస్టిక్‌ను కనిపెట్టారు. తొలినాటి ప్లాస్టిక్‌ను బేక్‌లైట్ అంటారు. బేక్‌లైట్‌కి డిసెంబర్, 7న 1909న పేటెంట్ వచ్చింది. సింథటిక్ ప్లాస్టిక్ కనిపెట్టడంతో ప్రపంచ పారిశ్రామిక రంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయి. విద్యుత్ తీగలకు ఈ ప్లాస్టిక్ పొరను కప్పడంతో పాటు, ఎలక్ట్రికల్ ఇన్సులేటర్లలో వేడిని నిరోధించడానికి, టెలిఫోన్ కేసింగ్‌లు, వంట గదుల్లో వాడే సామగ్రి, పైపులు ఇలా అన్ని రంగాల్లోకి ఈ ప్లాస్టిక్ వ్యాపించింది. ఇప్పుడు ప్రపంచంలో ప్లాస్టిక్‌లేని ప్రాంతమంటూ లేని పరిస్థితి ఏర్పడింది. ప్రపంచ తొలి సింథటిక్ ప్లాస్టిక్‌గా బేక్‌లైట్‌ని 1993లో అమెరికన్ కెమికల్ సొసైటీ జాతీయ చారిత్రాత్మక రసాయన మైలురాయిగా గుర్తించి గౌరవించింది. వేలోక్స్ ఫోటోగ్రాఫిక్ పేపర్ కనిపెట్టిన బేక్‌లాండ్ ఫినోల్, ఫార్మల్‌డీహైడ్ రియాక్షన్లపై ప్రయోగాలు చేశారు. బేక్‌లైట్‌ను తయారు చేసిన తరువాత తన సొంత ప్రయోగశాలలోనే వాణిజ్య అవసరాల కోసం బేక్‌లాండ్.. బేక్‌లైట్ తయారీని ప్రారంభించారు. ఎలక్ట్రికల్ ఇన్సులేటర్‌గా మార్కెట్‌లోకి తీసుకొచ్చారు. ఒక ప్లాస్టిక్ వెయ్యి ఉపయోగాలు అంటూ ప్రచారం చేశారు. ఇప్పుడది కోటి ఉపయోగాలుగా తయారైంది. 1939లో బేక్‌లాండ్ ప్రారంభించిన ఫ్యాక్టరీలను యూనియన్ కార్బైడ్ అండ్ కార్బన్ కార్పొరేషన్ టేకోవర్ చేసింది. భోపాల్‌లోని యూనియన్ కార్బైడ్ కంపెనీలోనే విష వాయువులు వ్యాపించి పెను విషాదానికి కారణమైన విషయం తెలిసిందే. తొలినాళ్లలో బేక్‌లైట్ ప్లాస్టిక్స్ అనే ట్రేడ్ మార్క్ కింద యూనియన్ కార్బైడ్ ప్లాస్టిక్ వ్యాపారం నిర్వహించేది.



చంద్రుడిపై నాట్లేశారు!



అపోలో 14 మిషన్‌లో భాగంగా ఫిబ్రవరి, 5వ తేదీ, 1971లో అమెరికా వ్యోమగాములు కమాండర్ అలన్ షెప్పర్డ్, లూనార్ మోడ్యూల్ పైలెట్ ఎడ్గార్ మిచెల్ చంద్రుడిపై కాలు మోపారు. చంద్రుడిపై ఫ్రా మైరో ఫార్మేషన్‌పైన అనేక శాస్త్రీయ ప్రయోగాలు చేశారు. చంద్రుడిపై తాత్కాలిక గోల్ఫ్ కోర్టు తయారు చేసి షెప్పర్డ్ రెండు బంతులను కొట్టారు. వీరిద్దరు చంద్రుడిపై 33 గంటలా 30 నిమిషాలు గడిపారు. వీరు చంద్రుడిపై ప్రయోగాలు చేస్తున్న సమయంలో చంద్రుడి కక్ష్యలో తిరుగుతున్న కిట్టి హాక్ సర్వీస్ మ్యాడ్యూల్‌లో కమాండ్ మోడ్యూల్ పైలెట్ స్టార్ట్ రూసా ఉండి పర్యవేక్షించారు. ప్రయోగాలతో పాటు చంద్ర గ్రహాన్ని ఫోటోలు తీయడం, అపోలో 16 మిషన్ దిగే చోటును గుర్తించడం వంటవి చేశారు. అపోలో 14 మిషన్‌లో భాగంగా వందలాది విత్తనాలను చంద్రుడిపైకి తీసుకెళ్లారు. అక్కడ కొన్ని విత్తనాలను నాటారు. నాటిన వాటి నుంచి మొలకలెత్తినవని, చంద్రుడి మొక్కలని ప్రచారం కూడా జరగడం విశేషం. ఇక అపోలో 14 మిషన్‌లో భాగంగా చంద్రుడి వద్దకు వెళ్లిన వ్యోమగాములు అదే 1971 ఫిబ్రవరి 9వ తేదీని పసిఫిక్ సముద్రంలో సురక్షితంగా దిగారు.

జనాభా దామాషాలో ముస్లింలకు సీట్లు

పాఠకీయం

ప్రజాస్వామ్యంలో ఓటు గొప్ప ఆయుధం. కానీ ఓటు రాజకీయం వల్ల మైనార్టీలు చాలావరకు మోసపోయారు. శతాబ్దాలుగా భారతీయ జీవన స్రవంతిలో మమేకమైన ముస్లింలు స్వతంత్ర భారత దేశం ఎదుర్కొంటున్న దుర్భర పరిస్థితులకు ఈ రాజకీయం కూడా ఒక కారణమన్నది వాస్తవం. దీంతో ముస్లిం సమాజం ఒక వింత పరిస్థితికి లోనయింది. మన జనాభాలో గణనీయంగా ఉన్న ముస్లింల అభివృద్ధిని విస్మరిస్తే సర్వతోముఖాభివృద్ధి కుంటుబడుతుందన్నది కాదనలేని వాస్తవం. అందుకే ముస్లింలకు విద్యాపరంగా, ఆర్థికపరంగా, చట్టసభల్లో ప్రాతినిధ్య పరంగా తగిన అవకాశాలు కల్పించాలి. ఈ బాధ్యత అన్ని మెజారిటీ పార్టీలతో పాటు పాలనలో ఉన్న పార్టీలపై కూడా ఉంది. రాష్ట్రంలో 90 నియోజకవర్గాలలో ముస్లిం జనాభా ఎక్కువగా ఉంది. అందులో 15 నియోజకవర్గాలలో ముస్లిం అభ్యర్థి ఎవరైనా గెలుపొందు అవకాశం మెండుగా ఉన్నాయి. మిగిలిన వాటిలో గెలుపోటములను ముస్లింలు నిర్ణయించే స్థితిలో ఉన్నారని చెప్పవచ్చును. ప్రస్తుతం సమాజంలో ఉన్న రెండు నుంచి ఐదు శాతం లోపు జనాభా ఉన్న వర్గాలు మిగిలిన వర్గాలను పాలిస్తున్నాయి. రాయలసీమ జిల్లాల్లోను ముస్లింలు అధికంగా ఉన్నారు. విద్య, ఆర్థిక, సామాజిక రాజకీయపరంగా ముస్లింలు బాగా వెనుకబడి ఉన్నారని అధికార లెక్కలే తేటతెల్లం చేస్తున్నాయి. ముస్లింలకు జనాభా ప్రాతిపదికన అవకాశాలు దక్కకపోవడం బాధాకరం. వారికి కూడా అవకాశాలు ఇవ్వాలని గట్టి నిర్ణయం తీసుకున్న విషయం తెలుగుదేశం పార్టీ, వైసీపీ, కాంగ్రెస్, జనసేన పార్టీలకు తెలిసిపోయిందన్న సమాచారం అందరికీ తెలిసిపోయింది. జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో రాయలసీమలో ఎక్కువ శాతం ముస్లిం జనాభా కలిగిన కర్నూలు, కడప, నంద్యాల, రాయచోటి, శ్రీశైలం, అనంతపురం అర్బన్ ఆదోని, హిందూపురం, ప్రొద్దుటూరు, కదిరి, పీలేరు, ఆళ్లగడ్డ, నందికొట్కూరు, గుంతకల్లు, మదనపల్లి, పుంగనూరుతో సహా 16 అసెంబ్లీ స్థానాలు ఇవ్వాల్సి ఉంటుంది.

-ఎస్.అభినయ్, 7036970116


ఇద్దరూ లక్ష్మణ రేఖ దాటారు!

సిబిఐ మళ్ళీ రచ్చకెక్కింది. ఈసారి అంతః కలహాలతో కాదు. పశ్చిమ బెంగాల్ ప్రభుత్వంపై దాడిచేయడం ద్వారా వార్తల్లోకెక్కింది. కోల్ కతా పోలీసు కమిషనర్ రాజీవ్ కుమార్ నివాసానికి ఆదివారం సాయంత్రం పొద్దుపోయిన తర్వాత 40 మంది సిబిఐ అధికారులు, సిబ్బంది రావడం, వారిని రాష్ట్ర పోలీసులు అడ్డుకోవడం తీవ్ర సంచలనాన్ని సృష్టించింది. సిబిఐ వైఖరికి నిరసనగా పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమత బెనర్జీ బైఠాయింపు జరుపుతున్నారు. రాష్ట్రంలో తీవ్ర సంచలనాన్ని సృష్టించిన శారదా చిట్ ఫండ్ వ్యవహారాలకు సంబంధించిన వాస్తవాలను రాజీవ్ కుమార్ భూస్థాపితం చేశారన్నది సిబిఐ అభియోగం. ఆయన ఐపిఎస్ అధికారి మాత్రమే కాకుండా, దేశంలో ఒక మహానగరానికి పోలీసు శాఖ అధిపతిగా వ్యవహరిస్తున్నందున ముందుగా నోటీసు ఇచ్చి సిబిఐ అధికారులు వచ్చి ఉంటే అభ్యంతరం ఉండేది కాదేమో. శారదా చిట్ ఫండ్ వ్యవస్థాపకుడు సుదీప్తో సేన్ మమతా బెనర్జీ అభిమాని. ఆమెకు కోటి రూపాయిల విలువ చేసే చిత్ర కళా ఖండాన్ని బహుకరించాడన్న ఆరోపణలు అప్పట్లో వచ్చాయి. శారదా, రోజ్ వ్యాలీ చిట్ ఫండ్ సంస్థ మూత పడి ఆరు సంవత్సరాలు అవుతున్నా, ఆ సంస్థ వ్యవహారాలు ఇప్పటికీ రాష్ట్ర రాజకీయాలను ప్రభావితం చేస్తూనే ఉన్నాయి. రాష్ట్రంలో అధికార పార్టీ అయిన తృణమూల్ కాంగ్రెస్ ఎంపీలు, ఇతర ప్రముఖులకు ఆ సంస్థతో ప్రత్యక్ష సంబంధాలున్నాయి. వారిని రక్షించేందుకు మమత ప్రయత్నిస్తున్నారన్నది ప్రధాన ఆరోపణ. అదే సందర్భంలో సుదీప్తో సేన్ మమతకు చిత్రకళాఖండాన్ని బహుకరించిన సంఘటన కూడా రాజకీయరంగు పులుముకుంది. అప్పట్లో మమత బిజేపీతో కలిసి ఉండేవారు కనుక, ఆ సంస్థ వ్యవహారాల గురించి కానీ, దానికి మమత అందిస్తున్న సహాయ, సహకారాల గురించి కానీ బహిర్గతం కాలేదు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయనతో మమతా బెనర్జీ దాదాపు యుద్ధమే చేస్తున్నారు. మోడీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మైనారిటీలకు రక్షణ కల్పించలేకపోయినందుకు ఆయనను తొలగించాలంటూ, ఎన్‌డిఏ -1 ప్రభుత్వాధినేత అయిన మాజీ ప్రధాని వాజ్‌పేయిపై ఆమె ఒత్తిడి తెచ్చి, ఆయన మంత్రివర్గం నుంచి వైదొలగారు. మోడీతో సైద్ధాంతిక పరమైన శత్రుత్వమే తప్ప వ్యక్తిగతంగా ఆయనపై తనకు ఎటువంటి వైరం లేదని ఆమె స్పష్టం చేశారు. అలాగే, మోడీ కూడా ఎన్‌డిఏ కూటమిలోకి మళ్ళీ వచ్చి ఉంటే ఆమె పట్ల వైరిభావాన్ని కలిగిఉండేవారు కారేమో. ఇంతకీ శారదా చిట్ ఫండ్ వ్యవహారాలపై ముందుగా స్పందించి ఖాతాదారుల ప్రయోజనాలను కాపాడింది తానేనని మమతా బెనర్జీ స్పష్టం చేస్తున్నారు. బాధితులకు రావల్సిన డబ్బు ఇప్పించానని ఆమె అంటున్నారు. సుప్రీంకోర్టు ఆదేశం ప్రకారం సిబిఐ దర్యాప్తు చేపట్టింది.', ఈకేసు దర్యాప్తును పర్యవేక్షించే బాధ్యతను సుప్రీంకోర్టు తీసుకోకుండా హైకోర్టుకు అప్పగించింది.

అయితే, కేసు దర్యాప్తు వేగవంతంగా పూర్తి కావడానికి సహకరించాల్సిందిగా ఆదేశించింది. కోల్‌కతా పోలీసు కమిషనర్ రాజీవ్ కుమార్ నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఈ కేసును దర్యాప్తు చేసింది కనుక, సిబిఐ దర్యాప్తు అవసరం లేదన్నది మమత ప్రభుత్వ వాదన. కోర్టు ఆదేశాలను కాదనడానికి మనమెవరం అని సిబిఐ ఎదురు ప్రశ్నిస్తోంది. ఈ కేసు దర్యాప్తు చాలాకాలంగా సాగుతోంది.

ఈ కేసులో తృణమూల్ ఎంపీ కునాల్ ఘోష్ అరెస్టు అయి జైలుకి వెళ్ళారు. ముకుల్ రాయ్, మిత్రాలకు కూడా సంబంధం ఉందన్న ఆరోపణలు వచ్చాయి. సుప్రీంకోర్టు ఆదేశం ప్రకారమే సిబీఐ దర్యాప్తు చేపట్టినా, ప్రధానమంత్రి మోడీ తమ పార్టీ మీద కక్ష కట్టి సిబిఐని ఉసిగొల్పుతున్నారన్నది మమత ఆరోపణ. మోడీ విధానాలను వ్యతిరేకిస్తున్నందునే ఆయన తనపై కక్ష కట్టారని కూడా ఆమె ఆరోపిస్తున్నారు. ఈ ఆరోపణలు, ప్రత్యారోపణల సంగతి అలా ఉంచితే, శారదాచిట్ ఫండ్ వ్యవహారంపై సీబీఐ దర్యాప్తు చాలా కాలంగా సాగుతున్నా, ఇప్పుడే దీనిని ముమ్మరం చేయడం వెనుక రాజకీయ కారణాలున్నాయన్నది యధార్థం. తృణమూల్ ఒకప్పుడు మార్క్సిస్టు పార్టీని ప్రధాన శత్రువుగా పరిగణించేది. ఇప్పుడు బిజేపీనే ప్రధాన శత్రువుగా భావిస్తోంది. రాష్ట్రంలో బిజేపీ నాయకుల ర్యాలీలకూ, రథయాత్రలకూ అనుమతి ఇవ్వకుండా అడ్డుకుంటోంది. బిజేపీ రథయాత్ర వల్ల రాష్ట్రంలో మతపరమైన ఉద్రిక్తతలు ఏర్పడతాయన్నది మమత వాదన.ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ హెలికాప్టర్ దిగేందుకు అనుమతి ఇవ్వలేదు.కారణం ఏదైనా ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి మరో రాష్ట్రంలో అడుగు పెట్టలేని పరిస్థితిని ప్రజాస్వామ్యంలో చూడాల్సి రావడం విషాదం.అలాగే, సిబిఐ బృందం పట్ల బెంగాల్ పోలీసులు వ్యవహరించిన తీరుని గర్హించాల్సిందే. చొక్కా కాలర్లు పట్టుకుని పోలీసు జీపుల్లోకి తోసేయడం దారుణం.దేశ అత్యున్నత విచారణ సంస్థకు వారు ప్రతినిధులన్న విషయాన్ని పోలీసులే ఉల్లంఘిస్తే ఇంకేమి అనాలి? అటు సిబిఐ ,ఇటుబెంగాల్ ప్రభుత్వమూ ఇద్దరూ లక్ష్మణరేఖ దాటారు. దర్యాప్తునకు కోల్‌కతా పోలీసు శాఖ అధిపతి సహకరించకపోవడమే కాకుండా వాస్తవాలను భూస్థాపితం చేశారంటూ సిబిఐ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను మంగళవారానికి సుప్రీంకోర్టు వాయిదావేసింది.

రైతుకు ఎంత ఇచ్చినా తక్కువే!



మనదేశంలో ఏ పారిశ్రామికవేత్త అయినా, తాను తయారు చేసే ఉత్పత్తుల ధరలను యాభై శాతం లాభాలు కలిపి అమ్మకపు ధరను నిర్ణయిస్తాడు. ఒక ఎలక్ట్రీషియన్, ఒక ప్లంబర్, ఒక కూలి, ఒక విద్యాసంస్థ, ఒక సినిమాహాలు వారు, తమ సేవలను వినియోగించుకోవడానికి తమ ధరను తామే నిర్ణయిస్తారు. కానీ, దేశానికి అన్నం పెట్టే కర్షకుడు తాను పండించే పంటలకు గిట్టుబాటు ధరను నిర్ణయించుకోలేరు. దాన్ని ప్రభుత్వం నిర్ణయిస్తుంది! పారిశ్రామికవేత్తలకు నష్టం వస్తే ఆదుకోవడానికి ఇన్సూరెన్స్ కంపెనీలు ముందుకొస్తాయి.

ప్రభుత్వాలు పోటీపడి రాయితీలు ఇస్తాయి. పన్ను మినహాయింపులు ఇస్తాయి. కానీ, అతివృష్టి, అనావృష్టి, కరవు కాటకాల కారణంగా రైతన్నలకు నష్టాలు సంభవిస్తే వారిని భగవంతుడు కూడా ఆదుకోలేడు. అదీ మనదేశ దౌర్భాగ్యం!

స్వతంత్రం వచ్చేనాటికి మన దేశం ఆహార ఉత్పత్తులను దిగుమతి చేసుకునే పరిస్థితిలో ఉన్నది. పంచవర్ష ప్రణాళికలు, పండిట్ నెహ్రూ దూరదృష్టి కారణంగా హరిత విప్లవం పురుడు పోసుకున్నది. తత్ఫలితంగా దేశంలో వ్యవసాయరంగం పుంజుకుని క్రమేణా స్వయం సమృద్ధిని సాధించగలిగింది. కాంగ్రెస్ ప్రభుత్వాలు నీటిపారుదల రంగానికి అధిక ప్రాధాన్యత ఇచ్చాయి. అనేక బహుళార్ధసాధక ప్రాజెక్టులను నిర్మించింది. తెలుగు రాష్ట్రాల విషయానికి వస్తే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నాగార్జునసాగర్ ప్రాజెక్ట్, శ్రీశైలం ప్రాజెక్ట్, ప్రకాశం బ్యారేజ్ నిర్మితం కాగా, తెలంగాణాలో శ్రీరామ్ సాగర్ ప్రాజెక్ట్ పెద్ద ప్రాజెక్టుగా ఉన్నది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక కేసీఆర్ పూనికతో కాళేశ్వరం, సీతారామసాగర్, దిండి, పాలమూరు ప్రాజెక్టులు రూపుదిద్దుకుని రైతులకు

ప్రయోజనకారిగా భాసిల్లాయి. అంతే కాక, మిషన్ కాకతీయ ప్రాజెక్ట్ పథకం ద్వారా వేలాది చెరువులను పూడిక తీయించి మళ్ళీ జలసిరితో కళకళలాడించారు.


ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా స్వర్గీయ వైఎస్ రాజశేఖర రెడ్డి ఉన్నపుడు వ్యవసాయరంగానికి అధిక ప్రాధాన్యత ఇచ్చి జలయజ్ఞం పేరుతో అనేక ప్రాజెక్టులకు రూపకల్పన చేశారు. అయితే ఆయన మరణానంతరం ఆ జలయజ్ఞం కుంటుపడింది. ఇప్పుడు జాతీయహోదా సాధించిన పోలవరం ప్రాజెక్ట్ వైఎస్ హయాంలోనే కొంత పురోగతి సాధించింది అనేది వాస్తవం. ఆంధ్రప్రదేశ్ రెండు భాగాలుగా విడిపోయాక విభజన చట్టం ప్రకారం ఈ ప్రాజెక్టును కేంద్రం నిర్మించాల్సి ఉన్నది. అయితే తామే నిర్మిస్తామని రాష్ట్రం ప్రతిపాదించడం, కేంద్రం అందుకు అంగీకరించడం జరిగింది. మొన్నటి కేంద్ర బడ్జెట్‌లో పోలవరానికి నిధులు కేటాయించలేదని రాష్ట్రం విమర్శిస్తున్నది.

ఈ అంశాన్ని పక్కన బెడితే రైతులకు ఏటేటా ఆర్థిక సాయాన్ని అందిస్తామని కేంద్రం మొన్నటి బడ్జెట్‌లో ప్రతిపాదించింది. ఈ పథకం కింద అయిదు ఎకరాలు ఒక యూనిట్‌గా భావించి రైతుకు ఆరువేల రూపాయలను మూడు విడతలుగా ఇస్తారట.

ఈ పథకం రైతులకు మేలు చేసే గొప్ప పథకంగా కేంద్రం భుజాలు చరుచుకుంటున్నప్పటికీ, రైతులు, ఆర్థిక నిపుణులు కేంద్ర ప్రతిపాదనమీద అసంతృప్తిని వ్యక్తం చేశారు. దీనికంటే, తెలంగాణ ప్రభుత్వం రెండేళ్లక్రితం ప్రవేశపెట్టిన రైతుబంధు పథకం ఏరకంగా చూసినా అత్యుత్తమంగా కనిపిస్తున్నది. గత పాలనాకాలంలో ఎకరానికి ఎనిమిదివేల రూపాయల సాయాన్ని రెండు విడతలుగా అందిస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించడమే కాక దాన్ని ఆచరణలో కూడా పెట్టారు. అయిదు ఎకరాలు ఉన్న రైతుకు నలభై వేలు అందుతాయి. మొన్నటి ఎన్నికలకు ముందు ఈ సాయాన్ని ఎనిమిది వేల నుంచి పదివేలకు పెంచడం జరిగింది. సుమారు యాభై లక్షల రైతు కుటుంబాలు ఈ పథకం ద్వారా లబ్ది పొందుతున్నాయి. ఏ రకంగా చూసుకున్నా దీన్ని చాలా మెరుగైన పథకంగా చెప్పుకోవచ్చు.

కేవలం లక్షా చిల్లర కోట్ల బడ్జెట్ కలిగిన ఒక చిన్న రాష్ట్రం ఇంత భారీ సాయాన్ని రైతులకు అందిస్తున్నపుడు, ముప్పయి లక్షల కోట్ల బడ్జెట్ కలిగిన కేంద్ర ప్రభుత్వ సాయం ఇంకెంత గొప్పగా ఉండాలి! దీన్నిబట్టి చూస్తే కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పథకం కేవలం కంటితుడుపు చర్యగా భావించవచ్చు. ఎన్నికల్లో లబ్ది కోసమే మోడీ ఈ ప్రతిపాదన తెచ్చారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పైగా కేసీఆర్ పథకాన్ని మోడీ కాపీ కొట్టారు అన్న హేళనలు కూడా వినిపిస్తున్నాయి.

రెండేళ్ల క్రితం కేసీఆర్ ప్రారంభించిన ఈ పథకాన్ని అప్పట్లో కొందరు ఎగతాళి చేశారు. ఓట్లకోసం రైతులకు ఇస్తున్న లంచం అని విమర్శించాయి విపక్షాలు. వాటిలో బీజేపీ కూడా ఉన్నది. రైతుబంధు పథకం కేసీఆర్‌ను తిరిగి అధికారంలోకి తెచ్చిందని నమ్మారో ఏమో, మోడీ కూడా కేసీఆర్ పథకాన్నే శరణుజొచ్చారు., ఒక్క మోడీయే కాదు. పశ్చిమ బెంగాల్, ఒడిశా, జార్ఖండ్ ప్రభుత్వాలు కూడా కేసీఆర్ పథకాన్ని అమలులోకి తెచ్చాయి. కేసీఆర్ ఆలోచనా విధానం ఎంత నిశితంగా ఉంటుందో, ఆయన దూరదృష్టి ఇతరులకు అందనంత స్థాయిలో ఎలా ఉంటుందో రైతుబంధు పథకం నిరూపించింది. ఈ పథకం ఎవరిదీ అనే ప్రశ్నను పక్కన పెడితే, తిండిగింజలు పండించే అన్నదాతను ఆదుకోవడానికి ఎన్ని లక్షల కోట్ల కేటాయింపులు చేసినా తప్పు లేదు. అయితే, రైతులకు మేలు చెయ్యాలంటే ఇలాంటి అరకొర సాయాలు కాకుండా, రైతులు తాము పండించే ఉత్పత్తులకు గిట్టుబాటు ధరను తామే నిర్ణయించుకునే అవకాశం కలిగించాలి. సరైన ధర లేనపుడు ఉత్పత్తులను దాచుకోవడానికి గిడ్డంగులను నిర్మించి ఉచితంగా ఇవ్వాలి. ఎరువులు, వ్యవసాయ పనిముట్లు, ట్రాక్టర్లు లాంటి వాటిని భారీ సబ్సిడీతో రైతులకు అందించాలి. మార్కెటింగ్ సౌకర్యం కలిగించాలి. ఉత్పత్తులను మార్కెట్‌కు తీసుకెళ్లడానికి ఉచిత రవాణా సౌకర్యం కలిగించాలి. రైతుల నుంచి ఎలాంటి పన్నులు వసూలు చెయ్యరాదు. పన్నుల పరిధి నుంచి వ్యవసాయ రంగాన్ని పూర్తిగా మినహాయించాలి. రైతును కూడా ఒక ఉద్యోగిని గౌరవించినట్లు గౌరవించాలి. ఉద్యోగులకు ఇచ్చినట్లుగానే గుర్తింపు కార్డులు ఇవ్వాలి. అతి తక్కువ వడ్డీతో రుణసౌకర్యం కలిగించాలి. రైతు కుటుంబాలకు హెల్త్ కార్డులు, ఉచిత వైద్య సౌకర్యం, బీమా సౌకర్యాలు కలిగించాలి. రైతులు అంటేనే గౌరవనీయులు అనే స్థాయికి అన్నదాతను తీసుకెళ్ళాలి. అప్పుడే భారతదేశం పాడిపంటలతో, సస్యశ్యామలంగా విలసిల్లగలదు.



-ఇలపావులూరి మురళీ మోహన రావు
సీనియర్ రాజకీయ విశ్లేషకులు

మన ఎన్నికల్లో విదేశాల పరోక్ష ప్రభావం!

దేశంలో ఇప్పటికి 16 సార్లు ఎన్నికలు జరిగాయి. గత 70 సంవత్సరాలుగా పార్లమెంటరీ ప్రజాస్వామ్యం విజయవంతంగా కొనసాగుతోంది. క్రమం తప్పకుండా ఎన్నికలు జరుపుకోవడం వల్ల దేశంలో సైనిక పాలనగాని, ఏక సామ్యపాలన గాని ఏర్పడకుండా ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతోంది. అందుకు కారణం మన రాజ్యాంగం. పటిష్టమైన రాజ్యాంగమే ప్రజాస్వామ్య సౌధానికి పునాది. ఎప్పటికప్పుడు ప్రజలు తమకు కావలిసిన ప్రభుత్వాలను ఎన్నుకుంటున్నారు.

అయితే, మన దేశంలో జరిగే ఎన్నికల్లో విదేశీ గూఢచార సంస్థలు జోక్యం చేసుకుంటున్నాయన్న ఆరోపణలు తరచూ వస్తున్నాయి. 1991లో సోవియట్ రష్యా పతనమైనపుడు భారత్ కూడా విడిపోతుందని జోస్యం చెప్పారు విదేశీ నిపుణులు ఆహార కొరత, అధిక జనాభా కలిగి పలు సమస్యలు ఎదుర్కొన్న మన వైవిధ్య దేశం ఐక్యంగా కొనసాగడానికి కారణం మన ప్రజల మనోభావాలు. మన దేశం ఎన్నో ఆటుపాట్లు (ఉగ్రవాదం, చొరబాట్లు సరిహద్దుల దురాక్రమణలను) ఎదుర్కొని నిలబడిందంటే అది ప్రజల్లో వెల్లివిరిసిన ఐక్యతా భావనే కారణం.. పాలక పార్టీలు, రాజకీయ నాయకులు ప్రాంతీయ పార్టీలు కూడా దేశ సమగ్రతను దృష్టిలో ఉంచుకుని జాగ్రత్తగా పనిచేయడమే కారణం. మన రాజ్యాంగం మనదేశానికి దిశ, దశను నిర్దేశించడం వల్ల ప్రభుత్వంలోని ఏ అంశం కూడా (కార్య నిర్వాహక వర్గం, న్యాయశాఖ, శాసన శాఖలు) తమ పరిధుల్లో పనిచేసుకుని పోతుండటం వల్ల మన దేశం సమైక్యంగా కొనసాగుతుంది. స్వాతంత్ర్యం అనంతరం ఆంగ్ల భాషను కొనసాగిస్తూ మన భాషలను పరిరక్షించుకోవడం వల్ల దేశ ఐక్యత సాధ్యం అయింది.

1772 బ్రిటీషు రెగ్యులేట్ ఇండియా చట్టం నుండి 1935 బ్రిటీషు ఇండియా చట్టం వరకు మనఐక్యతకు పడిన పునాదులు చాలా గట్టివి. ఆ స్థితిని కొనసాగించేందుకు మహాత్మాగాంధీ శాంతి, అహింస, సహాయ నిరాకరణ, స్వరాజ్ భావనలు ఎంతగానో ప్రభావం చూపాయి. వీటికితోడు నెహ్రూ, కాంగ్రెస్ ఆదర్శాలు లౌకికతత్వం ఎంతగానో పనిచేశాయి. 1950లో గణతంత్ర దేశంగా ప్రకటించుకొని 1952 మొదటి ఎన్నికలు జరుపుకున్నాం. అప్పుడు మన అధికార పార్టీ కాంగ్రెస్ పార్టీకి రష్యా మిత్రుని ఎంతగానో సహాయం చేసింది. అందుకు కారణం ఎం.ఎన్.రామ్, కృష్ణమీనన్‌ల ప్రభావం ఒక వైపు, నెహ్రూ సోషలిజం ఆదర్శాలు మరోవైపు మన దేశాన్ని అభివృద్ధి పథం వైపు నడిపించాయి. సోవియెట్ రష్యా ప్రణాళిక విధానాన్ని తెచ్చిపెట్టుకొని కొనసాగించాం. అదే సమయంలో 1950 నుంచి 1990 వరకు మన దేశం అలీన విధానం అనుసరించింది. అయితే, మన విధానాలు సోవియెట్ రష్యా వైపు మొగ్గు చూపాయి. ప్రభుత్వ రంగంలో రష్యా పెట్టుబడులు, ప్రయివేటు రంగంలో అమెరికా, బ్రిటీష్ , ఫ్రాన్స్, జపాన్, పెట్టుబడులతో సమన్వయ పరచుకుని ముందుకు సాగాం. ఆ విధంగా రష్యా కమ్యూనిస్టు పార్టీ ఇండియాలోని కాంగ్రెస్ పార్టీకి, కమ్యూనిస్టు పార్టీలకు సహాయపడింది. దానితో వామపక్షాలు కాంగ్రెస్ విధానాలను ప్రశ్నించినా, దగ్గరైనాయి. రష్యా కేజీబీ ఏజెంట్లు మన దేశంలోని పలు రంగాలను ప్రభావితం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలలో, కాంగ్రెస్ పార్టీ, అధికారికంగా రష్యా నుంచి నిధులు పొందింది. అంతేగాక కాంగ్రెస్ పార్టీ పరోక్షంగా రష్యా సోషలిజానికి ప్రభావితమైంది. ఇందిరాగాంధీ కాంగ్రెస్ పార్టీని చీల్చి 1971లో పాకిస్తాన్‌ను ఓడించింది. దాంతో కాంగ్రెస్ పార్టీకి పూర్తిస్థాయి



మెజారీటి రాగా కాంగ్రెస్ పార్టీ నాయకురాలి కుటుంబంలో అంతర్గత ఆధిపత్యం పోరులో సంజయ్‌గాంధీ ఒత్తిడితో అత్యయిక పరిస్థితిని విధించిన ఇందిరాగాంధీని ఓడించడానికి ప్రతిపక్షాలు సంఘటితమయ్యాయి. సోవియెట్ రష్యా. ప్రతికాధిపతులకు ఆర్థికసాయం చేకూర్చి కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ప్రచారం చేయించిందని ([illegible]) పలువురు వాస్తవాలను బయట పెట్టారు. దానితో కాంగ్రెస్ , ఇందిరాగాంధీలకు వ్యతిరేకంగా జనతా పార్టీ నాయకులను ప్రోత్సహించి అధికారంలో నిలబెట్టారు.

కానీ ఇందిరా గాంధీ తేరుకుని విదేశీ కుట్రను వమ్ము చేసి తిరిగి 1980లో అధికారానికి వచ్చింది. అదే సమయంలో ఖలిస్తాన్ ప్రత్యేక ఉద్యమం పంజాబ్‌లో తీవ్రస్థాయికి చేరుకుంది. దానికి అమెరికా, కెనడా నుంచి నిధులు అందాయి. దానితో ఖలిస్తాన్ ఉద్యమం పెరిగింది. దాన్ని అణచివేయుటకు ప్రధాని ఇందిరాగాంధీ అమృతసర్ స్వర్ణాలయంలో నక్కిన వేర్పాటు వాదులను పారద్రోలడానికి సైన్యాన్ని పంపి ఖలిస్తాన్ నాయకుణ్ణి హతమార్చింది. దాంతో ప్రధాని భద్రతాదళాలు ఆమెను హత్య చేశాయి. ఇందుకు అమెరికా రహస్య గూఢచార సంస్థ - సీఐఏ - పరోక్షకారణమని అప్పట్లో ఆరోపణలు వచ్చాయి. కెనడా నుంచి ఇండియాలో ప్రత్యేక వాదులకు నిధులు అందాయని మన రహస్య గూఢచార సంస్థ 'రా' (రిసెర్చ్ అండ్ ఎనాలిసిస్ వింగ్) నివేదికలు వెల్లడించాయి. అంటే మనదేశ పాలన తీరులను అటు రష్యా ఇటు అమెరికాలు ప్రభావితం చేస్తున్నాయనేది అక్షర సత్యం. 1984 ఇందిర హత్యానంతరం భారతదేశంలో బలమైన కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది. కాంగ్రెస్ నాయకులు రాజీవ్‌గాంధీ నాయకత్వాన, ఆయన తన 'నూతన విజన్'తో ఇండియాలో ''సమాచార విప్లవం''ను ప్రారంభించారు. నూతన పర్యావరణ పరిరక్షణకు పూనుకుని 1980లో జరిగిన అభివృద్ధి దేశాల శిఖరాగ్ర సభలో పాల్గొని ప్రచారంలో పర్యావరణ క్షీణతకు అమెరికాయే కారణమని స్పష్టం చేశారు. ఆయనపై అమెరికా కన్నువేసింది. ఆయన పటిష్టమైన నాయకత్వానికి ఓర్వలేని అమెరికా రాజీవ్ గాంధీపై చెక్ పెట్టింది. శ్రీలంక అంతర్యుద్ధంలో ఎల్‌టీటీఈని అణచివేయడానికి భారత్ సైనిక దళాలను పంపడంపై కక్షగట్టిన ఎల్‌టీటీఈ రాజీవ్‌గాంధీని హత్య చేసేందుకు కుట్ర పన్నింది.. ఎల్‌టీటీఈ వారికి సీఐఏ ప్రోత్సాహంతో ఇజ్రాయిల్ రహస్య గూఢచార సంస్థ ''మొజాద్'' సహకరించాయి. ఎల్‌టీటీఈ వారికి మానవ బాంబులచే హత్యలు చేయు శిక్షణ ఇచ్చింది. ఎల్‌టీటీఈ ఉగ్రవాదులు రాజీవ్‌గాంధీని 1990 ఎన్నికల ప్రచారంలో మానవ బాంబులతో హత్య చేశారు.. ఆ తర్వాత జరిగిన ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో మైనార్టీ ప్రభుత్వాన్ని వామపక్షాల మద్దతుతో నడిపించింది. ఆ కాలంలోనే సోవియట్ రష్యా పతనమైంది. ఆ దేశం భారత్‌కు ఇచ్చిన అప్పులు, నిధులు అన్నీ కూడా ఇండియాకే లాభించాయి.

1991లో బాబ్రీ మసీదు కూల్చివేతకు గురైంది కాంగ్రెస్ ప్రభుత్వం పీ.వీ నరసింహారావు నాయకత్వంలో సంస్కరణలకు శ్రీకారం చుట్టి విదేశీ మార్కెట్లకు భారత ఆర్థిక వ్యవస్థను అనుసంధానం చేశారు. దానితో ఇండియాలో ఉద్యోగులకు జీతాలు చెల్లించలేని స్థితిలో బంగారం కుదవ బెట్టి అప్పులు తెచ్చి ఇండియా వ్యవహారాలు నడిపారు. ఆనాటి కాంగ్రెస్ ప్రధాని నరసింహారావు వ్యూహాలతో రెండు ప్రధానాంశాలకు కారకుడు 1) కాంగ్రెస్‌ను వారసత్వ రాజకీయాల నుండి బయటపడేయడం అంటే కాంగ్రెస్‌ను గాంధీ, నెహ్రూ కుటుంబాల నుండి దూరం చేయడం 2) నూతన సంస్కరణలు ప్రవేశపెట్టి ఇండియాలో రిజర్వేషన్లు ఎస్సీ, ఎస్టీలకు, బీసీలకు లేకుండా చేయడం ఈ రిజర్వేషన్లను తొలగించేదమ్ము దేశంలో ఏ పార్టీకి లేదని గ్రహించిన పీ.వీ.నరసింహారావు తలచారు. ఆ విధంగా ప్రభుత్వం ప్రభుత్వ రంగాల ప్రాధాన్యత తగ్గింది. ఇండియా కాంగ్రెస్ హయాంలోని అంతర్జాతీయ మార్కెట్‌కు తలుపులు బార్లా తెరవడంతో ఆర్థిక స్థితి పుంజుకుంది. కాంగ్రెస్ పార్టీ చితికిపోయింది. కాంగ్రెస్ పార్టీ సొంతంగా అధికారాన్ని సంపాదించే స్థితి కోల్పోయింది. దాంతో కాంగ్రెస్ పగ్గాలు తిరిగి సోనియాగాంధీ చేతికి వచ్చాయి. 1998లో ఆమె అధ్యక్షురాలైంది. బీజేపీ అటల్ నాయకత్వంలో ఎన్.డీ.ఏ సంకీర్ణ కూటమి ప్రభుత్వాన్ని ఏర్పరచగా అమెరికా పూర్తిస్థాయి మద్దతు అందించింది. భారత దేశ విధానాలను ప్రభావితం చేసింది.

-డాక్టర్ ఆసయ్యా, ఐఐఎస్
8008359912

కౌన్సిల్ లోనూ రిజర్వేషన్లు ఉండాలి!

తెలంగాణాలో ఉపాధ్యాయ, పట్టభద్రుల, స్థానిక సంస్థల నియోజక వర్గాల నుంచి శాసనసభ్యుల కోటాలో, గవర్నర్ కోటాలో శాసనమండలి సభ్యులను ఎన్నుకోవడానికి రంగం సిద్ధం చేస్తున్నట్టు సమాచారం. ఇంతవరకూ మండలి స్థానాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న అభ్యర్థుల పని తీరు బేరీజు వేసుకోవడానికి ఇదే తరుణం. శాసనసభ్యులు నేరుగా ప్రజల నుంచి ఐదేళ్ళ కోసారి ఎన్నికవుతారు. శాసనమండలి సభ్యులైతే ప్రతి రెండు సంవత్సరాలకోసారి ఎన్నుకోబడతారు. శాసనసభ్యుల పదవీ కాలం 5 సంవత్సరాలు, శాసనమండలి సభ్యుల పదవీ కాలం 6 సంవత్సరాలు. ప్రతి రెండేళ్ళకోసారి లాటరీ పద్ధతిలో వారి పదవి ముగుస్తుంది. అదే మాదిరిగా జాతీయ స్థాయిలో పార్లమెంటు ఎగువ సభ అయిన రాజ్యసభకు ద్వైవార్షిక ఎన్నికలు జరుగుతాయి. శాసనమండలిలో ఉపాధ్యాయ, పట్టభద్రుల నియోజకవర్గాల నుంచి సభ్యుల ఎన్నిక జరుగుతుంది.

విద్యా విషయాల గురించి టీచర్ ఎమ్మెల్సీలు సభలో ప్రస్తావించి వాటి పరిష్కారం కోసం ప్రభుత్వం మీద ఒత్తిడి తెస్తారు. అలాగే, పట్టభద్రుల నియోజకవర్గాల నుంచి ఎన్నికైనవారు ప్రజల సమస్యలను శాసన మండలిలో ప్రస్తావించి పరిష్కారం కోసం కృషి చేస్తారు. బలహీన వర్గాల పిల్లలకు విద్యాసౌకర్యాలు సక్రమంగా అందుతున్నాయా? అసలు వారిలో బడికి వచ్చే పిల్లలు ఎంతమంది మొదలైన విషయాలను సభలో ప్రస్తావించి, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేసేందుకు బలహీనవర్గాలకు చెందిన వారికి రిజర్వేషన్లు కల్పించాల్సి న అవసరం ఎంతో ఉంది.

ఉపాధ్యాయ నియోజకవర్గాల నుంచి ఎన్నికైన ఎమ్మెల్సీలు గ్రామాల్లో, పట్టణాల్లో విద్యా సౌకర్యాల మెరుగుదలకు కృషి చేయాలి. బలహీనవర్గాలకు ప్రాతినిధ్యం కలిగించేందుకు శాసనమండలిలో రిజర్వేషన్లు కల్పించాలి. ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు రాజకీయ నేతల్లా కాకుండా కేవలం విద్యా విషయాలపైనే దృష్టిని కేంద్రీకరించాలి. శాసన మండలిలలో ఎస్సీలు, ఎస్టీలకు రిజర్వేషన్లు కల్పిస్తే బలహీన వర్గాల వాణి వినిపించేందుకు వీలుంటుంది.

-గుండమల్ల సతీష్ కుమార్
94031 55522



మార్లిన్ మన్రోల ప్రపంచ రికార్డు?

అడిలైడ్ : హాలీవుడ్ నటి మారిలిన్ మన్రోస్ ప్రపంచ రికార్డు సృష్టించారని ఆమె అభిమానులు చెబుతున్నారు. న్యూయార్క్‌లోని బ్రిగ్‌టన్ బీచ్‌లో 270 మందికిపైగా అభిమానులు మన్రోస్ వలే స్విమ్ సూట్ ధరించా రని వెల్లడించారు. ఒక ప్రదేశంలో మన్రోస్ లాగా అత్యధికమంది దుస్తులు ధరించడం ఇదే మొదటిసారని చెబుతున్నారు. అచ్చం ఆమె లాగే తెల్లని గౌనులు, విగ్గులు, కళ్లజోళ్లు ధరించారని, ఆదివారం ఈ రికార్డుస్థాయి ప్రదర్శన జరిగిందని చెబుతున్నారు. గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డుకు ఈ సంఖ్య సరిపోతుందని పేర్కొన్నారు. క్యాన్సర్‌పై పరిశోధనకు విరాళాలు సేకరిస్తున్న మారిలిన్ జెట్టీ స్విమ్ ఆర్గనైజర్ మన్రోస్ నిర్వహకురాలు సారా తిన్నే ఈ విషయాన్ని వెల్లడించారు.

క్యాన్సర్‌పై పరిశోధనలకు విరాళాల కోసం మన్రోస్ ఆస్ట్రేలియాలోని అడిలైడ్ బీచ్‌లో స్విమ్ సూట్‌లో మునగనున్నారు. ఈ కార్యక్రమం ద్వారా నిధులు సేకరించనున్నారు.ఈ పర్యటనకు ఒక్క రోజు ముందే ఈ రికార్డు స్థాయి ప్రదర్శన జరిగిందన్నారు.

అడిలైడ్‌లో జరగనున్న కార్యక్రమానికి అనేకమంది ఔత్సాహికులు పాల్గొంటామంటున్నారు. అయితే సరిపడా విగ్గులు అందుబాటులో లేవని ఆమె వెల్లడించారు. క్యాన్సర్‌పై పరిశోధనల కోసం మారిలిన్ జెట్టీ స్విమ్ ఆర్గనైజర్ కార్యక్రమాలను చేపడుతోంది. వివిధ దేశాలలోని బీచ్‌లో మారిలిన్ మన్రోస్ ప్రదర్శనల ద్వారా విరాళాలు సేకరిస్తున్నారు.

ప్రజల చేతుల్లో 'హరిత'

- 'పచ్చదనం' బాధ్యత వారికే
- సర్పంచ్‌లకు పర్యవేక్షణ బాధ్యత
- రహదారులకు ఇరువైపులా హరితవనాల అభివృద్ధికి ప్రణాళిక
- మూడు శాఖలను సమన్వయం చేస్తూ ప్రాజెక్టుకు రూపకల్పన
- కొన్ని జిల్లాల్లో పైలట్ ప్రాజెక్టుగా శ్రీకారం



హైదరాబాద్, ఆంధ్రప్రభ: ప్రజారోగ్యం, పర్యావరణ పరిరక్షణ నేపథ్యంలో హరితహారం కార్యక్రమానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్న ప్రభుత్వం ఈ ఏడాది నుంచి ప్రజలందరి భాగ స్వామ్యం కోరుతోంది. రహదారులకు ఇరువైపు లా హరిత వనాలను అభివృద్ధి చేయాలని నిర్ణ యించింది. ఇందులో గ్రామ పంచాయతీలకూ కీలక బాధ్యతలు అప్పగించాలని సీఎం కేసీఆర్ అధికారులను ఆదేశించారు. త్వరలో జరుగ నున్న శిక్షణ కార్యక్రమాల్లోనూ సర్పంచ్‌లకు పర్యవేక్షణ బాధ్యతలపై మార్గనిర్దేశం చేయను న్నారు. విభజన అనంతరం బంగారు తెలంగాణ నిర్మాణానికి శ్రీకారం చుట్టిన ముఖ్యమంత్రి మెగా సిటీలు, స్మార్ట్ సిటీల నిర్మాణంతో పాటు కొన్ని జిల్లాల్లో విస్తరించివున్న జాతీయ రహదారులన్నీ హరిత వనాలుగా తీర్చిదిద్దాలని సంకల్పించారు. పారిశ్రామిక, వాణిజ్య పెట్టుబడులను ఆకర్షించేం దుకు ప్రణాళిక సిద్ధం చేసుకున్న ఆయన అత్యంత ప్రాధాన్యత గల రహదారుల అభివృద్ధిపై దృష్టి పెట్టారు. వ్యవసాయం, సాగునీటి పారుదల, ఆర్థిక శాఖల సమన్వయంతో హరిత పేరుతో ప్రత్యేక ప్రాజెక్టును రూపొందించారు. అతిత్వర లోనే ఈ ప్రాజెక్టు కార్యరూపం దాల్చనుంది.

మొదటి దశలో జాతీయ రహదారులను సస్యశ్యామలంగా మార్చేందుకు అధికారులు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. ఇందుకు సంబం ధించి ఆయా శాఖల ఉన్నతాధికారులతో ఇప్ప టికే పలుసార్లు సీఎం కేసీఆర్ ఉన్నతస్థాయి సమీక్షలు నిర్వహించారు. ప్రభుత్వం అత్యంత ప్రతి ష్ఠాత్మకంగా భావిస్తున్న ఈ హరితహారం పథకం అమలు లక్ష్యాలు, విస్తరణపై దిశానిర్దేశం చేశారు. ఈ పథకానికి సంబంధించి మార్గదర్శకాలు విడుదలైన వెంటనే పలు జిల్లాల్లో పైలట్ ప్రాజె క్టుగా అమలు చేయనున్నారు. ఒక్కో జిల్లాలో ఐదు మండలాలను ఎంపిక చేసి కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తారు.

హరిత వనాల అభివృద్ధి ప్రాజెక్టు అమలుకు సంబంధించి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృ త్వంలో కార్యాచరణ ప్రణాళిక తయారవుతోంది. ప్రభుత్వ శాఖలతో రైతాంగానికి మధ్య సమాచా రాన్ని సమన్వయం చేయడం, సామర్థ్యాన్ని పెం పొందించడం, ప్రయోజనం చేకూరే నిర్ణయాలు తీసుకోవడం, వాస్తవ నివేదికలు, క్షేత్రస్థాయి సమాచారం ఆధారంగా పంటల సాగును విస్త రించడం, నీటి పారుదల అవకాశాలను మెరుగు పరచడం, నీటి యాజమాన్యం, సాగులో ఆధునిక పరిజ్ఞానాన్ని వినియోగించడం తదితర లక్ష్యాలను నెరవేర్చే కార్యక్రమాన్ని కూడా మూడు శాఖల సమన్వయంతో అమలు చేయనున్నారు. వ్యవసాయం, అనుబంధ రంగాలతో పాటు రెవెన్యూ, నీటి పారుదల శాఖలు ఈ ప్రాజెక్టు అమ లులో భాగస్వామ్యం పంచుకోబోతున్నాయి.

రాష్ట్రవ్యాప్తంగా అన్ని రహదారులకు ఇరువై పులా పెద్దఎత్తున చెట్లునాటి ఉద్యానవనాలను అభివృద్ధి చేసే బాధ్యతను కూడా అటవీ శాఖకే అప్పగించారు. గ్రీనరీని అభివృద్ధి చేసినందుకు వాహన చోదకుల నుంచి గ్రీన్‌సెస్ రూపంలో కొంత మొత్తాన్ని వసూలు చేయాలని సూచన ప్రాయంగా నిర్ణయించారు. ఆ రుసుము ఎంత ఉండాలనే అంశంపై కసరత్తు జరుగుతోంది.

హరితవనాలతో సంక్షోభ నివారణ

ఆర్థికాభివృద్ధికి మూలమైన వ్యవసాయ రంగంలో ఉన్న సంక్షోభాన్ని పూర్తిగా నివారిం చేందుకు అధికారులు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. భూసార పరీక్షలు నిర్వహించడం, పంటలు పండే ప్రాంతాలను గుర్తించి రైతులను ప్రత్యేకంగా ప్రోత్సహించడం, సాగుకు అవసరమైన ఎరువులు, విత్తనాలు సకాలంలో అందేలా చూడడం, వాతావరణ పరిస్థితులను అంచనా వేసి సూచనలివ్వడం, బ్యాంకుల ద్వారా పంట రుణాలను ఇప్పించడం, పంటల బీమా పథకాన్ని గ్రామస్థాయిలో ప్రచారం చేసి, రైతు లకు వివరించి ప్రీమియం కట్టించడం లాంటి కార్యక్రమాల అమలు బాధ్యతను వ్యవసాయ శాఖకు అప్పగించారు. వ్యవసాయ సంక్షోభ నివారణ చర్యలకు కూడా మొదటి దశలో రాష్ట్రవ్యాప్తంగా వెనుకబడిన మూడు జిల్లాలను ఎంపిక చేస్తారు. ప్రతి జిల్లా నుంచి 5 మండలాలు ఎంచుకుంటారు. ప్రతి మండలానికి 20 గ్రామాల చొప్పున మొత్తం 300గ్రామాలు ఎంపిక చేస్తారు. ప్రతి గ్రామంలో 300 మంది రైతులను ఎంపిక చేసి పైలట్ ప్రాజెక్టును అమలు చేయనున్నారు. గుర్తించిన ఈ రైతులందరికీ ప్రభుత్వపరంగా సంపూర్ణ సహకారం అందించిన తర్వాత ఈ కార్యక్ర మాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తారు.

రాజ్యాంగ సంస్థల ధ్వంసం: సురవరం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: దేశంలోని అన్ని రాజ్యాంగ సంస్థలను మోడీ ప్రభుత్వం ధ్వంసం చేస్తోందని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి ధ్వజమెత్తారు. సీపీఐ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం తెలంగాణ సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ, ఏన్డీఏ పాలనలో సీబీఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, ఆర్‌బీఐ వంటి రాజ్యాంగ సంస్థలను రాజకీయ ప్రత్యర్థులపై పంపుతూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నాయని మండిపడ్డారు. రానున్న ఎన్నికల్లో మోడీని గద్దె దించాలని ప్రజలకు సుర వరం పిలుపునిచ్చారు.

మమత రాజ్యాంగాన్ని కాపాడారు: వీహెచ్

కేంద్రప్రభుత్వం రాష్ట్రాల ప్రభుత్వాలపై కక్ష పూరితంగా వ్యవహరించడం సరికాదని ఏఐసీసీ కార్యదర్శి వి. హనుమంతరావు అన్నారు. సోమవారం గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడారు. పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీని బెదిరించే విధంగా మోడి ప్రభుత్వం చేయిస్తున్న సీబీఐ దాడులను ఖండించారు. సీబీఐని మమతా ఒక శక్తిలాగ అడ్డుకుని రాజ్యాంగాన్ని కాపాడిందన్నారు. ఈ విషయంలో సీఎం కేసీఆర్ ఎందుకు స్పందించడం లేదని నిలదీశారు.

'మోడీ అంటే భయమెందుకు?'

ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ రాష్ట్రానికి నిధుల విడుదల విషయంలో అన్యాయం చేస్తున్నా సీఎం చంద్రశేఖర్‌రావు ఎందుకు స్పందించడం లేదని పీసీసీ కోశాధికారి గూడూరు నారాయణరెడ్డి ప్రశ్నించారు. విభజన చట్టంలో పేర్కొన్న అంశాలు సాధించడంలో టీఆర్ఎస్ ప్రభుత్వం విఫల మైందని సోమవారం ప్రకటనలో విమర్శించారు. నీతి ఆయోగ్ సిఫారస్ చేసినప్పటికి మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, కాళేశ్వరం ప్రాజెక్టులకు కేంద్రం నిధులను ఇవ్వలేదన్నారు. ఈ విషయంలో మోడీ ప్రభుత్వంపై నిరసన చేయడానికి కేసీఆర్, టీఆర్ఎస్ నేతలు నిరసనలు చేయడానికి ఎందుకు ధైర్యం చేయడం లేదని గూడూరు నిలదీశారు.

హిందూ మహాసభ కార్యకర్తలపై చర్యలేవి?: పొన్నం ప్రభాకర్

మహాత్మా గాంధీ విగ్రహాన్ని అవమానించిన హిందు మహాసభ కార్యకర్తలపై కేంద్ర ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోలేదని పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ పొన్నం ప్రభాకర్ పశ్నించారు. యూపీలో గాంధీ విగ్రహాన్ని అవమానించినందుకు నిరసనగా సోమవారం గాంధీభవన్ ఆవరణలో ఉన్న గాంధీ విగ్రహం వద్ద నగర కాంగ్రెస్ అధ్యక్షుడు అంజన్‌కుమార్ అధ్యక్షతన పార్టీ నేతలు నిరసన వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ నేతపై సినీనటి జీవిత ఫిర్యాదు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : సినీ నటుడు, రాజశేఖర్ సోదరుడు గుణ శేఖర్‌పై కాంగ్రెస్ నేత దాడి చేసినట్లు జూబ్లీహిల్స్ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. రాజశేఖర్ సతీమణి, సినీ నటి జీవితతో కలిసి గుణశేఖర్ జూబ్లీహిల్స్ పోలీసుస్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. వారం రోజుల క్రితం ఈ ఘట చోటు చేసుకుందని ఫిర్యాదులో పేర్కొన్న గుణశేఖర్, జీవితలు దాడికి సంబంధించిన సీసీ టీవీ పుటేజీని పోలీసులకు అందించారు. జూబ్లిహిల్స్‌లో గుణశేఖర్ గుణ డైమండ్స్ పేరుతో ఓ దుకాణాన్ని నడుపుతున్నారు. ఈ దుకాణం ముందు కౌశిక్‌రెడ్డి కారును పార్కింగ్ చేసి వెళ్ళారు. తిరిగి కారు తీస్తున్న సమయంలో గుణశేఖర్, కౌశిక్‌రెడ్డి మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో ఆగ్రహించిన కౌశిక్‌రెడ్డి గుణశేఖర్‌పై దాడికి పాల్పడ్డారు.

నేటి బాలలే రేపటి శాస్త్రవేత్తలు

- ముగిసిన రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలు



ప్రశంసాపత్రాలు అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పద్మ, ఎంపీ దయాకర్

కాజీపేట, ప్రభ న్యూస్ : నేటిబాలలే రేపటి శాస్త్రవేత్తలు అని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గద్దల పద్మ అన్నారు. తెలుగాణ సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల మడికొండలో మూడు రోజులుగా ఇన్‌స్పైర్ మనక్ కార్యక్రమం పేరిట విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతి పని గుర్తించడానికి రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రంలోని 31 జిల్లాల్లో జిల్లాల వారిగా 2017-18-19 సంవత్సరాలకు గాను ప్రదర్శన కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు మూడురోజులు ఘనంగా ప్రదర్శనలు చేశారు. ఈ ప్రదర్శనలో మొత్తం మూడు రోజులు జరిగిన ప్రర్శనలో కాకతీయ యూనివర్సిటీ ఎన్ఐటీ విభాగాల నుంచి వివిధ విభాగాల నుంచి 14 టీంలతో 32 మంది ప్రొఫెసర్లు ఎంఐఎఫ్ నుంచి మౌనిక గోరె నదీమ్ ఉస్మానియావర్సిటీ ప్రొ. బి.ఎన్‌రెడ్డి న్యాయనిర్ణేతలుగా వచ్చి విద్యార్థులు ప్రదర్శించిన ఎగ్జిబిట్లను నిర్దేశిత పరిశీలించి 647 ప్రదర్శనల నుంచి 100 ఎగ్జిబిట్లను ఎంపిక చేయగా వాటిలో నుంచి 75 మంది విద్యార్థుల ప్రదర్శించే ప్రదర్శనలు తిలకించిన విజేతలుగా ప్రకటించారు. 2017-18 సంవత్సరంలో 33 మంది 2018-19 విద్యా సంవత్సరంలో 42 మందిని మొత్తం 75 మందిని ఎంపిక చేశారు.

ఢిల్లీలో ఉచిత క్యాన్సర్ శిబిరాలు

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: ప్రపంచ దేశాలను వణికిస్తున్న క్యాన్సర్ మహమ్మారిపై అవగాహన కల్పించేందుకు దేశ రాజధానిలో పలు స్వచ్ఛంద సంస్థలు అవగాహనా కార్యక్రమాలు చేపట్టాయి. ఫిబ్రవరి 4 క్యాన్సర్ డే సందర్భంగా ఢిల్లీలోని పలు ప్రాంతాల్లో క్యాన్సర్ అవగాహనా శిబిరాలు నిర్వహించారు. బంజారా ఎన్జీవో వ్యవస్థాపకులు డాక్టర్ పూర్ణిమ, డాక్టర్ ఆనంద్ ఆధ్వర్యంలో మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించారు. మహిళలు, పిల్లలకు ఉచిత క్యాన్సర్ పరీక్షలు జరిపారు. ఆర్ఎమ్ఎల్ ఆసుపత్రిలోని జనరల్ వార్డులో రోగులకు పండ్లు పంచారు. యాక్షన్ క్యాన్సర్ హాస్పిటల్ డాక్టర్ ఊష్మా సింగ్ క్యాన్సర్ రావడానికి గల కారణాలు, నివారణ, ఆ రోగాన్ని జయించే సాధనాల గురించి మహిళలకు అవగాహన కల్పించారు. భవిష్యత్‌లో తాము ఇలాంటి మరిన్ని కార్యక్రమాలు నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నామని బంజారా ఎన్జీవో వ్యవస్థాపకులు డాక్టర్ ఆనంద్ తెలిపారు. మరోవైపు బస్తీ వికాస్ కేంద్రలో సైరాస్ ఎన్జీవో ఆధ్వర్యంలో క్యాన్సర్‌పై ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. రాష్ట్రపతి అవార్డు గ్రహీత, బ్రెస్ట్ క్యాన్సర్ నిపుణులైన ఆర్ఎమ్ఎల్ ఆసుపత్రి వైద్యురాలు సి.కె.దుర్గ క్యాన్సర్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. వైద్య శిబిరానికి హాజరైన వారికి వివిధ రకాల పరీక్షలు నిర్వహించారు.

పోలవరం పనులు 64 శాతం పూర్తి

- రాజ్యసభలో కేంద్ర మంత్రుల వెల్లడి

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: పోలవరం ప్రాజెక్టు పనులు 64 శాతం పూర్తయ్యాయని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఇప్పటివరకూ అన్ని పనులు కలిపి 64.31 శాతం పనులు పూర్తయ్యాయని కేంద్ర జలవనరుల శాఖా మంత్రి, ఆ శాఖ సహాయ మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ వెల్లడించారు. ఇరిగేషన్ కాంపోనెంట్ అంచనా వ్యయం రూ. 7, 158 కోట్లు కాగా... పోలవరంనకు జాతీయ హోదా ప్రకటించిన తర్వాత రూ. 6,764 కోట్లు విడుదల చేశామని తెలిపారు. 2014కు ముందు ఏఐబీపీ పథకం కింద రూ. 562.47 కోట్లు విడుదల చేశామని కేంద్ర మంత్రులు జవాబిచ్చారు. టీడీపీ ఎంపీలు కనకమేడల రవీంద్ర కుమార్, టీజీ వెంకటేష్, కాంగ్రెస్ ఎంపీ కేవీపీ రామచంద్రరావు అడిగిన ప్రశ్నలకు సోమవారం రాజ్యసభలో కేంద్ర మంత్రులు లిఖితపూర్వక సమాధానమిచ్చారు. 2014 మార్చి 31 వరకు ప్రాజెక్టుపై చేసిన ఖర్చుకు సంబంధించిన ఆడిట్ స్టేట్‌మెంట్‌తో పాటు అంచనా వ్యయాల ఆమోదం గురించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని వివరణ అడిగినట్టు తెలిపారు. రూ. 393.51 కోట్లకు సంబంధించి ప్రతిపాదనలు అందాయని, దీనిపై తమకున్న సందేహాలకు సమాధానాలివ్వాలని కోరామన్నారు. 2017-18 ధరల ప్రకారం సవరించిన అంచనా వ్యయాల ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి పంపిందన్నారు.

ఉద్యమాలే నన్ను మలిచాయి

- బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్ రాములు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఉద్యమాలు, గ్రంథాలయాలు, సామాజిక అంశాలు తనను సమాజ సేవ వైపు నడిపించాయని తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ బిఎస్ రాములు అన్నారు. తెలంగాణ సారస్వత పరిషత్ నిర్వహిస్తున్న పరిణతవాణి ప్రసంగంలో సోమవారం బిఎస్ రాములు



ప్రసంగించారు. 79వ ప్రసంగకర్తగా బిఎస్ రాములు నిలిచారని సారస్వత పరిషత్ అధ్యక్షులు ఎల్లూరి శివారెడ్డి తెలిపారు. బిఎస్ రాములు మాట్లాడుతూ తాను 1949 ఆగస్టు 23న జగిత్యాలలో జన్మించానని తెలిపారు. 1969లో జరిగిన తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నానని తెలిపారు. 1968 జనవరి బాలమిత్ర సంచికలో తన మొదటి కథ ప్రచురితమైందని తెలిపారు. ఇప్పటి వరకు కథలు, నవలలు, సాహిత్య, సామాజిక, రాజకీయ విశ్లేషణ, వ్యక్తిత్వ వికాసం, తత్వశాస్త్రం, అలంకార శాస్త్రం, తెలంగాణ చరిత్ర, సంస్కృతి తదితర అంశాలపై ఇప్పటి వరకు 96 గ్రంథాలు రచించినట్టు తెలిపారు. వాటిలో కేవలం తెలంగాణ సాధన ఉద్యమం గురించే 42 గ్రంథాలు రచించినట్టు తెలిపారు.

మూడుచోట్ల టీ.టీడీపీ పోటీ?

- కాంగ్రెస్‌తో కలిసే రంగంలోకి!

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలుగుదేశంపార్టీ తెలంగాణ లోక్‌సభ ఎన్నికలపై దృష్టిసారించింది. ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీతో జతకట్టి ఆశించిన స్థాయిలో ఫలితాలు పొందలేనప్పటికీ మళ్ళీ అదే స్ఫూర్తితో వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కలిసి పోటీచేసేందుకు సిద్ధమవుతోంది. జాతీయ స్థాయిలో కాంగ్రెస్ పార్టీకి ప్రాంతీయ పార్టీల అవసరం ఉన్నందున లోక్‌సభ ఎన్నికల్లో కూ డా తెదేపాతోనే కలిసి పోటీ చేయాలని ఆ పార్టీ అధిష్టానం ఇప్పటికే సూచనప్రాయంగా తెలిపినట్టు సమాచారం. జాతీయ స్థాయిలో ఎన్డీఏకు ప్రత్యామ్నాయంగా కాంగ్రెస్ నేతృత్వంలో ఫ్రంట్ ఏర్పాటు చేయాల్సిన అవసరంపై తెదేపా జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు ఇప్పటికే స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు. ఈ నేపథ్యంలోనే తెదేపా తెలంగాణ వచ్చే ఎన్నికల్లోకూడా కాంగ్రెస్‌తో కలిసి పని చేసేందుకు సంసిద్ధం వ్యక్తం చేస్తోంది. గత నెల జరిగిన పంచాయితీరాజ్ ఎన్నికల్లో స్థానికంగా పొత్తులు పెట్టుకోవాలని తెదేపా అధిష్టానం పిలు పునిచ్చిన విషయం తెలిసిందే. తక్కువ స్థానాల్లో పోటీ చేసిన ప్పటికీ రాష్ట్రవ్యాప్తంగా కార్యకర్తలు ఉన్న తెదేపా కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇచ్చి పనిచేసింది. కాంగ్రెస్‌తో ఎలాంటి అర మరికలు లేకుండా సర్దుకుపోతున్న తెదేపా లోక్‌సభ ఎన్ని కల్లో కూడా అదే వైఖరి కొనసాగించాలని నిర్ణయించినట్టు తెలుస్తోంది. లోక్‌సభ ఎన్నికల్లో మూడు స్థానాల్లో పోటీ చేసేందుకు ఆ పార్టీ సిద్ధమవుతోంది. సెటిలర్లు అధికంగా ఉన్న మల్కాజ్‌గిరి, చేవెళ్ళ, నియోజక వర్గాల్లో, పార్టీ బలం గా ఉన్న ఖమ్మం లోక్ సభ స్థానం నుంచి పోటీ చేయాలని తెదేపా అధిష్టానం భావిస్తోంది. దేశవ్యాప్తంగా ఏర్పడే ప్రతి పక్షాల ఫ్రంట్ భాగస్వామ్యంగా తమకు కనీసం రెండు స్థానా లైనా కేటాయించాల్సి ఉంటుందని ఒక తెదేపా నేత అన్నారు. శాసనసభ ఎన్నికల్లో గెలుపోటములు, బలాబలాలతో నిమిత్తం లేకుండా లోక్‌సభ ఎన్నికల్లో సీట్లు రాబట్టాలని టీ.టీడీపీ భావిస్తోంది.

సుప్రీం తీర్పుతో ఉపాధ్యాయుల్లో ఆనందం

- పదోన్నతులకు డిమాండ్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీస్ రూల్స్ అంశంలో ఉపాధ్యాయులకు సానుకూల తీర్పు లభించింది. రాష్ట్రపతి ఉత్తర్వులపై రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంలో వేసిన స్పెషల్ లీవ్ పిటిషన్ విచారణలో హైకోర్టు తీర్పుపై స్టే విధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. దీనిపై ఉపాధ్యాయ సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. వెంటనె ఏకీకృత సర్వీస్ రూల్స్ రూపొందించి పదోన్న తులు కల్పించాలని సంఘాలు కోరుతున్నాయి. మధ్యంతర ఉత్తర్వుల అనంతరం మరో వాయిదా మార్చి నెల 25 ఉంది. అప్పటిలోగానే ఉపాధ్యాయులకు సర్వీస్ రూల్స్ రూపొందించి పదోన్నతులను ఇవ్వాల్సి ఉంటుంది. ఎన్నికల కోడ్ వచ్చేలోగా ఈ ప్రక్రియ సాధ్యమవుతుందా అన్న ఆందోళన నెలకొంది.జోన్ల వ్యవస్థపై కూడా హైకోర్టులో స్టేటస్ కో కొనసాగుతోంది. ప్రభుత్వం సర్వీస్ రూల్స్ రూపొందించి అమలుచేస్తే జోన్లపై ఉన్న స్టేటస్ కో అడ్డంకి మారే అవకాశముంటుందని న్యాయ నిపుణుల అభిప్రాయపడుతున్నారు.

ప్రేమించలేదని స్నేహితురాలి గొంతు కోసిన ఉన్మాది

మహబూబ్‌నగర్, ప్రభ న్యూస్ బ్యూరో : ప్రేమిస్తున్నానని చెబుతున్నా ఒప్పుకోలేదన్న కోపంతో ఓ యువతి గొంతుకోసిన యువకుడు ఆ తరువాత తనూ ఆత్మహత్య చేసుకునేందుకు విఫలయత్నం చేశాడు. ఈ సంఘటన మహబూబ్‌నగర్‌లో సోమవారం చోటు చేసుకుంది. తీవ్రంగా గాయపడిన ఇద్దరినీ ఆస్పత్రికి తరలించి చికిత్స చేస్తున్నారు.

పోలీసుల కథనం ప్రకారం మహబూబ్ నగర్ లక్ష్మీనగర్‌కు చెందిన సౌమ్య స్వీట్స్ ఇంజనీరింగ్ కాలేజీలో డిప్లొమా ఫైనల్ ఇయర్ చదువుతోంది. జడ్చర్ల నుంచి వచ్చే అనుదీప్ క్లాస్‌మేట్. దీంతో ఆమెను ప్రేమిస్తున్నానంటూ ఏడాదిగా వెంటపడుతున్నాడు. అయితే ఆమె అందుకు ఒప్పుకోకపోవడంతో పగ పెంచుకున్నాడు. ఆమెను ఒప్పించేందుకు ఒకటి రెండు ప్రయత్నాలు చేసినా ఫలితం లేకపోవడంతో రగిలిపోయాడు. అదను చూసి సోమవారం అమ్మాయి ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో లోపలికి జొరబడ్డాడు. ప్రేమిస్తావా లేదా అని బెదిరించాడు. ఆమె ఒప్పుకోక పోవడంతో బ్లేడ్‌తో ఆమె గొంతు కోసాడు. బాధతో విలవిలలాడిన సౌమ్య అరుపులు విని చుట్టు ప్రక్కల వాళ్ళు వచ్చి ఉన్మాదిని రూమ్‌లో బంధించారు. దీంతో అమ్మాయి ఇంట్లో కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఇరువురినీ ఆసుపత్రికి తరలించారు. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. సౌమ్య చాలా బీద కుటుంబీకురాలు. తల్లి తండ్రి పానీ పూరి బండి నడిపిస్తూ చదివిస్తున్నారు. ఉన్మాది దాడితో వారి కుటుంబం చిక్కుల్లో పడింది.

ఐఏఎస్ ఆదిత్యనాథ్‌కు హైకోర్టులో ఊరట

హైదరాబాద్, ఆంధ్రప్రభ : జగన్ అక్రమాస్తుల కేసులో ఆరోపణలు ఎదుర్కొన్న ఐఏఎస్ అధికారి, నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి ఆదిత్యనాథ్ దాస్‌పై సీబీఐ దాఖలు చేసిన కేసును హైకోర్టు కొట్టివేసింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.శివ శంకరరావు సోమవారం ఈ మేరకు తీర్పు ఇచ్చారు. ఈ అధికారిని శిక్షించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఎలాంటి అనుమతి లభించ లేదు. ఈ నేపథ్యంలో సీబీఐ కోర్టు నిర్ణయాన్ని న్యాయమూర్తి తప్పుపట్టారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నీటి పారుదల శాఖ ముఖ్యకార్యదర్శిగా ఆదిత్యనాథ్ వ్యవహరించారు.

మల్లన్నసాగర్ నిర్వాసితుల ఆందోళన

హైదరాబాద్, ఆంధ్రప్రభ: మల్లన్నసాగర్ నిర్వాసితులు మళ్ళీ ఉద్యమబాట పట్టారు. ప్రాజెక్టు పరిధిలో ఒక్కో గ్రామంలో ఒక్కోరకమైన నష్ట పరిహారం చెల్లించడంతో తక్కువ నష్టపరిహారం అందిన నిర్వాసితులు నిరసలు ప్రారంభించారు. ముంపు గ్రామాలన్నింటికీ సమన్యాయం చేయాలని గ్రామప్రజలందరూ రోడ్డెక్కారు. తక్కువ ధరలకు భూములు కోల్పోయామని సాగర్ ఆయకట్టుపై వంటావార్పు కూడా నిర్వహించారు. పలు గ్రామాల్లో నిరసనలు ప్రారంభమవడంతో దీన్ని పరిష్కరించమని ఉన్నతస్థాయి వర్గాలు ఆదేశించినట్లు తెలిసింది.

నేడు రాహుల్‌తో రాష్ట్ర నేతల భేటీ

- అసెంబ్లీ ఫలితాలపై సమీక్ష
- పార్లమెంట్ ఎన్నికల వ్యూహంపై చర్చ



హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్ర కాంగ్రెస్ నేతలకు పార్టీ అధిష్టానం నుంచి పిలుపు వచ్చింది. ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీతో మంగళవారం వార్ రూమ్‌లో సమావేశం కాను న్నారు. ఈ సమావేశానికి పార్టీ ముఖ్య నేతలు, ఎమ్మెల్యేలతో పాటు ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి చెందిన వారిని కూడా ఆహ్వానించినట్లుగా కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. కాగా అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఓటమిపైన రాహుల్‌గాంధీ సీరియస్‌గానే ఉన్నట్లుగా సమాచారం. ఏఐసీసీ నుంచి పూర్తి సహ కారం అందించినా.. టీపీసీసీ నాయత్వం సద్వినియోగం చేసుకోలేదనే ఆగ్ర హంతో అధిష్టానం పెద్దలు ఉన్నట్లుగా పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మంగళవారం జరిగే సమీక్షలో ఎన్నికల్లో జరిగిన లోపాలు, పొరపాట్లపై సుదీర్ఘంగా చర్చించనున్నారు. అంతే కాకుండా పార్లమెం ట్ ఎన్నికలపైన కూడా పార్టీ అధిష్టానం ప్రత్యేక దృష్టిసారించింది. ఒక వైపు అసెంబ్లీ ఎన్ని కల్లో జరిగిన లోపాలపై సమీక్ష చేసి .. మరో వైపు పార్లమెంట్ ఎన్నిక లకు ఈ సమావేశంలో రాష్ట్ర పార్టీ నేతలను రాహుల్‌గాంధీ సమా యత్తం చేయనున్నారు.

అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థుల ప్రకటన ఆలస్యం కావడం వల్ల రాష్ట్రంలో పార్టీ ఓటమికి కారణమైందని పీసీసీ చీఫ్ ఉత్తమ్ కుమార్‌రెడ్డి పార్టీ అధిష్టానానికి ఒక నివేదిక ఇచ్చారు. అయితే కొంతమంది నేతలు మాత్రం అందుకు భిన్నంగా రాహుల్‌గాంధీకి నివేదికలు ఇచ్చారని అప్పట్లోనే చర్చ జరిగిన విషయం తెలిసిందే. పార్టీ మీటింగ్‌లు హోటళ్లకే పరిమితం కావ డంతో పాటు.. ఎన్నికల మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకుపోవడంలో విఫలమైనామని, అభ్యర్థుల ఎంపికల్లో కూడా పొరపాట్లు జరిగాయ ని టీపీసీసీకి వ్యతిరేకంగా ఫిర్యాదులు వెళ్లాయి. అయితే పార్లమెంట్ ఎన్నికల్లో ఇవే సమస్యలు పునరావృతమైతే ఇబ్బందులు తప్పవని కాంగ్రెస్ నేతలు పేర్కొంటున్నారు. ఈ సమయంలో అప్రమత్తంగా ఉండాలనే ఆలోచనతో రాష్ట్ర నేతలతో రాహుల్ సమావేశం ఏర్పాటు చేశారని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. పార్లమెంట్ ఎన్నికల్లో స్థానిక నేతల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని బలమైన అభ్యర్థులను పోటీకి దింపాలనే యోచనలో అధిష్టానం ఉన్నట్లుగా తెలుస్తోంది. ఎన్నికల ప్రచారం కూడా పకడ్బందిగా చేయాలని నిర్ణయానికి నేతలు వచ్చారు.

ఖమ్మం పార్లమెంట్ బరిలో రాములమ్మ!?



కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, ఎన్నికల ప్రచార కమిటి చైర్మన్ విజయశాంతి వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేస్తారా..? లేదా..? ఒక వేళ పోటీకి సిద్ధమైతే ఎక్కడి నుంచి బరిలో ఉంటారనే అంశంపై పార్టీ లో తీవ్ర చర్చ జరుగుతుంది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉన్న రాములమ్మ.. పార్లమెంట్ ఎన్నికల్లో మాత్రం అధిష్టానం ఆదేశిస్తే పోటీకి సిద్ధమనే సంకేతాలు ఇస్తున్నారు. టీఆర్ఎస్‌లో ఉన్నప్పుడు 2009 ఎన్నికల్లో మెదక్ పార్లమెంట్ నుంచి విజయం సాధించిన శాంతమ్మ.. ఇప్పుడు మాత్రం ఖమ్మం పార్లమెంట్ స్థానంపై గురిపెట్టినట్లుగా కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఖమ్మం జిల్లాలో పది అసెంబ్లీ నియోజక వర్గాలకు గాను ఎనిమిది నియోజక వర్గాల్లో ప్రజా కూటమి అభ్యర్థులే విజయం సాధించారు. అధికార టీఆర్ఎస్ ఒక స్థానానికే పరిమితం కాగా.. మరో చోట కాంగ్రెస్ పార్టీకి రెబల్‌గా పోటీ చేసిన స్వతంత్ర అభ్యర్థి విజయం సాధించిన విషయం తెలిసిందే. అసెంబ్లీ ఫలితాలను బట్టి చూస్తే ఖమ్మం పార్లమెంట్ హస్తం పార్టీ కైవసం చేసుకోవడానికి అవకాశం ఉంటుందని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. ఒకవేళ పార్లమెంట్ ఎన్నికల్లోనూ ప్రజా కూటమి పొత్తులో భాగంగా ఖమ్మం పార్లమెంట్ సీటును టీడీపీకి కేటాయించే అవకాశం ఉంటుందనే చర్చ కూడా జరుగుతోంది. ఒక వేళ పార్లమెంట్ ఎన్నికల్లో పొత్తులు లేకుండా కాంగ్రెస్ పార్టీ ఒంటరిగా బరిలోకి దిగితే బలమైన అభ్యర్థినే పోటీకి దింపాలని కాంగ్రెస్ అధిష్టానం ఆలోచన చేస్తున్నట్లుగా తెలుస్తోంది. ఖమ్మం జిల్లా కాంగ్రెస్‌లో రెండు వర్గాలుగా ఎవరికి వారే రాజకీయాలు నడిపిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో స్థానిక నేతలకు టికెట్ ఇవ్వడం వల్ల నష్టపోయే ప్రమాదం ఉందని, జిల్లా బయటి వ్యక్తులకు టికెట్ ఇస్తే కాంగ్రెస్ విజయానికి ఢోకా ఉండదంటున్నారు. ఈ పరిస్థితుల్లో కాంగ్రెస్ పార్టీ నేతగానే కాకుండా సినీ నటిగా ప్రజల్లో మంచి పలుకుబడి ఉన్న విజయశాంతిని ఖమ్మం నుంచి బరిలోకి దింపడం వల్ల కాంగ్రెస్‌కు లాభం జరుగుతుందనే ఆలోచనతో ఉన్నట్లుగా సమాచారం. ఆ జిల్లా నేతలు కూడా విజయ శాంతి రాకను వ్యతిరేకించకపోవచ్చని, నాయకులందరూ ఐక్యంగా పని చేయడానికి అవకాశం ఉంటుందని పార్టీ నేతలు చెబుతున్నారు.



ఆర్‌కామ్‌కు ఊరట!

న్యూఢిల్లీ: రిలయన్స్ కమ్యూనికేషన్స్‌కు ఇక్కడి టెలికం డిస్ప్యూట్ సెటిల్మెంట్ అండ్ అప్పిలేట్ ట్రైబ్యునల్ (టీడీసాట్)లో సోమవారం నాడు భారీ ఊరట లభించింది. పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోయిన అనిల్ అంబానీకి చెందిన ఆర్‌కామ్‌కు... డాట్‌కు ఇచ్చిన రూ.2,000 కోట్ల బ్యాంకు గ్యారంటీని తిరిగి ఇచ్చేయాలని టీడీసాట్ ఆదేశించింది. అలాగే ఆర్‌కామ్ వద్ద ఉన్న సీడీఎంఏ, జీఎస్ఎం బ్యాండ్ స్పెక్ట్రమ్‌కు వన్‌టైం స్పెక్ట్రమ్ చార్జీలు (ఓటీఎస్‌సీ) నుంచి మినహాయింపులు ఇచ్చిందని ఆర్‌కామ్ ఒక ప్రకటనలో పేర్కొంది. ఇదిలా ఉండగా కేంద్ర కేబినెట్ 2012లోనే 6.2 మెగాహర్జ్ స్పెక్ట్రమ్ దక్కించుకున్న ఆపరేటర్లు జులై 2008 నుంచి జనవరి 1, 2013 వరకు 4.4 మెగాహర్జ్ కంటే ఎక్కువ స్పెక్ట్రమ్ కలిగిన కంపెనీలు జనవరి 1, 2013 నుంచి ప్రారంభమయ్యే కాలానికి లైసెన్స్ ఫీజు చెల్లించాలని కేబినెట్ నిర్ణయించింది.

అలాగే సీడీఎంఏ స్పెక్ట్రమ్ లేదా 800 మెగాహర్జ్ బ్యాండ్‌లో 2.5 మెగాహర్జ్ కంటే ఎక్కువ ఉన్న స్పెక్ట్రమ్‌లో వాటిపై కూడా ఫీజు వసూలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇదిలా ఉండగా టీడీసాట్ డాట్‌ను ఆర్‌కామ్ బ్యాంకు గ్యారంటీగా ఇచ్చిన రూ.2,000లను తిరిగి ఇచ్చేయాలని జులై 3, 2018న ఆర్డర్ జారీ చేసింది. ఇదిలా ఉండగా కేంద్రప్రభుత్వం 2012లో జీఎస్ఎం స్పెక్ట్రమ్‌కలిగిన భారతి ఎయిర్‌టెల్, వొడాఫోన్, ఐడియా సెల్యూలార్, బీఎస్ఎన్ఎల్, ఎంటీఎన్ఎల్, ఎయిర్‌సెల్, ఆరాకామ్‌ల నుంచి రూ.24వేల కోట్లు డిమాండ్ చేశాయి. ఈ ఆర్డర్లను టెలికం ఆపరేటర్లు టీడీసాట్‌లో సవాలు చేశాయి. దీనిపై స్పందించిన టిడీసాట్ ఆర్‌కామ్ బ్యాంకు గ్యారంటీ ఇచ్చేయాలని డాట్‌ను ఆదేశించింది.



మాల్యా అప్పగింతకు లైన్ క్లియర్



- బ్రిటన్ హోంమంత్రి సాజిద్ జావేద్ గ్రీన్‌సిగ్నల్

న్యూఢిల్లీ: లిక్కర్‌కింగ్ విజయ్‌మాల్యాను బ్రిటన్ నుంచి భారత్‌కు తరలించడానికి బ్రిటన్ హోం మంత్రి సాజిద్ జావేద్ సోమవారం నాడు ఆమోదం తెలిపారు. భారత్‌లో విజయ్‌మాల్యా పలు బ్యాంకుల నుంచి సుమారు రూ.9వేల కోట్లు రుణాలు తీసుకొని ఎగ్గొట్టి బ్రిటన్ పారిపోయారు. మాల్యాను బ్రిటన్ నుంచి భారత్‌కు రప్పించడానికి భారత ప్రభుత్వంతో పాటు భారతీయ బ్యాంకులు బ్రిటన్ కోర్టులో ఆయనపై క్రిమినల్ కేసులు దాఖలు చేశాయి. బ్యాంకుల నుంచి తీసుకున్న రూ.9వేల కోట్లను ఆయను మనీలాండరింగ్‌కు పాల్పడినట్లు (కరెన్సీ స్మగ్లింగ్) చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. తాజాగా బ్రిటన్ హోం సెక్రెటరీ కూడా మాల్యాను భారత్‌కు అప్పగించడానికి ఆమోదం తెలపడంతో, ఈ నిర్ణయాన్ని సవాలు చేయడానికి మాల్యాకు 14 రోజుల గడువు ఉంటుందని వార్త ఏజెన్సీలు చెబుతున్నాయి. ఇదిలా ఉండగా డిసెంబర్ 10, 2018న బ్రిటన్ కోర్టు మాల్యాను భారత్‌కు తరలించాలని ఆదేశాలు కూడా జారీ చేసింది. లండన్‌లోని వెస్ట్‌మినిస్టర్ మేజిస్ట్రేట్ కోర్టు చీఫ్ మేజిస్ట్రేట్ జడ్జి ఎమ్మా ఆర్బోత్‌నాట్ తన తీర్పులో మాల్యాను భారత్‌కు తరలించి అక్కడ ఆయన కోర్టుల్లో క్రిమినల్ కేసును ఎదుర్కొవాల్సిందేనని తీర్పు ఇచ్చారు. భారత్‌లోని సీబీఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ కోర్టులో ఆయనపై ఇప్పటికే పలు క్రిమినల్ కేసులు నమోదయ్యాయి.

ఇదిలా ఉండగా విజయ్‌మాల్యా కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్ పేరుతో పెద్దమొత్తంలో బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుని, ఆ మొత్తాన్ని విదేశాలకు తరలించారన్న ఆరోపణలను మాల్యా ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా ఐడీబీఐ బ్యాంకు నుంచి రుణాలు తీసుకొని భారీ మొత్తంలో వాటిని విదేశాలకు తరలించారని సీబీఐ చార్జ్‌షీటులో పేర్కొంది. రుణాల మంజూరు చేయించుకోవడానికి ఐడీబీఐ బ్యాంకు అధికారులకు పెద్దమొత్తంలో లంచాలు ఇచ్చారన్న ఆరోపణలున్నాయి. వాటిపై కూడా సీబీఐ దర్యాప్తు కూడా మొదలుపెట్టింది.

ఆర్థిక క్రమశిక్షణకు తూట్లు

- ద్రవ్యలోటు 3.6 శాతం • ప్రభుత్వ లక్ష్యం జీడీపీలో 3% • ఎన్నికల నేపథ్యంలో తాయిలాల వర్షం • పెద్దమొత్తంలో వ్యయమే కారణం • ఫిచ్ రేటింగ్..



న్యూఢిల్లీ: వచ్చే ఆర్థిక సంవత్సరం ద్రవ్యలోటు లక్ష్యాన్ని చేరుకోలేదని ఫిచ్ రేటింగ్ ఏజెన్సీ స్పష్టం చేసింది. బడ్జెట్‌లో ప్రభుత్వ లక్ష్యం కంటే 0.2 శాతం పెరిగి 2019-20లో జీడీపీలో 3.6 శాతానికి ఎగబాకుతుందని ఫిచ్ రేటింగ్ పేర్కొంది. వచ్చే ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో ప్రభుత్వం సంక్షేమానికి పెద్దపీట వేసింది. ఈ ఏడాది మేలో లోకసభ ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వం ఆమ్‌ఆద్మీని ప్రసన్నం చేసుకోవడానికి భారీ మొత్తంలో తాయిలాలు ప్రకటించింది. ఉత్తరాదిలోని మూడు కీలకమైన వ్యవసాయాధారిత రాష్ట్రాల్లో ఎన్నికల్లో ఓటమి చవిచూడటంతో అధికార భారతీయ జనతాపార్టీ తన పంథాను మార్చింది.

2019-20లో వ్యయం రూ.27.8 లక్షల కోట్లు

కేంద్రప్రభుత్వం 2019-20లో రూ.27.8 లక్షల కోట్లు వ్యయం చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. 2018-19తో పోల్చుకుంటే ఇది 13.3 శాతం ఎక్కువ. దీనికి ప్రధాన కారణం ఈ ఏడాది మేలో జరిగే ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వం పెద్దమొత్తంలో సంక్షేమ పథకాలపై వ్యయం చేస్తుందని వివరణ ఇచ్చింది. ప్రభుత్వం అత్యధికంగా వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, రవాణా, మౌలికరంగంపై పెద్దమొత్తంలో వ్యయం చేస్తుంది. బడ్జెట్‌లో ఆర్థికమంత్రి పీయూష్‌గోయల్ ముఖ్యంగా వ్యవసాయం, సామాజిక సంక్షేమం, విద్య, ఆరోగ్యంపై పెద్దమొత్తంలో కేటాయింపులు చేశారు. వీటితో పాటు షెడ్యూల్ట్‌కాస్ట్, షెడ్యూల్డ్ ట్రైబ్ (హరిజన, గిరిజన)లు జనాభాలో 25 శాతం ఉన్నారు. వారిపై వ్యయం చేస్తారు.. జనాభాలో 58 శాతం రైతులు ఉన్న కారణంగా వారిపై పెద్దమొత్తంలో ప్రభుత్వం వ్యయం చేయనుంది.

వ్యవసాయరంగంపై

వచ్చే ఆర్థిక సంవత్సరం 2019-20లో వ్యవసాయరంగంపై మొత్తం వ్యయం 5.4 శాతం వరకు చేయాలనుకుంటోంది. ఈ ఆర్థిక సంవత్సరం 3.5 శాతం వరకు వ్యయం చేయాలని ప్రభుత్వం బడ్జెట్ అంచనాల వ్యయంలో పేర్కొంది. అలాగే మధ్యంతర బడ్జెట్‌లో రెండు హెకార్లున్న రైతుకు ఏడాదికి రూ.6,000 ఖాతాలో జమ చేస్తామని ప్రకటించింది. దీని వల్ల సుమారు 12 కోట్ల మంది రైతులకు లబ్దిచేకూరుతుంది. దీంతో పాటు మధ్య తరగతికి పన్ను రాయితీలు ప్రకటించింది. ఈ రాయితీల వల్ల ఈ ఆర్థిక సంవత్సరం ద్రవ్యలోటు జీడీపీలో 0.1 శాతం పెరిగి 3.4 శాతానికి చేరుతుందని ఫిచ్ అభిప్రాయ పడింది. ఈ ఆర్థిక సంవత్సరంలో రైతులకు రూ.20వేల కోట్లు, వచ్చే ఆర్థిక సంవత్సరం రూ.75వేలకోట్లు కేటాయిస్తున్నామని బడ్జెట్ ప్రసంగంలో గోయల్ ప్రకటించారు. దీంతో వచ్చే ఆర్థిక సంవత్సరం ద్రవ్యలోటు జీడీపీలో 3.6 శాతానికి పక్కాగా పెరిగిపోతుందని నివేదికలో స్పష్టం చేసింది.

ఏప్రిల్-డిసెంబర్ ద్రవ్యలోటు రూ.7.01 లక్షల కోట్లకు..

ఈ ఆర్థిక సంవత్సరం పూర్తి సంవత్సరం ద్రవ్యలోటు లక్ష్యం డిసెంబర్ చివరి నాటికి 112.4 శాతానికి చేరింది. ప్రభుత్వానికి రెవెన్యూ వసూళ్లు తగ్గడం.. ఖర్చులు పెరగడం కారణమని ప్రభుత్వం విడుదల చేసినతాజా గణాంకాలను బట్టి తెలుస్తోంది. ఏప్రిల్- డిసెంబర్ వరకు ద్రవ్య లోటు రూ.7.01 లక్షల కోట్లను దాటిపోయింది. డిసెంబర్ 2017లో ద్రవ్యలోటు బడ్జెట్ అంచనాలో 113.6 శాతంగా నమోదైంది. ఈ ఆర్థికసంవత్సరం ద్రవ్యలోటును జీడీపీలో 3.3 శాతానికి లేదా 6.24 లక్షల కోట్లకు పరిమితం చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. గత ఆర్థిక సంవత్సరం 3.53 శాతంగా నమోదైంది.

గెలుపే లక్ష్యం

వచ్చే ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలనే లక్ష్యంగా ప్రభుత్వం పెద్దమొత్తంలో వ్యయంచేయబోతోంది. కావాలనుకుంటే అదనంగా మరింత వ్యయం చేయడానికి కూడా వెనకాడని పరిస్థితి కనిపిస్తోంది. అదే సమయంలో ప్రభుత్వానికి రెవెన్యూ కూడా పెరిగే అవకాశాలు మెరుగుపడ్డాయి. బడ్జెట్‌లో ప్రభుత్వం మధ్యతరగతికి, చిన్న వ్యాపారులకు పన్ను రిబేటు ప్రకటించడంతో పన్ను వసూలు పెరగడానికి అవకాశాలు మెరుగుపడ్డాయని ఫిచ్ సొల్యూషన్స్ నివేదికలో పేర్కొంది. ఫిచ్ సొల్యూషన్స్ వచ్చే ఆర్థిక సంవత్సరానికి ద్రవ్యలోటును జీడీపీలో 3.6 శాతానికి సవరించింది. గతం లో మూడు శాతంగా అంచనా వేసింది. 2018-19తో పోల్చుకుంటే 2019-20లో ద్రవ్యలోటు మరింత పెరిగే అవకాశాలున్నాయి. ప్రభుత్వం పెద్దమొత్తంలో ఆర్థిక ఉద్దీపన పథకాలను ప్రకటించింది. 2020-21 ఆర్థిక సంవత్సరానికి ద్రవ్యలోటు లక్ష్యం 3 శాతానికి చేరుకోవడం అసాధ్యమని ఫిచ్ తాజా విడుదల చేసిన 'ఇండియాస్ పాపులిస్ట్ ఎఫ్‌వై 2019-20.. బడ్జెట్ టూ డిలే ఫిస్కల్ కన్సాలిడేషన్' పేరుతో నివేదికను విడుదల చేసింది.

ప్రత్యక్ష పన్నుల వసూళ్లలో 15 శాతం వృద్ధి

- అంచనాలను అందుకుంటాం
- రెవెన్యూ కార్యదర్శి అజయ్ పాండే

వచ్చే ఆర్థిక సంవత్సరం ప్రత్యక్ష పన్నుల వసూళ్ల లక్ష్యం 15 శాతం వృద్ధితో రూ.13.80 లక్షల కోట్లను సాధించవచ్చునని ఆర్థికమంత్రిత్వశాఖ గట్టి ధీమాతో ఉంది. అయితే ఈ ఆర్థిక సంవత్సరంతో పోల్చుకుంటే ప్రత్యక్షపన్నుల వసూళ్లు 20 శాతం తగ్గుతాయని రెవెన్యూ కార్యదర్శి అజయ్ భూషణ్‌పాండే సోమవారం నాడు చెప్పారు. మధ్యతర బడ్జెట్‌లో వచ్చే ఆర్థిక సంవత్సరానికి 2019-20కి ప్రత్యక్ష పన్నుల వసూళ్ల లక్ష్యంగా రూ.13.80 లక్షల కోట్లుగా ప్రకటించింది. వాటిలో కార్పొరేట్, వ్యక్తిగత ఆదాయపు పన్ను కలిపి ఉంటుంది. ఈ ఆర్థికసంవత్సరంలో రూ.12 లక్షలకోట్లు వసూలయ్యే అవకాశాలున్నాయి. దీన్ని బట్టి చూస్తే ప్రత్యక్ష పన్నుల వసూళ్లలో 15 శాతం వృద్ధి కనిపిస్తుందని ఆయన వివరించారు. వరుసగా గత మూడు సంవత్సరాల నుంచి రెవెన్యూ వసూళ్లు జోరందుకున్నాయని, కాబట్టి వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి రెవెన్యూ వసూళ్ల లక్ష్యం కాస్తా పెంచుకోవడానికి వీలైందని పాండే అన్నారు. ప్రత్యక్షపన్నుల వసూళ్లు 2016-17లో 15 శాతం, 2017-18లో 18 శాతం, 2018-19లో 19.76 శాతం వసూళ్లు అయ్యాయని పాండే పేర్కొన్నారు. వివరంగా చెప్పాలంటే 2016-17లో రూ.8.50 లక్షల కోట్లు,2017-18లో రూ.10.02 లక్షల కోట్లు ఈ ఆర్థిక సంవత్సరం 2018-19లో రూ.12 లక్షల కోట్లని పాండే వివరించారు. పాత రికార్డులను పరిశీలిస్తే.. కనీస జీడీపీ వృద్ధిరేటు 10-11 శాతం వృద్ధి కనిపించిందని, ఒకసారి 18 శాతం వసూళ్లు పెరిగితే.. మరోసారి 15 శాతం పెరిగాయి.. ఈ ఏడాది 20 శాతం, వచ్చే ఏడాది 15 శాతం వసూళ్లు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, మూడు సంవత్సరాల గణాంకాలను పరిశీలిస్తే.. 18 శాతం, 20 శాతం, 15 శాతాన్ని పరిగణనలోకి తీసుకుంటే కనీస జీడీపీ వృద్ధిరేటు 10-11 శాతంగా తేలిందన్నారు. పాత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని గత కొన్ని సంవత్సరాల నుంచి వసూళ్లను దృష్టిలో ఉంచుకొని పన్ను పరిధిని పెంచుకుంటున్నామని, కొత్తగా మరికొంత మందిని పన్ను పరిధిలోకి తీసుకువస్తామని, అదే సమయంలో పన్ను రేట్లు కూడా పెంచబోమన్నారు. ప్రస్తుతం అంతా డిజిటైజేషన్ అయినందున పన్ను లక్ష్యాన్ని తేలిగ్గా చేరుకుంటామని ఆయన భరోసాను వ్యక్తం చేశారు. ఆర్థికమంత్రి పీయూష్‌గోయల్ మధ్యంతర బడ్జెట్‌లో గత ఐదు సంవత్సరాల నుంచి ఎన్‌డీఏ ప్రభుత్వం పన్ను రేట్లను తగ్గించిందన్నారు. సామాన్యుడికి, మధ్య తరగతికి పన్ను చెల్లింపును మరింత సరళీకరణ చేసినట్లు చెప్పారు. ఎన్‌డీఏ ప్రభుత్వం 2013-14 ఆర్థిక సంవత్సరంలో ప్రత్యక్ష పన్ను వసూళ్లు రూ.6.38 లక్షల కోట్ల నుంచి ఈ ఏడాదికి రూ.12 లక్షల కోట్లు వసూలు చేసే స్థాయికి వచ్చామని.. దీన్ని బట్టి పన్ను వసూళ్ల రెట్టింపు అయ్యాయని తెలిపారు. అలాగే ఐటి రిటర్న్స్ ఫైల్ చేసే వారి సంఖ్య కూడా 3.79 కోట్ల నుంచి 6.85 కోట్లకు పెరిగారని.. పన్ను చెల్లింపుదార్లు 80 శాతం వరకు పెరిగినట్లు గోయల్ బడ్జెట్‌లో ప్రసంగంలో పేర్కొన్నారు.

ఐడీబీఐ నష్టం మూడింతలు

- క్యూ3లో రూ.4,185 కోట్లు

న్యూఢిల్లీ: డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో ఐడీబీఐ బ్యాంకు నష్టాలు మూడింతలు పెరిగి రూ.4,185 కోట్లకు ఎగబాకాయి. దీనికి ప్రధాన కారణం మొండి బకాయిలు పెరిగిపోవడమే. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో బ్యాంకు నికర నష్టం రూ.1,524.31 కోట్లని తెలిపింది. మొత్తం ఆదాయం కూడా తగ్గి రూ.6,190.94 కోట్లకు దిగిరాగా.. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.7,125.20 కోట్లు ఆర్జించి నట్లు బ్యాంకు ప్రకటనలో వివరిం చింది. బ్యాంకు గరిష్ఠ నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏ) ఏకంగా 29.67 శాతానికి ఎగబా కగా.. ఏడాది క్రితం 24.72 శాతంగా నమోదైంది. నికర ఎన్‌పీఏ మాత్రం 14.01 శాతానికి దిగిరాగా.. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో 16.02 శాతంగా నమో దైనాయి. ఫలితంగా మొండిబకాయిలకు కేటాయింపులు భారీగాపెరిగి రూ.5,074.80 కోట్లకు ఎగబాకగా.. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.3,649.82 కోట్లు మాత్రమే కేటాయించింది. ఇదిలా ఉండగా బ్యాంకు యాజమాన్యం చేతులు మారింది. ప్రభుత్వం నుంచి ప్రస్తుతం ఎల్ఐసీ చేతిలోకి వెళ్లింది.

జీఎస్‌కే ఫార్మా లాభం రూ.113 కోట్లు

న్యూఢిల్లీ: ప్రముఖ ఔషధ దిగ్గజం గ్లాస్కో స్మిత్‌క్లియిన్ ఫార్మాస్యూటికల్స్ డిసెంబర్‌తోముగిసిన త్రైమాసికంలో స్టాండ్ఎలోన్ ప్రాతిపదికన నికరలాభం రూ.112.97 కోట్లు ఆర్జించింది. ఖాతాలో ఒక్కసారి రూ.28 కోట్లు లబ్ధి చేకూరింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.89.69 కోట్ల లాభాన్ని నమోదు చేసినట్లు కంపెనీ బీఎస్ఈకి సమాచారం అందించింది. రెవెన్యూ విషయానికివస్తే రూ.825.35 కోట్లకు చేరగా.. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.703.91 కోట్లు నమోదు చేసినట్లు కంపెనీ ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈ ఏడాది బ్రాండ్‌లపై ఎక్కువ ఫోకస్ చేయడంతో పాటు పెద్దెత్తున విస్తరణ చేపడుతున్నట్లు కంపెనీ ఎండీ ఏ వైదేహిషి చెప్పారు. బీఎస్ఈలో దీని షేరు 0.35 శాతం పెరిగి రూ.1402.30 వద్ద ముగిసింది.

సుందరం ఫాస్ట్నర్స్ లాభంలో 21.3% వృద్ధి

చెన్నై: సుందరం ఫాస్టర్న్స్ లిమిటెడ్ డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో స్టాండ్ఎలోన్ ప్రాతిపదికన నికరలాభంలో 21.3 శాతం వృద్ధితో రూ111.18 కోట్లు ఆర్జించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.91.66 కోట్లు నమోదు చేసినట్లు ఒక ప్రకటనలో తెలిపింది. రెవెన్యూ విషయానికి వస్తే రూ.1,021.46 కోట్లకు ఎగబాకగా.. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.853.25 కోట్లని తెలిపింది.

ఆదిత్యబిర్లా ఫ్యాషన్ లాభం రెట్టింపు

- క్యూ3లో రూ.70 కోట్లు

న్యూఢిల్లీ: ఆదిత్యబిర్లా ఫ్యాషన్ రిటైల్ డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో నికరలాభం రెట్టింపు రూ.70 కోట్లకు ఎగబాకింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికం లో రూ.35 కోట్లు ఆర్జించినట్లు కంపెనీ ఒక ప్రకటనలో వెల్లడించింది. రెవెన్యూ విషయానికి వస్తే రూ.2,282 కోట్లకు ఎగబాక గా.. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.1,855 కోట్లు నమోదు చేసింది. రెవె న్యూలో 23 శాతం వృద్ధి కనిపించింది. గ్రూపులోని అన్ని విభాగాలు మంచి పనిత నం కనిపించాయని తెలిపింది. రాబోయే రోజుల్లో మరింత జోరందుకుంటుందని, కంపెనీ కొత్త బ్రాండ్‌లను తీసుకురావడంతో పాటు నెట్‌వర్కును విస్తరిస్తుందని మార్కెటింగ్‌ను మరింత మెరుగుపరుస్తుందని తెలిపింది.



రెనో ఇండియా కొత్త క్విడ్

న్యూఢిల్లీ: ఫ్రెంచ్ ఆటో దిగ్గజం రెనో సోమవారం నాడు కొత్త రేంజి ఎంట్రీ లెవెల్ కారు చిన్న క్విడ్‌ను మార్కెట్లో విడుదల చేసింది. దీనికి అదనపు భద్రతా ఫీచర్లను అందిస్తోంది. ప్రారంభ ధర రూ.2.67 నుంచి రూ.4.63 లక్షలు (ఎక్స్‌షోరూం ఢిల్లీ)గా ప్రకటించింది. ఇంజిన్ సామర్థ్యం విషయానికి వస్తే 0.8 లీటర్ నుంచి ఒక లీటర్ పెట్రోల్ ఇంజిన్‌తో పాటు మాన్యువల్ నుంచి ఆటోమెటిక్ ట్రాన్స్‌మిషన్‌ను అందుబాటులో ఉంచినట్లు కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. ప్రభుత్వం భద్రతా ఫీచర్లను తప్పనిసరి చేయడంతో ఆటోమొబైల్ కంపెనీలు పాటించ డం మొదలుపెట్టాయి. వాటిలో పెడెస్ట్రియన్ సెప్టీ ఫీచర్‌తో పాటు యాంటీ లాక్ బ్రేకింగ్ సిస్టమ్, ఎలక్ట్రానిక్ బ్రేక్‌ఫోర్స్ డిస్ట్రిబ్యూషన్ (ఏబీఎస్ - ఈబీడీ)ని అందుబాటులోకి తెచ్చింది. ఇతర ఫీచర్ల విషయానికి వస్తే డ్రైవర్ సీటు ఎయిర్‌బ్యాగ్, కో డ్రైవర్ సీటుకు సీట్‌బెల్ట్ రిమైండర్, స్పీడ్ అలర్ట్‌తో పాటు స్టాండర్ట్ ఫీచర్లను అన్నీ వెరియెంట్లకు ఇవ్వడం జరుగుతోంది.

తిరుగులేని ఆర్థిక శక్తిగా భారత్

కేంద్ర వాణిజ్యశాఖ కార్యదర్శి అనూప్ వాద్వాన్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: భారతీయ ఎగుమతులు 314 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయ ని, భవిష్యత్తులో మన ఎగుమతు లకు వచ్చే డిమాండ్ ఉంటుందని కేంద్ర వాణిజ్యశాఖ కార్యదర్శి అనూప్ వాద్వాన్ అన్నారు. 2018-19లో కంప్యూటర్ సాఫ్ట్‌వేర్, ఐటి ఎగుమతులు 126 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయని ఆయన తెలిపారు. ఐటి ఎగుమతులు ఏటా 10 శాతం వృద్ధి నమోదు చేసుకుంటున్నాయని, ఉపాధి కల్పనలో ఐటి రంగం శరవేగంగా విస్తరిస్తోందని ఆయన చెప్పారు. హెచ్ఐసీసీలో సోమవారం ఎలక్ట్రానిక్స్ అండ్ కంప్యూటర్ సాఫ్ట్‌వేర్‌ఎక్స్‌పోర్టు ప్రమోషన్ కౌన్సిల్ (ఇఎస్‌సీ) ఇండియా సాఫ్ట్ సదస్సును ఆయన ప్రారంభించారు. ఇఎస్‌సీ చైర్మన్ మందీప్ సింగ్ పూరి సదస్సుకు స్వాగతం పలుకగా, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డీకే సెరీన్ వందన సమర్పణ చేశారు. రాష్ట్ర ఐటిశాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, ఇండియా సాఫ్ట్ చైర్మన్ నలిన్ కోహ్లి కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అనూప్ వాద్వాన్ మాట్లాడుతూ, ఐటి రంగం విస్తరణతో ప్రపంచమే కుగ్రామంగా మారిందని, దీంతో గ్రామాల్లో కూడా ఉపాధి అవకాశాలు మెరుగుపడ్డాయని అన్నారు. డిజిటల్ ఇండియాగా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం డిజిటల్ సర్వీసులు ప్రారంభించిందని, దీంతో



ప్రజలకు ఈ-సర్వీసులు అందుబాటులోకి వస్తున్నాయని చెప్పారు. బ్రాడ్‌బ్యాండ్, హైవేస్, డీజీ బ్లాక్ బోర్డు, వర్చువల్ క్లాస్‌రూమ్స్‌తో సామాన్య ప్రజలకు కూడా ఐటి టెక్నాలజీని అందించనున్నట్లు ఆయన చెప్పారు. ఐటి టెక్నాలజీలో వచ్చిన అధునాతన ప్రాడక్ట్స్ ఆర్టిఫి షియల్ ఇంటెలిజెన్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, బ్లాక్‌చైన్ టెక్నా లజీ అభివృద్ధితో జాతీయ స్థూల ఉత్పత్తి మరింత పెరుగు తుందని వాద్వాన్ చెప్పారు. డిజిటల్ ఇన్నోవేషన్స్ పెను మార్పు లు తెస్తున్నాయని, ఇవి నూతన ప్రపంచాన్ని సృష్టిస్తున్నాయని ఆయన చెప్పారు. 2030 నాటికి భారత ఆర్థిక వ్యవస్థ ప్రపంచం లోనే ప్రభావిత శక్తిగా ఎదుగుతుందని ఆయన అన్నారు. భారతీ య ఐటి నిపుణుల సేవలు ప్రపంచ వ్యాప్తంగా విస్తరించాయని, ఇవి ఎగుమతుల వృద్ధికి దోహద పడుతున్నాయన్నారు.

స్టార్టప్స్ హబ్‌గా హైదరాబాద్

జయేష్ రంజన్ మాట్లాడు తూ, సాఫ్ట్‌వేర్ రంగంలో భారత్ శక్తివంతమై న దేశంగా అభివృద్ధి చెందుతోందన్నారు. భారతీయ ఐటి ఎగుమతులు 120 దేశాలకు వెళుతున్నాయని, ఇది నిపుణుల సామర్థ్యానికి అద్దం పడుతోందన్నారు. హైదరాబాద్ ఇన్నోవేషన్స్, స్టార్టప్స్ హబ్‌గా వెలుగుతోందని, టీ-హబ్‌లో వందలాది ఇంక్యుబేటర్లు ఉన్నాయని చెప్పారు. హైదరాబాద్‌లో ఐటి అధునాతన టెక్నాలజీ అభివృద్ధి చెందుతోందని, ఇది ఈ నగర స్థాయిని మరింత ఇనుమడింపజేస్తుందని జయేష్ రంజన్ అన్నారు. ఈ సదస్సులో 400 మంది ప్రతినిధులు, 60 దేశాల నుంచి 150 కంపెనీలు ఎగ్జిబిషన్‌లో పాల్గొన్నాయి.


వర్ల్‌పూల్ లాభం రూ.61 కోట్లు

- క్యూ3లో 14 శాతం వృద్ధి

న్యూఢిల్లీ: హోం అప్లియెన్సెస్ తయారీ కంపెనీ వర్ల్‌పూల్ డిసెంబర్‌తో ముగిసినత మూడవ త్రైమాసికంలో నికరలాభంలో 14 శాతం వృద్ధితో రూ.60.62 కోట్లు ఆర్జించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.53.14 కోట్లు ఆర్జించినట్లు కంపెనీ బీఎస్ఈకి సమాచారం అందించింది. మొత్తం ఆదాయం రూ.1238.41 కోట్లకు ఎగబాకగా.. క్రితం ఏడాది ఇద త్రైమాసికంలో రూ.979.26 కోట్లని ఒక ప్రకటనలో వెల్లడించింది. పుదుచ్చేరిలో ప్లాంట్‌లను ఆధునీకరించడానికి వచ్చే ఐదు సంవత్సరాల్లో రూ.407 కోట్లు పెట్టుబడులు పెడుతున్నట్లు చైర్మన్ అరవింద్ ఉప్పల్ తెలిపారు. మాస్ మార్కెట్లో అమ్మకాలు బాగా పుంజుకున్నాయని, పండుగ సీజన్‌లో కూడా అమ్మకాలు పెరిగాయని ఆయన వివరించారు.

నష్టాల నుంచి లాభాల్లోకి

- 113 పాయింట్ల వృద్ధి
- విదేశీ పెట్టుబడుల జోరు
- దుమ్మురేపిన రిల్



ముంబై: స్టాక్ మార్కెట్లు వరుసగా మూడో రోజు లాభాలతో ముగిశాయి. సోమవారం నాటి ట్రేడింగ్ సరళిని గమనిస్తే.. ఉదయం మార్కెట్ నష్టాలతో మొదలైనా సాయంత్రానికి కోలుకొని 113 పాయింట్ల లాభంతో ముగిసింది. విదేశీ సంస్థాగత మదుపరులు పెద్దమొత్తంలో దేశీయ మార్కెట్లోకి పెట్టుబడులు జొప్పించడంతో మార్కెట్‌లకు కొత్త జోష్ వచ్చింది. దీంతో రిల్ 3.52 శాతం వరకు లాభపడింది. ఇంట్రాడేలో 400 పాయింట్ల వరకు క్షీణించి అటు తర్వాత కోలుకుని చివరకు 113.31 పాయింట్ల లాభంతో 36,582.74 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ కూడా 18.60 పాయింట్లు లాభపడి 10,912.25 వద్ద స్థిరపడింది. మార్కెట్ నిపుణుల అంచనా ప్రకారం బడ్జెట్‌లో దేశీయ కంపెనీలపై ఫోకస్ పెట్టడంతో పాటు వినియోగరంగంపై.. ప్రైవేట్ బ్యాంకులపై ఫోకస్ పెట్టడం మార్కెట్లకు బాగా కలిసొచ్చింది. త్వరలోనే ఆర్‌బీఐ ద్రవ్యపరపతి సమీక్షా సమావేశం మొదలు కానుండం.. ఈ సారి పరపతి సమీక్షలో వడ్డీరేట్లను యధాతథంగా కొనసాగించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్న అంచనాతో ఇన్వెస్టర్లు పెద్దమొత్తంలో షేర్లు కొనుగోలు చేసినట్లు చెబుతున్నారు. బీఎస్ఈలో అత్యధికంగా లాభపడింది మాత్రం రిలయన్స్ ఇండస్ట్రీస్ .. దీని షేరు 3.52 శాతం పెరిగి రూ.1291.15 వద్ద ముగిసింది. సూచి 139.52 పాయింట్లు పెరగడానికి రిల్ దోహదం చేసింది. లాభపడిన ఇతర షేర్లు ఇలా ఉన్నాయి. ఓఎన్‌జీసీ, బజాజ్‌ఆటో, కొటక్ బ్యాంకు, టీసీఎస్, టాటాస్టీల్, యాక్సిస్ బ్యాంకు, మారుతి, హెచ్‌డీఎఫ్‌సీ, హెచ్‌యూఎల్ షేర్లు 3.03 శాతం వరకు పుంజుకున్నాయి. దీనికి వ్యతిరేకంగా పవర్‌గ్రిడ్, ఎస్‌బ్యాంకు, ఎన్‌టీపీసీ, సన్‌ఫార్మా, ఎంఅండ్ఎం, ఐటీసీ, ఎల్‌అండ్‌టి, బజాజ్ ఫైనాన్స్3.13 శాతం వరకు నష్టపోయిన వాటిలో ఉన్నాయి. బ్యాంకు, ఆటో షేర్లు స్తబ్దుగా ట్రేడ్ అయ్యాయి. అదే సమయంలో వినియోగ ఆధారిత షేర్లు మాత్రం పుంజుకున్నాయి. దీంతో పాటు యూఎస్ ఫెడరల్ రిజర్వువడ్డీ రేట్లను ప్రస్తుతానికి పెంచకపోవడం కలిసొచ్చింది. ఇదిలా ఉండగా మంగళవారం నాడు రిజర్వుబ్యాంకు ద్రవ్యపరపతి సమీక్ష మొదలవుతుంది. గ్లోబల్ మార్కెట్లు బలహీనంగా ట్రేడ్ కావడంతో దాని ప్రభావం దేశీయ మార్కెట్లపై పడింది. లేదంటే సూచి మరింత దూసుకుపోయేది. డాలర్ మారకంతో రూపాయి 43 పైసలు క్షీణించి 71.68 వద్ద మధ్యాహ్నాం ట్రేడ్ అయ్యింది. ఇదిలా ఉండగా విదేశీ సంస్థాగత మదుపరులు శుక్రవారం నాడు రూ.1,315.89 కోట్ల షేర్లు కొనుగోలు చేస్తే.. దేశీయ సంస్థాగత మదుపరులు రూ.5.07 కోట్ల షేర్లు విక్రయించినట్లు బీఎస్ఈ గణాంకాలు తెలియజేస్తున్నాయి. ఇక గ్లోబల్ మార్కెట్ల విషయానికి వస్త మిశ్రమ స్పందన కనిపించింది.

స్లిప్పర్ సెల్ఫీ

సెల్ఫీ మాయ ఏమిటో ఈ చిన్నారుల మోము చూసినా... ఈ చిత్రాన్ని చూసినా ఇట్టే అర్థమవుతుంది. సృజన ఏ ఒక్కరి సొత్తో కాదు... అనడానికి కూడా ఈ ఫోటో ఓ ఉదాహరణగా నిలుస్తుంది. ఆధునిక ప్రపంచంలో స్మార్ట్‌ఫోన్లు వచ్చాక సెల్ఫీ ఓ సరదా... ఓ పేషన్.. ఓ అలవాటుగా మారింది. ఆ ఫోన్లుంటే నచ్చినచోటల్లా క్లిక్‌మనిపించి.. సోషల్ మీడియాలో పడేయడం ఈరోజుల్లో సాధారణం. కానీ అలాంటి ఫోన్లు లేనప్పుడు ఏంటి పరిస్థితి.. అవి లేకపోతే ఆ సరదా తీరకుండా ఉండిపోవాల్సిందేనా.. కానీ ఈ పిల్లలు అలా ఆలోచించలేదు.. సెల్ఫీ తీసుకున్న ఆనందం ఏమిటో ఇలా ఆస్వాదించారు. చెప్పునే స్మార్ట్‌ఫోన్‌గా భావిస్తూ... దానిని చేతిలో పెట్టుకుని చిరునవ్వులు చిందిస్తూ ఫోజిచ్చారు. ఈ ఫోటోను ఎవరో సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. అంతే ఇది ఇప్పుడు వైరల్ అయింది.. బిగ్ బీ అమితాబ్ దగ్గర నుంచి తెలంగాణ షీ టీమ్ సారథి, ఐపీఎస్ అధికారిణి స్వాతిలక్రా వరకు ఈ చిత్రాన్ని చూసి స్పందించారు. అమాయకంగా, ఆనందంగా చిరునవ్వులు పూయిస్తున్న ఈ చిన్నారులు ఇలా చెప్పునే ఫోన్‌గా భావించి ఆనందించడంలో క్రియేటివిటీ దాగి ఉంది కదూ. సరే ఇది ఫొటోషాప్ ఫొటో అయి ఉండొచ్చని, ఇలా చెబుతున్నందుకు క్షమించాలని బిగ్ బి అమితాబ్ అంటే అన్నారుగానీ... ఎవరూ ఆ వాదనను ఒప్పు కోవడం లేదు. ఈ చిత్రాన్ని చూస్తే శ్రీశ్రీ మహా ప్రస్థానంలోని గీతం 'ఏమీ ఎరుగని పిల్లల్లారా... ఐదారేడుల పాపల్లారా...మెరుపు మెరిస్తే.. వాన కురిస్తే.. ఆకసమున హరివిల్లు విరిస్తే... అవి మీ కోసమేనని ఆనందించే కూనల్లారా' గుర్తొస్తోంది కదూ. మొత్తానికి ఈ పిల్లల ఐడియాకు, ఆ మోముల్లోని సంతోషానికి నెటిజన్లు ఫిదా అయ్యారన్నది మాత్రం నిజం.




హరితహారంపై యూపీ ఆసక్తి

అధ్యయనం కోసం 10 మంది అధికారులు రాక

హైదరాబాద్, ఆంధ్రప్రభ ముఖ్యమంత్రి కెసీఆర్ ప్రత్యేక చొరవతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారం, అటవీ సంరక్షణ విధానాలు ఇతర రాష్ట్రా లకు దిక్సూచిగా నిలిచాయి. హరితహారం పథకాన్ని ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం ఆదర్శంగా తీసుకుంది. అధ్యయనం నిమిత్తం పదిమంది అధికారులను మన రాష్ట్రా నికి పంపించింది. యూపిలోని గోరఖ్‌పూర్ ముఖ్య కన్జర్వేటర్ బివాస్ రంజన్ నేతృత్వంలోని అధికారుల బృందం అరణ్యభవన్‌లో తెలంగాణ అటవీ అధికారులతో సమావేశమయ్యారు. ముఖ్యమంత్రి కెసీఆర్ సంకల్పం అత్యంత సహసోపేతమైనదిగా యూపి అధికారులు ప్రశంసించారు. ఉత్తర ప్రదేశ్‌లో జనాభా 22 కోట్లుఅని, 22 కోట్ల మొక్కలను నాటాలనే నిర్ణయం తమ రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదిత్యనాథ్ తీసుకున్నారని ఆయన వెల్లడించారు. రాష్ట్రంలో భారీ సంఖ్యలో నర్సరీల ఏర్పాటు, ఉపాధి హామీ నిధుల అనుసంధానం, మొక్కలు నాటే కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం, ప్రజలు, విద్యార్థుల భాగస్వామ్యంపై తెలంగాణ అదనపు అటవీ సంరక్షణ అధికారి ఆర్.ఎం. డోబ్రియల్ యూపీ అధికారులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అడవులను కాపాడుకోవడం, కొత్తగా పచ్చదనం పెంచాలనే స్పృహను స్వయంగా ముఖ్యమంత్రి కెసీఆర్ ఉద్యమ స్ఫూర్తి మాదిరిగా కలిగించారని పీసీసీఎఫ్ పి.కె. ఝా తెలిపారు.

ఏడుపాయల్లో పోటెత్తిన భక్తులు

మాఘ స్నానాలు ఆచరించిన లక్షలాది మంది



మెదక్, ప్రభన్యూస్ బ్యూరో : పచ్చటి అడవిలో వెలసిన మెదక్ జిల్లా ఏడుపాయల ప్రాంతం భక్తజన సందోహంతో కిక్కిరిసింది. పాపన్నపేట మండల పరిధిలోని నాగ్సాన్‌పల్లిగ్రామ సమీపాన వెలసిన వనదుర్గామాత ఆలయం మాఘ అమావాస్య సందర్భంగా భారీ సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి ఏడుపాయలకు చేరుకున్న భక్తులు మంజీరా నదిలో పుణ్య స్నానాలు ఆచరించారు. ఆలయ పాలకవర్గం షవర్‌బాత్‌లు, తాగునీరు తదితర మౌలిక సదుపాయాలు కల్పించారు. మెదక్ డీఎస్పీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సి.ఐ రాజశేఖర్, ఎస్.ఐ ఆంజనేయులుతో పాటు సుమారు 200 మంది పోలీసు సిబ్బంది, హోంగార్డులు, ఏఆర్ కానిస్టేబుళ్ల ఆలయ ప్రాంగణం, రాజగోపురం, బస్టాండ్, చెక్‌డ్యాం, మంజీరా డ్యాం వద్ద బందోబస్తు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, ఈవో మోహన్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, ఈవో మోహన్‌రెడ్డి, కమిటీ డైరెక్టర్లు కిష్టయ్య, శ్రీధర్, నాగప్ప, దుర్గయ్య, ప్రభుగౌడ్, చంద్రయ్య, నారాయణ, సంగప్ప, శ్రీనివాస్‌రెడ్డి, గౌరీశంకర్, నాగయ్య, ఆలయ సిబ్బంది రవికుమార్, సిద్దిపేట శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, అచ్చన్నపల్లి శ్రీనివాస్, ప్రతాప్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాస్‌శర్మ, మహేశ్, యాదగిరి, ఆలయ పూజారులు ఉన్నారు.

ఉపాధి కోర్సులకు ప్రాధాన్యమివ్వాలి

ఉన్నత విద్య సదస్సులో వక్తలు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఉపాధికి ఉపయోగపడే కోర్సులకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని ఉన్నత విద్యా రంగంపై జరిగిన ఉన్నతస్థాయి అంతరంగిక సమావేశం(కాన్‌క్లేవ్) లో వక్తలు అభిప్రాయపడ్డారు. కాన్‌క్లేవ్ సోమవారం హైదరాబాద్‌లోని ఒక ప్రైవేటు కళాశాలలో కాన్‌క్లేవ్ ప్రారంభం అయింది. పరిశ్రమలకు అవసరం అయిన సిలబస్ కోసం పరిశ్రమలు, విద్య రంగం సంయుక్తంగా కృషి చేయాల్సిన అవసరం ఉందని నవీన్ మిత్తల్ అన్నారు. ఎస్ బ్యాంక్‌తో తెలంగాణ సాంకేతిక విద్య శాఖ అవగాహన ఒప్పందం కుదర్చుకుంది. ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి మాట్లాడుతూ ఉన్నత విద్యా రంగంలో పలు సంస్కరణలు తీసుకొచ్చినట్టు తెలిపారు. డోస్ట్ ద్వారా డిగ్రీలో ప్రవేశాలను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఏఐసీటీఈ డిప్యూటీ డైరక్టర్ నీతూ భగత్ మాట్లాడుతూ ఇంజనీరింగ్ విద్యార్థులకు ఉపాధి అవకాశాలు లభించాలని ఏఐసీటీఈ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌ను తప్పనిసరి చేసిందన్నారు. ఈ కాన్‌క్లేవ్‌లో కళాశాల విద్య కమిషనర్ నవీన్ మిత్తల్, ఇంటర్ విద్య కమిషనర్ అశోక్, ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి, ఏఐసీటీఈ డిప్యూటీ డైరక్టర్ నీతూ భగత్, ఇక్ఫాయ్ వీసీ జె మహేందర్‌రెడ్డి, శ్రీనిధి ఇంజనీరింగ్ కాలేజ్ ఈడీ నరసింహారెడ్డి, కాకతీయ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ సాయన్న, జేఎన్‌టీయు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదయ్య, అక్కినేని ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్ ఎండీ అమల అక్కినేని, ఎస్ బ్యాంక్ కంట్రీ హెడ్ రింకీ దింగ్రా తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల విలీనంపై తీర్పు వాయిదా

ముగిసిన వాదనలు

• అసెంబ్లీ రికార్డులు తెప్పించలేం • హైకోర్టు స్పష్టీకరణ



హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణ రాష్ట్రంలో పురపాలక సంఘాల్లో గ్రామపంచాయతీలను విలీనం చేయడాన్ని సవాలు చేస్తూ పెద్ద సంఖ్యలో దాఖలైన వ్యాజ్యాల్లో వాదనలు ముగిశాయి. అయితే హైకోర్టు తీర్పును మాత్రం వాయిదా వేసింది. ఈ సందర్భంగా హైకోర్టు ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేసింది. రాష్ట్ర ప్రభుత్వాలు అలాంటి బిల్లులు తీసుకురాకుండా ఏమైనా రాజ్యాంగ నిషేధం ఉందా అని పిటిషనర్ల తరపు న్యాయవాదులను హైకోర్టు ప్రశ్నించింది. అసెంబ్లీ చేసిన బిల్లులకు సంబంధించిన రికార్డులను ఇవ్వాలని ఆదేశించే అధికారం కోర్టులకు లేదని హైకోర్టు స్పష్టం చేసింది. కోర్టులు కేవలం న్యాయిక దృక్పథంతో మాత్రమే పనిచేస్తాయని హైకోర్టు తేల్చిచెప్పింది.. .తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టీబీఎన్.రాధాకృష్ణన్, జస్టిస్ ఎ.రాజశేఖర్ రెడ్డి లతో కూడిన డివిజన్ బెంచ్ సోమవారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది..గ్రామ పంచాయతీలను వివిధ పురపాలక సంఘాల్లో విలీనం చేసే నిమిత్తం తెలంగాణ ప్రభుత్వం తెలంగాణ మున్సిపల్ యాక్ట్ ,1994 లోని షెడ్యూల్ నంబర్ .1,మరియు సెక్షన్ 3ఏ ను స్టేట్ యాక్ట్ నంబర్ 4 తో చేసిన సవరణ అమలును సస్పెండ్ చేయాలని అభ్యర్థిస్తూ కరీంనగర్, ఖమ్మం, మెదక్, రంగారెడ్డి, నిజామాబాద్, నల్గొండ, మహబూబ్ నగర్ జిల్లాల నుంచి హైకోర్టులో పెద్ద సంఖ్యలో వ్యాజ్యాలు దాఖలైన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యాలపై సీనియర్ న్యాయవాదులు సుదీర్ఘమైన వాదనలు వినిపించారు. ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాది వేదుల.వెంకటరమణ వాదనలు వినిపిస్తూ..ఓ కార్పొరేషన్ ఏర్పాటు అనే అంశం స్వతంత్రమైన కసరత్తు కాదన్నారు. ముందుగా గవర్నర్ గజెట్ నోటిఫికేషన్ జారీ చేయాల్సి ఉంటుందన్నారు. ఆ నోటిఫికేషన్ లో పెద్ద ప్రాంతాన్ని స్పష్టీకరించాల్సి ఉంటుందని తెలిపారు. ఆయా పురపాలక సంఘాల్లో విలీనమయ్యే ప్రస్తుత గ్రామపంచాయతీలను డీనోటిఫై చేయాల్సి ఉంటుందని విన్నవించారు. ఈ తతంగాన్ని ప్రభుత్వం పూర్తి చేయడంతో అసెంబ్లీ బిల్లును ఆమోదించిందని తెలిపారు.

ఈ సవరణ రాజ్యాంగ విరుద్ధమని, ఆర్టికల్ 243 ను ఉల్లంఘించడమేనని నివేదించారు. దీంతో తెలంగాణ మున్సిపల్ యాక్ట్‌లోని సెక్షన్ 3ఏ ను కొట్టివేయవచ్చునని విన్నవించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 245 విరుద్ధమైన చట్టాన్ని చేసే అధికారం తెలంగాణ శాసనసభకు లేదన్నారు. అలాంటి బిల్లులు తీసుకురావడంతో రాష్ట్రాలు గ్రామ పంచాయతీ వ్యవస్థను నిరుత్సాహపర్చరాదని నివేదించారు. మరో సీనియర్ న్యాయవాది ఎస్.సత్యం రెడ్డి వాదనలు వినిపిస్తూ...గ్రామ పంచాయతీలను మున్సిపాలిటీల్లో విలీనం చేసే ముందు పంచాయతీలకు ప్రభుత్వం ఎలాంటి ముందస్తు నోటీసులు జారీ చేయలేదన్నారు. గ్రామ పంచాయతీలను మున్సిపాలిటీల్లో విలీనం చేయడం వల్ల గ్రామీణ పేద ప్రజలు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం (మహాత్మాగాంధీ నేషనల్ రూరల్ ఎంప్లాయ్‌మెంట్ స్కీం)వంటి ఉపాధి అవకాశాలు కోల్పోతారని తెలిపారు.

దీనిపై తెలంగాణ అదనపు అడ్వకేట్ జనరల్ జె.రామచందర్ రావు స్పందిస్తూ..పంచాయతీలను మున్సిపాలిటీల్లో విలీనం చేసే ముందు సర్వే నిర్వహించారని, జిల్లా కలెక్టర్లు అంగీకార పత్రాలను కూడా సమర్పించడం జరిగిందన్నారు. ఇరు పక్షాల వాదనలు విన్న అనంతరం ధర్మాసనం స్పందిస్తూ. రాష్ట్ర ప్రభుత్వాలు అలాంటి బిల్లులు తీసుకురాకుండా ఏమైనా రాజ్యాంగ నిషేధం ఉందా అని ప్రశ్నించింది. కోర్టులు కేవలం న్యాయిక దృక్పథంతో మాత్రమే పనిచేస్తాయని మౌఖికంగా స్పష్టం చేసింది. అసెంబ్లీ చేసిన బిల్లులకు సంబంధించిన రికార్డులను ఇవ్వాలని అదేశించే అధికారం కోర్టులకు లేదని తేల్చి చెప్పింది.....తీర్పును వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది.

నర్సంపేటలో ఏకలవ్య మోడల్ స్కూల్?

ఎమ్మెల్యే పెద్ది వినతికి కేంద్రమంత్రి సానుకూల స్పందన



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : వరంగల్ జిల్లా, నర్సంపేట నియోజకవర్గంలో ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటుకు కేంద్రం సానుకూలంగా స్పందించింది. స్థానిక ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు సీతారామ్ నాయక్‌తో కలిసి సోమవారం కేంద్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి జుయల్ ఓరమ్‌తో ఢిల్లీలో సమావేశమయ్యారు. కేంద్ర మంత్రికి వినతిపత్రం సమర్పించారు. కావలసిన మౌలిక వసతులు సమకూరుస్తామని వరంగల్ రూరల్ జిల్లా కలెక్టర్ ఐఎఎస్ ఎం. హరిత ఇచ్చిన కాపీ ప్రతిని, రాష్ట్ర ప్రభుత్వం ద్వారా గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి బి.ఎం.డి. ఎక్కా ఇచ్చిన కాపీ ప్రతిని కూడా కేంద్ర మంత్రికి సమర్పించారు. గిరిజ నులు అధికంగా ఉన్న నియోజకవర్గమైనందున విద్యార్థులకు ఉన్నత విద్యా ప్రమా ణాలు అందించేందుకు ఏకలవ్య మోడల్ స్కూల్ (ఈఎంఆర్ఎస్)ను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి కేంద్ర మంత్రి జుయల్ ఓరమ్‌కు వివరించారు.

కాంగ్రెస్ ఎమ్మెల్సీల విలీనంపై విచారణ వాయిదా

హైదరాబాద్, ఆంధ్రప్రభ: శాసన మండలిలో కాంగ్రెస్ పార్టీ శాసనసభా పక్షాన్ని తెరాస లో విలీనం చేయడాన్ని సవాలు చేస్తూ, బులెటిన్ 9ని సస్పెండ్ చేయాలని హైకోర్టులో దాఖలైన వ్యాజ్యంపై విచారణ వాయిదా పడింది. తెలంగాణ అదనపు అడ్వకేట్ జనరల్ జె.రామచందర్ రావు అభ్యర్థన మేరకు హైకోర్టు తదుపరి విచారణ మార్చి 1 కి వాయిదా వేసింది. తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టీబీఎన్.రాధాకృష్ణన్, జస్టిస్ ఎ.రాజశేఖర్ రెడ్డి లతో కూడిన డివిజన్ బెంచ్ సోమవారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. విలీనం చేస్తూ నలుగురు శాసన మండలి సభ్యులు (ఎమ్మెల్సీలు) ఇచ్చిన లేఖపై శాసనమండలి చైర్మన్ స్వామిగౌడ్ ఆమోదించడాన్ని సవాలు చేస్తూ ఎమ్మెల్సీ మహ్మద్ అలీ షబ్బీర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సదరు ఎమ్మెల్సీలను అనర్హులుగా ప్రకటించి 90 రోజుల్లో నిర్ణయం తీసు కోవాలని పిటిషనర్ అభ్యర్థించారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మె ల్సీలు ఎం.ఎస్.ప్రభాకర్,సంతోష్‌కుమార్, కూచుకుళ్ల.దామోదర్ రెడ్డి, ఆకుల లలితలను తెరాస ఎమ్మెల్సీలుగా గుర్తిస్తున్నట్లు చైర్మన్ పేర్కొన్న విషయం తెలిసిందే.

ఆర్టీవోలు లేరు.. దళారుల జోరు

• రవాణాశాఖలో మూడేళ్లుగా ఇదే దుస్థితి • సిబ్బంది కొరతతో నామమాత్రంగా తనిఖీలు • భారీగా ఆదాయం తెచ్చిపెడుతున్నశాఖపై శీతకన్ను



హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు దండిగా ఆదాయాన్ని తెచ్చిపెడుతున్న రవాణా శాఖ ప్రస్తుతం సిబ్బంది కొరతతో ఇబ్బందులను ఎదుర్కొంటోంది. రవాణా శాఖలో కీలక బాధ్యతలను నిర్వహించే ఆర్టీవోలు కొరతగా ఉండటంతో నామమాత్రపు సేవలు అందుతున్నాయి. దాదాపుగా మూడు సంవత్సరాలుగా రవాణా శాఖలో ఇదే పరిస్థితి నెలకొన్నప్పటికీ నియామకాలపై ప్రభుత్వం దృష్టి సారించడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారులు, సిబ్బంది కొరత కారణంగా దళారులు ఇదే అదనుగా రెచ్చిపోతున్నారు. తెలంగాణ రాష్ట్రంలో 2016 వరకు 10 జిల్లాలే ఉండేవి, ఇందుకనుగుణంగా 10 మంది ఆర్టీవోలు పని చేశారు. కానీ 2016 దసరా తర్వాత జిల్లాల సంఖ్య 31కి చేరింది. దీంతో మిగిలిన జిల్లాలకు కొత్తగా ఆర్టీవోలతో పాటు సిబ్బంది అవసరమయ్యారు. జిల్లాలను ఏర్పాటు చేసినప్పటికీ అందుకు అనుగుణంగా సిబ్బంది నియామకం చేపట్టక పోవడంతో పూర్వపు జిల్లాలలో పని చేసే ఆర్టీవోలకే కొత్త జిల్లాల బాధ్యతలను కట్టబెట్టారు. ఫలితంగా ఉన్న సిబ్బందిపై పనిభారం తీవ్రమైంది. అంతేకాకుండా కొన్ని జిల్లాలలో ఎంవీఐలు, పరిపాలనా విభాగం ఆర్టీవోలకు ఇంచార్జీలుగా బాధ్యతలను కట్టబెట్టారు. కీలకమైన పనులు ఉన్నప్పుడు మాత్రమే ఆర్టీవోలు అదనపు బాధ్యతలున్న జిల్లా రవాణా కార్యాలయాలకు వెళ్తున్నారు.

17 జిల్లాల్లో ఇన్‌ఛార్జ్‌లే...

ప్రస్తుతం 31 జిల్లాలలో కేవలం 14 జిల్లాలకు మాత్రమే ఆర్టీవోలున్నారు. మిగిలిన 17 జిల్లాలకు మాత్రం ఇంచార్జీలే ఆర్టీవోలుగా వ్యవహరిస్తున్నారు. వీరిలో 9 మంది ఎంవీ ఐలు, 8 మంది డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ (డీటీసీ)లున్నారు. వాస్తవానికి పదోన్నతులు పొందేందుకు వీరిలో చాలా మందికి అర్హతలున్నాయి. మూడేళ్ళుగా విధులను నిర్వహిస్తున్నప్పటికీ ప్రభుత్వం మాత్రం పదోన్నతులను కల్పించలేదు. పని భారం పెరిగినప్పటికీ అలవెన్సులను కూడా చెల్లించక పోవడంతో సిబ్బంది అయిష్టంగానే విధులను నిర్వహిస్తున్నారు.

రోడ్లపై తనిఖీలు శూన్యం

సిబ్బంది కొరత, అదనపు పనిభారంతో సతమతమవుతున్న రవాణా శాఖ అధికారులు క్షేత్రస్థాయి తనిఖీలను పక్కకు పెట్టారు. నిబంధనలను అతిక్రమించి రోడ్లపై తిరుగుతున్న వాహనాలు, పర్మిట్‌లు లేకుండా సంచరిస్తున్న వాహనాలను గుర్తించి కట్టడి చేయడంపై నిరాసక్తత కనబరుస్తున్నారు. ఎప్పుడో అడపాదడపా తూ.తూ. మంత్రంగా తనిఖీలు నిర్వహిస్తూ హడావిడి చేస్తున్నారు తప్ప తరచూ తనిఖీలు లేకుండా పోయాయి. దీంతో టిప్పర్‌లు, సరుకు రవాణా లారీలు, ప్రైవేట్ బస్సులు విచ్చలవిడిగా రాత్రి పూట రోడ్లపై తిరుగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. మట్టిని తరలించే టిప్పర్‌లతో పాటు భవన నిర్మాణ సామాగ్రిని తరలించే వాహనాలు అనేకం కనీస జాగ్రత్తలు తీసుకోకుండా సంచరించడంతో రోడ్లపై వెళ్ళే వారు ఇబ్బందులకు గురవుతున్నారు.

అదే విధంగా ఇసుక లారీలు కూడా ఇష్టానుసారంగా సంచరిస్తూ ప్రజలను ఇబ్బందుల పాలు చేస్తున్నాయి. వీటన్నింటినీ ఎప్పటికప్పుడు గుర్తించి కట్టడి చేయాల్సిన రవాణా శాఖ నామమాత్రపు తనిఖీలకే అది కూడా ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల తనిఖీలకే పరిమితమవుతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ఏజంట్లదే హవా

ఇంచార్జ్ ఆర్టీవోలు ఉన్న చోట ఏజంట్ల హవా నడుస్తోంది. కార్యాలయంలోనే తిష్ట వేస్తున్న ఏజంట్లు సిబ్బందితో కలిసి ఉంటూ పోస్టులో పంపాల్సిన స్మార్ట్‌కార్డులు, డ్రైవింగ్ లైసెన్సులు, పర్మిట్లను నేరుగా వినియోగదారులకు అందిస్తూ అందినంత దండుకుంటున్నారు. మరికొన్ని చోట్ల స్లాట్ బుకింగ్‌లు, లెర్నింగ్ లైసెన్సులను ఇప్పించేందుకు చేతివాటాన్ని ప్రదర్శిస్తున్నారు.

బ్లాక్‌చైన్ వర్సిటీతో డిజిథాన్ ఒప్పందం

టెక్నాలజీలో శిక్షణ

హైదరాబాద్, ఆంధ్రప్రభ : బ్లాక్ చైన్ టెక్నాలజీ ద్వారా నూతన అవకాశాలను అందిపుచ్చుకునేలా విద్యార్థులకు శిక్షణ కల్పించేందుకు అమెరికాలోని సియాటెల్‌లో గల బ్లాక్‌చైన్ యూనివర్సిటీతో రాష్ట్రంలోని డిజిథాన్ సంస్థ ఒక ఒప్పందం కుదుర్చుకుంది.

రాష్ట్రంలో బ్లాక్‌చైన్ టెక్నాలజీ ప్రమోట్ చేసేందుకు దేశవ్యాప్తంగా ఉన్న విద్యార్థులకు శిక్షణ లక్ష్యంగా ఈ పరస్పర అంగీకారం కుదిరింది. డిజిథాన్ సీఈవో సందీప్ కుమార్ మక్తాల, బ్లాక్‌చైన్ యూనివర్సిటీ కంట్రీహెడ్ ఆకాశ్ భన్సాల్ సోమవారం ఈ మేరకు ఒప్పందం కుదుర్చుకున్నారు. పల్లెసీమల్లో సాంకేతిక అక్షరాస్యతకు కృషి, నగదురహిత లావాదేవీలు, డిజిటల్ విలేజ్ కార్యక్రమాల ద్వా రా డిజిథాన్ చేరువై విద్యార్థులకు నూతన నైపుణ్యాల కల్పనకు ఈ ఒప్పందం దోహద పడుతుందని ఆకాశ్ భన్సాల్ చెప్పారు. బ్లాక్‌చైన్ టెక్నాలజీపై అవగాహన కల్పించడం, ఉపాధి అవకాశాలు పొందే పరిజ్ఞానంపై శిక్షణ ఇస్తామని సందీప్ చెప్పారు.

వేసవి రద్దీ నేపథ్యం..

108 ప్రత్యేక రైళ్ళు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: వేసవిలో ప్రయాణీకుల రద్దీ తట్టుకునే విధంగా పలు మార్గాల్లో 108 ప్రత్యేక రైళ్ళను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు వెల్లడించారు. ప్రధానంగా రద్దీగా ఉండే మార్గాల్లో మార్చి నుంచి జూన్ నెల వరకు ప్రత్యేక రైళ్ళను నడపనున్నట్లు సోమవారం ఒక ప్రకటనలో అధికారులు తెలిపారు. తిరుపతి - నాగర్‌సోల్ మధ్య మార్గంలో ప్రత్యేక వీక్లీ ట్రైన్లు (28 సర్వీసులు), హెచ్ .ఎస్ నాందేడ్ - తిరుపతి మధ్య మార్గంలో ప్రత్యేక ట్రైన్లు (26 సర్వీసులు) నడపనున్నారు. అలాగే తిరుపతి - కాకినాడ టౌన్ - రేణు గుంట మార్గ మధ్యలో జనసాధారన్ ప్రత్యేక ట్రైన్లు (26 సర్వీసులు), కాచిగూడ - కాకినాడ పోర్టు మధ్య మార్గంలో కాచిగూడ ప్రత్యేక ట్రైన్లు (28 సర్వీసులు) నడపనున్నారు.


నడపలేం..మూసేస్తాం

• జేఎన్‌టీయూకి 8 కాలేజీల లేఖలు • అదేబాటలో మరికొన్ని విద్యాసంస్థలు • సమస్యగా మారిన సంస్కరణలు • అడ్మిషన్లు లేక అవస్థలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్రంలోని కొన్ని ఇంజనీరింగ్ కాలేజీలు తాము కళాశాలలను నడపలేము మూసేసుకుంటామని.. పేర్కొంటూ జేఎన్‌టీయూకి కాలేజీల యాజమాన్యాలు లేఖలు రాస్తున్నాయి. ఇప్పటికే కొన్ని కాలేజీలు జేఎన్‌టీయూకి లేఖలు రాశాయి. రాష్ట్రంలో నాణ్యమైన ఇంజనీరింగ్ విద్యను అందించాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం పలు సంస్కరణలు తీసుకొచ్చింది. ఈ నేపథ్యంలో అన్ని వసతులు, సౌకర్యాలు ఉన్న కాలేజీల్లో విద్యార్థులు చేరుతున్నారు. సరైన సౌకర్యాలు, ల్యాబ్‌లు, అధ్యాపకులు లేని కాలేజీల్లో విద్యార్థులు చేరడం లేదు. దీంతో గత 4 సంవత్సరాలుగా కొన్ని కాలేజీలు మూతపడే స్థితికి చేరుకున్నాయి. ఈ నేపథ్యంలో గత నాలుగేళ్లుగా కొత్త అడ్మిషన్లు రాకపోవడంతో రాష్ట్రంలోని పలు ఇంజనీరింగ్ కాలేజీలు మూసేసే పరిస్థితికి వచ్చాయి. రాష్ట్రంలోని 8 ఇంజనీరింగ్ కాలేజీలు తాము కాలేజీలను నడపలేమని పేర్కొంటూ జేఎన్‌టీయూకి లేఖలు సమర్పించాయి. మరికొన్ని కాలేజీలు కూడా లేఖలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్టు తెలుస్తోంది. ఇంజనీరింగ్ కాలేజీలను నడపలేమని భావించిన వారు దరఖాస్తు చేసుకోవడానికి ఫిబ్రవరి 8 వరకు జేఎన్‌టీయూ అవకాశంఇచ్చినట్టు తెలిసింది. ఇప్పటికే 8 కాలేజీలు లేఖలను సమర్పించగా మరికొన్ని కాలేజీలు కూడా ఉన్నట్టు తెలుస్తోంది. లేఖలు ఇచ్చిన కాలేజీల్లో గత 4 సంవత్సరాలుగా కొత్త అడ్మిషన్లు జరగలేదు. ఇప్పటి వరకు ఇంజనీరింగ్ కోర్సును కొనసాగిస్తున్న విద్యా ర్థులు వారి కోర్సు పూర్తయ్యే వరకు కాలేజీ యాజమాన్యాలు ఎదురు చూశాయి. గత 4 సంవత్సరాలుగా కొత్త అడ్మిషన్లు రాకపోవడంతో ఇకపై వారు కాలేజీలను నడపలేని స్థితికి చేరుకోవడంతో తాము కాలేజీలను కొనసాగించలేమని పేర్కొంటూ యాజ మాన్యాలు జేఎన్‌టీయూకి లేఖలు రాశారు. అయితే ఇప్పటికే లేఖలు రాసిన కాలేజీలతోపాటు మరికొన్ని కాలేజీలు ఏమైనా దరఖాస్తు చేసు కుంటాయోమోనని జేఎన్‌టీయూ చూస్తోంది. ఫిబ్రవరి 8 వరకు అవకాశం ఇచ్చినందున అప్పటి వరకు వచ్చిన కాలే జీల దరఖాస్తులపై యూనివర్సిటీ నిర్ణయం తీసుకునే అవకాశం కనిపిస్తోంది.

కొలువులకు 'జోనల్' ట్రబుల్!

నిలిచిన డీఎల్ ఖాళీల భర్తీ



హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్రంలో కొత్తగా చేపట్టాల్సిన నియామకాలు కొత్త జోనల్ వ్యవస్థ మూలంగా ఆలస్యం కానున్నాయి. రాష్ట్రంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో లెక్చరర్ పోస్టుల నియామకానికి సర్కార్ ఉత్తర్వులు సైతం జారీ చేసింది. ఉత్తర్వులు జారీ చేసిన అనంతరం కొత్త జోనల్ వ్యవస్థకు కేంద్రం ఆమోదం లభించింది. దీంతో నియామకాల కోసం గతంలో చేసిన ప్రతిపాదనలు కాకుండా కొత్త జోనల్ వ్యవస్థ ఆధారంగా తిరిగి చేపట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో ఇటు జూనియర్ లెక్చరర్స్‌తోపాటు అటూ డిగ్రీ లెక్చరర్స్ పోస్టుల నియామకాలు ఆగిపోయాయి. వచ్చే ఏడాది కొత్తగా మరో 119 బీసీ గురుకులాల ఏర్పాటుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కానీ నియామకాలు ఆలస్యంకానున్నాయి.

1214 డీఎల్ పోస్టులకు అనుమతి.

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 132 ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో 1214 డిగ్రీ లెక్చరర్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. డీఎల్ పోస్టులు మల్టీ జోనల్ పోస్టులు కావడంతో వాటి భర్తీకి కళాశాల విద్యా శాఖ అధికారులు కసరత్తు చేశారు. అయితే ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసే సమయానికి కొత్త జోన్ల వ్యవస్థకు రాష్ట్రపతి ఆమోదం లభించలేదు. కానీ ఇప్పుడు కొత్త జోన్ల వ్యవస్థకు రాష్ట్రపతి ఆమోదం లభించడంతో డీఎల్ నియామకాలను కొత్త జోన్ల ఆధారంగా భర్తీ చేయడం కోసం కసరత్తు చేస్తున్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో 3147 డీఎల్ పోస్టులు మంజూరయి ఉంటే వాటిలో ప్రస్తుతం 1386 మంది రెగ్యులర్ లెక్చరర్లు కొనసాగుతుండగా 898 మంది కాంట్రాక్ట్ లెక్చరర్లు మిగిలిన వారు గెస్ట్ ఫ్యాకల్టీగా ఉన్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన 1214 పోస్టుల భర్తీ చేపట్టాలని భావించి గతంలో ఉన్న రెండు జోన్ల వారీగా పోస్టులను భర్తీకి కళాశాల విద్య శాఖ ప్రతిపాదనలు సిద్ధం చేసింది. కానీ వచ్చే ఏడాది 2018-19 విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి కొత్త డిగ్రీ లెక్చరర్లు వచ్చే అవకాశం తక్కువగా ఉంది.

ప్రభుత్వ వివరణ కోరిన గురుకుల సొసైటీ రిక్రూట్‌మెంట్ బోర్డు

కొత్తగా చేపట్టాల్సిన జూనియర్ లెక్చరర్స్, డిగ్రీ లెక్చరర్స్ పోస్టుల నియామకం కోసం జారీ చేయాల్సిన నోటిఫికేషన్‌పై సందిగ్ధత నెలకొంది. కొద్ది రోజుల క్రితం జరిగిన గురుకుల సొసైటీల రిక్రూట్‌మెంట్ బోర్డు సమావేశంలోనూ ఇదే అంశం చర్చకు వచ్చింది. అయితే కార్పొరేషన్లు, సొసైటీలకు రాష్ట్రపతి ఉత్తర్వులు వర్తించవని కొందరు సభ్యులు అభిప్రాయం వ్యక్తం చేశారు. దీనిపై ప్రభుత్వం నుంచి స్పష్టమైన వివరణ తీసుకోవాలని రిక్రూట్‌మెంట్ బోర్డు సమావేశంలో తీర్మానించారు. ప్రభుత్వం నుంచి స్పష్టత వచ్చిన అనంతరం జోనల్ వారీగా అయితే తదనుగుణంగా నోటిఫికేషన్లను జారీ చేయాలని లేకపోతే సాధారణంగా బోర్డు రిక్రూట్‌మెంట్ ప్రకారం భర్తీ చేపట్టాలని నిర్ణయించారు.

అతిపెద్ద కప్‌కేక్ టవర్.. గిన్నిస్‌లో చోటు



చెన్నై: ప్రపంచంలోనే అతిపెద్ద కప్‌కేక్ టవర్ ఇది. చెన్నైలోని కప్‌కేక్ టవర్‌కు గిన్నిస్ వరల్డ్ రికార్డులో కూడా చోటుదక్కింది. చెన్నైలోని ప్రీతి కిచెన్ అప్లియెన్సెస్, ఫూడ్ కన్సల్టేట్ చెన్నై సం యుక్తంగా చేసిన ఈ ప్రయత్నానికి గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్సులో చోటుదక్కింది. ఇటీవలే చెన్నైలోని ఫోరం విజయ మాల్‌లో ఈ కప్‌కేక్‌ను ఏర్పాటు చేశారు. మొత్తం 18,818 కప్‌కేకులతో ఉపయోగించి రూపొందించారు. ఈ టవర్ ఎత్తు 41 అడుగుల 8 ఇంచులు. అవసరమయిన కేకులను అదే ప్రదేశంలో తయారు చేశారు. కప్‌కేకులను తయారు చేసి పిరమిడ్ ఆకృతిలో ఎత్తుగా పేర్చారు. పూర్తిచేయడానికి మొత్తం 30 గంటల సమయం పట్టింది. కార్మికులు అంకితభావంతో పని చేశారు. ఒక్కో కప్పు బరువు 70 గ్రాములు. మొత్తం కప్పుల బరువు 1.3 టన్నులు అని గిన్నిస్ బుక్ రికార్డ్స్ వెల్లడించింది. ఈ కప్‌కేక్‌ను గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డు పరిశీలను రికార్డు చేసిన తర్వాత చెన్నైలోని ఎన్‌జీవో క్రాస్‌లో పంచిపెట్టారు.

డిన్నర్ వివాదం.. భార్యపై ఫిర్యాదు



సిడ్నీ: భార్యాభర్తల మధ్య చిన్నచిన్న గొడవలు, మనస్పర్థలు రావడం. అంతలోనే కలిసిపోవడం సహ జం. ఆస్ట్రేలియాలోని సిడ్నీకి చెందిన ఓ దంప తుల మధ్య కూడా ఇలాంటి ఘటన చోటుచేసు కుంది. భార్య భర్తలు ఓ రెస్టారెంటుకు వెళ్లారు. భర్త చైనీస్ ఆహారం తిన్నాడు. ఈ విషయం భార్యకు నచ్చలేదు. దీంతో అతడి బిల్లు చెల్లించేందుకు తిరస్కరించింది. దీంతో భర్త ఆగ్రహానికి గురయ్యాడు. వెంటనే పోలీసులకు ఫోన్‌చేసి ఫిర్యాదు చేశాడు. అత్యవసర నంబర్‌కు ఫోన్ చేసి మరీ ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు అందుకున్న అధికారులు ఘటనాస్థలానికి చేరుకున్నారు. అత్యవసర విభాగ నంబర్‌కు ఇలాంటి ఫిర్యాదులు చేయకూడదని భర్తకు వివ రించారు. అనంతరం అక్కడి నుంచి వెళ్లిపోయారు. అయితే రుచికరమైన చైనీస్ మీల్ కు ఇద్దరిలో ఎవరు డబ్బులు చెల్లించారో తెలియదని నార్త్ షోర్ పోలీసు అధికారులు వెల్లడించారు. గత నెలలో ఈ ఘటన జరిగిందని చెప్పారు.

కలుషిత ఆహారం....
20 మందికి అస్వస్థత



చిట్యాల , ప్రభన్యూస్ : జయశంకర్ భూపాలపల్లి జిల్లా, చిట్యాల మండల కేంద్రంలోని సాంఘీక సంక్షేమ ఆశ్రమ పాఠశాలకు చెందిన మరో 20 మంది విద్యార్థినులు ఫుడ్ పాయిజన్‌కు గురై సాయంత్రం ఆస్పత్రి పాలయ్యారు. ఆస్పత్రి సిబ్బంది అప్రమత్తమై విద్యార్థినులకు అత్యవసర వైద్యం అందించగా పరిస్థితిని స్థానిక తహసీల్దార్ షరీష్ దగ్గరుండి పరిస్థితిని సమీక్షించారు. విద్యార్థినుల పరిస్థితి దయనీయంగా ఉండటంతో ప్రిన్సిపాల్ జయశ్రీ అక్కడి నుండి ఉడాయించారు. పూర్తివివరాల్లోకి వెళ్తే .. మండల కేంద్రంలోని సాంఘీక సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ పాయిజన్‌కు గురై 16 మంది విద్యార్థినులు ఉదయం అస్వస్థతకు గురయ్యారు. ఉదయమంతా చికిత్స పొంది సాయంత్రానికి పాఠశాలకు చేరుకున్నారు. పరిస్థితి బయటకి పొక్కడంతో ప్రిన్సిపాల్ జయశ్రీ రహస్యంగా విద్యార్థినులకు చికిత్స అందించినట్లు ఉప సర్పంచ్ పూర్ణ చందర్ రావు తెలిపారు. తాము పాఠశాలను సందర్శించిన సందర్భంగా ఇబ్బందులు పడుతున్న విద్యార్థినులు జరిగిన పరిస్థితిని తమకు వివరించినట్లు తెలిపారు. సుమారు 23 మంది విద్యార్థినులు నిర్బంధం నుండి బయటపడి తాము వచ్చామన్న సమాచారం తెలుసుకుని తమ పై పడి కన్నీటి పర్యంతమయ్యారని తెలిపారు. విద్యార్థినుల పరిస్థితిని గమనించి 108 వాహనంలో ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు. ప్రతస్తుం ఆస్పత్రిలో విద్యార్థినులకు మెరుగైన వైద్యం అందించాలని తహసీల్దార్ ఆస్పత్రి సిబ్బందిని ఆదేశించారు. విద్యార్థినులకు మెరుగైన చికిత్స అందించాలని స్థానిక ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి వైద్యులను ఫోన్లో ఆదేశించారు. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ అస్వస్థతకు గురైన బాలికలను సివిల్ ఆస్పత్రికి తరలించారు. విద్యార్థినీల అస్వస్థతకు కారకులైన ప్రిన్సిపల్ జయశ్రీ ని సస్పెండ్ చేయాలని గ్రామ సర్పంచ్ మాసు రాజన్న, ఉప సర్పంచ్ ఇరుకుపాటి పూర్ణ చందర్ రావు, నాయకులు పెరుమాండ్ల సమ్మయ్య, రవీందర్ , అల్లం రవీందర్ , వేముల మహేందర్ డిమాండ్ చేశారు.

లోక్‌సభ ఎన్నికలు రెండో కురుక్షేత్రం

న్యూఢిల్లీ: త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికలను రెండవ కురుక్షేత్ర యుద్ధం. మోడీ సారథ్యంలోని కౌరవులకు, రాహుల్ సారథ్యం లోని కాంగ్రెస్ పార్టీకి మధ్య ఈ యుద్ధం జరుగు తుంది అని వెటరన్ ఏఐసీసీ నాయకుడు ఏకే ఆంటోనీ పేర్కొన్నారు. దేశాన్ని, రాజ్యాంగాన్ని, నైతిక విలువలను, రాజ్యాంగ వ్యవస్థలను కాపాడు కునేందుకు మోడీ కూటమితో కాంగ్రెస్ సమరానికి సిద్ధమ వుతున్నది.



తిరువనంతపురంలోని కాసర్ గఢ్‌లో చేపట్టిన జనమహాయాత్ర కార్యక్రమంలో భాగంగా ఆంటోనీ ఈ వ్యాఖ్యలు చేశారు. జాతీ యవాదం గురించి బీజేపీ, ఆర్ఎస్ఎస్ పాఠాలు కాంగ్రెస్‌కు అక్కర్లేదని అన్నారు. మునుపెన్నడూ లేనంతగా దేశం నిరుద్యోగ సమస్యను ఎదుర్కొంటోంది. రాష్ట్రాన్ని పాలిస్తున్న ముఖ్యమంత్రి పినరయి విజయన్, నరేంద్ర మోడీ ఒకే విధానాలు అనుసరిస్తు న్నారని విమర్శించారు. కాంగ్రెస్ బలాన్ని తగ్గించాలన్నదే వారి కుట్ర. క్షేత్రస్థా యిలోకార్యకర్తలు క్రియాశీలకంగా పనిచేయాలి. వచ్చే ఎన్నికల్లో మెజార్టీ సీట్లు గెలవాలి అని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

మెదడు ఏ వ్యాధినైనా జయిస్తుంది

పనాజీ: మానవ మెదడు ఎటువంటి వ్యాధినైనా అధిగమించి స్వస్థత చేకూరుస్తోందని గోవా సీఎం మనోహర్ పారికర్ అన్నారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా పాంక్రియాటిక్ క్యాన్సర్‌తో బాధపడుతున్న పారికర్ సోమవారం ట్విటర్ వేదికగా మాట్లాడుతూ ఎటువంటి వ్యాధినైనా ఎదిరించేశక్తి మనిషి మెదడుకు ఉందని ట్వీట్ చేశారు.



కాగా గతేడాది ఫిబ్రవరిలో గోవా సీఎం మనోహర్ పారి కర్‌కు పాంక్రియాటిక్ క్యాన్సర్ ఉన్నట్టు వైద్య పరీక్షల్లో నిర్ధారణ అయింది. దీంతో ఆయనను గోవా నుంచి ముంబై అనంతరం న్యూయార్క్ ఆధునిక వైద్య చికిత్స కోసం తరలించారు. న్యూయార్క్ నుంచి వచ్చిన అనంతరం పారికర్ ఢిల్లీలోని ఆలిం డియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయి మ్స్)లో వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారు. ఈ ఏడాది జన వరి 30న ప్రవేశపెట్టిన 2019-20 వార్షి క బడ్జెట్ సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం అదేరోజు ఎయిమ్స్‌లో అడ్మిటయ్యారు. ఈ సందర్భంగా గోవా క్యాన్సర్ సొసైటీ జాయింట్ సెక్రటరీ డాక్టర్ శేఖర్ సల్కార్ మాట్లాడుతూ క్యాన్సర్ పేషంట్లలో మనో ధైర్యాన్ని నింపేందుకు పారికర్ గొప్ప ఉదాహరణగా నిలుస్తారన్నారు. ఆయనకు ఎటువంటి భయంకరమైన వ్యాధినైనా ఎదుర్కొనే గొప్ప మనోధైర్యం ఉందన్నారు.

ఔను.. బీజేపీ నన్ను ఉపయోగించుకుంది

- నిరశన దీక్షలో అన్నా హజారే



అహ్మద్‌నగర్: బీజేపీ 2014లోక్‌సభ ఎన్నికల్లో విజయం సాధించేందుకు తనను ఉపయోగించుకుందని సామాజిక ఉద్యమ నేత అన్నాహజారే సోమవారం అన్నారు. 2014లో బీజేపీ తనను ఉపయోగించు కుందన్నారు. తను లోక్ పాల్ నియామకం కోసం ఆందోళన నిర్వహించిన విషయం ప్రతి ఒక్కరికి తెలు సన్నారు. దాన్ని అడ్డుపెట్టుకుని బీజేపీతోపాటు ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) అధికారంలోకి వచ్చాయని రాలేగావ్ సిద్ధిలో అన్నా హజారే అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దేశ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. దేశాన్ని నిరంకుశత్వం వైపు మళ్లిస్తున్నారన్నారు. కేజ్రీవాల్ తనతో వేదిక పంచుకునేందుకు అనుమతించను అని స్పష్టం చేశారు.

అన్నాహజారే ప్రాణాలను ప్రభుత్వం కాపాడాలి: శివసేన

లోక్‌పాల్, లోకాయుక్తనియామకాలు చేపట్టాలని, రైతులసమస్యలు పరిష్కరించాలని తన సొంతగ్రామం రాలేగావ్ సిద్ధిలో నిరాహార దీక్షకు దిగిన అన్నా హజారే ప్రాణాలను బీజేపీ నేతృత్వంలోని కేంద్రప్రభుత్వం కాపాడాలని శివసేన డిమాండ్ చేసింది. హజారే దీక్షకు మీడియా ప్రచారం చేయకుండా కేంద్ర, మహారాష్ట్రప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయని శివసేన తన అధికార పత్రిక సామ్నాలో ఆరోపించింది. ప్రధానమంత్రి కార్యాలయం నుంచి వచ్చిన లేఖలో అన్నా అమరుడయ్యేవరకు దీక్షకొనసాగించాలని కోరుకుంటున్నట్టుగా లేఖలోపేర్కొన్నారని శివసేన తెలిపింది. 81 ఏళ్ల అన్నాహజారే దీక్ష ఆరోరోజు చేరుకుందని ముందు హజారే ప్రాణాలు కాపాడాలని శివసేన కోరింది.

ఏపీకి రూ.5.6 లక్షల కోట్లిచ్చాం...
బాబూ చర్చకు రా!



- ఇక బాబు వస్తామన్నా ఎన్డీయేలో చేర్చుకోం
- శ్రీకాకుళం, విజయనగరంలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా

పలాస(శ్రీకాకుళం) ప్రభ న్యూస్ బ్యూరో: కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి గత నాలుగున్నర సంవత్సరాలలో రూ. 5.6 లక్షల కోట్లు వివిధ పథకాల ద్వారా నిధులు అందించామని, దీనిపై బహిరంగ చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని, చంద్రబాబు కూడా చర్చకు రాగలరా అంటూ బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా సవాల్ విసిరారు. ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీ ప్రజా చైతన్య బస్సు యాత్రను సోమవారం శ్రీకాకుళం జిల్లా పలాసలో అమిత్‌షా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో అమిత్‌షా మాట్లాడుతూ, రాజకీయ ప్రయోజనాల కోసమే చంద్రబాబునాయుడు బీజేపీతో తెగ తెంపులు చేసుకుని, వచ్చే ఎన్నికల్లో మరోసారి అధికారంలోకి రావాలన్న ఉద్దేశంతో చంద్రబాబునాయుడు కలలుగంటు న్నారని, ఇందుకోసం కేంద్రంలోని బీజేపీని అధికారంలోకి రాకుండా కొన్ని ఇతర ప్రతిపక్షాలతో కలిసి కుట్రలు పన్ను తున్నారని అమిత్‌షా విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ఆంధ్ర ప్రదేశ్‌కు ఎటువంటి సహకారం అందించలేదంటూ చంద్ర బాబునాయుడు ప్రజలముందు అబద్దాలు చెబుతున్నారని, తాము ఏమి చేశామో ప్రజలకు వివరిస్తామని, దీనిపై బహిరంగ చర్చకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. కాంగ్రెస్ పార్టీతో రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన చంద్రబాబు నాయుడు కాంగ్రెస్ రాజకీయాలనే వంటపట్టించుకుని ఎన్‌టి ఆర్‌కు వెన్నుపోటు పొడిచి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చారని అన్నారు. దేశ వ్యాప్తంగా మోడీ ప్రభంజనం వీస్తున్న విషయాన్ని తెలుసుకున్న చంద్రబాబు ఎన్‌డిఎలో చేరి కేంద్ర ప్రభుత్వంలో భాగస్వాములయ్యారని, అయితే ఆంధ్ర ప్రదేశ్‌ను విభజించి వంచించిన కాంగ్రెస్ పార్టీపంచనే మళ్లీ ఇప్పుడు చంద్రబాబునాయుడు చేరారని ప్రజలు ఈ విషయాన్ని తెలుసుకోవలసిన అవసరం ఎంతైనా ఉందని అమిత్‌షా అన్నారు. చంద్రబాబునాయుకు వేసిన పాచికలు తెలంగాణాలో పనిచేయలేదని, మహాకూటమిగా కాంగ్రెస్‌తో ఏర్పాటై తెలంగాణా ఎన్నికల్లో చిత్తుగా ఓడిపోయిన తెలుగుదేశం పార్టీ ఇప్పుడు కాంగ్రెస్‌తో సహా మరికొన్ని రాజకీయపార్టీలతో కలిసి రాజకీయప్రయోజనాలకోసం తెలుగువారి ఆత్మ గౌరవాన్ని చంద్రబాబునాయుడు తాకట్టుపెడుతున్నారని విమర్శించారు.

పన్నుల్లో వాటా తప్ప...
కొత్తగా మీరిచ్చిందేంటి



- అమిత్‌షా వ్యాఖ్యలపై ఏపీ సీఎం చంద్రబాబు రియాక్షన్

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: కేంద్ర ఎన్నికల సంఘంతో విపక్ష కూటమి భేటీ కోసం ఢిల్లీ వచ్చిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు అటు భారతీయ జనతా పార్టీ, ఇటు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీపై విరుచుకుపడ్డారు. ఈసీతో సమావేశం అనంతరం ఎన్సీపీ అధినేత శరద్ పవార్ నివాసంలో భేటీ అయిన చంద్రబాబు, అక్కడ ప్రెస్ మీట్ ఏర్పాటు చేశారు. ఆ సందర్భంగా మాట్లాడుతూ 2014లో ఎవరు ఎవరి తలుపుతట్టారో గుర్తుతెచ్చుకోవాలని బీజేపీ అధినేత అమిత్‌షాను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. అమిత్‌షా గౌరవం ఇచ్చిపుచ్చుకోవాలని, బెదిరిస్తే భయపడేవాళ్లెవరూ లేరని బదులిచ్చారు. ఏపీ పర్యటనలో ఉన్న అమిత్ షా చేసిన వ్యాఖ్యలకు బదులిస్తూ.. బీజేపీ తీరును ప్రజలు హర్షించరని, త్వరలో ప్రజలే బీజేపీ తలుపులు మూసేస్తారన్నారు. రాష్ట్రంలో అవినీతి పార్టీ అధికారంలో వస్తుందని అమిత్ షా అనుకుంటున్నారని, వారితోనే వెళ్లనివ్వండి అంటూ ఎద్దేవా చేశారు. అదే సమయంలో రూ. 5 లక్షల కోట్ల కంటే ఎక్కువ నిధులు రాష్ట్రానికి ఇచ్చినా అభివృద్ధి చేయకుండా అవినీతి చేశారంటూ బీజేపీ నేతలు చేస్తున్న ఆరోపణలపైనా చంద్ర బాబు స్పందించారు. దేశంలో ఏ రాష్ట్రానికీ లేనన్ని అవార్డులు పొందిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గురించి బీజేపీ నేతలు చేస్తున్నదంతా తప్పుడు ప్రచారమేనని తిప్పికొట్టారు. బీజేపీ నేతృత్వం వహిస్తున్న కేంద్ర ప్రభుత్వం సహా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వివిధ రంగాల్లో 670కి పైగా అవార్డులు వచ్చాయని, జీ ఎస్డీపీలో గత నాలుగేళ్లుగా నెంబర్ 1 స్థానంలో నిలిచామని గుర్తుచేశారు. అన్ని రంగాల్లో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపామని బాబు అన్నారు. ఒకసామాజికవర్గానికి చెందిన పోలీసు అధికారులకు మాత్రమే పదోన్నతులు కల్పించారని వైకాపా అధినేత జగన్మోహన్ రెడ్డి చేసిన ఆరోపణలపై స్పందిస్తూ.. జగన్ పూర్తిగా తప్పుడు ప్రచారం చేస్తున్నారని చంద్రబాబు అన్నారు. కులాల మధ్య చిచ్చుపెట్టాలని జగన్ చూస్తున్నారని, తాము అన్ని వర్గాలకు సమ ప్రాధాన్యమిస్తున్నామని తెలిపారు. 40 ఏళ్లుగా రాజకీయంలో ఉన్న తాను ఇంత నీచ రాజకీయాల్ని ఎప్పుడూ చూడలేదని వ్యాఖ్యానించారు. అందరితో కలిసే రాజకీయం చేస్తున్నానని, తమ కేబినెట్ లోనూ అన్ని వర్గాలకు చెందిన నేతలున్నారని తెలిపారు. కులాల మధ్య చిచ్చు పెట్టి, రాజకీయ ప్రయోజనం పొందా లన్న కుటిల యత్నానికి వైకాపా దిగజారిందని తీవ్రస్థాయిలో ప్రత్యారోపణలు చేశారు.

మీరు చేసేది అసత్యమేవ జయతే

- పుట్టిన రోజున ఎంపీ మాగంటి వినూత్న నిరసన

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా సభలు పెట్టి ప్రజలను మోసం చేయాలని చూస్తున్నారని తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ సభ్యులు మండిపడ్డారు. చివరి పార్లమెంట్ సమావేశాలు కావడంతో ఎంపీలు మాటల వాడి-నిరసనల వేడి పెంచారు. సోమవారం పార్లమెంట్ ప్రాంగణంలోని మహాత్మ గాంధీ విగ్రహం వద్ద టీడీపీ ఎంపీలు ధర్నా నిర్వహించారు. ఇప్పటికైనా ప్రత్యేక హోదా, విభజన హామీలను కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలని నినాదాలు చేశారు. అనంతరం ఇరు సభలకు హాజరైన ఎంపీలు మధ్యాహ్నం విజయ్ చౌక్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి అమిత్ షా ఉత్తరాంధ్ర, జగన్ ఢిల్లీ పర్యటనలపై విరుచుకుపడ్డారు. ఇన్నిరోజులు చెప్పిన మాయ మాటలు సరిపోవా ఇంకా ఎంతకాలం ఆంధ్రప్రదేశ్ ప్రజలను మోసం చేస్తారని శ్రీకాకుళం ఎంపీ రామ్మోహన్ నాయుడు ప్రశ్నించారు. ఉత్తరాంధ్ర జిల్లాలకు రైల్వే జోన్ ఫైల్‌ను ఆఫీసులోనే తొక్కి పెట్టారని, వెనుకబడిన జిల్లాలకు నిధులు ఎందుకు ఇవ్వడం లేదని అన్నారు. తాము కేంద్ర ప్రభుత్వ వైఖరిపై ధర్నాలు, నిరసనలు చేపడుతున్నప్పటి నుంచి ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన వివిధ ఫైల్స్‌ను ఆపివేశారని ఆయన ఆరోపించారు. శ్రీకాకుళం జిల్లాను అతలాకుతలం చేసిన తిత్లీ తుపాను బాధితులకు సహాయం చేయమని కోరితే... బీజేపీ పెద్దలు పార్టీ ఆఫీసు ఓపెన్ చేసి వెళ్లిపోయారని రామ్మోహన్ నాయుడు విమర్శించారు. యూనివర్సిటీల కోసం స్థలాలు, భూములు ఇచ్చినా కూడా ఆంధ్రప్రదేశ్‌ను పట్టించుకోవడం లేదని ఆయన దుయ్యబట్టారు. గాంధీ సిద్ధాంతాలకు విరుద్ధంగా మీరు చేస్తున్నది అసత్యమేవ జయతేనని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. హాస్యాస్పదంగా సభలు నిర్వహిస్తూ దేశాన్ని భ్రష్టు పట్టిస్తున్నారని రామ్మోహన్ నాయుడు చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో మీరు తిరగాలంటే ముందు తమ ప్రశ్నలకు సమాధానాలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

అనుమతులు రాగానే..
అనంతపురం-అమరావతి ఎక్స్‌ప్రెస్ వే స్పష్టం చేసిన కేంద్రం

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : అనంతపురం - అమరావతి గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే పనులకు పర్యావరణ, అటవీ, వన్యప్రాణులు ఇతర చట్టబద్ధమైన అనుమతులన్నింటినీ సంపాదించుకోవడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అంగీకరించిందని, అవసరమైన అనుమతులన్నింటినీ పొందిన తర్వాత ఎక్స్‌ప్రెస్‌వే పనులు ప్రారంభమవుతాయని కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ సహాయ మంత్రి మన్సుఖ్ మాండవీయ సోమవారం రాజ్యసభలో వెల్లడించారు. వైఎస్సార్సీపీ రాజ్యసభ సభ్యులు వి. విజయసాయి రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి రాత పూర్వకంగా జవాబిచ్చారు. ఎక్స్‌ప్రెస్‌వేకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియ ప్రారంభమైనట్లు ఆయన చెప్పారు. అమరావతి - అనంతపురం ఎక్స్‌ప్రెస్‌వే అభివృద్ధికి సంబంధించి గత ఏడాది ఆగస్టు 13, అక్టోబర్ 23 తేదీలలో తమ మంత్రిత్వ శాఖ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాధికారులతో రెండు దఫాలుగా చర్చలు జరిపినట్లు మంత్రి చెప్పారు. ఎక్స్‌ప్రెస్‌వే మొదట 100 మీటర్ల వెడల్పుతో నాలుగు లేన్ల రహదారిగా 384 కిలోమీటర్ల మేర నిర్మించాలని నిర్ణయించారు. భవిష్యత్తులో పెరిగే ట్రాఫిక్ దృష్ట్యా దీనిని 8 లేన్ల రహదారిగా విస్తరించే సౌలభ్యం కూడా కల్పించారు. ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణానికి అవసరమైన భూసేకరణ ఖర్చులో 50 శాతం భరించడానికి, ఇందులో ప్రభుత్వ భూమిని ఉచితంగా కేటాయించడానికి రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించినట్లు మంత్రి చెప్పారు. దేశంలోని వివిధ రాష్ట్రాలలో చేపడుతున్న ఈ తరహా ప్రాజెక్టులకు డీపీఆర్ సిద్ధం అయ్యేనాటికి రాష్ట్ర ప్రభుత్వం 50 శాతం భూమిని సేకరించి ఉంటే ప్రాజెక్టును సత్వరమే చేపడతామని మంత్రి మన్సుఖ్ మాండవీయ తెలిపారు. అలాగే ప్రాజెక్ట్ పనులు ప్రారంభించే నాటికి కనీసం 90 శాతం భూసేకరణ జరిగి ఉండాలని కూడా తెలిపారు.

అనర్హత పిటిషన్‌ను సస్పెండ్ చేయండి

- హైకోర్టులో ఎమ్మెల్సీ యాదవరెడ్డి వ్యాజ్యం

హైదరాబాద్,ఆంధ్రప్రభ: తన సభ్యత్వాన్ని రద్దు చేస్తూ జనవరి16 ,2019న తెలంగాణ శాసన మండలి చైర్మన్ స్వామిగౌడ్ జనవరి16 ,2019న జారీ చేసిన అనర్హత పిటిషన్ నంబర్ 1ని సస్పెండ్ చేయాలని, తన స్థానాన్ని ఖాళీగా ప్రకటించి, భర్తీ చేయరాదని కేంద్ర ఎన్నికల సంఘాన్ని (ఈసీఐ) ఆదేశించాలని అభ్యర్థిస్తూ తెరాస ఎమ్మెల్సీ కె.యాదవ రెడ్డి హైకోర్టులో వ్యాజ్యం దాఖలు చేశారు. అలాగే తనకు జీత, భత్యాల చెల్లింపును కొనసాగించేలా పే అండ్ అక్కౌంట్స్ ఆఫీసర్ ను ఆదేశించాలని ఆయన అభ్యర్థించారు. తాను సోనియా గాంధీని కలిసినట్లు, కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా చేసిన ప్రచారం పూర్తిగా నిరాధారమని, అసత్యమని ఆయన పేర్కొన్నారు. ఈ వ్యాజ్యంపై హైకోర్టు మంగళవారం విచారణ చేపట్టే అవకాశం ఉంది.

మోడీతో కమల్‌నాథ్ భేటీ

న్యూఢిల్లీ: మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత కమల్‌నాథ్ మిశ్రా సోమవారం ప్రధానమంత్రి మోడీతో సమావేశం అయ్యారు. పార్ల మెంటులో ప్రధానిని కలిసిన ఆయన పంటబీమా మద్దతు కింద రాష్ట్రానికి రావా ల్సిన రూ. 575.90 కోట్లను త్వరగా విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. దీంతో పాటు మైనింగ్ అనుమతులకు క్లియరెన్స్ ఇవ్వాలని కోరారు. సుమారు 170 మైనింగ్ దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని గుర్తుచేశారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మోడీతో భేటీ కావడం ఇదే తొలిసారి. సుమారు 30 నిము షాల పాటు జరిగిన సమావేశంలో పలు అంశాలపై చర్చిం చారు. ఆయిల్ సీడ్ మద్దతు ధరకు మునుపటి విధానాన్నే కొనసాగించాలని నాథ్ కేంద్రానికి విజ్ఞప్తి చేశారు.

రీనా ఎర... చిక్కిన జయరాం



- పక్కా ప్లాన్‌తో రప్పించుకున్న రాకేష్
- ఒక రోజు నిర్బంధం.. టార్చర్.. కొంత డబ్బు వసూలు
- రెండో రోజు మరికొందరితో కలిసి హత్య
- కారులో కీసరకు తరలింపు.. మరో కారులో అనుసరించిన నిందితుడు
- బెదరింపుల్లో దిట్ట.. ఇప్పటికే రాకేష్‌పై ఎన్నో కేసులు
- దర్యాప్తు ముమ్మరం చేసిన ఏపీ, తెలంగాణ

హైదరాబాద్, ఆంధ్రప్రభ : పారిశ్రామికవేత్త, ప్రవాసాంధ్రుడు చిగురుపాటి జయరాం హత్య కేసులో మిస్టరీ వీడు తోంది. అతడిని హత్య చేసినది శిఖా స్నేహితుడు, పాత నేర స్థుడు రాకేష్ అని పోలీసులు నిర్ధారణకు వచ్చారు. రీనా అనే యాంకర్ పేరుతో సామాజిక మాధ్యమం ద్వారా జయరాంకు వలవేసి... ఇంటికి రప్పించిన రాకేష్ కిడ్నాప్ చేసి... కొంత డబ్బు చేజిక్కించుకున్నా డని, ఇక డబ్బు రాబట్టలేనని భావించిన తరువాత విషపూరిత ఇంజక్షన్ ఇచ్చి హతమార్చాడని తేలినట్లు తెలిసింది. ఈ మేరకు తాను చేసిన హత్య, అందు కోసం వేసిన ప్లాన్, అమలు చేసిన తీరును ఆయన పోలీసులకు పూసగుచ్చినట్లు చెప్పాడని తెలిసింది.

యాంకర్ వలపు వల ఇలా...

జయరాం బలహీనతల ఆధారంగా హత్య చేసేందుకు రాకేష్‌రెడ్డి పక్కా ప్లాన్‌తో ముందుకు వెళ్ళారని, జయరాంను తన ఆధీనంలోకి రప్పించేందుకు గతంలోఆయన టీవీ ఛానల్లో పని చేసిన అమ్మాయిని ఎర వేశాడని పోలీసులు గుర్తించారు. జయరాంకు రీనా అమ్మాయి పేరుతో రాకేష్‌రెడ్డి వల వేశాడని గుర్తించారు. జయరాంకు వ్యాపారం నిమిత్తం రాకేష్‌రెడ్డి ఇచ్చిన నాలు గున్నర కోట్ల రూపాయలను రాబట్టుకునేందుకు ఎన్నిసార్లు ప్రయ త్నించినా జయరాం స్పందించక పోవడంతో చివరకు రీనా అనే అమ్మాయి పేరుతో వాట్సప్ ఛాటింగ్ చేశా డని, అందమైన అమ్మాయి ఫొటోను వాట్సప్ డీపీగా ఉంచాడని పోలీసులు గుర్తిం చారు. రీనా కోరిన విధంగానే జూబ్లీహిల్స్‌లోని ఇంటికి జయ రాం గత నెల 30 వ తేదీన ఒక్కరే వెళ్లడంతో అప్పటికే తన అనుచరులతో సిద్ధంగా ఉన్న రాకేష్‌రెడ్డి బలవంతంగా లోనికి తీసుకు వెళ్ళి డబ్బుల కోసం టార్చర్ పెట్టినట్లు తేలింది.

డబ్బు కోసం జయరాం విఫలయత్నం

ఆ టార్చర్ భరించలేకపోయిన జయరాం కోస్టల్ బ్యాంక్‌లో పని చేసిన ఉమా అనే మహిళతో పాటు తన మేనకోడలు శిఖాచౌదరికి ఫోన్ చేసి డబ్బులు కావాలని కోరినట్లు పోలీసులు గుర్తించారు. శిఖాచౌదరిని రూ. 10 లక్షలు కావాలని కోరగా తన వద్ద లేవని సమా ధానం చెప్పిందని, తర్వాత తన బ్యాంక్‌లో పని చేసిన ఈశ్వరప్రసాద్ అనే వ్యక్తిని డబ్బులు అడుగగా రూ. 6లక్షలు ఇస్తానని చెప్పడంతో అక్కడకు రాకేష్‌రెడ్డి తన అనుచరులను పంపించి తెప్పించుకున్నా డని పోలీసుల విచారణలో రూఢీ అయ్యింది. ఆ తర్వాత రోజు కూడా జయరాంను రాకేష్‌రెడ్డి వేధింపులకు గురి చేశాడని, అయినప్పటికీ డబ్బులు రాకపోవడంతో కిరాయి హంత కుల సహాయంతో విషపు ఇంజక్షన్ ఇచ్చి చంపారని పోలీసుల దర్యాప్తులో వెల్లడైనట్లు సమా చా రం. సుమారు 31 గంటల చిత్రహింసల అనం త రం జయరాంను రాకేష్ రెడ్డి విషపు ఇంజక్షన్ ద్వారా చంపారని తేలింది. తర్వాత జయరాం మృతిపై ఎవ రికీ అనుమానం రాకుండా ఉండేం దుకు కారులో తెలం గాణ రాష్ట్ర సరిహద్దును దాటించారని, శవాన్ని ఒక కారులో తరలించిన రాకేష్ రెడ్డి మరో కారులో దాన్ని అనుసరించారని పోలీసులు ఆయన సెల్ సిగ్నల్ ఆధారంగా గుర్తించారు.

శిఖాచౌదరే చేసుండొచ్చు:రాకేశ్‌రెడ్డి తండ్రి

జయరాం హత్య కేసులో తన కుమారుడి ప్రమేయం ఉండక పోవచ్చని ఈ కేసులో మొదటి ముద్దాయిగా పోలీసులు అనుమానిస్తున్న రాకేష్‌రెడ్డి తండ్రి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. తమకు బతికేందుకు ఎలాంటి ఇబ్బందులు లేవని, అలాగని పెద్ద మొత్తం లోఆస్తిపాస్తులు లేవన్నా రు. జయరాం హత్యకు శిఖా చౌదరి కారణం కావచ్చునని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. శిఖా చౌదరితో తన కుమారుడికి పరిచయం తర్వాత రాకేష్‌రెడ్డి ఇంటికి రావడం మానేశాడని, అంతకు ముందు తమతో బాగానే ఉండేవా డన్నారు. శిఖాచౌదరి తన కుమారుడిని కావాలని ఈ కేసులో ఇరికిస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

రాకేష్‌పై ఎన్నో కేసులు

జయరాం హత్య కేసులో మొదటి ముద్దాయి రాకేష్‌రెడ్డికి నేర చరిత్ర ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. బెదరించి డబ్బులు వసూలు చేసిన నేరంపై రాకేష్‌రెడ్డిపై 2015లోనే కూకట్‌పల్లి పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైనట్లు వెల్ల డైంది. అప్పటి ఎంఎల్ఎలు కేపీ వివేకానంద, మాధ వరం కృష్ణారావుల పేర్లు చెప్పి పలువురి నుంచి రాకేష్ రెడ్డి డబ్బులు వసూలు చేశారని, ఇతడి బాధితుల్లో అరబిందో ఫార్మా నిత్యానం దరెడ్డి క ూడా ఉన్నారని అంటున్నారు. దీపక్ నైట్రేట్, సరస్వతీ కెమికల్స్, వర్చివ్ ల్యాబ్స్ నుంచి లక్షల్లో డబ్బులు వసూలు చేసినట్లు సమాచారం. గ్రీన్‌బావర్చి కళానికేతన్ ఎంపీ లిలాకుమార్‌లను కూడా రాకేష్‌రెడ్డి బెదరించినట్లు పోలీసులు గుర్తించారు.

హత్యకు అసలు కారణం?

జయరాంను పక్కా ప్లాన్ ప్రకారం అంతం చేసిన రాకేష్‌రెడ్డి డబ్బుల కోసం చేశారా? లేక శిఖా చౌదరిని లొంగదీసుకుని తనకు దక్కకుండా చేశారన్న దుగ్ధతో చేశారా అన్న అంశంపై పోలీ సులు దృష్టి కేంద్రీకరించారు. రెండు వివాహాలు చేసుకున్న జయరాం మేనకోడలు శిఖా చౌదరి రాకేష్‌రెడ్డితో కొంతకాలం కలిసి ఉంది. ఆ సమ యంలోనే జయరాం ఆమెను లొంగదీసుకు న్నాడు. దీంతో రాకేష్‌రెడ్డికి శిఖాచౌదరికి గొడ వలు తలెత్తి దూరంగా ఉంటున్నారు. ఈ విష యంలో గతంలో పలు పర్యాయాలు జయ రాంతో రాకేష్‌రెడ్డి గొడవపడ్డట్లు పోలీసులు గుర్తించారు. వ్యాపారం నిమిత్తం రాకేష్‌రెడ్డి వద్ద నాలుగున్నర కోట్ల అప్పు తీసుకున్న జయరాం తర్వాత చెల్లించారని పోలీసుల విచారణలో శిఖా చౌదరి వెల్లడించిన నేపథ్యంలో పోలీసులు ఆర్థిక లావాదేవీలే హత్యకు కారణం కాదేమో అన్న కోణంపై దృష్టి పెట్టి దర్యాప్తును వేగం చేశారు. జయరాంకు నాలుగున్నర కోట్ల అప్పు ఇచ్చేంత ఆర్థిక స్థోమత రాకేష్‌రెడ్డికి ఉందా అన్న అంశంపై ఆయన తండ్రి శ్రీనివాస్‌రెడ్డిని పోలీసులు ఆరా తీస్తున్నారు. ఇదిలాఉండగా జయరాం హత్య కేసు నేడో రేపో హైదరాబాద్‌కు బదలీ చేసే అవకా శాలున్నాయన్న ఉద్దేశ్యంతో మాదాపూర్ పోలీ సులు కేసు దర్యాప్తును ప్రారంభించారు. సోమ వారం మాదాపూర్ పోలీసులు జయరాం ఇంటికి వెళ్ళి వివరాలను సేకరించారు. జయరాం భార్య పద్మశ్రీ నుంచి స్టేట్‌మెంట్‌ను రికార్డు చేశారు. శిఖాచౌదరి క్రిమినల్ మెంటాలిటీ అని, జయరాం హత్య వెనుక ఆమె హస్తం ఉండి ఉంటుందని పద్మశ్రీ పోలీసులకిచ్చిన వాంగ్మూలంలో తెలిపారు.

పోలీసుల ప్రమేయం?

- రాకేష్ కాల్‌డేటా ఆధారంగా సీఐ ఫోన్ నెంబర్ నిర్ధారణ
- నగర సీపీకి సమాచారం అందించిన కృష్ణా జిల్లా ఎస్పీ
- సీఐ శ్రీనివాస్‌పై సస్పెన్షన్ వేటు

పారిశ్రామికవేత్త చిగురుపాటి జయరామ్ హత్యకేసులో తెలుగు రాష్ట్రా ల్లో పనిచేస్తున్న పలువురు పోలీసు అధికారుల ప్రమేయం ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. . ఈ హత్య కేసులో ప్రధాన నిందితుడిగా అనుమానిస్తున్న రాకేష్‌రెడ్డి చిగురుపాటిని హతమార్చిన తర్వాత హైదరాబాద్ నగరం లోని నల్లకుంట పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌తో సెల్ ఫోన్ మంతనాలు జరిపారని, మరికొంతమంది పోలీసు అధి కారులతో కూడా ఆయన మాట్లాడినట్లుగా రాకేష్‌రెడ్డి సెల్ ఫోన్ కాల్‌డేటా ఆదారంగా బయటపడిందని ప్రచారం జరుగుతోంది. ఈకేసును దర్యాప్తు చేస్తున్న కృష్ణాజిల్లా నంది గామ పోలీసులు నల్లకుంట ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ వ్యవహా రాన్ని హైదరాబాద్ నగర పోలీస్ కమీషనర్ దృష్టికి తేగా వెం టనే రంగంలోకి దిగిన ఆయన శ్రీనివాస్‌పై బదిలీవేటు వేశా రు. నగరంలో పనిచేస్తున్న మరికొంతమంది పోలీస్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలతో రాకేష్‌రెడ్డికి సత్సంబంధాలు ఉండే అవకాశాలు ఉన్నాయని అనుమానిస్తున్న కృష్ణాజిల్లా పోలీసులు ఆ దిశగా కూపీ లాగే ప్రయత్నిస్తున్నారు. గతంలో జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, గచ్చిబౌలి, రాయదుర్గం, మాదాపూర్, చందానగర్, కుకట్‌పల్లి, జీడిమెట్ల పోలీస్ స్టేషన్‌లో పనిచేసిన అధికారులతో రాకేష్‌రెడ్డికి స్నేహ సంబంధాలు ఉన్నాయని కొంతమంది అధికారులు రాకేష్‌రెడ్డి నిర్వహించిన పలు వ్యాపారాల్లో పెట్టుబడులు కూడా పెట్టారని అనుమానిస్తున్నారు. జయరామ్ హత్యకేసులో ప్రధాన ముద్దాయిగా భావిస్తున్న రాకేష్‌రెడ్డిని లోతుగా విచారిస్తున్న కొద్దీ అనేక కొత్త విషయాలు బయ టపడటంతో ఈ హత్యకేసులో ఇంకెంతమంది ఉన్నారనే కోణంలో పోలీసులు జరుపుతున్న విచారణను ముమ్మరం చేసినట్లు తెలుస్తుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పనిచేసిన కొంతమంది పోలీసు అధికారులు రాష్ట్ర విభజన తర్వాత ఏపీకి వెళ్ళారని, ప్రస్తుతం అక్కడున్న అధి కారులతో రాకేష్‌రెడ్డికి సంబంధాలు ఉన్నట్లుగా అనుమానిస్తున్నారు. ఈ హత్యకేసులో రాకేష్‌రెడ్డి, శిఖా చౌదరి, శ్రీకాంత్‌తో పాటు మరికొంతమంది ప్రమేయం ఉందంటుననారు.



బీజేపీలో ధైర్యమున్న ఒకే ఒక్కడు గడ్కరి

న్యూఢిల్లీ: బీజేపీలో కొంత ధైర్యమున్న ఒకే ఒక్క నాయకుడు నితిన్ గడ్కరి అని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహల్ గాంధీ అన్నారు. గడ్కరీ గారు మీకు అభినందనలు. దయచేసి 1. రాఫెల్ స్కాం, అనిల్ అంబానీ, 2. రైతుల ఇబ్బందులు, 3. రాజ్యాంగ వ్యవస్థల ధ్వంసంపై క ూడా స్పందించాలని గడ్కరీని ఆయన కోరారు. పార్టీ కార్యకర్తలు ఇంటి బాధ్యతలను నిర్వహించిన తర్వాతే పార్టీ, దేశం కోసం పాటుపడాలని గడ్కరీ శనివారం ఓ కార్యక్రమంలో అన్నారు. ఈ వ్యాఖయలను ప్రస్తావిస్తూ రాహుల్ ఈ మేరకు ట్వీట్ చేశారు. రాహుల్ ట్వీట్‌కు గడ్కరీ రిప్లై ఇచ్చారు. నా ధైర్యానికి నీ సర్టిఫికెట్ అవసరం లేదు. ఒక జాతీయ పార్టీ నాయకుడిగా కొనసాగుతున్నారు. మీడియా రిపోర్టులపై ఆధారపడి బీజేపీని విమర్శించడం వింతగా ఉందని గడ్కరీ బదులిచ్చారు. ఈ ట్వీట్‌కు రాహుల్ వెంటనే బదులిచ్చారు. అవునా.. గడ్కరీ గారు. క్షమాపణలు కోరుతున్నాను. అతిముఖ్యమైన విషయం మరచిపోయాను.. అవే ఉద్యోగాలు, ఉద్యోగాలు, ఉద్యోగాలు... అంటూ బదులిచ్చారు. ఇదిలావుండగా నితిన్ గడ్కరీ ఇటివల ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేసి చర్చలకు తెరలేపారు.

ఇంటిని చక్కదిద్దని వాళ్లు...



నాగ్‌పూర్: కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ మరోసారి ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. పార్టీ కార్యకర్తలు మందుగా వారి ఇంటి బాధ్యతలు నిర్వర్తించాలన్నారు. ఎందుకంటే ఇంటిని చక్కబెట్టుకోలేనివాళ్లు దేశాన్ని నడిపించలేరని ఆయన వ్యాఖ్యానించారు. మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో బీజేపీ అనుబంధ విభాగం ఏబీవీపీ నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. . బీజేపీ కోసం, దేశం కోసం పని చేస్తామంటున్న ఓ వ్యక్తిని నువ్వు ఏం పని చేస్తావని, మీ ఇంట్లో ఎంతమంది ఉంటారని ప్రశ్నించాను. భార్య, పిల్లలు ఉన్నారని చెప్పాడు. దుకాణాన్ని నిర్వహించే వాడినని, సరిగా నడవకపోవడంతో దుకాణాన్ని మూసివేశానని చెప్పడంతో అతడికి నేనొకసలహా ఇచ్చాను. ముందు మీ ఇల్లు చక్కబెట్టుకో. పిల్లల్ని సరిగా చూసుకో. ఆ తర్వాత పార్టీ, దేశం కోసం పని చేయమంటూ హితబోధచేశానన్నారు.

ప్రచ్ఛన్నయుద్ధం?



ఐఎన్ఎఫ్ ఒప్పందం నుంచి వైదొలుగుతామంటున్న అమెరికా, రష్యా

- ఒప్పంద ఉల్లంఘన జరిగింది: అమెరికా
- నిరాధార ఆరోపణలు: రష్యా
- పరిస్థితులు ప్రచ్ఛన్న యుద్ధానికి దారితీయనున్నాయా?

మాస్కో/ వాషింగ్టన్: 1980నాటి ప్రచ్ఛన్న యుద్ధ పరిస్థితులు మరోసారి తలెత్తనున్నాయా?.. అగ్రరాజ్యం అమెరికా, రష్యా మరోసారి ప్రపంచ దేశాలను కలవరపెట్ట నున్నాయా?.. అనే సందేహాలు ఉత్పన్నమవుతున్నాయి. దీనికి కారణం రెండు దేశాల దుందుడుకు వైఖరే. ప్రచ్ఛన్న యుద్ధానికి ముగింపు పలుకుతూ 1987లో అమెరికా, సోవియట్ యూనియన్ మధ్య ఇంటర్‌మీడియట్-రేంజ్ న్యూక్లియర్ ఫోర్సెస్ ట్రీటీ(ఐఎన్ఎఫ్) కుదిరింది. కీలకమైన ఈ ఒప్పందం నుంచి వైదొలగుతామని ఇరు దేశాలు ప్రకటించి ఆందోళనలకు కారణమయ్యాయి. ఒప్పందానికి విరుద్ధంగా రష్యా సరికొత్త క్రూయిజ్ మిసైల్ నొవెటర్ 9ఎం729 క్షిపణిని మోహరించిందని అమెరికా ఆరోపిస్తోంది. నిబంధనలు ఉల్లంఘించిందని చెబుతోంది. ఈ ఆరోణలను రష్యా ఖండించింది.

6 మాసాల్లో తేల్చాలి

అమెరికా కోరిన విధంగా పరిశీలించి క్రూయిజ్ మిసైళ్లను ఆరు నెలల్లోగా ధ్వంసం చేయకపోతే ఒప్పందం నుంచి వైదొలగుతామని అమెరికా సెక్రటరీ ఆఫ్ స్టేట్ మైక్ పొంపియో డిమాండ్ చేశారు. రష్యా ఒప్పందాన్ని ఉల్లంఘించిందన్నారు. కానీ అమెరికా ఆరోపణలను రష్యా కొట్టిపారేసింది. తాము ఎలాంటి నిబంధనలను ఉల్లంఘించలేదని చెబుతోంది. ఇస్కాండర్-ఎం అనే క్షిపణి వ్యవస్థను మోహరించాం. ఈ క్షిపణి పరిధి కేవలం 480 కి.మీ అని రష్యా అధికారి చెబుతున్నారు. ఒప్పందాన్ని విరమించుకునేందుకే అమెరికా ఈ ఆరోపణలు చేస్తోందని అధికారి వ్యాఖ్యానించారు.

ఒప్పంద ఉల్లంఘన జరిగింది: ట్రంప్

1987లో కుదిరిన ఐఎన్ఎఫ్ ఒప్పందాన్ని రష్యా ఉల్లఘించిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శుక్రవారం ప్రకటిం చారు. ఒప్పం దానికి విలువ ఇవ్వకుండా నిషేధిత క్షిపణులను పశ్చిమ యూరప్ లక్ష్యంగా మోహరించిందని ఆయన ఆరోపించారు. రష్యా ముఖ్యమైన ఒప్పందాన్ని ఉల్లంఘిస్తోంది. భూఉపరితల ఆధారిత క్రూయిజ్ మిసైళ్లు, బాలిస్టిక్ మిసైళ్లను యూరప్‌లోని భూభాగంలో రష్యా మోహరించింది. రష్యా చర్యలకు ధీటుగా అమెరికా ముందుకు వెళ్తుంది. క్రూయిజ్ మిసైళ్లను రష్యా తయారు చేస్తోంది. ఐఎన్ఎఫ్ ఒప్పందానికి విరుద్ధంగా 500 కి.మీ-5000 కి.మీ రేంజ్ కలిగిన ఆయుధాలను మోహరిస్తోంది.

వైదొలుగుతాం.. కానీ: పుతిన్

అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యలను రష్యా అధ్యక్షుడు పుతిన్ తీవ్రంగా ఖండించారు. ఒప్పందం నుంచి వైదొలగేందుకే అమెరికా ఈ వ్యాఖ్యలు చేస్తోందన్నారు. రష్యాపై అమెరికా నిరాధారమైన ఆరోపణలు చేస్తోందని శనివారం కొట్టి పరేశారు. అణ్వాయుధాల నియంత్రణ ఒప్పందం నుంచి వైగొలగుతాం. కానీ న్యూక్లియర్ క్షిపణులను అమెరికా మోహరించినప్పుడే తాము కూడా మోహరిస్తుందన్నారు. ఒప్పందం నుంచి ఆరు నెలల్లోగా వైదొలగుతామని అమెరికా నోటిసులు ఇస్తే రష్యా కూడా వైదొలగుతుంది. ఆయుధాల అభివృద్ధి, పరిశోధన జరుపుతా మమని అమెరికా అధ్యక్షుడు అన్నారు. మేము కూడా తదనుగు ణంగానే వ్యవహరిస్తాం. భూఉప రితలంపై మోహరించే ఇంటర్‌మీడియట్ క్షిపణుల తయారీకి ఆదేశాలు జారీ చేశామని పుతిన్ వెల్లడించారు.



చర్చలకు సిద్ధం : రష్యా

ఇరుదేశాధ్యక్షుల వ్యాఖ్యల నేపథ్యంలో రష్యా రక్షణ మంత్రిత్వశాఖ ఒకశాటిలైట్ చిత్రాన్ని విడుదల చేసింది. అమెరికాలోని ఆరిజోనాలో క్షిపణులను తయారీ కేంద్రం రేథోన్స్‌ను ఈ శాటిలైట్ చిత్రాల్లో చూపించింది. 2017 నుంచి ఈ కేంద్రాన్ని విస్తరిస్తున్నారని పేర్కొంది. ఇంటర్‌మీడియట్ రేంజ్ మిసైళ్లను రూపొందిస్తున్నారు. ఐఎన్ఎఫ్ ఒప్పందం నుంచి విరమించుకోవాలనే ఉద్దేశ్యంతో అమెరికా క్షిపణులను రూపొందిస్తోంది. ఈ చిత్రాల ద్వారా ఆ విషయం స్పష్టమయిందన్నారు. ఈ కారణంతోనే రష్యాపై నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని ప్రకటనలో పేర్కొంది. ఒప్పందంలో లేని ఆయుధాలను నౌకలు, విమానాలపై మోహరించాం. ఈ ఆయుధాలను చూసి అమెరికా ఆరోపణలు చేస్తోంది. చర్చలు జరిపేందుకు రష్యా సిద్ధంగా ఉంది. ఏ నిర్ణయం తీసుకోవాలనే విషయాన్ని అమెరికాకే వదిలేస్తున్నాం. ఈ సమస్యపై చర్చించేందుకు అమెరికా సిద్ధంగా ఉందోలేదో వేచిచూస్తామని అధ్యక్షుడు పుతిన్ అన్నారు.

అసలేంటి ఐఎన్ఎఫ్ ఒప్పందం..

1980లో ప్రచ్ఛన్న యుద్ధానికి ముగింపు పలికేందుకు ఇరు దేశాల మధ్య 1987లో ఇంటర్‌మీ డియట్ రేంజ్ న్యూక్లియర్ ఫోర్సెస్ (ఐఎన్ఎఫ్) ఒప్పందం జరిగింది. అప్పటి అమెరికా అధ్యక్షుడు రొనాల్డ్ రేగాన్, సోవియట్ నాయకుడు మిఖైల్ గోర్బాచెవ్ ఒప్పందంపై సంతకాలు చేశారు. 500 కి.మీ నుంచి 5000 కి.మీ రేంజ్ కలిగిన భూఉపరితల అణ్వాయుధ మిసైళ్లను రష్యా, రష్యాలు తయారు చేయకూడదు. మోహరించకూడదు. 1980లో కుదిరిన ఐఎన్ఎఫ్ ఒప్పందంతో ఈ వివాదానికి పరిష్కారం లభించింది. కీలకమైన ఈ ఒప్పందం నుంచి వైదొలగుతున్నామని ఇరుదేశాలు వ్యాఖ్యానించడంతో ఆనాటి ప్రచ్ఛన్న యుద్ధం పునరావృత్తం అవుతుందేమోననే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. తాజా పరిణామాలపై నాటో దేశాలు అమెరికాకు మద్దతిస్తున్నాయి. ఒప్పందం నుంచి వైదొలవద్దని, ఒప్పందాన్ని కొనసాగించాలని రష్యాను కోరుతున్నాయి.

1980లో జరిగింది ఇది

యూరప్‌లో అణ్వాయుధ సామర్థ్యం కలిగిన మూడు ఎస్ఎస్-22 అనే క్షిపణులను సోవియట్ యూనియన్ మోహరించడం ప్రచ్ఛన్నయుద్ధానికి కేంద్ర బిందువయింది. సోవియట్ చర్యకు ప్రతిచర్యగా క్రూయిజ్, పెర్షింగ్2 అనే మిసైళ్లను యూరప్‌లో అమెరికా మోహరించింది. నిమిషాల్లోనే లక్ష్యాలను ఛేదించే విధంగా మిసైళ్లను మోహరించాయి. దాడులు చేస్తామంటూ ఇరు దేశాలు హెచ్చరికలు జారీ చేసుకున్నాయి. దీంతో అప్పట్లో ప్రపంచ వ్యాప్తంగా ఆందోళనలు వ్యక్తమయ్యాయి. అణుదాడులు జరుగుతాయనే అనుమానాలు వ్యక్తమయ్యాయి.

భాజపా 'బోస్' అస్త్రం!

- ఎన్డీఏ కొత్త వ్యూహం?
- స్వాతంత్ర్య సమరయోధుల వారసత్వాన్ని అందిపుచ్చుకునేందుకు పావులు
- బెంగాల్‌లో గణనీయమైన స్థానాలను గెలుచుకోవడమే లక్ష్యం
- రాజకీయ విశ్లేషకుల అంచనా..

న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికలు మూడు నెలల్లోనే జరగనున్న నేపథ్యంలో అధికార బీజేపీ కొత్త అస్త్రాలను సిద్ధం చేస్తోందా?. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు, బడ్జెట్ ద్వారా రైతులు, ఇతర వర్గాలకు తాయిలాలతోపాటు మరో పదునైన ఆయుధాన్ని ఉపయోగిస్తుందా?. ముఖ్యంగా పశ్చిమబెంగాల్‌లో అధిక స్థానాలను గెలవాలని భావిస్తుం? అనే ప్రశ్నలకు ఔననే సమాధానాలు వస్తున్నాయి. పశ్చిమబెంగాల్‌కు చెందిన ప్రముఖ స్వాతంత్ర్య సమరమోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ పేరును ఎన్డీఏ ప్రభుత్వం ఇటివల బాగా ప్రస్తావిస్తోంది. ప్రధాని మోడీ, బీజేపీ అనుబంధ సంస్థల నాయకులు కూడా బోస్ నామం, సేవలను స్మరించుకుంటున్నారు. ఇదేకోవలో నేతాజీ మ్యూజియాన్ని ప్రధాని మోడీ ఢిల్లీలో ప్రారంభించారు. నేతాజీకి సంబంధించిన కీలకమైన ప త్రాలను కూడా వర్గీకరించారు. బెంగాల్ పర్యటించిన ప్రధాని మోడీ కూడా బోస్ సేవలను స్మరించారు.ఎన్‌డీఏ ప్రభుత్వ నిర్ణయాలు నేతాజీ అనుచరులు, అభిమానులకు ఒకింత ఆనందం కలిగించొచ్చు. అయితే ఇంతకాలం బోస్ పేరును పెద్దగా ప్రస్తావించని బీజేపీ ఇప్పుడు స్మరించుకోవడం ఎన్నికల వ్యూహమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. బెంగాల్‌కు చెందిన సుభాష్ చంద్రబోస్‌ను లెఫ్ట్ పార్టీలు ఆరాధారిస్తాయి. తమ నేతగా కొలుస్తాయి. లెఫ్ట్‌పార్టీలు ఆరాధిస్తున్నా బీజేపీ బోస్ వారసత్వాన్ని అందుపుచ్చుకునేందుకు ప్రయత్నిస్తోందం టున్నారు.



పశ్చిమబెంగాల్‌లో కనీసం 20 లోక్‌సభ స్థానాలను గెలుచుకోవాలని బీజేపీ లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఈ మేరకు ప్రధాని మోడీ, ఇతర నేతలు ర్యాలీలు, సభలు నిర్వస్తున్నారు. బెంగాల్‌కు చెందిన సుభాష్ చంద్రబోస్, రవీంద్రనాథ్ ఠాగూర్‌తోపాటు స్వామీ స్వామీ వివేకానందల పేర్లు, వారి సిద్ధాంతాలను ఉపయో

బెంగాల్‌లో 20 సీట్లు లక్ష్యం

గించుకోవాలని బీజేపీ నేతలు భావిస్తున్నారు. ఈ ముగ్గురి నినాదాలను బీజేపీ నేతలు ఇటీవల తరచుగా ప్రస్తావిస్తున్నారు. నేతాజీ, వివేకానంద సిద్ధాంతాల ద్వా రా బెంగాలీ ఓటర్లను ఆకర్షిం చాలని వ్యూహాలు రచిస్తున్నారు. తద్వారా మోడీ వ్యతిరేక కూటమికి నాయకు రాలినని ప్రకటించుకుంటున్న మమతకు సమాధానం చెప్పటం, అలాగే ఉత్తర ప్రదేశ్‌లో జరగ బోయే నష్టాన్ని తగ్గించు కోవాలని లెక్కలు కడుతున్నారు.

కాంగ్రెస్ తమ వారసులుగా ప్రకటించుకుంటున్న గాంధీ, నెహ్రూ, మద్దతుదారులకు బోస్ సరైన సమాధానమని బీజేపీ, హిందుత్వ శక్తులు భావిస్తున్నాయనే సందేహాలు కలుగుతున్నా యి. మహాత్మగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ క ు ఉన్న కీర్తి బోస్‌కు కూడా ఉంది. కానీ కాంగ్రెస్ నాయకులు అంతగా ప్రాధాన్యమివ్వలేదనే చెప్పాలి.

బోస్ ఆలోచనలు లెఫ్టిస్ట్ ఫార్వర్డ్ బ్లాక్ ఏర్పాటుకు కారణమయ్యాయి. అయినప్పటికీ ఆయనను సొంతం చేసుకునేందుకు బీజేపీ ప్రయత్నిస్తోంది. నేతాజీ జాతీయవాదం, ఆయన దేశభక్తి పార్టీకి సానుకూలంగా మారుతాయని బీజేపీ నేతలు అంచనాలు వేసుకుంటున్నారు. బోస్ నినాదాలు, ఆయనపై ఉన్న అభిమానం బలంగా మారుతుందని నమ్ముతు న్నారు. నెహ్రూ, గాంధీ మద్దతుదారులకు ఇది విరుగుడని అంచనాలు వేస్తున్నారు. రాజకీయాలకు అతీతంగా బోస్ జాతీయవాదం, దేశభక్తి నినాదా లను ఉపయోగించుకోవాల నుకుంటున్నారు. ఇదొక అస్త్రమని విశ్లేష కులు చెబుతున్నారు. ఈ పరిణామాలు ఆర్ఎస్ఎస్, భారతీ య జన సంఘ్ వంటి హిందుత్వ సంస్థలు తమ వైఖరిలో మార్పు తెచ్చు కోవాలని భావిస్తున్నా యని స్పష్టమవుతోందని విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు.

నేను గుజరాత్ సీఎం కావడమే
మా అమ్మకు ఆనందం

నేను గుజరాత్‌లోనే ఉండాలని ఆమె కోరుకుంటుంది
మాతృమూర్తి అనుబంధాన్ని గుర్తుచేసుకున్న మోడీ




న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోడీ తన మాతృమూర్తి హీరాబెన్‌కు సంబంధించిన ఆసక్తికరమైన విషయాన్ని వెల్లడించారు. తాను ప్రధానమంత్రిగా ఎన్నికవడం కంటే గుజరాత్ ముఖ్యమంత్రిగా ఎన్నికవ్వడమే ఆమెకు గొప్ప విషయమని, ఎంతో విలువైనదని అన్నారు. ప్రధానమంత్రిగా ఎన్నికైన తర్వాత మీ అమ్మగారు ఎలా స్పందించారంటూ అనేకమంది నన్ను అడిగారు. కానీ నేను గుజరాత్ ముఖ్యమంత్రిగా ఎన్నికవమే ఆమెకు గొప్పవిషయం. గుజరాత్ ముఖ్యమంత్రిగా ప్రకటించినప్పుడు ఢిల్లీలో ఉన్నాను. ఢిల్లీ నుంచి గుజరాత్ వెళ్లాను. ప్రమాణస్వీకారానికి ముందు తల్లి హీరాబెన్, సోదరుడిని కలవడానికి అహ్మదాబాద్ వెళ్లాను. అప్పటికే నా పేరు, ఫొటోలు మీడియాలో చక్కెర్లు కొడుతున్నాయి. ఇంటివద్ద కోలాహలంగా ఉంది. నేను ముఖ్యమంత్రిని కాబోతున్నానని అమ్మ తెలుసుకుంది. ఇంట్లోకి వెళ్లగా నా వైపు చూస్తూ ఆప్యాయంగా కౌగిలించుకుంది. నేను ఢిల్లీ నుంచి గుజరాత్ రావడమే నాకు గొప్ప విషయమని ఆమె అన్నారు. అది మాతృమూర్తి సహజ స్వభావం. పిల్లలు తన దగ్గరే ఉండాలని కోరుకుంటుంది. సీఎం పదవా లేక ఇంకేదైనా ఉద్యోగం చేస్తున్నామా అనే విషయాలను మాతృమూర్తులు ఆలోచించరు. పిల్లలు తమవద్ద ఉండాలని కోరుకుంటారు. కొడుకుకు చిన్న ఉద్యోగం వచ్చినా ఊరంతా మిఠాయిలు పంచిపెడతారని మోడీ తన మాతృ జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు.



సీబీఐ చీఫ్‌గా శుక్లా బాధ్యతల స్వీకారం

న్యూఢిల్లీ: కేంద్ర దర్యాప్తు సంస్థ(సీబీఐ) నూతన చీఫ్‌గా 1983బ్యాచ్ ఐపీఎస్ అధికారి రిషీకుమార్ శుక్లా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కోల్‌కతా పోలీసులుకు, సీబీఐ అధికారులకు నడుమ చెలరేగిన వివాదం రాజకీ యరూపం సంతరించుకుని కేంద్రం, పశ్చిమబెంగాల్ ప్రభుత్వాల మధ్య వివాదంగా మారింది. ఈ నేపథ్యంలో శుక్లా సీబీఐ నూతన చీఫ్‌గా బాధ్యతలు స్వీకరించారు. సోమవారం ఉదయం బాధ్యతలు స్వీకరించారని సీబీఐ అధికార ప్రతినిధి నితిన్ వాకన్‌కార్ తెలిపారు. కాగా 58ఏళ్ల శుక్లా గతంలో మధ్యప్రదేశ్ డీజీపీగా, కేంద్ర నిఘాసంస్థలో సీనియర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. గొలుసుకట్టు కుంభకోణంలో పశ్చిమబెంగాల్ ప్రభుత్వం పనితీరును సీబీఐ సుప్రీంకోర్టులో సవాల్ చేసిన నేపథ్యంలో శుక్లా పూర్తిస్థాయి సీబీఐ చీఫ్‌గా బాధ్యతలు స్వీకరించారు. కోల్‌కతా పోలీస్ కమిషనర్ రాజీవ్‌కుమార్‌ను ప్రశ్నించడానికి వెళ్లిన సీబీఐ అధికారులను అదుపులోకి తీసుకున్న బెంగాల్ పోలీసుల చర్యలను సీబీఐ తాత్కాలిక చీఫ్ ఎం.నాగేశ్వరరావు ఖండించారు. కోల్‌కతా నగరంలోని సాల్ట్‌లేక్‌సిటీ సీజీవో కాంప్లెక్స్‌లో ఉన్న సీబీఐ కార్యాలయంలో పోలీసులు సోదాలు నిర్వహించటంపై ఆయన దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ ఆదివారం రాత్రి నుంచి ప్రధానమంత్రి నరేంద్రమోడీ, బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా నేతృత్వంలో కేంద్రం రాష్ట్రాల అధికారాలను అణచివేస్తుందని ఆరోపిస్తూ ఆందోళనకుదిగారు. శారదా, రోజ్‌వ్యాలీ కుంభకోణాల్లో కోల్‌కతా పోలీస్ చీఫ్‌ను ప్రశ్నించేం దుకు సీబీఐ అధికారులు ముందుగా సమాచారం ఇవ్వకుండానే రావటంపై మమతా బెనర్జీ తప్పుపట్టారు.

కుంభమేళాలో 10వేల మంది నాగా దీక్షలు



హరిద్వార్/ప్రయాగ్‌రాజ్: ఉత్తరప్రదేశ్‌లో జరుగుతున్న కుంభమేళాలో సోమవారం సుమారు 10వేలమంది నాగాదీక్షలు చేపట్టారు. దీక్షలో భాగంగా గుండుతో కేవలం నడినెత్తిపై పిలకను మాత్రమే ఉంచుకుని తమకు తాము పిండ ప్రదానం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వీరంతా రాత్రిసమయంలో జరిగే పవిత్ర అగ్నిఉత్సవాల్లో పాల్గొని నాగ సాధువులుగా మారతారు. సోమవారం దీక్ష చేప ట్టినవారిలో వేలాదిమందిలో విద్యాధికులు కూడా ఉండటం గమనార్హం. కుంభమేళాలో నాగా సాధువులు ప్రధాన ఆకర్షణగా ఉంటారు. వారి ఆచారంలో భాగంగా చితిలో బూడిదను ఒంటికి రాసుకుని నగ్నంగా సంచరిస్తుంటారు. అఖిల భారతీయ అఖారా పరిషత్ (ఏబీఏపీ) తెలిపిన వివరాలు ప్రకారం 10వేల మంది నాగాదీక్ష తీసుకోనున్నారు. వీరిలో పురుషులతోపాటు మహిళలు కూడా ఉన్నారని ఏబీఏపీ ప్రతినిధులు తెలిపారు. దేశవ్యాప్తంగా ఉన్న 13అఖారాలలో పెద్దదైన జునా అఖారాలో 1100మంది చేరుతున్నట్టు తెలిపారు. మరోవైపు జునా అఖారా ఈ నెలలో ఇతర పెద్ద అఖారాలైన నిరంజనీ, మహానిర్వానీలతో కలిసి భారీ కార్యక్రమాలకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఈ సందర్భంగా జునా అఖారా చీఫ్ కన్వీనర్, ఏబీఏపీ జనరల్ సెక్రటరీ మహంత్ హరి గిరి మాట్లాడుతూ కుంభమేళా సందర్భంగా మరిన్ని ఉత్సవాలు నిర్వహించనున్నామని తెలిపారు. నాగా సాధువులుగా మారాలనుకునేవారికి తీవ్ర వైరాగ్యం ఉండాలని తెలిపారు. నాగా సాధువులకు కులం, రంగు, మతం తదితర ఎటువంటి నిబంధనలు ఉండవని తెలిపారు. ముస్లిం, క్రైస్తవులుతోపాటు ఇతర మతాలవారు క ూడా దీక్ష చేపడతారని ఆయన వెల్లడించారు. డాక్టర్లు, ఇంజినీర్లు వంటి విద్యాధికులు కూడా నాగా సాధువులుగా మారతారని మహంత్ హరి గిరి తెలిపారు. నాగ సాధువులుగా మారాలనుకునేవారిని సంవత్సరాలు పాటు పరీక్షిస్తామని తెలిపారు. జీవితంలో సమస్యలు, నిలకడలేనితనం వల్ల సాధువులుగా మారాలనుకుంటున్నారనేది తీక్షణంగా పరీక్షించి వారు తాము పెట్టిన పరీక్షల్లో నిరూపించుకుంటే దానికి మేము సంతృప్తి చెందితేనే వారు నాగాలుగా మారతారని తెలిపారు.

ట్రంప్.. కిమ్ మరో భేటీకి సన్నాహాలు



సియోల్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ మధ్య మలిదశ చర్చలకు సన్నాహాలు జరుగుతున్నాయి. దీనిపై చర్చించేందుకు అమెరికా ప్రతినిధి స్టీఫెన్ ద.కొరియా ఉన్నతాధికారితో సోమవారం భేటీ అయ్యారు. ఈ విషయాన్ని ద.కొరియా అధ్యక్ష కార్యాల యం వెల్లడించింది. ద.కొరియన్ సరిహద్దు గ్రామం పాన్మున్జోమ్ లేదా ఉత్తర కొరియా రాజధాని పొంగ్యాంగ్‌లో ఈ వారమే ఈ భేటీ ఉండొచ్చని ప్రచారం జరుగుతోంది. అమెరికా ప్రతినిధితో చర్చల విషయాలను కొరియా అధ్యక్ష కార్యాలయం బయటకు వెల్లడించలేదు. గతేడాది ట్రంప్, కిమ్ సింగపూర్‌లో భేటీ విజయవంతమైన విషయం తెలిసిందే. నాటి ఒప్పందం ప్రకారం అణ్వాయుధ స్థావరాలను ఉ.కొరియా ధ్వంసం చేయాలి. కానీ ఒప్పందాన్ని కిమ్ పూరిగా అమలు చేసిన దాఖలాలు కనిపించడం లేదు. గతేడాది జూన్‌లో తీసిన శాటిలైట్ చిత్రాలను బట్టిచూస్తే, కిమ్ అణ్వస్త్రాల నిర్మాణ కార్యక్రమాలు కొనసాగుతున్నట్లే అనిపించింది. సరిహద్దు ప్రాంతంలో ద.కొరియా ప్రతిపాదిత రైల్వే, రోడ్డు ప్రాజెక్టుల తోపాటు ఉ.కొరియా భూభాగంలోని డైమండ్ పర్వత రిసార్ట్‌కు పర్యాటకుల అనుమతి, సంయుక్త సుహృద్భావ చర్యలకు ఈ చర్చల్లో ప్రాధాన్యత ఉంటుందని అధికార వర్గాలు భావిస్తున్నాయి.

మమతపై ఈసీకి బీజేపీ ఫిర్యాదు



న్యూఢిల్లీ: రక్షణశాఖమంత్రి నిర్మలా సీతారామన్ సారథ్యంలోని బీజేపీ సీనియర్ నేతల ఉన్నతస్థాయి బృందం చీఫ్ ఎలక్షన్ కమిషనర్ సునీల్ ఆరోరాను కలిసింది. పశ్చిమబెంగాల్‌లో కొనసాగుతున్న సందిగ్ధ పరిస్థితిని ఆయన దృష్టికి తీసుకెళ్లింది. ముఖ్యమంత్రి మమత బెనర్జీ తీరుపై ఫిర్యాదు చేస్తూ బృందం ఓ లేఖను అందజేసింది. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో తమ పార్టీ కార్యక్రమాల నిర్వహణకు బెంగాల్ ప్రభుత్వం అనుమతి ఇవ్వడం లేదని ఫిర్యాదు చేశారు. బెంగాల్‌లో శాంతియుత వాతావరణలో ఎన్నికలు జరగాలని కోరుకుంటున్నాం. మమత బెనర్జీ ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ పర్యటనకు సంబంధించి హెలికాప్టర్ ల్యాండింగ్ అనుమతి ఇవ్వలేదు. జిల్లా స్థాయి అధికారుల నుంచి ముందుగానే అనుమతి తీసుకున్నాం. కానీ హెలికాప్టర్ ల్యాండింగ్‌కు అనుమతి ఇవ్వలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి అధికారులు మమత బెనర్జీకి సహకరిస్తున్నారు. వారందరినీ తొలగించాలని లేఖలో కోరారు.

ఫిర్యాదు చేసిన అనంతరం మంత్రి నిర్మలాసీతారామన్ మీడియాతో మాట్లాడారు. మమత బెనర్జీకి ప్రజాస్వామ్యంపై నమ్మకంలేదని ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పశ్చిమబెంగాల్‌లో ప్రశాంతమైన వాతావరణాన్ని బీజేపీ కోరుకుంటోందన్నారు. మమత బెనర్జీ రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరిస్తున్నారన్నారు. బంగాల్‌లో బీజేపీ బలపడడాన్ని చూసి తృణమూల్ కాంగ్రెస్ భయపడుతోందని, అందుకే తమ పార్టీ కార్యక్రమాలను అడ్డుకుంటున్నారన్నారు. బెంగాల్‌లో పరిస్థితులను ఎలక్షన్ కమిషన్ తెలుసుకోవాల ఆమె అన్నారు. బెంగాల్‌లో పరిస్థితిని పోల్ పానెల్ తెలుసుకుందని ముఖ్తార్ అబ్బాస్ నక్వీ అన్నారు. తగిన చర్యలు తీసుకోవాలని కోరామని వెల్లడించారు. పశ్చిమబెంగాల్‌లో తమ పార్టీ కార్యక్రమాలను నిర్వహించేందుకు అనుమతి ఇవ్వడంలేదని విమర్శించారు. ఎలక్షన్ కమిషన్‌ను కలిసిన బృందంలో నిర్మలాసీతారామన్, ముఖ్తార్ అబ్బాస్ నక్వీ, భూపెందర్ సింగ్ యాదవ్, ఎస్ఎస్ అహ్లూవాలియా కూడా ఉన్నారు.

వీవీ ప్యాట్ స్లిప్పులు
లెక్కించాల్సిందే

- అవకతవకలకు ఏ మాత్రం చోటివ్వరాదు
- కేంద్ర ఎన్నికల సంఘాన్ని డిమాండ్ చేసిన విపక్ష కూటమి
- ఏ మీట నొక్కినా బీజేపీకే ఓటు : ఆజాద్
- సాంకేతికంగా ముందున్న దేశాలే పేపర్ బ్యాలెట్ ఉపయోగిస్తున్నాయి : ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ (ఈవీఎం)ల పనితీరుపై విపక్ష కూటమి పార్టీలు మరోమారు అనుమానం వ్యక్తం చేశాయి. ఏ బటన్ నొక్కినా బీజేపీకే ఓటు వెళ్తుందని ఆరోపించాయి. సోమవారం సాయంత్రం కేంద్ర ఎన్నికల సంఘం అధికారులతో సమావేశమైన విపక్ష కూటమి నేతలు అనంతరం ఈ వ్యాఖ్యలు చేశారు. ముందుగా తీసుకున్న అపాయింట్మెంట్ ప్రకారం సాయంత్రం గం. 5.30 సమయంలో విపక్ష కూటమి నేతలంతా కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కార్యాలయం చేరుకున్నారు. కాంగ్రెస్ పార్టీ నుంచి గులాం నబీ ఆజాద్, అహ్మద్ పటేల్, మల్లికార్జున ఖర్గే, తెలుగుదేశం పార్టీ నుంచి ఆ పార్టీ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా, తృణమూల్ కాంగ్రెస్ నుంచి డెరెక్ ఓబ్రెయిన్, సీపీఐ ఎంపీ డీ. రాజా, ఆమ్ ఆద్మీ పార్టీ నేత సంజయ్ సింగ్, సమాజ్‌వాదీ పార్టీ నుంచి రామ్‌గోపాల్ యాదవ్, ఆర్జేడీ ఎంపీ ప్రొ. నీరజ్ కుమార్, తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ నేత వైఎస్ చౌదరి (సుజనా చౌదరి), ఎంపీ కనకమేడల రవీంద్ర కుమార్ తదితరులు ఈ సమావేశానికి హాజరయ్యారు. దేశవ్యాప్తంగా ఈవీఎంల పనితీరుపై అనుమానా లున్న నేపథ్యంలో పేపర్ బ్యాలెట్ పద్ధతిని ఉపయోగించాలని, కుదరని పక్షంలో ఈవీఎంతో పాటు విధిగా వీవీప్యాట్ స్లిప్పులను కూడా లెక్కించాల్సిందే నని వారంతా కేంద్ర ఎన్నికల సంఘాన్ని డిమాండ్ చేశారు. ఈవీఎంలపై విపక్ష కూటమి ప్రత్యేక కమిటీ అధ్యయనం చేసి రూపొందించిన నివేదికను ఈసీకి అందజేశారు. ఈవీఎంల విషయంలో మరింత పారదర్శకత అవసరమని, ఆ దిశగా ఈసీ మరిన్ని చర్యలు చేపట్టాలని కోరారు. వీవీప్యాట్ స్లిప్పులను ఈసీ సురక్షితంగా ఉంచాలని కూడా విజ్ఞప్తి చేశారు. అనంతరం కాంగ్రెస్ సీనియర్ నేత గులాం నబీ ఆజాద్ మాట్లాడుతూ ఈవీఎంలో ఏ మీట నొక్కినా ఓట్లు మాత్రం కమలం గుర్తుకే ఓటు వెడుతోందని మరోసారి ఆరోపించారు. ఎవరి ఓటు ఎవరికి వెళ్తుందో తెలియని పరిస్థితి నెలకొందని అన్నారు. నిజానికి తాము క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నప్పుడు అనేక మంది ఈ విషయం చెబుతున్నారని, మా ఓట్లన్నీ మీకే వేశాం అయినా ఎలా ఓడిపోయామో అర్థం కావడం లేదని వారంతా వ్యాఖ్యానిస్తున్నారని ఆయన గుర్తుచేశారు. అందుకే తాము మరింత పారదర్శకంగా, ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికలు నిర్వహించేందుకు పోరాడుతున్నామని తెలిపారు. అనంతరం టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ సాంకేతికంగా మనకంటే అభివృద్ధి చెందిన దేశాల్లో సైతం ఈవీఎంలను ఉపయోగించడం లేదని అన్నారు. ఈవీఎంల పనితీరుపై ప్రజలకు విశ్వాసం కల్పించాల్సిన బాధ్యత ఈసీపై ఉందని, అందుకే తమ కూటమికి చెందిన 23 పార్టీల నేతలు ఎన్నికల కమిషన్‌ను కలిసినట్టు ఆయన వెల్లడించారు. ఈ క్రమంలో ఈవీఎంలతో పాటు కనీసం 50 శాతం వీవీప్యాట్ స్లిప్పులను లెక్కించి సరిపోల్చి చూడాల్సిన అవసరముందని ఆయన అభిప్రాయపడ్డారు. ఇదే విషయంపై ఈసీని కోరామని, సానుకూలంగా నిర్ణయం తీసుకుంటుం దనే నమ్మకం తమకుందని చంద్రబాబు అన్నారు. ఈసీ అంగీకరించకపోతే ప్రజాస్వామ్యయుతంగా ప్రత్యామ్నాయ మార్గాలపై కూడా దృష్టిపెడతామని తెలిపారు.



60 లక్షల నకిలీ ఓటర్లు

- సర్వేల పేరుతో వైసీపీ సానుభూతిపరుల ఓట్లు తొలగించారు
- కేంద్ర ఎన్నికల సంఘాన్ని కలిసిన వైఎస్ జగన్ బృందం



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : ఏపీలో స్వేచ్ఛగా, పారదర్శకంగా ఎన్నికలు జరిగేందుకు కేంద్ర ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో 59.18 లక్షల డూప్లికేట్ ఓట్లను, డబుల్ ఓట్లను సృష్టించారని కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. ఓటర్ల జాబితాలో ఉన్న అవకతవకలను సరిదిద్దాలని డిమాండ్ చేశారు. సోమవారం వైఎస్సార్సీపీ అధినేత జగన్ నేతృత్వంలోని బృందం కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ సునీల్ అరోరాను కలిసింది. ఏపీలో ఓటర్ల జాబితాలో భారీ ఎత్తున అవకతవకలున్నాయని ఫిర్యాదు చేసింది. అనంతరం వైఎస్ జగన్ మీడియాతో మాట్లాడుతూ, ఏపీ ఓటర్ల జాబితాలో పెద్ద సంఖ్యలో దొంగ ఓట్లు చేరుస్తున్నారని చెప్పారు. వైఎస్సార్సిపి సానుభూతిపరుల ఓట్లు తొలగిస్తున్నారని ఆరోపించారు. ప్రజా సాధికార సర్వే, ఆర్టీజీఎస్, పరిష్కార వేదిక, పిరియాడిక్ సర్వేల పేరుతో వివరాలు తెలుసుకుని తమ పార్టీ సానుభూతిపరుల ఓట్లను తొలగిస్తున్నారని వెల్లడించారు. అలాగే సుమారు 59.18 లక్షల నకిలీ ఓట్లను నమోదు చేయించారని తెలిపారు. ఇప్పటికే నాలుగు లక్షల వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుల ఓట్లను తొలగించారని, దీనికోసం ప్రత్యేకంగా ఒక యాప్‌ను కూడా క్రియేట్ చేశారని వివరించారు. నిబంధనలకు విరుద్ధంగా టీడీపీ తన అధికారిక వెబ్‌సైట్లలో ఫొటోలతో కూడిన ఓటర్‌లిస్ట్‌ను ఉంచిందని చెప్పారు. రాజకీయ పార్టీలకు ఎన్నికల సంఘం ఇచ్చే అధికారిక ఓటర్ జాబితాలో కూడా ఓటర్ల ఫొటోలు ఉండవని, కానీ టీడీపీ మాత్రం అనైతికంగా ఫొటోలతో సహా ఓటరు జాబితాను వెబ్‌సైట్‌లో పెట్టి ఓటర్ల వ్యక్తిగత సమాచారానికి భంగం కలిగిస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం పోలీసు యంత్రాంగాన్ని దుర్వినియోగం చేస్తోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆరోపించారు. తన సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులను నిబంధనలకు విరుద్ధంగా కీలక పోస్టుల్లో చంద్రబాబు ప్రమోట్ చేస్తున్నారని ఆరోపించారు. ఒకే సామాజిక వర్గానికి చెందిన 35 మందిని సీఐలు, డీఎస్పీలుగా ప్రమోట్ చేశారన్నారు. ఎన్నడూ లేని విధంగా డీఐజీ లా అండ్ ఆర్డర్ పోస్ట్ సృష్టించి చంద్రబాబు తన సామాజిక వర్గానికి చెందిన ఘట్టమనేని శ్రీనివాస్ రావును నియమించారని ఆరోపించారు.

కోయిలకొండలో...
యుద్ధకాండ

- జిల్లా మార్చొద్దంటూ ఉద్యమం..
- ఘర్షణ.. ఉద్రిక్తత
- నారాయణపేట వద్దు.. మహబూబ్‌నగర్ కావాలంటూ డిమాండ్
- ఆందోళనకారుల రాళ్లదాడి..
- సీఐ పాండురంగారెడ్డి తలకు గాయం
- అదనపు బలగాల తరలింపు.. ప్రస్తుతం ప్రశాంతం





మహబూబ్‌నగర్, ప్రభన్యూస్ బ్యూరో : కొత్తగా ఏర్పాటు చేయబోయే నారాయణపేట జిల్లాలో కోయిలకొండ మండలాన్ని చేర్చవద్దని, ప్రస్తుతం ఉన్న మహబూబ్‌నగర్ జిల్లాలోనే కొనసాగించాలం టూ ఆ ప్రాంత వాసులు చేపట్టిన ఆందోళన సోమవా రం ఘర్షణలకు దారితీసింది. దీంతో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. నడిరోడ్డుపై వంటావార్పు చేస్తూ ప్రజలు ఆందోళనకు దిగడంతో ట్రాఫిక్ నిలిచిపోయిం ది. పరిస్థితి చక్కదిద్దేందుకు రంగంలోకి దిగిన పోలీసులు ఆందోళనకారులను చెదరగొట్టేందుకు ప్రయత్నించడంతో కోపోద్రిక్తులైన ఆందోళనకారులు రాళ్లదాడికి దిగారు.. దీంతో సీఐ పాండురంగారెడ్డి తలకు తీవ్రగాయం కావడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది.. ఎంతకీ ఆందోళనకారులు వినకపోవటం తో అదనపు బలగాలను రంగంలోకి దింపి పలువురిని అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు..

ఇదీ వివాదం

శాసనసభ ఎన్నికల సమయంలో నారాయణపే టను జిల్లాగా ఏర్పాటు చేస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించారు.. దీంతో అధికారంలోకి రాగానే ఆమేరకు చర్య లు ప్రారంభిం చారు. కొత్తగా ఏర్పాటు చేసే నారాయణపేట జిల్లాలో ప్రస్తుత మహబూ బ్‌నగర్ జిల్లా పరిధిలోని కోస్గి, కోయిల్‌కొండ మండ లాలను కలిపేలా జిల్లా అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈ ప్రతిపాదనను కోయిలకొండ వాసులు వ్యతిరేకిస్తు న్నా రు. ప్రజారవాణా సౌకర్యాల పరంగా వారికి మహబూబ్‌నగరే వారికి చేరువగా ఉంటుం ది. ఇప్పుడు నారా యణ పేట జిల్లాకు మారిస్తే ఏపని కోసం జిల్లా కేంద్రానికి వెళ్లాల్సి వచ్చినా దూరా భా రం, వ్యయ ప్ర యాసలు తప్పవని వారు ఆందోళన చెందుతున్నారు. పాలకుల సౌలభ్యం కోసమే జిల్లా , మండలాల విభజనలు చేసున్నారు తప్ప, దీనివల్ల తమకేమీ ఉపయోగం లేదని వారు పెదవివిరుస్తున్నారు. ఇక్కడికి సుదూరంగా ఉన్న నారాయ ణపేటకు వెళ్లిరావడానికి సమయమంతా సరిపో తుందని, ఇక పనులెప్పుడు చేసు కుంటా మని వారు చెబుతున్నారు. అసలు అంతదూరంలోని నారాయణపేటలో కోయిలకొండ, కోస్గి మండలాలను ఎందు కు కలుపుతున్నారని ప్రజలు ప్రభుత్వ అధికారులను, పాలకులను ప్రశ్నించారు. ఈ మేరకు జేఏసీగా ఏర్పడి ఆ ప్రాంత నాయకులు కొంతకాలంగా ఆందోళన నిర్వహిస్తున్నారు. కాగా సోమవారం మహబూబ్‌నగర్ - కోయిల్ కొండ మార్గం లోని దమ్మాయిపల్లి గేటు వద్ద వంటావా ర్పు నిర్వహిం చారు. వంటావార్పు కార్యక్రమంలో భారీ సంఖ్యలో మండలాల ప్రజలు పాల్గొన్నారు. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఎక్కడికక్కడ వాహనాలు నిలిచిపోయాయి.

పోలీసుల లాఠీఛార్జ్.. ఉద్రిక్తత

దమ్మాయిపల్లి ప్రధాన రహదారిపై జరుగుతున్న ఆందోళన కారణంగా ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు కలగడంతో సంబంధిత పోలీస్ సేషన్లకు సమాచారం మేరకు పోలీసు బలగాలతో పాటు పారా మిలటరీ బలగాలు కూడా రంగంలోకి దింపారు. నిరసన కార్యక్రమానికి ఇచ్చిన సమయం అయిపోయిందని, వెళ్లాలని పోలీ సులు పలు విధాలుగా నచ్చజెప్పేందుకు ప్రయత్నించినప్పటికీ ఆందోళ నకారులు వినిపించుకోలేదు. ఇది అదునుగా భావించిన కొందరు ఆందోళన కారులు పోలీసులపై తిరగబడడంతో పోలీసులు లాఠీ ఛార్జ్ చేయక తప్పలేదు. పోలీసులు లాఠీ ఛార్జ్ చేయడంతో ఆగ్రహించిన ఆందోళనకారులు పోలీసులపై రాళ్లు విసరడం ప్రారంభించడంతో పోలీసులు మండల కేంద్రానికి సమాచారంఅందించడంతో భూత్పూర్ సీఐ పాండు రంగారెడ్డి తన టీంతో రంగంలోకి దిగారు. ఆందోళన కారులు విసిరిన రాయి తగలడంతో సీఐ పాండురంగారెడ్డి తలకు బలమైన గాయమైంది. రక్తస్రావం కావడంతో ఆయనను చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇక ఉపేక్షిస్తే ఫలితం లేదని గ్రహించిన పోలీసులు అక్కడ ఉన్న ముఖ్య నేతలను పలువురు యువకులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. జేఏసీ చేపట్టిన ఆందోళన కార్యక్రమంలో ప్రజలు భారీ ఎత్తున పాల్గొనడంతో అక్కడ కొంతమేర ఉద్రిక్తత నెలకొంది. ఇటు ప్రజలకు, అటు పోలీసులకు మధ్య దాదాపు గంటకు పైగానే ఘర్షణ జరిగింది. ఆందోళన జరిగిన ప్రాంతాన్ని ఎస్పీ రెమా రాజేశ్వరి పరిశీలించారు. అక్కడి జరిగిన పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఇకనుంచి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని, మరోసారి ఇలాంటి ఘటనలు పునరావతం కావద్దని పోలీసులను ఆదేశించారు.



గంగా జలాభిషేకం...మహాపూజ
నాగోబా జాతరకు శ్రీకారం

- కెస్లాపూర్‌లో మెస్రం వంశీయుల పూజలు
- భక్తి శ్రద్ధలతో కొత్త కోడళ్ల పరిచయం



ఆదిలాబాద్, ప్రభన్యూస్ బ్యూరో : దక్కన్ పీఠ భూమి గిరిజనులకు ఆరాధ్యదైవమైన నాగోబాకు మెస్రం వంశీయులు అత్యంత భక్తి శ్రద్ధలతో మహాపూజ నిర్వహించారు. సోమవారం రాత్రి నాగోబా ఆలయంలో మెస్రం వంశీయులు సంస్కృతి సంప్రదాయబద్ధంగా పూజా కార్యక్రమం నిర్వహించి నాగోబా జాతరకు శ్రీకారం చుట్టారు. ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కెస్లాపూర్‌లో కొలువై ఉన్న నాగోబా ఆలయాన్ని గంగాజలంతో శుద్ధిచేశారు. పక్షం రోజుల క్రితం కాలినడకన గోదావరి నదికి వెళ్లి తీసుకువచ్చిన గంగాజలాన్ని ఆలయ ప్రాంగణంలోని చెట్టుపై ఉంచిన కలశాన్ని మెస్రం వంశీయులు కొత్త కుండల్లో గోదావరి జలాన్ని ఆలయంలో కి తీసుకువచ్చి ఆలయాన్నంతా శుద్ధిచేశారు. అనంతరం జరిగిన మహాపూజలో పాల్గొన్నారు. నాగోబా సన్నిధిలో భక్త జన సందడి నెలకొని ఉంది. గిరిజన సంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడ్డాయి. మహాపూజ నిర్వహించిన మెస్రం వంశీయులు తమ ఆరాధ్య దైవానికి పూజలు చేసిన అనంతరం ఇతరులను ఆలయంలోకి అనుమతించారు. ఆదివాసుల సంస్కృతి నుంచి అనాదిగా వస్తున్న ఆచారం మేరకు మెస్రం వంశీయుల కొత్త కోడళ్లను నాగోబా సన్నిధిలో పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతకు ముందు నాగోబా ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మికచింతనతో మారుమ్రోగిపో యింది. ఆదివాసీ సంస్కృతి ఉట్టిపడేవిధంగా మహిళలు పురుషులు పూజా కార్యక్రమానికి తరలి వచ్చారు. ఆలయ ప్రాంగణంలోని మర్రిచెట్టు నుంచి మెస్రం కూతుళ్లు , అల్లుల్లు , కోడళ్లు గంగాజలాన్ని ఆలయానికి తీసుకురావడంలో ఆదివాసుల్లో ఉన్న క్రమ శిక్షణను చాటి చెప్పింది. సంప్రదాయబద్ధంగా వారు కుండల్లో నీరు తీసుకువచ్చి అత్యంత భక్తి శ్రద్ధతో నాగోబా ఆలయాన్ని శుద్ధి చేశారు. పంటలు పుష్కలంగా పండాలని ఆయురారోగ్యాలతో ఉండాలని వేడుకుంటూ మెస్రం అల్లుల్లు, బిడ్డలు ఆలయ ప్రాంగణంలో ఉన్న పుట్టను కొత్తగా ఏర్పాటు చేశారు. మెస్రం వంశీయులు తయారు చేసిన పుట్టకు ప్రత్యేక పూజలు చేశారు. నాగోబా సన్నిధిలో నాలుగు రోజుల పాటు జాతర సాగనుంది. ఆదివాసి సంస్కృతిలో అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుని ఉన్న నాగోబా జాతరకు సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ భారీ ఏర్పాట్లు చేసింది. జాతరకు వచ్చే భక్తుల కోసం భారీ ఏర్పాట్లు చేశారు. నాగోబా జాతరకు తెలుగు రాష్ట్రాలే కాకుండా, మహారాష్ట్ర, చత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల నుంచి ఆదివాసులు తరలి రావడం ఆనవాయితీగా వస్తోంది. ఇప్పటికే వివిధ ప్రాంతాల నుంచి మెస్రం వంశీయులు కెస్లాపూర్ చేరుకున్నారు. మెస్రం వంశీయులకు నాగోబా ఆరాధ్య దైవమైనప్పటికి ఆదివాసీ తెగల్లోని వివిధ జాతులు నాగోబాను అత్యంత భక్తిశ్రద్ధలతో కొలుస్తారు. మంగళవారం నుంచి ప్రతీ రోజు వేలాది మంది నాగోబాను సందర్శించనున్నారు. యాత్రికుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సును జాతర వరకు నడిపిస్తున్నారు. జాతరలో తాగునీరు, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించారు. ప్రత్యేకంగా మరుగుదొడ్లు నిర్మించారు. జాతరలో అనేక దుకాణాలు రంగుల రాట్నాలు , వినోదం పంచే సాదనాలు వెలిసాయి. జాతర సందర్భంగా పోలీసులు గత ఏడాది కంటే ఈ ఏడాది భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

సీబీఐ వాదనేంటి?

న్యూఢిల్లీ: చిట్‌ఫండ్ స్కామ్‌లో విచారణ కోసం కోల్‌కొతా వెళ్లిన సీబీఐ అధికారుల విజ్ఞప్తిని అధికారికంగా గుర్తించడానికి కూడా పశ్చిమ బెంగాల్ పోలీసులు తిరస్కరించినట్లు కేంద్ర దర్యాప్తు అధికారి ఒకరు వెల్లడించారు. సీబీఐ అధికారులను షేక్‌స్పియర్ సరాని పోలీస్‌స్టేషన్‌కి తరలించి వారి పరిశోధనా ప్రణాళికను తెలుసుకోవడానికి ఒత్తిడి తెచ్చినట్లు చెప్పారు. కొల్‌కతా పోలీసులు ఉద్దేశపూర్వకంగా, బలవంతంగా భౌతిక బలాన్ని ఉపయోగించి అడ్డుకోవడంతోనే సీబీఐ అధికారులు తమ విధి నిర్వర్తించలేక వెను తిరిగారన్నారు. చిట్‌ఫండ్ స్కామ్ పరిశోధిస్తున్న సిట్‌లో రాజీవ్ కుమార్ సభ్యుడు కావడంతోనే ఆయనను కలవడానికి సీబీఐ మూడు సార్లు రాత పూర్వకంగా ప్రయత్నించిందన్నారు.



రాజీవ్ కుమార్‌కి 3 నోటీసులు...

మొదటి నోటీసు

రాజీవ్ కుమార్‌కి సీబీఐ మొదటి నోటీసును 18, అక్టోబర్, 2017న పంపింది. మరసటి రోజున విచారణకు హాజరు కావాలని ఆ నోటీసులో పేర్కొంటే, పండగ సీజన్ కావడంతో శాంతిభద్రతల పర్యవేక్షణలో ఉన్నందున సాధ్యం కాదని రాజీవ్ కుమార్ సమాధానం చెప్పారు.

రెండవ నోటీసు

రెండవ నోటీసును 23, అక్టోబర్, 2017న కేంద్ర దర్యాప్తు సంస్థ జారీ చేయగా, దానికి కూడా కోల్‌కతా కమిషనర్ రాజీవ్ కుమార్ సాకులు చూపి తప్పించుకున్నారు.

మూడవ నోటీసు

సీబీఐ మూడవ నోటీసును రాజీవ్ కుమార్‌కి 8, డిసెంబర్, 2018న జారీ చేసింది. దీనిపై తాను స్వయంగా హాజరు కావడం సాధ్యపడదని, ప్రశ్నలు పంపితే జవాబులను రాతపూర్వకంగా తెలియచేస్తానని కోల్‌కత్తా కమిషనర్ చెప్పినట్లు సీబీఐ అధికారి ఒకరు వెల్లడించారు. మూడు నోటీసులకు స్పందన కరువవడంతోనే 11 మంది సీబీఐ అధికారుల బృందం వెళ్లిందన్నారు.

కేంద్రం వద్దు.. నిధులూ వద్దు



కేంద్ర దర్యాప్తు సంస్థకి తెలియదు.. చినికి చినికి గాలి వాన అవుతుందని. రోజువారీ దర్యాప్తులో భాగంగా కోల్‌కొత్తా పోలీసు కమిషనర్ తలుపు తట్టి.. దేశంలో పెద్ద గాలి దుమారానికి తెర తీసింది. హాట్ మా పోలీసు కమిషనర్‌ను విచారించడానికి మీరెవ్వరని కోల్‌కతా కాళికలాగా మమతా ఏకంగా వీధికెక్కారు. నగరం నడిబొడ్డున ధర్నాకి దిగారు. ధర్నా ప్రాంతంలోనే పరిపాలన సైతం చేశారు. అధికారులతో భేటీలు నిర్వహించారు. పోలీసులకు అవార్డులు కూడా ప్రదానం చేశారు. సోమవారం సాయంత్రానికి పరిస్థితి మరీ శృతి మించింది. సీబీఐనే కాదు, కేంద్ర నిధులను కూడా బెంగాల్ గడ్డపై అడుగు పెట్టనివ్వనని మమతా శపథం చేశారు. మోడీ ప్రభుత్వ నిధులకు వద్దంటే వద్దని ప్రకటించారు. ఇటు పార్లమెంట్‌లో కోల్‌కొతా ఘటనపై అధికార, విపక్ష సభ్యుల మధ్య వాడీవేడీ చర్చ జరిగింది. రాజ్యాంగబద్ధమైన సీబీఐని అడ్డగించడం సంక్షోభం కిందకు వస్తుందని కేంద్రహోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రకటించారు. మమతా ప్రభుత్వం హద్దులు మీరితే చర్యలు తీసుకోవడానికి కేంద్ర ప్రభుత్వం వెనుకాడదని హెచ్చరికలు జారీ చేశారు. సీబీఐని మోడీ ప్రభుత్వం రాజకీయ అస్త్రంగా వాడుతోందని విపక్ష సభ్యులు మండిపడ్డారు. అటు తృణమూల్ నుంచి బీజేపీలో చేరిన ముకుల్ రాయ్ నేతృత్వంలో కేంద్ర రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్, మరో ఇద్దరు కేంద్ర మంత్రులు ఎన్నికల ప్రధాన అధికారిని కలిసి మమతా సర్కార్‌పై ఫిర్యాదు చేశారు. పశ్చిమ బెంగాల్‌లో ఎన్నికల ప్రచారం చేసుకోకుండా అడ్డుకుంటున్నారని, ప్రజాస్వామ్యం లేదని ఆరోపించారు. ఇటు సీబీఐ సుప్రీం మెట్లు ఎక్కింది. తన విధి నిర్వహణకు బెంగాల్ పోలీసులు అడ్డుపడుతున్నారని, పోలీసు కమిషనర్ రాజీవ్ కుమార్ సాక్ష్యాధారాలు నాశనం చేసే అవకాశముందని తన పిటిషన్‌లో పేర్కొంది. సీబీఐ పిటిషన్‌పై సుప్రీం ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగోయ్ నేతృత్వంలోని ధర్మాసనం నేడు విచారణ చేపట్టనుంది.

ఢిల్లీపై మమత తిరుగుబాటు బావుటా

- ప్రధాని మోడీ ఆదేశాలతోనే.. • అజిత్ దోవల్ కనుసన్నల్లోనే.. సీబీఐ దర్యాప్తు చేస్తోంది.. • కోల్‌కతాలో దీదీ వీధి పోరాటం!

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం ఏకంగా వీధికెక్కింది. సీబీఐతో, కేంద్ర ప్రభుత్వంతో తాడో పేడో తేల్చుకోవడానికి సిద్ధపడిన పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా కులకర్ణి ధర్నా గంటగంటకీ సంచలనంగా మారుతోంది. కోల్‌కత్తాలోని మెట్రో సినిమా థియేటర్ ఎదుట మమతా బెనర్జీ ధర్నా వేదిక జాతీయ రాజకీయాల్లో సంచలనంగా మారుతోంది. దీదీ తన ధర్నాని సత్యాగ్రహంగా అభివర్ణిస్తోంది. ఆదివారం రాత్రి నుంచి నిరవధికంగా ధర్నా చేస్తున్న పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ.. నిరసన వేదికనే సచివాలయంగా మార్చేశారు. ధర్నా వేదిక నుంచే ప్రభుత్వ పరిపాలన సాగించారు. అక్కడే అధికారులతో సమావేశాలు నిర్వహించడం, పాలనకి సంబంధించిన నిర్ణయాలను తీసుకోవడం చేశారు. ధర్నా వేదికనే ప్రభుత్వ పాలనా కేంద్రంగా చేసుకొని మమతా బెనర్జీ ఢిల్లీపై ఏకంగా వీధి పోరాటాన్ని ప్రకటించారు. కోల్‌కొత్తాలోని ఎస్‌ప్లనేడ్ ప్రాంతం మమతాకి కలిసి వచ్చిన ప్రాంతమంటారు. 2006లో ఇక్కడి నుంచే మమతా సింగూర్‌లోని టాటా మోటార్స్ ప్లాంట్‌కి వ్యతిరేకంగా ధర్నా చేశారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా చేస్తున్న తన ధర్నా ఫిబ్రవరి 8 వరకు కొనసాగుతుందని సీఎం మమతా బెనర్జీ ప్రకటించారు. పదవ తరగతి విద్యార్థులకు పరీక్షలు మొదలవుతాయని, మైకుల హోరుతో వారికి ఇబ్బందులు సృష్టిస్తుందన్నారు. తన ధర్నాని సత్యాగ్రహంగా అభివర్ణించిన మమతా బెనర్జీ, చిట్‌ఫండ్ స్కాము పేరుతో ప్రభుత్వాన్ని పడగొట్టడానికి కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని మండిపడ్డారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఆదేశాలకు అనుగుణంగా జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ కనుసన్నల్లో సీబీఐ పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాన్ని పడగొట్టడానికి పన్నాగాలు పన్నుతోందని మమతా ఆరోపించారు.

కేంద్ర నిధులు మాకొద్దు...

రైతులకు పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం సింహభాగం ఖర్చు పెడుతోందని, ఏడాదికి అయిదు వేలు, పింఛన్ కింద వెయ్యి రూపాయిలు ఇస్తోందని, బీమా యోజనలో ఎనభై శాతం తమ ప్రభుత్వమే భరిస్తోందని సీఎం మమతా బెనర్జీ అన్నారు. ఇకపై కేంద్ర ప్రభుత్వ నిధులను తీసుకోరాదని నిర్ణయించినట్లు మమతా ప్రకటించారు. మోడీ ప్రభుత్వ హయంలో 12 వేల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు.

ధర్నా వద్ద రాజీవ్ కుమార్!

పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ధర్నా స్థలంలో కోల్‌కత్తా కమిషనర్ రాజీవ్ కుమార్ కనిపించారు. ఇతర అధికారుల్లో మనో ధైర్యం నింపడానికి ఆయన ప్రయత్నం చేయడం కనిపించింది. ధర్నా ప్రాంతంలోనే సీఎం మమతా బెనర్జీ అధికారులతో సమావేశాలు నిర్వహించారు. మంత్రి వర్గ సమావేశాన్ని సైతం అక్కడే నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వాన్ని మరింత రెచ్చగొట్టేలా పోలీసు అధికారులకు ధర్నా స్థలంలోనే అవార్డుల ప్రదాన కార్యక్రమం నిర్వహించారు. విధుల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన అధికారులకు మమతా అవార్డులు అందచేశారు.

బెంగాల్‌లో బంద్‌లు.. రాస్తారోకోలు



కోల్‌కతా: తమ పార్టీ అధినేత్రికి మద్దతుగా తృణమూల్ శ్రేణులు సోమవారం రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టారు. జాతీయ రహదారులపై బైఠాయించారు. రైలు పట్టాలపైకి చేరుకుని నిరసన తెలిపారు. అనేకచోట్ల ప్రధాని మోడీ, బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షా దిష్టిబొమ్మలను దగ్ధం చేశారు. సీనియర్ నేతలు, మంత్రులు, ఎమ్మెల్యేలు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నార. నల్లబ్యాడ్జిలు ధరించి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తృణమూల్‌విద్యార్థి విభాగం కూడా ఈ నిరసన కార్యక్రమాల్లో పాలుపంచుకుంది. వివిధ కళాశాలలు, యూనివర్సిటీల విద్యార్థులు ర్యాలీలు చేపట్టారు. మోడీ సర్కార్ గద్దె దిగేదాకా మా పోరాటం ఆగదంటూ గర్జించారు. బుర్ద్వాన్, తూర్పు పురులియా, బిర్భుమ్, దక్షిణ 24 పరగణ జిల్లాలు, ఉత్తర 24 పరగణ జిల్లాల్లో ర్యాలీలు ఉధృతంగా జరిగాయి. హౌరా, హుగ్లీ జిల్లాల్లో పలు రైళ్లను ఆందోళన కారులు అడ్డుకున్నారు. బంకుర జిల్లాల్లో సాయంత్రం దాకా జాతీయ రహదారిపై రాకపోకలను స్తంభింపజేశారు. జనజీవనానికి అసౌకర్యం కలగకుండా మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల మధ్య నిరసన ర్యాలీలు చేపట్టాలని స్వయానా మమతా బెనర్జీ పార్టీ నేతలకు సూచించారు.



ధర్నా స్థలం పక్కనే ఉన్న పోలీస్ ఔట్‌పోస్టులో కేబినెట్ భేటీ నిర్వహించిన పశ్చిమ బెంగాల్ సీఎం మమతా

కోల్‌కతా ప్రకంపనలు

- ఉభయసభల్లో టీఎంసీ ఎంపీల ఆందోళన • మద్దతు పలికిన కాంగ్రెస్, టీడీపీ సహా విపక్షాలు
- పశ్చిమ బెంగాల్‌లో రాజ్యాంగ సంక్షోభమే: రాజ్‌నాథ్





న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : పశ్చిమబెంగాల్‌లో సీబీఐ వ్యవహారంపై పార్లమెంటు ఉభయసభలు దద్దరిల్లాయి. కోల్‌కతాలో సీబీఐకి, పశ్చిమబెంగాల్ పోలీసులకు మధ్య జరిగిన పరిణామాలపై చర్చించాలని తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ఎంపీలు ఉభయసభల్లో ఆందోళనకు దిగారు. వీరికి విపక్ష పార్టీలు మద్దతు పలకడంతో సభా కార్యక్రమాల వాయిదా పడ్డాయి. సోమవారం ఉదయం లోక్‌సభ సమావేశం కాగానే టిఎంసి ఎంపీలు నినాదాలు చేస్తూ స్పీకర్ పోడియం వద్దకు దూసుకెళ్లారు. వీరికి మద్దతుగా కాంగ్రెస్, టీడీపీ, ఆర్జెడి, ఎస్పీ సహా పలు విపక్ష పార్టీలు వెల్‌లోనిరసన తెలిపాయి. ప్రశ్నోత్తరాల సమయం పూర్తి కాగానే ఈ అంశంపై మాట్లాడేందుకు అనుమతి ఇస్తానని స్పీకర్ సుమిత్రా మహాజన్ తెలిపారు. సభ్యులను తమ సీట్లలోకి వెళ్లి కూర్చోవాలని పదేపదే విజ్ఞప్తి చేశారు. సభ్యుల నినాదాల మధ్య కొంతసేపు ప్రశ్నోత్తరాల సమయాన్ని కొనసాగించారు. అనంతరం సభను కొద్దిసేపు వాయిదా వేశారు.

పశ్చిమబెంగాల్ అంశం పై హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ లోక్‌సభలో ప్రకటన చేశారు. పశ్చిమబెంగాల్ పోలీసులు ప్రవర్తించిన తీరు సమాఖ్య వ్యవస్థకే ప్రమాదకరమని హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. సీబీఐ అధికారు లను కోల్‌కతా పోలీసులు అరెస్ట్ చేయడం రాజ్యాంగ సంక్షోభానికి దారితీస్తుందన్నారు. సీబీఐ అధికారుల విధులను పోలీసులు అడ్డుకోవడం చట్ట విరుద్ధమని అన్నారు. రాజ్యాంగబద్ధంగా పరిపాలన జరపాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ అంశంపై తాము గవర్నర్ నుంచి సవివర నివేదిక కోరామని లోక్‌సభలో గందర గోళం మధ్య వెల్లడించారు. శారదా చిట్‌ఫండ్ కుంభకోణంలో కోల్‌కతా పోలీస్ కమిషనర్ దర్యాప్తుకు సహకరించకపోవడం వల్లే సీబీఐ ఈ చర్యలు తీసుకుందన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకే సీబీఐ ఈ కేసు దర్యాప్తు చేస్తోందని చెప్పారు. ఈ కేసులో రాజకీయ నాయకులకు, ప్రముఖ వ్యక్తులకు మధ్య సంబంధాలున్నాయని చెప్పారు. కేంద్ర , రాష్ట్ర పోలీసు వ్యవస్థలు ఘర్షణకు దిగడం దురదృష్ట కరమని అన్నారు. రాష్ట్ర పోలీసులు సీబీఐ ఆఫీసులు, అధికారుల నివాసాలు చుట్టుముట్టడం వల్లే కేంద్ర బలగాలను రంగంలోకి దింపామని చెప్పారు. సీబీఐ దర్యాప్తు విధులు నిర్వర్తించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతించాలని విజ్ఞప్తి చేశారు. అంతకుముందు టిఎంసి ఎంపీ సౌగతరాయ్ లోక్‌సభలో మాట్లాడుతూ, ప్రతిపక్షాలను అణిచివేసేందుకు సీబీఐని రాష్ట్రంపై ఉసిగొల్పుతోందన్నారు. సీబీఐ చర్యలతో రాజ్యాంగ సంక్షోభానికి దారితీస్తోందన్నారు. ఇటీవల టిఎంసి నిర్వహించిన ర్యాలీలో బీజేపీలో వణుకు పుట్టిందన్నారు. ఎటువంటి ఆదేశాలు లేకుండా సీబీఐ తమ పోలీస్ కమిషనర్ నివాసానికి చేరుకుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం సీబీఐని దుర్వినియోగం చేస్తోందని ఆరోపించారు.

ప్రతిపక్షాలను అణిచివేసేందుకు సీబీఐని కేంద్రం ఒక ఆయుధంలాగా ఉపయోగించుకుంటోందని కాంగ్రెస్ పక్ష నేత మల్లికార్జున ఖర్గే లోక్‌సభలో అన్నారు. అయితే ఈ ఒత్తిళ్లకు ప్రతిపక్షాలు భయపడే పరిస్థితి లేదన్నారు. సీబీఐ విశ్వసనీయతను ప్రశ్నార్థకంలో పడిందని, అధికార పార్టీకి తొత్తుగా పనిచేస్తోందని బీజేడీ ఎంపీ భర్త హరి మెహతాబ్ అన్నారు. ఇటు రాజ్యసభలోనూ ఇదే పరిస్థితి ఉత్పన్నమైంది. సీబీఐ వ్యవహరిస్తున్న తీరుపై రాజ్యసభలో టిఎంపి సహా విపక్షాలు వెల్‌లోకి దూసుకెళ్లి నిరసన తెలిపాయి. కేంద్రానికి, సిబిఐకి వ్యతిరేకంగా టిఎంసీ ఎంపీలు నినాదాలు చేశారు. అటు బిజెపి ఎంపీలు తమ స్థానాల్లో నిలబడి విపక్ష పార్టీల ఎంపీల తీరును తప్పుపట్టారు. దాంతో సభ పదే పదే వాయిదా పడింది. మధ్యాహ్నం తర్వాత సభ మంగళవారానికి వాయిదా పడింది.

సుప్రీం మెట్లెక్కిన సీబీఐ

శారదా చిట్‌ఫండ్ కేసు విచారణకు పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం నుంచి సహకారం కరువైందని సీబీఐ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. కోల్‌కత్తా కమిషనర్ రాజీవ్ కుమార్‌ను విచారించడానికి వెళ్లిన తమకు మమతా సర్కార్ చుక్కలు చూపించిందని పేర్కొంది. గత రెండు సంవత్సరాలుగా శారదా చిట్‌ఫండ్ కుంభ కోణానికి సంబంధించి సీబీఐ కోల్‌కొత్తా కమిషనర్ రాజీవ్ కుమార్‌కి సమన్లు పంపుతోందని, అయినా స్పందన కరువైందని సుప్రీంకోర్టు దృష్టికి తీసుకెళ్లింది. కుంభకోణాల్లో సాక్ష్యాధారాలను రాజీవ్ కుమార్ నాశనం చేస్తారని పిటిషన్‌లో పేర్కొంది. దీనిపై సుప్రీం ధర్మాసనం నేడు విచారణ చేపట్టనుంది.

దీదీ దేనికి భయం?



న్యూఢిల్లీ: పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ దేన్ని చూసి భయపడుతున్నారని కేంద్రమంత్రి ప్రకాశ్ జవదేకర్ ప్రశ్నించారు. విచారణ నుంచి ఆమె ఎందుకు పారిపోతున్నారన్నారు. సాక్ష్యాలను వారు దాచి పెట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. చిట్‌ఫండ్ కుంభకోణంలో నిందితుడు ఒకరు ఒక ఎర్ర డైరీ ఉందని వెల్లడించారని జవదేకర్ చెప్పారు. కుంభకోణాల వివరాలున్న డైరీ, పెన్ డ్రైవ్ కోల్‌కొత్తా పోలీసుల వద్ద ఉందన్నారు. పశ్చిమ బెంగాల్‌లో చిట్‌ఫండ్ స్కాములపై విచారణ జరిపించాలని కాంగ్రెస్ పార్టీ సుప్రీంకోర్టులో పిటిషన్ వేసిన విషయాన్ని మరవరాదన్నారు. దీంతో చిట్‌ఫండ్ కుంభకోణాలపై దర్యాప్తుకి సుప్రీంకోర్టు ఆదేశించిందన్నారు. పశ్చిమ బెంగాల్‌లో రాజ్యాంగ యంత్రాంగం పూర్తిగా విఫలమైందని జవదేకర్ అన్నారు. పశ్చిమ బెంగాల్‌లో ఎమర్జన్సీ వాతావరణం ఉందని మమతా అనడం హాస్యాప్పదమని జవదేకర్ చెప్పారు. ఇది ప్రధాని మోడీ విధించిన ఎమర్జెన్సీ కాదని, మమతా బెనర్జీ స్వయంగా అత్యాయిక పరిస్థితి సృష్టించారన్నారు. సీబీఐ నుంచి తప్పించుకోవడానికే మమతా బెనర్జీ ధర్నాకి దిగిందని కేంద్రమంత్రి జవదేకర్ మండిపడ్డారు. ఒక పోలీసు అధికారిని కాపాడడానికి సీఎం పదవిలో ఉన్న మమతా బెనర్జీ ఎందుకు ధర్నా చేస్తున్నారని మరో కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ ప్రశ్నించారు. కోల్‌కత్తాలో సీబీఐ అధికారుల రక్షణ కోసం పారా మిలటరీని రంగంలోకి దించాల్సి వచ్చిందని, దీన్ని బట్టే పశ్చిమ బెంగాల్ పరిపాలన ఎంత అరాచకంగా ఉందో తెలుస్తోందన్నారు.


సీబీఐ కరెక్టే అయినా..!

చెన్నై: తమిళనాడులో అధికారంలో ఉన్న ఏఐఏడీఎమ్‌కే కొల్‌కత్తా పరిణామాలపై ఆచీతూచీ వ్యవహరించింది. కేంద్ర దర్యాప్తు సంస్థకి విచారించే అధికారముందని, దాన్ని అడ్డుకోవడం సముచితం కాదన్న తమిళనాడు మత్స్యశాఖ మంత్రి జయకుమార్.. అయితే దాని కోసం ఒక విధానాన్ని అవలంభించడం అవసరమన్నారు. నిజానిజాలు వెలికి తీయడానికి సీబీఐ తన విద్యుక్తధర్మం తాను చేస్తోందన్నారు. ఏదీ ఏమైనా సీబీఐకి అధికారముందని, దేన్నైనా పరిశోధించడం, ఎవరినైనా విచారించేశక్తి ఉందని, వారి పని వారు చేస్తున్నారని అన్నారు. ప్రతి ఒక్కరికి రాజ్యాంగంలో వెసులుబాటు ఉందని, వారి అధికార పరిధిలో వారు వ్యవహరిస్తుంటే అందులో తప్పుబట్టడానికి ఏమీ లేదన్నారు. ఎవరైనా తమ అధికారాన్ని అతిక్రమిస్తేనే అది తప్పవుతుందన్నారు.

ఇది విపక్షాల ధర్నా!

కోల్‌కత్తా: మమతా ధర్నాకి దేశవ్యాప్తంగా విపక్షల నుంచి మద్దతు పెరుగుతోందని తృణమూల్ అధికార ప్రతినిధి డెరెక్ ఓ బ్రియన్ చెప్పారు. మమతా ధర్నాకి ఢిల్లీ సీఎం అరింద్ కేజ్రీవాల్, ఏపీ సీఎం చంద్రబాబునాయుడు, ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్, డీఎమ్‌కే నేత కనిమొళితో సహా 22 పార్టీలు మద్ధతు ప్రకటించాయన్నారు. మమతా ధర్నాకి తాము కూడా హాజరవుతామని ఆసక్తి ప్రదర్శించారన్నారు. పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ఆదివారం రాత్రి 8.30 నుంచి ధర్నా చేస్తున్న విషయం తెలిసిందే. మమతా చేస్తున్న ధర్నా తృణమూల్ పార్టీకి సంబంధించింది కాదని బ్రియన్ చెప్పారు. ధర్నా స్థలంలో ఒక్క తృణమూల్ పార్టీ జెండా కూడా ఎగరడం లేదన్నారు. విపక్షాలన్నీ ఏకతాటిపైకి వచ్చాయన్నారు. మమతా బెనర్జీకి కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ, బీఎస్పీ అధినేత మాయవతి, ఎస్పీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ తదితరులు ఫోన్లు చేసి పరామర్శించారని బ్రియన్ వెల్లడించారు.





న్యూజిలాండ్‌కు షాక్..

టీ20 సిరీస్‌కు మార్టిన్ గప్టిల్ దూరం



వెల్లింగ్టన్ : న్యూజిలాండ్‌కు మరో షాక్. సీనియర్ కీవిస్ ఓపెనర్ మార్టిన్ గప్టిల్ భారత్‌తో జరిగే మూడు టీ20 మ్యాచ్‌ల సిరీస్‌కు దూరం అయ్యాడు. వెన్నునొప్పి నుంచి ఇంకా కోలుకోకపోవడంతో న్యూజిలాండ్ క్రికెట్ బోర్డు ఈ నిర్ణయం తీసుకుంది. గప్టిల్ స్థానంలో ఆల్ రౌండర్ జిమ్మి నీషమ్‌ను జట్టులోకి తీసుకున్నారు. జిమ్మికి భారత్‌తో జరిగిన చివరి రెండు వన్డేల్లో ఆడిన అనుభవం ఉంది. న్యూజిలాండ్ కోచ్ గేరి స్టీడ్ మాట్లాడుతూ.. టీ20 సిరీస్‌కు మార్టిన్ దూరం కావడం బాధాకరమని, అనుకున్న సమయానికి గాయం నుంచి కోలుకోలేకపోయాడని అన్నారు. ఐదు రోజుల్లో భారత్‌తో కీవీస్ మూడు టీ20 మ్యాచులు ఆడనుందని తెలిపారు. వన్డే, టీ20ల్లో మార్టిన్ విధ్వంసకర బ్యాట్స్‌మెన్ అని, త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నామని అన్నారు. భారత్‌తో జరిగిన 4వ వన్డేలో గప్టిల్ గాయపడ్డాడు. భారత్‌తో టీ20 సిరీస్ ముగిసిన తరువాత బంగ్లాదేశ్‌తో కీవీస్ తలపడనుంది. అప్పటి వరకు గప్టిల్ కోలుకుంటాడని కోచ్ గేరి ఆశాభావం వ్యక్తం చేశాడు. ఫిబ్రవరి 6న వెల్లింగ్టన్‌లో మొదటి టీ20, 8న ఆక్లాండ్‌లోని ఈడెన్ పార్క్‌లో రెండో టీ20, 10న హామిల్టన్‌లో మూడో టీ20 జరగనుంది. కీవీస్ టీ20 జట్టులో యువ ఆల్ రౌండర్ డేరిల్ మిచెల్‌కు స్థానం కల్పించారు. ఇతను మాజీ కోచ్ జాన్ మిచెల్ కుమారుడు.

న్యూజిలాండ్ జట్టు : కేన్ విలియమ్సన్ (కెప్టెన్), బ్రాస్‌వెల్, కొలిన్ డీ గ్రాండ్హోమ్, ఫెర్గ్యుసన్, స్కాట్ కుగెజీజెన్, డేరిల్ మిచెల్, కోలిన్ మున్రో, జిమ్మి నీషమ్, మిచెల్ శాంట్నర్, టిమ్ సీఫెర్ట్, ఇష్ సోధీ, టిమ్ సౌథీ, రాస్ టేలర్.

సొంత గడ్డపై ఆస్ట్రేలియాను టెస్టు, వన్డే ఫార్మాట్‌లలో ఓడించి చరిత్ర తిరగరాసింది టీమిండియా. అంతటితో ఆగకుండా పక్కనే ఉన్న న్యూజిలాండ్ గడ్డపై కాలు మోపి వన్డే సిరీస్‌ను కైవసం చేసుకుంది. 4-1 తేడాతో కివీస్ జట్టును మట్టికరిపించింది. కేవలం నాలుగో వన్డేలోనే ఓటమి చవి చూసింది. ఇక 6 నుంచి ప్రారంభమయ్యే టీ20 సిరీస్‌కు సిద్ధమైంది. ఈ తరుణంలో ఐసీసీ ప్రకటించిన తాజా వన్డే ర్యాంకింగ్స్‌లో టీమిండియా రెండో స్థానంలో నిలిచింది. ఇక విరాట్ కోహ్లీ ఎప్పటిలాగే మొదటి స్థానంలో తన జైత్రయాత్ర కొనసాగిస్తున్నాడు.

వాహ్.. విరాట్



విరాట్ కోహ్లీ (నంబర్‌వన్)

టీమిండియా నంబర్ 2.. మొదటి స్థానంలో ఇంగ్లండ్

భారత్‌కు 122 పాయింట్లు

కొనసాగుతున్న టీమిండియా జైత్రయాత్ర

టాప్‌టెన్‌లో ముగ్గురు బ్యాట్స్‌మెన్, బౌలర్లు మనోళ్లే

కోహ్లి నంబర్‌వన్ : ఐసీసీ ర్యాంకింగ్స్



జస్ప్రీత్ బుమ్రా

ముంబై: ఐసీసీ సోమవారం వన్డే ర్యాంకింగ్స్ ప్రకటించింది. టీమిండియా రెండో స్థానంలో నిలిచింది. ఇంగ్లండ్ జట్టు 6,918 పాయింట్లు, 126 రేటింగ్స్‌తో మొదటి స్థానాన్ని కైవసం చేసుకుంది. భారత్ జట్టు 8,058 పాయింట్లతో 122 రేటింగ్‌తో కొనసాగుతోంది. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ పర్యట నల్లో టీమిండియా జైత్రయాత్ర కొనసాగిస్తున్న విషయం తెలిసిందే. దక్షిణాఫ్రికా 5,545 పాయింట్లు, 111 రేటింగ్స్‌తో మూడో స్థానంలో ఉంది.

బ్యాట్స్‌మెన్ జాబితాలో టీమిండియా సారథి వన్డేల్లో విరాట్ కోహ్లీ 887 రేటింగ్స్‌తో తొలి స్థానంలో నిలిచాడు. టెస్టుల్లో కూడా 922 రేటింగ్స్‌తో విరాటే ముందు వరుసలో ఉండటం విశేషం. తాత్కాలిక కెప్టెన్‌గా కొనసాగుతున్న రోహిత్ శర్మ 854 రేటింగ్స్‌తో రెండో స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. వీరిద్దరి తరువాత న్యూజిలాండ్ ఆటగాడు రాస్ టేలర్ మూడో స్థానంలో (821 రేటింగ్స్), ధావన్ పదో స్థానంలో (744 రేటింగ్స్) నిలిచాడు. వన్డేల్లో టాప్ 10లో ముగ్గురు టీమిండియా ఆటగాళ్లు ఉన్నారు. ఆస్ట్రేలియాలో మంచి ప్రతిభ కనబర్చి ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డును దక్కించుకున్న మాజీ సారథి ధోనీ 17వ స్థానంలో (688 రేటింగ్స్) ఉన్నాడు. ఆస్ట్రేలియాపై విలువైన మూడు అర్ధ శతకాలను నమోదు చేశాడు. కేదార్ జాదవ్ 8 స్థానాలు మెరుగుపడి 35వ స్థానంలో ఉన్నాడు.

బౌలింగ్ విభాగంలో టీమిండియా బౌలర్ జస్ప్రిత్ బుమ్రా (808) మొదటి స్థానంలో ఉన్నాడు. రెండో స్థానంలో రషీద్ ఖాన్ (788) కొనసాగుతున్నాడు. భారత్‌పై 12 వికెట్లు తీసిన ట్రెండ్ బౌల్ట్(732) మూడో స్థానంలో ఉన్నాడు. భారత్‌తో జరిగిన నాల్గో వన్డేలో బౌల్ట్ కీలక పాత్ర పోషించాడు. 5 వికెట్లు తీసుకుని జట్టు గెలుపులో దోహదపడ్డాడు. 7 స్థానాలు మెరుగుపడి 3వ స్థానంలో కొనసాగుతున్నాడు. జనవరి 2016లో బౌల్ట్ మొదటి స్థానంలో ఉన్నాడు. భువనేశ్వర్ 6 స్థానాలు మెరుగుపడి 17వ స్థానంలో, చాహల్ 1 స్థానం మెరుగుపడి 5వ స్థానంలో ఉన్నాడు. కెదార్ జాదవ్ 8 స్థానాలు ఎగబాకి 35వ స్థానంలో నిలిచాడు. న్యూజిలాండ్ సిరీస్‌లో మ్యాన్ ఆఫ్ ది సిరీస్ అవార్డును సొంతం చేసుకున్న షమీ 30వ స్థానంలో ఉన్నాడు.

జట్టు	పాయింట్లు	రేటింగ్స్
1. ఇంగ్లండ్	6,918	126
2. భారత్	8,058	122
3. దక్షిణాఫ్రికా	5,545	111
4. న్యూజిలాండ్	5,645	111
5. పాకిస్థాన్	4,872	102
6. ఆస్ట్రేలియా	4,290	100
7. బంగ్లాదేశ్	3,608	93
8. శ్రీలంక	4,426	78
9. వెస్టిండీస్	2,899	72
10. ఆఫ్ఘనిస్తాన్	2,394	67

బౌలర్	దేశం	రేటింగ్స్
1. బుమ్రా	భారత్	808
2. రషీద్ ఖాన్	ఆఫ్ఘనిస్తాన్	788
3. ట్రెంట్ బౌల్ట్	న్యూజిలాండ్	732
4. కుల్దీప్	భారత్	719
5. చాహల్	భారత్	709
6. ముస్తఫిజు	బంగ్లాదేశ్	695
7. రబాడా	ద.ఆఫ్రికా	688
8. ఆదిల్ రషీద్	ఇంగ్లండ్	683
9. ముజీబ్	ఆఫ్ఘనిస్తాన్	679
10. హేజల్‌వుడ్	ఆస్ట్రేలియా	665

ఆటగాడు	దేశం	రేటింగ్స్
1.విరాట్ కోహ్లీ	భారత్	887
2. రోహిత్ శర్మ	భారత్	854
3. రాస్ టేలర్	న్యూజిలాండ్	821
4. జో రూట్	ఇంగ్లండ్	807
5. బాబర్ ఆజం	పాకిస్థాన్	801
6. డుప్లిస్	ద.ఆఫ్రికా	791
7.హోప్	వెస్టిండీస్	780
8. డికాక్	ద.ఆఫ్రికా	758
9. ఫకర్ జమన్	పాకిస్థాన్	755
10. ధావన్	భారత్	744

హోల్డర్‌పై ఐసీసీ వేటు

స్లో ఓవర్ రేటే కారణం



దుబాయ్ : వెస్టిండీస్ కెప్టెన్ హోల్డర్‌పై ఐసీసీ వేటు వేసింది. గత వారం ఆంటిగ్వాలో జరిగిన మ్యాచ్‌లో స్లో ఓవర్ రేట్ నమోదు కావడంతో హోల్డర్‌ను ఇంగ్లండ్‌తో జరిగే చివరి మూడో టెస్టు నుంచి తప్పించినట్టు ఐసీసీ సోమవారం ప్రకటించింది. నిర్ణయించిన దానికంటే వెస్టిండీస్ 2 ఓవర్లు తక్కువ వేసిందని, అందుకే హోల్డర్‌ను తప్పించినట్టు ఐసీసీ పేర్కొంది. ఈ సిరీస్‌లో హోల్డర్ 7 వికెట్లు తీసుకొని 229 పరుగులు చేశాడు. హోల్డర్‌పై నిషేధం విధించడంతో పాటు మ్యాచ్ ఫీజులో 40 శాతం, మిగిలిన ప్లేయర్‌లకు 20 శాతం ఫైన్ విధించడం జరిగిందని రెఫరీ జెఫ్ క్రౌ తెలిపారు. హోల్డర్ స్లో ఓవర్ రేట్ కారణంగా బహిష్కరించబడటంతో రెండో సారి. 2017, డిసెంబర్‌లో స్లో ఓవర్ రేట్ కారణంగా కివీస్‌తో హామిల్టన్ వేదికగా జరిగిన రెండో టెస్టు నుంచి తప్పించారు.

స్మిత్, డేవిడ్‌తో మరింత బలం

ఆస్ట్రేలియా సారథి టిమ్ పైన్



కాన్‌బెర్రా : యాషెస్ సిరీస్‌లో స్టీవ్ స్మిత్, డేవిడ్ వార్నర్‌లు ప్రధాన పాత్ర పోషిస్తారని భావిస్తున్నట్టు ఆస్ట్రేలియా సారథి టిమ్ పైన్ ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రస్తుత క్రికెట్‌లో ఆస్ట్రేలియా మెరుగైన స్థానంలో ఉందని చెప్పుకొచ్చాడు. బాల్ ట్యాంపరింగ్, ప్రముఖ క్రీడాకారులు గైర్హాజరుతో ఇబ్బందుల్లో ఉన్న ఇంగ్లండ్ జట్టు శ్రీలకంపై రెండు టెస్టుల్లో విజయం సాధించింది. బాల్ ట్యాంపరింగ్ కారణంగా స్మిత్, వార్నర్‌పై విధించిన సస్పెన్షన్ ఈ నెల చివరితో పూర్తి అయితే వెంటనే రీ ఎంట్రీ ఇవ్వాల్సిందిగా జట్టు సభ్యులు కోరుకుంటున్నారు. వార్నర్, స్మిత్ వస్తే యాషెస్ సిరీస్ గెలిచే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని పైన్ అభిప్రాయపడ్డాడు.

స్పిన్‌లో ఆచితూచి అడుగులు

పూనమ్, ఏక్తాను ఎదుర్కొంటా : సూజీ బేట్స్



వెల్లింగ్టన్: టీమిండియా మహిళా క్రీడాకారులు పూనమ్ యాదవ్, ఎక్తా స్పిన్‌లో ఎలా ఆడాలో తెలుకోవడం జరిగిందని, వన్డే సిరీస్ కోల్పోవడం బాధగా ఉన్నా టీ20 సిరీస్‌ను మాత్రం తప్పకుండా కైవసం చేసుకుంటామని కివీస్ సినీయర్ బ్యాట్స్‌మెన్ సూజీ బేట్స్ ధీమా వ్యక్తం చేసింది. బేట్స్ మూడో వన్డేలో 25వ అర్ధ శతకాన్ని నమోదు చేసి 8 వికెట్ల తేడాతో జట్టును గెలిపించింది. చివరి వన్డేలో టీమిండియాపై గెలవడంతో కివీస్ ఆత్మవిశ్వాసం ఎంతో పెరిగిందని అన్నారు. మొదటి రెండు మ్యాచులు ఓడిపోయిన తరువాత మూడో మ్యాచ్ కూడా పోగొట్టుకుని ఉంటే జట్టు మొత్తం ఎంతో నిరాశలో ఉండేదని, ఇది టీ20 సిరీస్‌పై ప్రభావం పడేదని అభిప్రాయపడింది. ఓ మంచి భాగస్వామ్యం కూడా కివీస్ జట్టుకు అవసరం అని కోరింది.

గెలుపు పక్కా : చండిమాల్

కాన్‌బెర్రా: ఆస్ట్రేలియాతో టెస్టు సిరీస్‌ను 2-0 తేడాతో ఓడిపోయిన శ్రీలంక జట్టు ఇక దక్షిణాఫ్రికాపై విక్టరీ నమోదు చేయడానికి ఉవ్విళ్లూరుతోంది. ఆసీస్‌తో ఓడిపోయిన అనంతరం సోమవారం శ్రీలంక కెప్టెన్ చండీమల్ మీడియాతో మాట్లాడారు. ఆస్ట్రేలియా జరిగిన టెస్టు సిరీస్‌లో జరిగిన తప్పిదాలు దక్షిణాఫ్రికాతో ఆడబోయే మ్యాచుల్లో దొర్లకుండా చూసుకుంటామని అన్నారు. జట్టులో చాలా మంది యువ క్రీడాకారులు ఉన్నారని, వారంతా ఆటను నేర్చుకోవడంలో ఉన్నారని అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కూడా దక్షిణాఫ్రికాపై విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశాడు.

సఫారీలదే టీ20 సిరీస్

2-0 తేడాతో పాక్ ఓటమి



జోహెన్సన్‌బర్గ్ : దక్షిణఫ్రికాతో జరిగిన రెండో టీ20 మ్యాచ్‌లో పాక్ ఓటమి పాలైంది. పాక్ బ్యాట్స్‌మెన్ బాబర్ ఆజం 90 పరుగులు చేసినా సఫారీలకే గెలుపు వరించింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో ఒక మ్యాచ్ మిగిలి ఉండగానే దక్షిణఫ్రికా 2-0తో ఛాంపియన్‌గా నిలిచింది. రెండో మ్యాచ్‌లో పాక్‌పై ద.ఆఫ్రికా 7 పరుగుల తేడాతో గెలుపొందింది. 2016, మార్చి భారత్‌లో జరిగిన ప్రపంచ టీ20 నుంచి తొలగించబడిన తరువాత ఇప్పటి వరకు పాకిస్థాన్ ఎలాంటి టీ20 సిరీస్‌ను పోగొట్టుకోలేదు. తొలుత బ్యాటింగ్ చేసిన సఫారీల జట్టు 20 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 188 పరుగులు చేసింది. కెప్టెన్ డేవిడ్ వార్నర్ 65 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. రాస్సీ వాండర్ డస్సెన్ (45), జన్నేమన్ మలన్ (33), హెండ్రిక్స్ (28)తో రాణించారు. పాక్ బౌలర్లు వసీం, షహీన్ ఆఫ్రిదిలు తలో వికెట్ తీ సుకున్నారు. 189 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన పాక్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 181 పరుగులు మాత్రమే చేయగలిగింది. బాబార్ ఆజం (90), హుస్సేన్ తాలత్ (55)తో రాణించినా ఫలితం లేకుండా పోయింది. ఆజం, హుస్సేన్ తాలత్ రెండో వికెట్‌కు 75 బంతుల్లో 102 పరుగులు జోడించారు. ద.ఆఫ్రికా బౌలర్లు ఆండ్లీ (3), హెండ్రిక్స్ (2), క్రిస్ మోరీస్ (2) వికెట్లు తీసుకున్నారు. గెలిచే మ్యాచ్ అయినప్పటికీ మంచి ముగింపును ఇవ్వలేకపోయామని పాక్ కెప్టెన్ షోయబ్ మాలిక్ అన్నాడు. బాబర్ ఆజం 58 బంతుల్లో 90 పరుగులు చేశాడు.

బీబీఎల్ నుంచి మెక్‌కలమ్ రిటైర్మెంట్



బ్రిస్బేన్ : బిగ్ బాష్ లీగ్ నుంచి న్యూజిలాండ్ మాజీ కెప్టెన్ మెక్ కలమ్ రిటైర్మెంట్ ప్రకటించారు. శుక్రవారం జరిగే ఆటే తనకు చివరిది అని, 8 ఏళ్ల పాటు బిగ్ బాష్ లీగ్‌లో ఆడానని తెలిపాడు. రిటైర్మెంట్ తరువాత కోచింగ్ కెరీర్‌ను ప్రారంభించాలని అనుకున్నట్టు తెలిపాడు. 37 ఏళ్ల విధ్వంసకరమైన బ్యాట్స్‌మెన్, వికెట్ కీపర్ అంతర్జాతీయ క్రికెట్‌కు 2016లోనే రిటైర్మెంట్ ప్రకటించాడు. గబ్బాలో శుక్రవారం బీబీఎల్ తుది పోరు జరగనుంది. మెల్‌బోర్న్ స్టార్స్‌తో జరిగే ఈ ఫైనల్‌లో బ్రిస్బేన్ హీట్ కచ్చితంగా గెలిచి తీరుతామని మెక్ ధీమా వ్యక్తం చేస్తున్నాడు. 2011 నుంచి బ్రిస్బేన్ హీట్ తరఫున ఆడుతున్నాడు. 34 మ్యాచుల్లో 920 పరుగులు చేశాడు. 5 హాఫ్ సెంచరీలను నమోదు చేసుకున్నాడు. ఈ ఏడాది వేరే దేశాల తరఫున టీ20 ఆడుతానని ప్రకటించాడు. ఆ తరువాతే కోచింగ్ ఇన్నింగ్స్‌ను ప్రారంభిస్తానని తెలిపాడు. బీబీఎల్‌కు తన క్రికెట్ కెరీర్‌లో ఎంతో ప్రాముఖ్యత ఉందని చెప్పుకొచ్చాడు. అంతర్జాతీయ స్థాయిలో కోచ్ అనేది ఎంతో ఆనందాన్ని ఇస్తుందని అన్నాడు.





ఐఎస్‌హెచ్ జ్యూరీలో బింద్రా, గోపీచంద్

ముంబై : ఇండియన్ స్పోర్ట్స్ హానర్ (ఐఎస్‌హెచ్) ప్యానెల్ కమిటీలో జ్యూరీ సభ్యులుగా భారత్‌కు షూటింగ్ రంగంలో వ్యక్తిగత విభాగం కింద మొదటి బంగారు పతకాన్ని తెచ్చిపెట్టిన అభినవ్ బింద్రా, జాతీయ బ్మాడ్మింటన్ కోచ్ గోపీచంద్‌కు స్థానం కల్పించడం జరిగింది. ఫిబ్రవరి 16న ఇండియన్ స్పోర్ట్స్ హానర్స్ అవార్డును అందజేయనున్నారు. ఇండియన్ మాజీ హాకీ కెప్టెన్ సర్దార్ సింగ్, టెన్నిస్ దిగ్గజం మహేష్ భూపతి, లెజెండరీ అథ్లెట్ పీటీ ఉషాతో పాటు మాజీ షూటర్ అంజలి భగవత్‌లు ఎంపిక కమిటీలో సభ్యులుగా ఉన్నారు. ఈ సందర్భంగా అభినవ్ బింద్రా మాట్లాడుతూ.. అథ్లెట్‌కు ఇచ్చే పురస్కారం కేవలం అతడికి మాత్రమే గుర్తింపు కాదని అన్నారు. జట్టుకు, అండగా నిలిచిన బృందానికి, సక్సెస్ సాధించడంలో సహకరించిన వారికి కూడా గుర్తింపు ఇచ్చేనట్టే అన్నారు. పురస్కారం అనేది వ్యక్తిగత కష్టానికి గుర్తింపు కాదని, జట్టు కష్టానికి గుర్తింపు అని అభిప్రాయపడ్డారు. ఆర్‌పీ సంజీవ్ గోయెంకా గ్రూప్, విరాట్ కోహ్లీ ఫౌండేషన్ కలిసి ఇండియన్ స్పోర్ట్స్ హానర్స్ అవార్డులు ఇవ్వడం జరుగుతోంది. ప్రతీ విభాగంలో నామినేట్ అయిన క్రీడాకారులను జ్యూరీ ఈ మధ్యే ఎంపిక చేసింది. సభ్యులు కొద్ది రోజుల క్రితమే కోల్‌కతాలో భేటీ అయ్యారు. స్పోర్ట్స్ జర్నలిస్టు ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నామినేషన్లను వడపోసింది. 200 మందికి పైగా జర్నలిస్టులు ఓటు వేశారు. ఇండియన్ స్పోర్ట్స్ దిగ్గజాలు బింద్రా, గోపీచంద్‌ను జ్యూరీలోకి సాదరంగా ఆహ్వానిస్తున్నట్టు గోయెంకా తెలిపారు.

క్రీడారంగ అభివృద్ధికి కృషి

బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్

కోటక్‌తో సీఎస్‌ఆర్ ఒప్పందం.. క్రీడాకారులకు మౌలిక సదుపాయాలు

హైదరాబాద్: క్రీడారంగాన్ని మరింత అభివృద్ధి పథంలో తీసుకెళ్లేందుకు కోటక్ మహీంద్రా బ్యాంక్ లిమిటెడ్ ముందుకు వచ్చింది. కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్‌ఆర్)లో భాగంగా పుల్లెల గోపీచంద్ బ్యాండ్మింటన్ ఫౌండేషన్‌తో కోటక్ విజన్ సోమవారం ఒప్పందం చేసుకుంది. క్రీడాకారుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు గాను సీఎస్‌ఆర్ కార్యక్రమంలో భాగంగా శిక్షణకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు కోటక్ మహీంద్రా బ్యాంకు ముందుకొచ్చింది. బ్యాడ్మింటన్ కోర్టులు, జిమ్, రన్నింగ్ ట్రాక్, స్విమ్మింగ్ పూల్స్ వంటి సౌకర్యాలు కల్పించనుంది. అంతర్జాతీయ ప్రమాణాలు కలిగిన కోచ్‌లతో శిక్షణ ఇవ్వనున్నారు. ఈసందర్భంగా లెజండరీ బ్మాండ్మింటన్ క్రీడాకారుడు పుల్లెల గోపీచంద్ మాట్లాడుతూ.. ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి వారికి శిక్షణ ఇచ్చి అంతర్జాతీయ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌లుగా నిలబెట్టడమే ఫౌండేషన్ లక్ష్యం అన్నారు. ప్రపంచ స్థాయి అథ్లెట్లుగా తీర్చిదిద్దేందుకు క్రీడాకారులకు మౌలిక వసతులు కల్పించడం జరుగుతుందని తెలిపారు. ప్రస్తుతం ఆరు ఏసీ బ్మాడ్మింటన్ కోర్టులు ఉన్నాయన్నారు. స్పోర్ట్ సైన్స్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తామని తెలిపారు.

కోటక్ మహీంద్రా బ్యాంక్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ దీపక్ గుప్తా మాట్లాడుతూ.. ఆర్థికపరమైన అంశాలకు సంబంధం లేకుండా ప్రతీ ఒక్క విద్యార్థి, యువతకు నాణ్యమైన విద్య, క్రీడలు, జీవనోపాధి సదుపాయాలు అందుబాటులో ఉండాలన్నారు. దీనిపై కోటక్ సీఎస్‌ఆర్ దృష్టి సారించిందని, పుల్లెల గోపీచంద్ అంకితభావంతో ప్రపంచ స్థాయి బ్మాడ్మింటన్ క్రీడాకారులను అందించి ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. బ్యాడ్మింటన్‌లో భారత్‌ను పతాక స్థాయికి తీసుకెళ్లేందుకు పుల్లెల గోపీచంద్ ఫౌండేషన్‌తో కలిసి ముందుకు వెళ్తామన్నారు.



కోటక్ మహీంద్రా జాయింట్ ఎండీ దీపక్ గుప్తాతో ఒప్పందం చేసుకుంటున్న పుల్లెల గోపీచంద్

Printed & Published by **MOOTHA GOUTAM** on behalf of Andhra Prabha Publications Ltd., and printed at Andhra Prabha Publications Ltd., 13-6-445/a/b1, Konejeti Enclave, Mehdhipatnam, Hyderabad-500028. Published from Andhra Prabha Publications Ltd., 8-2-293/82/A/75, Plot No.75, Road No.9, Jubilee Hills, Hyderabad-500033. Phones: 23559940/41/42/45, Fax No.23558812. Editor: Y S R Sarma, Responsible for News selection under PRB ACT. RNI Regd.No.32178/1977.

Lively Interaction For Ever

ఆంధ్రప్రభ

lifepage2012@gmail.com

లైఫ్ I

మంగళవారం 5 ఫిబ్రవరి 2019



జోగిని...

సమాజం చెక్కిన అభాగిని



ఓఎమ్ ఫౌండేషన్
జోగిని ప్రాజెక్ట్ డైరెక్టర్, ఏంజెలా

జోగిని, బస్వి, మాతంగి పేరు ఏదయితేనేం, ప్రదేశం ఎక్కడైతేనేం దళిత మహిళను లైంగిక వస్తువుగా చేసి ఊరుమ్మడి వేశ్యగా వాడుకునే పైశాచికత్వం. ఇది ఇంకో యాభై ఏళ్లయినా పూర్తిగా రూపుమాసిపోతుందో లేదో తెలియని పరిస్థితి. తెలంగాణలో యాభైమంది జోగినులు ఉన్న ఊర్లు కూడా ఉన్నాయి. అమాయకత్వం, నిరక్షరాస్యత, దేవుడంటే భక్తి కంటే ఎక్కువగా భయం ఈ వ్యవస్థను ఎప్పటికప్పుడు పునరుజ్జీవింపచేస్తోంది. దేవుడిని పెళ్లి చేసుకుని దేవుడి భార్యలుగా చెప్పుకునే వీరిని ఉత్సవాలప్పుడు దేవతగా కొలిచి మిగతాకాలం ఊరు అంటరానివారిగా చూస్తుంది. బిచ్చగత్తెలుగా, రోగాలతో అస్తవ్యస్త జీవితం వీరిది. తండ్రిపేరు లేని పిల్లలుగా వీరి సంతానాన్ని సమాజం వెలివేస్తుంది. ఈ పరిస్థితి మారాలంటే ఇక నుంచి కొత్తగా జోగినిలు తయారవకూడదు. ఉన్నవారిలో చేతన పెరగాలి. వారికి న్యాయం జరగాలి. ఆ దిశగా జోగినిలతో కలిసి ఒక దశాబ్దకాలంగా ఓఎమ్ ఫౌండేషన్ తరపున తెలంగాణలో జోగిని ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఏంజెలా ఇలా చెప్తున్నారు.

మా నాన్న సింగరేణి ఉద్యోగి. నన్ను ఎమ్‌బిఏ చదివించారు. మాకు కమ్యూనిస్ట్ మూలాలున్నాయి. అందుకే నాకు సమాజం పట్ల బాధ్యత ఉందని నేను భావిస్తుంటాను. బహుజన సాహిత్య అకాడమీనుంచి సావిత్రిబాయి పూలే నేషనల్ అవార్డు తీసుకున్నాను.

ఎమ్‌బిఏ చదివిన తర్వాత డప్పు అనే దళిత నెట్‌వర్క్‌లో హెచ్ ఆర్ ఇన్‌చార్జిగా చేరాను. ఆవిధంగా నేను 2005 నుంచి జోగినిల మీద, దళితుల గురించి పనిచేయడం ఆరంభించాను. అక్కడే జోగిని, మానవహక్కులు ఇలా వివిధ అంశాల మీద అవగాహన పెరిగింది.

తర్వాత ఎపిమాస్‌లో పనిచేశాను. ఇప్పుడు ఆపరేషన్ మర్సీ మియా(ఓఎమ్)ఫౌండేషన్‌లో పనిచేస్తున్నాను. ఈ సంస్థ సమాజ సేవలో భాగంగా 110 దళిత స్కూళ్లు నడుపుతుంది. ఐదు క్లినిక్‌లు నడుపుతారు. మహిళలకు నైపుణ్య శిక్షణలిస్తారు. నేను ఇక్కడ చేరింది వేరే బాధ్యతలకోసం అయినా నాకు జోగినిల మీద పనిచేయాలని ఉండేది. ఈ వ్యవస్థ ఒకేలాటిది అయినా పేర్లు రకరకాలు. నెల్లూరులో మాతమ్మ అంటారు. అనంతపూర్ వైపు బస్వి. దళిత అమ్మాయిలని ఎల్లమ్మకి అప్పగిస్తే జోగిని అంటారు. అదే బిసి అమ్మాయిలను నర్సింహస్వామికి అప్పగిస్తే వాళ్లని బస్విని అంటారు. జోగినిలలో 98 శాతం దళితులే. తెలంగాణ అంతా జోగిని ఉంది. మొదటగా నా అంతట నేనే 2010లో పదిహేనుమంది జోగిని పిల్లల్ని ఈ సంస్థకు తీసుకువచ్చి ప్రతిజ్ఞ సెంటర్ ఫామ్ అని ఆరంభించాం. జోగిని వ్యవస్థ రూపుమాపాలనే ఉద్దేశ్యంతో 100 గ్రామాలలో జోగినిల మీద పనిచేయడం ఆరంభించాం. వాళ్లని ప్రభుత్వ పథకాలతో కలిపాం. ఇప్పుడిక్కడ మొత్తం 42మంది జోగిని పిల్లలు చదువుతున్నారు. జోగినిలను ఏ కేటగిరి కిందకి చేర్చాలో వారికి అర్థం కాదు. జనాభా లెక్కల్లో జోగినిలను చేర్చరు. పెళ్లయినవారు, కానివారు, వితంతు, ఈ మూడు వర్గాలలోకి వీరు రారు కాబట్టి ప్రభుత్వ పథకాలు వీరిదాకా వచ్చేవి కావు. పెన్షన్, రేషన్ కార్డులు, ఉపాధి పథకాలు ఇప్పించాం.

వందరోజుల ఉపాధి పని దగ్గర కూడా వీరితో వివక్ష చూపిస్తారు. జాబితాలో పేరుకి మాతమ్మ అని ఈమె పేరుంటుంది కాని వేరే అమ్మాయి పనిచేసి కూలీ తీసుకుంటుంది. ఒకవేళ వీళ్లు పనికివెళ్లినా జోగిని అనేసరికి రెండువందల స్థానంలో వంద రూపాయలే ఇస్తారు. అలా జరగకుండా మేం స్పెషల్ ఆర్డర్ తీసుకురాగలిగాం. 2018 నుంచి ఎస్‌సి కార్పొరేషన్ వాళ్లు మాకు బాగా మద్దతునిస్తున్నారు. జోగినిలకు రుణాలు ఇస్తున్నారు. వాళ్లకి టైలరింగ్ సెంటర్లు తెప్పించగలిగాం. 20 మందిని కొత్తగా జోగినిలుగా మారకుండా ఆపగలిగాం. ప్రతినెలా మెడికల్ క్యాంప్ చేస్తాం. ప్రభుత్వ 104 మెడికల్ క్యాంపులు ఉంటాయి కాని దాంట్లో డాక్టర్ ఉండడు. 104కి మేం వాళ్లకి డాక్టర్‌ను ఇచ్చి మందులు ఇప్పిస్తాం. మహబూబ్‌నగర్‌లో మావి 2 గుడ్‌షెఫర్డ్ స్కూల్స్ ఉన్నాయి. అందులో 70మంది జోగిని పిల్లల్ని చేర్చాం. వాస్తవానికి జోగినిలున్న ఊర్లో కూడా చాలా స్కూల్స్ ఉన్నాయి. కాని జోగిని పిల్లలు ఇంగ్లీష్ మీడియం చదవడం ఏంటి అని అక్కడ ఆ పిల్లలు చదవడానికి జనం ఒప్పుకోరు. అందుకే ఆ పిల్లలకు ప్రత్యేకంగా బస్‌లు వేసి మా స్కూల్స్‌లో చేర్పించాం.

జోగిని నిషేధం మీద 98 లోనే చట్టం వచ్చినా రూల్స్ లేవు. అందుకే రూల్స్ ఏర్పాటు చేయమని 2010 లో హైకోర్టుకు వేశాం. ఎంతకీ స్పందించకుంటే మళ్లీ రిట్ పిటీషన్ వేశాం. ఆంధ్ర ప్రభుత్వం ముందు ప్రతిస్పందించి రూల్స్ చేసింది. ఆ రూల్స్‌నే మనం కూడా తీసుకుందామని తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది. మా ప్రోద్బలంతో కోర్టు రిటైర్డ్ జడ్జి రఘునాథరావుతో ప్రభుత్వం ఒన్ మ్యాన్ కమిటీ వేసింది. దానికి మేం రిప్రజెంట్ చేశాం. ఆ కమిటీ రికమండేషన్స్ బాగా ఇచ్చింది. ప్రభుత్వం అవన్నీ తీసుకుని అమలు చేయగలిగితే జోగినికి ఒక డిగ్నిటీ తీసుకువచ్చి ఆ వ్యవస్థ నిషేధం జరిగే అవకాశం ఉంది. కనీసం ఇంకో 20 ఏళ్ల తర్వాత అయినా ఈ వ్యవస్థ రూపుమాపవచ్చు.

ఆడపిల్లల్ని జోగినిలుగా చేయడం వెనక చాలా అంశాలుంటాయి. దళితులకు చదువుండదు. మూఢాచారాలు ఎక్కువ. వాళ్లింట్లో నలుగురు ఆడపిల్లలుంటే ఒకరిని జోగినిగా చేస్తే ఇంట్లో ఉంటుంది. ఈ పిల్ల ద్వారా మగపిల్లవాడు పుడతాడన్న ఆశ ఉంటుంది. జోగినికి పెళ్లి ఉండదు కాబట్టి పుట్టిన మగపిల్లవాడు వీరి ఇంటిపేరునే ముందుకు తీసుకెళ్తాడు. అదే పెళ్లి చేస్తే తండ్రి ఇంటిపేరుతో ఉంటాడనే స్వార్థం ఉంటుంది. వానలు పడకపోతే ఊళ్లోవాళ్లు నిర్ణయం తీసుకుంటారు. ఒకమ్మాయిని జోగిని చేస్తే దానివలన ఊరు బాగుంటుంది. వానలు పడతాయని చెప్తారు. ఇది ఒక సంప్రదాయంగా మారింది. గుడికి, చర్చికి ఎలా వెళ్తారో అలానే అమ్మాయిని దేవునికి ఇచ్చేయడం. ఇంట్లో మొక్కుకుంటారు.నా ఇంట్లో పిల్ల పుడితే దేవుడికి ఇస్తాను అని మొక్కుకుంటారు. దానివలన ఇంట్లో మంచి జరుగుతుంది. రోగాలు పోతాయని అనుకుంటారు. తిండికి లేక, తమ అవసానదశలో చూసుకుంటుందని, పెద్ద కులాల ప్రోద్బలంతో తల్లిదండ్రులే తమ బిడ్డల్ని జోగినిలుగా చేస్తారు. దళితులు పెద్ద కులాల వారి దగ్గర అప్పులు తీసుకుని ఉంటారు. నీ కూతుర్ని జోగిని చెయ్యి అప్పు మాఫీ చేస్తాం అంటారు. లేదా దళిత పిల్ల చూడటానికి అందంగా ఉంటే వాడుకోవచ్చు కదా దురుద్దేశ్యంతో దళితుడిని ప్రోత్సహిస్తారు. కాని దానికి మా దగ్గర సాక్ష్యం ఉండదు కదా. మేం కేసువేయాలంటే అమాయకత్వం, అజ్ఞానం కూడుకున్న తల్లిదండ్రుల మీదనే వేయాల్సి వస్తుంది.

అమ్మాయిలను లైంగికంగా వాడుకునే వ్యవస్థ 1800 నుంచి ఉంది. అప్పట్లో దేవదాసీలు రాజును సంతోషపెట్టాలి. గుడిలో ఉండాలనే పద్ధతి ఉండేది. బ్రిటీషర్లు వచ్చాక రాజుల విలాసాలలో ఇది ఒకటి కాబట్టి నిషేధించారు. కాని పెద్దకులాల వారు, ఇదొక సంప్రదాయ పద్ధతి. దీన్ని బతికించాలి అని దళితులను వాడుకోవడానికి ఈ వ్యవస్థ ఏర్పరచారు. సిడె అనే ఒక ఆచారం ఉండేది. ఇప్పుడు బ్యాన్ చేశారు. జాతరలలో ఒక పెద్ద క్రేన్‌లాటిది పెడతారు. అమ్మాయిని కూర్చోబెట్టి తిప్పుతుంటారు. ఆ అమ్మాయి అక్కడి నుంచి పసుపు, కుంకుమ చల్లుతుంది. అది జనాల మీద పడితే వీరికి దేవుని ఆశీర్వాదం దొరికినట్లు భావిస్తారు జనం. అమ్మాయి అప్పటికే తాగి ఉంటుంది. అంత ఎత్తు నుంచి కింద పడితే ప్రాణం పోతుంది. 96 లో మహబూబ్‌నగర్‌లో ఒక ఐఎఎస్ ఆఫీసర్ దీన్ని ఆపేశారు. జాతర జరుగుతుందంటే జోగినిలకు పండగ. లింగంపల్లి జాతర మహబూబ్ నగర్‌లో నర్సింహస్వామి దేవుడు. కేవలం పెద్దకులాలవారు గుడిలోకి వెళ్లాలి. గుడి వెనక ఉన్న ఒక దేవుడి విగ్రహం దగ్గర దళితులు, జోగినిలు మొక్కాలి. జోగినిని దేవత అంటారు. ఆమె ఆశీర్వదిస్తే మంచి అవుతుందంటారు కాని ఆమెను గుడిలోకి రానివ్వరు. ఊర్లలో ఆడవాళ్లు తమ భర్తలను జోగినితో రాత్రి గడిపితే వారి ఇంటికి మంచిదని తామే వారి దగ్గరకు పంపిస్తారు. జోగినిలు మంగళవారం, శుక్రవారం ఇంటింటికి వెళ్లి భిక్షాటన చేయాలి. దాని ద్వారా వచ్చినదానితో తిని బతుకుతారు. వీళ్లు వారంలో కొన్నిరోజులు ఉపవాసాలుండాలి. ఊర్లో ఎవరైనా చనిపోతే వీరు ఉపవాసాలుండాలి. శవం దగ్గరకు వెళ్లి పూజలు చేయాలి. నెల్లూరు వైపు మాతంగిలు జాతరలో ఒంటి మీద కేవలం వేపాకులు కట్టుకుని డాన్స్ చేసేవారు. రాగితో చేసిన దేవుడి పాదాలు కాళ్లకి పెట్టుకుంటారు. మెడలో గవ్వలేసుకుంటారు. జోగిని చనిపోయినా అది ఒక పెళ్లిలాగా చేయాలి. వారికి తినడానికి తిండి ఉండదు కాని చనిపోతే 20,30 వేలు ఖర్చు పెట్టాలి. చనిపోయిన జోగిని శవానికి మళ్లీ పెళ్లి చేస్తారు పెద్ద తంతు చేస్తారు. ఆమె బతికి ఉన్నంతకాలం పెళ్లి చేసుకోకూడదు. ఎవరైనా ఎదురుతిరిగి పెళ్లి చేసుకుంటే వారి మీద దాడి చేస్తారు.

మేం జోగినిలకు సంబంధించి ఎయిడ్స్ మీద పనిచేస్తాం. మెడికల్ క్యాంపులు ఏర్పాటుచేస్తాం.జోగినిలకు వైట్ డిస్చార్జి, గైనిక్ ప్రాబ్లమ్స్ ఎక్కువ ఉంటాయి. 5 ఏళ్ల వయసులో జోగినిగా చేస్తారు. రజస్వల కాగానే ఊరంతా వాడుకుంటారు. అంత చిన్న వయసు నుంచే ఆమె లైంగిక వస్తువుగా మారడం, సరైన పోషకాహారం లేక 20 ఏళ్ల వయసున్న జోగిని 40 ఏళ్ల వయసున్నామెలా కనిపిస్తుంది. పైగా జోగినిలు అందరూ చీప్ లిక్కర్ తాగుతారు. ఇదొక ఆచారం. మేం ఒకసారి 100మంది జోగినిలతో ఒక ప్రోగ్రామ్ చేశాం. తాగుడికి ఏళ్ల తరబడి బానిసలైన జోగినిలు ఒక్కొక్కరే ఫిట్స్ వచ్చి పడిపోయారు.

వారి జీవితాల్లో వెలుగు నింపాలనే ప్రయత్నం చేస్తున్నా తీసుకునే పరిస్థితుల్లో వారు మానసికంగా సిద్ధంగా ఉండరు. జోగినిలు కూడా మొండిగా అయిపోయారు. మా జీవితం అంతే. మేం అంతే. ఇట్లానే ఉండాలి అనే ఉద్దేశ్యంతోనే ఉన్నారు. వారి ఆరోగ్యం బాగా చూసుకోవాలని చెప్తుంటాం. మేం వాళ్లకి క్యాన్సర్ టెస్ట్‌లు చేయించాం. వందలో నలభైమంది చేయించుకోలేదు. చేస్తే చస్తాం. మాకొద్దన్నారు. ప్రసవాలు కూడా వాళ్లు ఆసుపత్రులకు వెళ్లి చేయించుకోరు.

జోగినిల గురించి ప్రత్యేకంగా ప్రభుత్వం నుంచి కూడా ఏం మద్దతు లేదు. రూల్స్ ఫ్రేమ్ చేయడానికి 30 ఏళ్లు పట్టింది. జోగిని నిషేధ చట్టం ఉందని పోలీసులకే తెలీదు. జోగిని ఆపుదాం రమ్మని మేం పోలీసులని అడిగితే వాళ్లు రారు. అవగాహన లేకపోవడం, నిర్లక్ష్యం రెండూ ఉన్నాయి. రెండు వందల గ్రామాల్లో 3000 మంది జోగినిలున్నారు. ఒక్క ధన్వాడలోనే 60మంది జోగినిలున్నారు. అమ్మమ్మ జోగిని, తల్లి జోగిని, బిడ్డ జోగిని ఇలా తరాలవారీగా ఉన్నారు. మేం మూడవతరాన్ని ఆపుతున్నాం. మేం పని చేస్తున్న ఈ పది సంవత్సరాలలో వారిలో చాలా అవగాహన, చైతన్యం పెరిగాయి. నాలాగా నాబిడ్ కాకూడదు అనే ఆలోచనలో జోగినిలు ప డుతున్నారు. వాళ్లలో వచ్చిన చైతన్యం ఊళ్లో వాళ్లకి నచ్చక వారి మీద దాడులు జరుగుతుంటాయి. ఒక 27 ఏళ్ల జోగిని అతనితో గడపడానికి ఒప్పుకోలేదని ఒకతను ఊరందరూ చూస్తుండగానే బాగా కొట్టాడు. ఎవరూ ఆమె మద్దతుకు రాలేదు. మీడియా కూడా జోగిని వ్యవస్థ గురించి బాగా స్పందించాలి.

- శ్రీదేవి కవికొండల

అది మేం సాధించిన విజయమే!

మగపిల్లలు పుట్టలేదని నాకు ఏడెనిమిదేండ్ల వయసులో జోగిని చేశారు. ఊళ్లో అడుక్కుని బతికాను. పలకలో రూపాయి, రెండు రూపాయలు వేస్తారు. చారెడు బియ్యం వేస్తారు. నా ఒక్క కూతురిని పెంచడానికి కూడ కష్టపడ్డాను. కాని పదేళ్ల నుంచి జోగోళ్లం అందరం కట్టగట్టి ఇంకెవరూ జోగిని చెయ్యకూడదని పనిచేస్తున్నాం. మొత్తం 70 మంది జోగినిలు ఉన్న ఊరు ఇది. ఇక్కడ జోగినిలు చాలామంది పెళ్లిళ్లు చేసుకున్నారు. ఈ ఊర్లో జోగినిలుగా చెయ్యకుండా పదిమందిని ఆపాం. అది మేం సాధించిన విజయం. జోగిని క ూతురుని కూడా జోగిని చేయడం ఆచారం. కాని నేను చెయ్యదల్చుకోలేదు. మా అమ్మాయిని బాగా చదివించాను. ఆమె బి.ఇడి చేసింది. బిఇడి చేసిన ఒక బిసి వ్యక్తిని పెళ్లిచేసుకుంది. మా ఆచారం అయినా కూడా ఇప్పుడు నాకు ఇల్లిల్లు తిరిగి అడుక్కోవడం ఇష్టముండదు. నిన్ను దేవతను చేస్తే అడుక్కోవా అని ఊళ్లో అందరూ అడుగుతారు. సాధారణంగా ఎస్‌సిలు, పైగా జోగినిలు బిసిని చేసుకోరు. వారు మాపై దాడి చేస్తారు. కాని వెనక ఓఎమ్ సంస్థ ఉందన్న భయంతో మా జోలికి రావట్లేదు. పోలీసులు మాకు మద్దతుగా ఉంటారు అని అల్లుడు కూడా బాగా చూసుకుంటు న్నాడు. ఇదంతా చైతన్యమే. పెన్షన్‌తో పాటు బీడీలు చేసుకుని బతుకుతున్నాను. నేను మెడికల్ క్యాంపుకు వెళ్తాను. ప్రజల దగ్గరకు వెళ్లి జోగిని చెయ్యద్దని అవగాహన తీసుకువస్తాను. ఒకప్పుడు తమ దగ్గరకు రమ్మనేవారు మగవాళ్లు. ఇప్పుడు మమ్మల్ని జనం అక్క అని పిలుస్తున్నారు.

కాలా కిష్టమ్మ, జోగిని
పాలమూరు జిల్లా, ఉట్కూరు.

నా కష్టాలు ఇంకెవరికీ వద్దు

నాకు ఏడేళ్ల వయసున్నప్పుడు నాకు తెలవనప్పుడు నా తల్లిదండ్రులు నన్ను జోగినిగా చేసిన్రు. నాకు పదవ తరగతి చదువుతున్న కూతురు ఉంది. ప్రభుత్వ పాఠశాలలో చదువుతుంది. అంతకుముందు నాకేమీ తెలవకపోయేది. జోగిని మీద మేడమ్‌వాళ్లు వచ్చి చెప్తున్నకాడ్నుంచి నాకు ఆలోచించడం తెలిసింది. జోగినిగా నేను అనుభవించిన కష్టాలు ఇంకెవరికీ రావద్దు. ఏడ ఎవరు జోగిని చేస్తారని తెలిస్తే ఆడకుపోత. అట్ల ఐదుగురు అమ్మాయిలకు పుస్తెలు కట్టకుండా ఆపినా. నేను భయపడ. ఎమ్ఆర్ఓ దగ్గర కూడా మాట్లాడతా. ఎస్‌సి ఆఫీసుకు పోయి 40 మందికి కుట్టు మిషన్లు ఇప్పించినా. మేం జోగినులాగా చాలా బాధలు పడున్నం. మాలాగా మీరు అవకూడదు అని పోరాడుతున్నాం. వేరే ఊర్లలో జోగిని చేస్తున్నరని తెలిసినా పోత. ఊరి పెద్దలతో, ఆ పిల్ల తల్లిదండ్రులతో గొడవపడత. పోలీసు స్టేషన్‌కి పోయి ఇట్ల జరుగుతుందని సమాచారం ఇస్త. ఎట్లయిన జోగిని చెయ్యడం ఆపాలని నా ఉద్దేశ్యం. నేను పూర్తిగా జోగిని ఆచారాలను వదిలేసిన. నాకు కారంపొడి మెషీన్ ఇప్పించారు. అది నడుపుకుంటాను. కూలినాలి పోతా. బీడీ చెస్త. దాంతో బతుక ుదెరువు నడుస్తుంది. జోగినిలుగా ఉన్నవారికి ఈ పద్ధతి వదిలేయమని చెప్త. మా అమ్మాయి ఎంత చదువుకుంటే అంత చదివిస్త. పెండ్లి చేస్త. మా అమ్మానాన్నకు బుర్రలేక నాకు ఇటువంటిపని చేశారు. నా కూతురుకు ఆ పరిస్థితి రానివ్వ. బడిలో జోగిని పిల్లలను ఒకదిక్కు కూచోబెడతరు. నాయన పేరు ఏంటి చెప్పమని అడిగితే జోగిని పిల్లలు చేతులెత్తలేదట. పిల్లలు ఇంటికి వచ్చి చెప్పు చెప్పు అని తల్లిని అడిగితే ఏమని చెప్పాలి మేం? మేడమ్ వాళ్లు సింగిల్ మదర్ అని కాగితం రాయించి తెస్తే అది బడికాడ ఇచ్చినం. అప్పట్లో మా పిల్లల్ని కలుపుకునేటోళ్లు కాదు. కాని మేం మారుతున్నం అని జనం చూస్తున్నరు కదా. ఇప్పుడు బాగనే ఉంటున్నరు.

నరసమ్మ, జోగిని
ధన్వాడ

పిల్లలు మెచ్చే పోషకాల స్నాక్స్

పోషకాలతో కూడిన ఆహారం అంటే పిల్లలు దూరంగా జరుగుతారు. అవి చూడటానికి బావుండవు. తినడానికి రుచించవు అనే ఉద్దేశ్యం ఉంది. కాని స్కూల్లో చదువుకుని, ఆటల్లో అలిసిపోయిన పిల్లలకు పోషకాలు ఎంతో ముఖ్యం. పోషకాలు, రుచి ఈ రెండిటికి సరిపడదు అనుకోవడం పొరపాటే. ఈ రెండిటినీ కలిపి పిల్లలకు నచ్చేవిధంగా స్నాక్స్ తయారు చేయవచ్చు. అది కూడా కేవలం కొద్ది సమయంలో. ఇవి ప్రయత్నించి చూడండి.

రాగి కుకీస్

ఈ కుకీస్‌లో కాల్షియం అధికంగా ఉంటుంది. పళ్లు, ఎముకలు గట్టిగా



ఉండాలంటే కాల్షియం తప్పనిసరి. 100 గ్రాముల రాగిలో 330 కేలరీల కాల్షియం ఉంటుంది.

తయారీ:

ఒక కప్పు రాగిపిండిలో అరస్పూన్ యాలకుల పొడి వేసి ఒక పాన్‌లో రెండు నిమిషాలు వేయించాలి. ఆ పిండిలో ఒక గిలకొట్టిన కోడిగుడ్డు, అరస్పూన్ ఉప్పు, రెండు చిటికెలు శొంఠి కలపాలి. అందులో అరకప్పు నూనెను కలిపి ఒక చిక్కటి మిశ్రమంలా తయారయ్యేవరకు కలపాలి. దానితో గుండ్రటి ఉండలు చేయాలి. ఉండలను చదునుగా ఒత్తి వాటిని 8 నిమిషాలపాటు 180 డిగ్రీల సెల్సియస్ వేడిలో ముందుగా వేడి చేసిన ఓవెన్‌లో పెట్టాలి. కుకీస్ తయారవుతాయి.

పొట్టుధాన్యాల క్రేకర్స్



పొట్టు గోధుమల పిండిలో కార్బోహైడ్రేట్లతోపాటు పీచుపదార్థం కూడా ఉంటుంది. అరుగుదల బావుంటుంది. పైగా పిల్లలకు రోజంతా కావలసినంత శక్తిని ఇస్తుంది. అవిసె గింజలు ఒక టేబుల్‌స్పూన్ తీసుకోవాలి. రెండు గ్రాముల అవిసెగింజలలో పాలీ అన్‌సాచ్యురేటెడ్ ఫ్యాటీ యాసిడ్లు, ఫిటోకెమికల్స్, అరుగుదలకు ఉపయోగపడే పీచుపదార్థాలు ఉంటాయి.

తయారీ:

అరకప్పు పొట్టు గోధుమల పిండిని ఒకటిన్నర టేబుల్‌స్పూన్ల నూనెతో కలిపి చపాతీ పిండిలా చేయాలి. విడిగా అరకప్పు ఓట్స్, రెండు టేబుల్‌స్పూన్ల అవిసెగింజలు, నాలుగు టేబుల్‌స్పూన్ల తెల్లనువ్వుల గింజలు, ఒక టేబుల్‌స్పూన్ ఎండుమిరపకాయల ఫ్లేక్స్ కలిపి పొడిగా తయారుచేయాలి. ఈ పొడిని కలుపుకున్న పిండికి కలపాలి. ఒక కుకీ కట్టర్ తీసుకుని గుండ్రని ఆకారంలో కట్ చేసుకోవాలి. ఓవెన్‌ను ముందుగా వేడిచేసి పెట్టుకుని 180 డిగ్రీల సెల్సియస్ వేడిలో 20 నిమిషాలపాటు కుక్ చేయాలి. బయటకు తీసిన క్రేకర్స్‌ను చల్లారాక గాలి చొరబడని సీసాలో ఉంచాలి. అవసరమైనప్పుడు మాత్రమే మూత తీయాలి.

ఆల్మండ్ గ్రానోలా బార్

ఆరోగ్యకరమైన, రుచికరమైన స్నాక్‌లలో ఉన్న ఓట్స్ ద్వారా 71 శాతం కార్బోహైడ్రేట్లు, 16 శాతం ప్రొటీన్, 11 శాతం పీచు పదార్థం ఉంటాయి. అన్నీ పోషకాలనిచ్చే పదార్థాలే. గోధుమలో థయామిన్, ఫోలేట్, విటమిన్ బి6, మాంగనీస్, జింకు, మెగ్నీషియం లాటి మినరల్స్ ఉంటాయి.

తయారీ:



ఒక గిన్నెలో నీళ్లు వేడిచేయాలి. అందులో 225 గ్రాముల బెల్లం, 150 మిల్లీలీటర్ల తేనె వేయాలి. విడిగా ఒక పాన్‌లో 225 గ్రాముల తెల్ల ఓట్స్, 90 గ్రాముల ఎండు కొబ్బరి, 200 గ్రాముల బాదం, 25 గ్రాముల నువ్వులు, 25 గ్రాముల మల్టీగ్రెయిన్ గింజలు వేయించుకుని పొడిచేసుకుని పెట్టుకోవాలి. బెల్లం, తేనె మిశ్రమానికి ఈ పొడిని జతచేయాలి. ఒక ట్రేలో సిల్వర్ పేపర్ పరిచి ఆ మిశ్రమాన్ని అందులో వేయాలి. 30 నిమిషాలసేపు 180 డిగ్రీల సెల్సియస్ వేడిలో బేక్ చేయాలి. తర్వాత ముక్కలుగా కట్ చేసుకోవాలి.

వంటింటి మెలకువలు

సిట్రస్ పండ్లు, టొమాటో, చీజ్, చాకొలెట్ ఇవి ఫ్రిజ్‌లో పెట్టేకంటే గది ఉష్ణోగ్రతలోనే ఎక్కువ రుచిగా ఉంటాయి.

ఏం తిన్నా చేతికి అంటుకున్న వాసన అంత త్వరగా పోదు. చేతి నుంచి వాసనలు పోవాలంటే చేతులను ఉప్పుతో కడుక్కోవాలి, లేక అరచేతులను స్టెయిన్‌లెస్ స్టీల్ ట్యాప్‌కేసి రుద్దుకోవాలి.

పప్పుచారు, రసం, లేదా సూప్‌లో ఉప్పు ఎక్కువైందా? అందులో ఒక ఉడికించిన ఆలుగడ్డను వేయండి. పదినిమిషాల్లో అది ఉప్పును పీల్చుకుంటుంది.

పచ్చిమిరపకాయ తరిగిన తర్వాత చేతులను పొరపాటున కంటికి తగిలిస్తే కళ్లు మండుతాయి. చేతులకు ఆ మంట చాలాసేపు ఉంటుంది. అలా చేతికి కారం పట్టకుండా ఉండాలంటే పచ్చిమిర్చి తరిగేముందు అరచేతులకు వెజిటబుల్ ఆయిల్ రాసుకోవాలి.

నీటిలో కొద్దిగా బైకార్బ్ వేసి తర్వాత వాటిని చన్నీళ్లలో వేస్తే కోడిగుడ్డు మీద తొక్కలు త్వరగా వస్తాయి.



చింతన

మాఘంలో స్నానంతో ఘనఫలం



మాఘ మాసం వచ్చింది. మాఘమాసంలో స్నానం ఎంతో పుణ్యప్రదం. పద్మ పురాణం ఉత్తర ఖండంలో 124వ అధ్యాయం నుంచి 128వ అధ్యాయం వరకు మాఘమాస మాహాత్మ్యం, మాఘ స్నాన మాహాత్మ్యం 1022 శ్లోకాలలో వర్ణించబడింది. దిలీప - హరిత సంవాద రూపంగా, దిలీప వసిష్ఠ సంవాద రూపంగా ఈ విషయం వర్ణించారు. మాఘమాస పుణ్య నదీ స్నానం, విశేషించి ప్రయాగ స్నాన మహిమ విస్తృతంగా వర్ణితమైంది. ఇంద్రుడు అహల్యాసంగమ కృత పాపాన్ని మాఘమాసంలో ప్రయాగ స్నానం తో తొలగించుకున్న గాథ, ఒక వేశ్య కుబ్జకా ప్రయాగలో మాఘ స్నానంతో పుంజికస్థల అనే అప్సరసగా అవతరించిన మహిమ వంటి ఎన్నో వృత్తాంతాలను వ్యాస భగవానుడు అతి మనోహ రంగా వర్ణించాడు.

వినా వహ్నిం వినా యజ్ఞం
ఇష్టాపూర్తం వినా ప్రియే
వాంఛన్తి సద్గతిం స్నాతుం
ప్రాతర్మాఘే బహిర్జలే

అగ్నిహోత్రం లేకుండా, యజ్ఞం లేకుండా, దానధర్మాలు, బావులు, చెరువులు తవ్వించడం వంటివి చేయకుండా సద్గతి కోరు వారు మాఘమాసంలో నదీ జలా ల్లో స్నానమాచరించ గోరు తారు.

హరేః పూజాచ వైశాఖే
తపః పూజాచ కార్తికే
తపో హోమస్తథా దానం
త్రయం మాఘే విశిష్యతే

వైశాఖ మాసంలో శ్రీహరిపూజ, కార్తికంలో తపస్సు పూజ, మాఘమాసాన తపస్సు, పూజ, హోమం, దానం, స్నానం ఈ నాలుగు విశేష ఫలప్రదాలని ఈ శ్లోక భావం.

అదితి ప్రయాగలో 12 సంవత్సరాల పాటు ప్రతి మాఘమాసంలో ఉపవాసంతో స్నానం ఆచరించి, ద్వాదశాదిత్యులను పుత్రులుగా పొందింది. రోహిణి మాఘ మాసంలో ప్రయాగ స్నానం చేసి చంద్రునికి ప్రియురాలైంది. అరుంధతి మాఘ మాసంలో స్నానం, దానం చేసి వసిష్ఠుని భర్తగా పొందింది. శచీ దేవి మాఘ మాసంలో ప్రయాగలో స్నానం, దానం చేసి ఇంద్రపత్ని అయింది.

మాఘ మాసంలో బహుదానాలు చేసి శ్రీమన్నారాయణుని ఆరాధించి నవారు, తనకు బాగా ఇష్టమైన వస్తువును పరిత్యజించినవారు, నియమ నిష్ఠలను ఆచరించినవారు అఖిలాభీష్టములను పొంది, అంత్యమున విష్ణు సాయుజ్యం పొందుతారు. మాఘ మాసంలో బహిర్జలంలో స్నానమాచరించి గోదానం చేసినవారు, బెల్లంతో నువ్వులను దానం చేసిన వారు పునరావృత్తిరహితమైన మోక్షాన్ని పొందుతారు. ఇతర పుణ్యాలను ఆచరించినవారు స్వర్గానికి వెళ్లి తిరిగి వస్తారు. మాఘ స్నానం చేసినవారు తిరిగిరారు. జ్ఞాన శీలులకు, వనవాసులకు, విష్ణు భక్తులకు లభించు లోకాలు మాఘ మాసంలో నదీ స్నానం చేసిన వారికి లభించును. దానం చేయకుండా మాఘ మాసమును గడుపరాదు.

నమాఘేన సమో మాసః
న గంగా సదృశీ నదీ
న విష్ణుసదృశోదేవః
నాస్త్యత్ర చ పరత్రచ

అనేది పద్మ పురాణ వచనం.

మాఘ మాసంలో అందుబాటులో ఉన్న నదిలో స్నానం చేయండి, చేయించండి. అన్నీ చేయలేకున్నా స్నాన మాహాత్మ్యాన్ని సవివరంగా చదివినా అనంత పుణ్యం వస్తుంది.

> **మాఘ మాసంలో బహుదానాలు చేసి శ్రీమన్నారాయణుని ఆరాధించినవారు, తనకు బాగా ఇష్టమైన వస్తువును పరిత్యజించినవారు, నియమ నిష్ఠలను ఆచరించినవారు అఖిలాభీష్టములను పొంది, అంత్యమున విష్ణు సాయుజ్యం పొందుతారు.**



- డా॥ కందాడై రామానుజాచార్య

శరీరమందే ఉన్నా ఆత్మ దేహంతో కలవదు



భగవద్గీత

అధ్యాయం-13
శ్లోకం -33

యథా సర్వగతం సౌక్ష్మ్యాత్
ఆకాశం నోపలిప్యతే।
సర్వత్రావస్థితో దేహే
తథాత్మా నోపలిప్యతే॥

తాత్పర్యం

సర్వత్ర వ్యాపించియున్నను సూక్ష్మత్వ కారణముగా ఆకాశము దేనితోను కలియనట్లు, బ్రహ్మ భావములో నిలిచిన ఆత్మ దేహము నందు నిలిచియున్నను దేహముతో కలియదు.

భాష్యం

గాలి ఎంత సూక్ష్మమైనదంటే అది నీరు, భూమి, మలము ఇలా అన్నింటి యందును ప్రవేశించును. అయితే గాలి దేనితోనూ మిశ్రితము కాదు. అలాగే ఆత్మ వేరు వేరు శరీరాల్లో ఉన్నప్పటికీ, తన సూక్ష్మ ప్రభావం వలన శరీరమునకు భిన్నముగానే తన స్థితిని కలిగి ఉంటుంది. కాబట్టి భౌతిక దృష్టికి ఆత్మ శరీరముతో ఉంటూ ఎలా వేరుగా ఉంటుందో అర్ధము చేసుకొనుట సాధ్యము కాదు. మన ఆధునిక విజ్ఞానమునకు కూడా ఇది అంతుపట్టలేదు.

అంతర్జాతీయ కృష్ణ చైతన్యసంఘ సంస్థాపకాచార్యులు కృష్ణ కృపామూర్తి శ్రీశ్రీల ఎసి భక్తి వేదాంతస్వామి ప్రభుపాదులు రచించిన 'భగవద్గీత' యథాతథము ఆధారంగా సమర్పిస్తున్నాము.

Google play | iOS iTunes

సంక్షిప్త రామాయణం

అత్రి అనసూయల ఆదరణ




చిత్రకూట పర్వతమందున్న ఋషులు దండకారణ్యంలోని ఖరదూషణులనే రాక్షసుల అనుచరుల ఆగడాలను, దుష్కృత్యాలను సహింపలేకపోయారు. వారు తమలో తాము గుసగుసలాడుకోవడం రాముడు గమనించాడు. దానితో తమ దోషం ఏదైనా ఉందా అని కులపతిని అడిగాడు. 'రామా! మీరు ఇక్కడికి వచ్చిన తరువాత రాక్షసులు మితిమీరి ప్రవర్తిస్తున్నారు. రాక్షసులు నీరు పోసి హోమాగ్నులను ఆర్పివేస్తున్నారు. స్రుక్కు, స్రువం మొదలైన యజ్ఞోపకరణాలను ధ్వంసం చేస్తున్నారు. అందువల్ల అందరూ సురక్షిత ప్రాంతానికి వెళ్లాలనుకుంటున్నారు. మీరు కూడా మాతో రావచ్చు కదా!' అన్నాడు కులపతి. 'నేను ఉండగా మీకు భయమేల? నేను మిమ్మల్ని కాపాడగలను' అని రాముడు అభయమిచ్చాడు. కాని వారందరూ కులపతితో పాటు వెళ్లిపోయారు. వన వాసానికి వచ్చిన తరువాత రాముడు ముని సమూహం లేకుండా ఒంటరి జీవితం గడపాల్సి వచ్చింది. వారు వెళ్ళిన తరువాత రామునికి దిక్కు తోచలేదు. దానికి తోడు తల్లులు వచ్చి ఏడ్చిన దృశ్యాలే కనుల ముందు మెదులుతున్నాయి. మనస్సు స్థిమితంగా ఉండడం లేదు. భరతుడి సైన్యం రావడం వల్ల అక్కడి ప్రశాంత వాతావరణానికి భంగం కలిగింది. మృగాలన్నీ భయపడి స్వేచ్ఛగా సంచరించడం లేదు. ప్రజలు తమను చూడడానికి మరల మరల రావచ్చు, తమ ప్రశాంత జీవనానికి అడ్డుపడవచ్చు అని భావించి, రాముడు, సీతా లక్ష్మణులతో అత్రి ముని ఆశ్రమానికి బయలుదేరాడు. వృద్ధుడైన అత్రి మహర్షి వారిని సాదరంగా ఆహ్వానించాడు.

అత్రి, పండు ముసలిదైన తన భార్య అనసూయను పరిచయం చేశాడు. 'అనసూయ సార్థక నామధేయురాలు. ఒకప్పుడు పది సంవత్సరాలపాటు అనావృష్టి వల్ల కరువు కాటకాలు తాండవించాయి. తినడానికి తిండి, త్రాగడానికి నీరులేక జనులు మలమల మాడిపోయారు. అనసూయ దుష్కరమైన తపస్సు చేసి, తన తపో మహిమతో కందమూల ఫలాలను సృష్టించింది. గంగానదిని రప్పించింది. అందరి ఆకలిదప్పులను తీర్చింది. ఈ మాతృమూర్తి వెంట వెళ్లమ్మా!' అని సీతతో అన్నాడు అత్రి. సీత రాముని అనుమతి పొంది, అనసూయను అనుసరించి పర్ణశాలలోనికి వెళ్ళింది. సీత భర్తతో పాటు వనవాసం చేస్తున్నందుకు అనసూయ అభినందించింది. 'భర్తను సేవించిన భార్య ఉత్తమురాలు. భర్త మాత్రమే భార్య హితాన్ని కోరుతాడు. భర్తలను సాధించే స్త్రీలు అపకీర్తి పాలవుతారు. నీ వంటి సహధర్మచారిణులకు స్వర్గం సులభంగా లభిస్తుంది. తపస్సుగాని, ధర్మకార్యాలు గాని, వ్రతాలుగాని పతి సేవకు సాటిరావు' అని అనసూయ స్త్రీ ధర్మాలు సీతకు తెలిపింది. సీత అనసూయ మాటలు విని, 'నా భర్త సకల సుగుణాభిరాముడు. భార్యకు భర్తే ప్రత్యక్షదైవం అని నేను ముందే గ్రహించాను. నేను సర్వకాలసర్వావస్థలయందు త్రికరణ శుద్ధితో భర్తను సేవిస్తున్నాను. నీ మాటల వల్ల, నా అత్త కౌసల్య మాటలు, మా అమ్మ హితవాక్యాలు మరల స్ఫురణకు వచ్చాయి. పతిని సేవించడమే సతికి తపస్సువంటిది. నీవు, సావిత్రి, రోహిణి పతి సేవ వల్ల దేవతల చేత కూడా గౌరవింపబడ్డారు కదా!' అన్నది.

అనసూయ వాత్సల్యంతో సీత మూర్ధాన్ని ముద్దాడింది. 'నేను తీవ్రమైన తపస్సు చేశాను. నా తపో మహిమతో నీవు కోరిన వరాన్ని ఇవ్వగలను' అన్నది అనసూయ. దానికి సీత బదులిస్తూ, 'నీ తీయని మాటలతోనే నా కోరికలన్నీ తీరాయి. ప్రత్యేకంగా నాకు వరమెందుకు? అన్నది. అయితే అనసూయ, 'సీతా! ఈ పూలమాలలు, వస్త్రాలు, ఆభరణాలు, కుంకుమ, పసుపు, గంధములను స్వీకరింపుము. ఇవి నీకు శోభను ఇస్తాయి' అని అనసూయ సీతకు కానుకలను ఇచ్చింది. సీత భక్తి శ్రద్ధలతో స్వీకరించింది.

- కె.ఓబులేశు
9052847742

నేనెవడను?



మనస్సణగుటకు వేరు ఉపాయములు లేవా?

మనస్సు అణగారుటకు విచారణ తప్ప వేరే మంచి ఉపాయాలు లేవు. ఒకవేళ ఇతర ఉపాయాల చేత అణగినా, మనస్సు కాసేపు అణగినట్లుండి, తిరిగి లేస్తుంది. ప్రాణాయామం చేత కూడా మనస్సు అణుగుతుంది. అయితే ప్రాణం నిరోధమై ఉండేవరకు మనస్సు కూడా అణగి ఉండి, ప్రాణము మరల బయటకు కదిలేటప్పటికి మనస్సు కూడా బయటకు వచ్చి వాసనల వశం చేత అలసిపోతుంది. మనస్సుకు, ప్రాణానికి పుట్టుచోటు ఒక్కటే. తలపే మనస్సు స్వరూపం. నేననే తలపే మనస్సు యొక్క తొలి తలపు. అదే అహంకారము, అహంకారం ఎక్కడ పుడుతుందో అక్కడి నుండే శ్వాస (ప్రాణము) బయలుదేరుతుంది. అందుచేత మనస్సు అణిగితే ప్రాణం, ప్రాణం అణిగితే మనస్సు పరస్పరంగా అణుగుతుంటాయి. అయితే సుషుప్తిలో (నిద్ర) మనస్సు అణగినా ప్రాణం అణగుట లేదు. దేహరక్షణ కోసం, దేహం ఉన్నదో, మరణించినదో అనే సందేహం కలగకుండా ఈశ్వర నియతి చేత ఈ విధంగా ఏర్పడినది. జాగ్రత్తులోను, సమాధిలోను మనస్సు అణగినప్పుడు ప్రాణము కూడా అణగు తోంది. ప్రాణం అనేది మనస్సు యొక్క స్థూలరూపం. మరణకాలం దాకా మనస్సు ప్రాణాన్ని శరీరంలో నిలుపుకుని ఉండి, దేహం మరణించే సమయంలో దానిని కబళించుకుని (ఇముడ్చుకుని) పోవుచున్నది. కాబట్టి, ప్రాణాయామం మనస్సు లోబడుటకు సహకరిస్తుందేగాని నశింప చెయ్యదు.

ప్రశ్నలు-సమాధానాలు

ప్రాణాయామం లాగే మూర్తి (రూప) ధ్యానము, మంత్రజపము, ఆహారనియమము మొదలైనవి మనస్సును లొంగదీసేందుకు సహకారులే. మూర్తి ధ్యానం చేత, మంత్రజపం చేత మనస్సు ఏకాగ్రతను చెందుచున్నది. ఎల్లప్పుడూ చలిస్తూ ఉండే ఏనుగు తొండానికి ఒక ఇనుప గొలుసును అందిస్తే ఆ ఏనుగు వేరొకదానికై చూడక దానినే పట్టుకుని ఏవిధంగా పోతుందో, అదేవిధంగా సదా సంచ లించే మనస్సును ఏదో ఒక నామంలోనో, రూపంలోనో అలవాటు చేసి నచో దానిని గ్రహించి ఉంటుంది. మనస్సు అంతు లేని తలపులుగా విస్తరించుట చేత ఒక్కొక్క తలపు అతి బలహీన మవుతుంది. తలపులు ఉడిగి క్షీణిస్తూ క్షీణిస్తూ, ఏకాగ్రస్థితిని పొందుట ద్వారా మనస్సు శక్తివంతమై ఆత్మ విచారణ సులువుగా సిద్ధిస్తుంది. నియమాల న్నింటిలోనూ శ్రేష్ఠమైన మిత సాత్త్విక ఆహార నియతి చేత మనస్సు యొక్క సత్త్వగుణము పెంపొంది ఆత్మ విచారానికి సాయపడుతుంది.

అనువాదం: ప్రణవానందులు

శ్రీ రమణాశ్రమము, తిరువణ్ణామలై వారి సౌజన్యంతో

Facebook page https://www.facebook.com/ Sri Ramana Telugu
website http://www.sriramanamaharshi.org/ tel/

దిన ఫలాలు

మేష రాశి: విద్యా ప్రయత్నాలు అనుకూలం. మంచి కార్యాలలో పేరు, ప్రఖ్యాతులు లభిస్తాయి. ఆరోగ్యంలో ప్రతికూలత తగ్గుతుంది. ఆదాయమార్గాలు సులభతరమవుతాయి.

వృషభ రాశి: ఆర్థిక ప్రయత్నాలు ఊరట కలిగిస్తాయి. స్థిరాస్తి విక్రయాలు వంటివి ఉపకరిస్తాయి. విద్యా విషయాల్లో ప్రాధాన్యత లభిస్తుంది. ఆరోగ్య విషయంలో అశ్రద్ధ పనికిరాదు. ఆర్థిక విషయాల్లో విస్మయాలు ఉంటాయి. ఆదాయవృద్ధిలో ఆటంకాలు కొనసాగుతాయి.

మిథున రాశి: సాహస నిర్ణయాలు ఊరట కలిగిస్తాయి. కోర్టు వ్యవహారాలలో ఉపశమనం ఉంటుంది. ఆర్థిక వ్యవహారాల్లో అనుకూలత ప్రారంభమవుతుంది. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. పనులలో వేగం పెరుగుతుంది. ఆదాయంలో గట్టి ప్రయత్నాలు కలసి వస్తాయి.

కర్కాటక రాశి: శ్రమ అధికమవుతుంది. పిల్లల విషయంలో శ్రద్ధ తప్పనిసరి. ఆరోగ్య ప్రతికూలత ఉంటుంది. అనవసర ఆందోళనలు పెరుగుతాయి. ఆదాయ మార్గాలు అన్వేషించగలుగుతారు.

సింహ రాశి: గృహకార్యాలు, కార్యక్రమాలు అనుకూలం. ఆర్థిక క్రమశిక్షణ తప్పనిసరి. పెట్టుబడుల ప్రతిబంధకాలు ప్రబలమవుతాయి. ఆరోగ్యం అనుకూలత పెరుగుతుంది. వ్యాపార మోసాలను గ్రహించలేకపోతారు. ఆదాయంలో అయోమయ పరిస్థితులున్నా అధిగమించగలుగుతారు.

కన్యా రాశి: తెలివైన నిర్ణయాలు తద్వారా విజయాలు చేకూరుతాయి. ఆహ్లాద పరిస్థితులు గృహరీత్యా ఉంటాయి. వ్యాపార విజయాలు కొనసాగుతాయి. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. స్థిరాస్తి విషయాల్లో చిరాకులు పరిష్కరింపబడతాయి. ఆదాయ మార్గాలు సులభతరమవుతాయి.

తులా రాశి: విదేశీ లావాదేవీలు/ సంభాషణలు కలసి వస్తాయి. కోర్టు వ్యవహారాలు లాభిస్తాయి. ఖర్చులు అధికమవుతాయి. మెరుగైన పరిస్థితులు ఆరోగ్య రీత్యా ఆనందాన్ని కలిగిస్తాయి. అతి తొందర ద్వారా కార్యక్రమాల్లో పొరపాట్లు దొర్లుతాయి. ఆదాయంలో మంచి లాభాలను కూడగట్టుకొనే ప్రయత్నాలు అనుకూలిస్తాయి.


వృశ్చిక రాశి: రాజకీయ నిర్ణయాలు అనుకూలం. నూతన ఒప్పందాలు కలసి వస్తాయి. పరీక్షలు ఆరోగ్య పరంగా ఉపకరిస్తాయి. శ్రమ అధికమవుతుంది. ఆరోగ్యంలో జాగ్రత్తలు పాటించాలి. పనులలో ఆలస్యం ఉంటుంది. ఆదాయం పర్వాలేదు.

ధనూ రాశి: ఉద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి. నూతన స్నేహాల ద్వారా లబ్ధి చేకూరుతుంది. వ్యాపార ప్రతిబంధకాలను ఎదుర్కోగలుగుతారు. ఆరోగ్యంలో ప్రతికూలత తగ్గుతుంది. గతంలోని తప్పులు సరిదిద్దుకొనే అవకాశాలు లభిస్తాయి. ఆదాయంలో మెరుగైన అవకాశాలు దగ్గరవుతాయి.

మకర రాశి: సంభాషణల విషయంలో జాగ్రత్తలు పాటించాలి. కోర్టు వ్యవహారాలు ఊరట కలిగిస్తాయి. ప్రయాణాల విషయంలో జాగ్రత్తలు తప్పనిసరి. ఆరోగ్య ప్రతికూలత ఆకస్మికం. బాధ్యతలు పెరుగుతాయి. ఆదాయం గట్టి ప్రయత్నాలతో మాత్రమే సాధ్యం.

కుంభ రాశి: నూతన ఉత్సాహం పెరుగుతుంది. విద్యా ప్రయత్నాలు లాభిస్తాయి. శుభవార్తలు వింటారు. శుభ వ్యయం ఉంటుంది. ఆరోగ్య విషయంలో ప్రతికూలత తగ్గుతుంది. పోటీని తట్టుకోగలుగుతారు. ఆదాయంలో ప్రోత్సాహ పరిస్థితులు మాత్రం ఆనందాన్ని కలిగిస్తాయి.

మీన రాశి: ఋణ ప్రయత్నాలు లాభిస్తాయి. కోర్టు వ్యవహారాల్లో ఉపశమనం ఉంటుంది. ఆరోగ్య సమస్యల నుండి ఉపశమనం లభిస్తుంది. ఆరోగ్యరీత్యా శ్రద్ధ పాటించాలి. ముఖ్యమైన పనుల విషయంలో ఏకాగ్రత తప్పనిసరి. ఆదాయంలో జాగ్రత్తతో కూడిన నిర్ణయాలు ఉపకరిస్తాయి.



శ్రీ నూకల సూర్యనారాయణ
nookalasuryanarayana@gmail.com

కులాసా



టెక్నాలజీ పుణ్యమా అని మోడ్రన్ డేస్‌లో మనిషి ఒళ్లు వంచి పనిచేయడం అరుదుగా కనిపిస్తుంది. ఇంట్లో, బయట ఎక్కడైనా సరే గంటల తరబడి కుర్చీల్లో కూర్చునే పనిచేస్తున్నారు. చెమట చుక్క రాలకుండానే లక్షలు సంపాదిస్తున్నారు. ఈ సంపాదనలో పడి ఆరోగ్యం గూర్చి అస్సలు పట్టించుకోవడం మానేశారు. జీవనశైలి మారడంతో హైపర్‌టెన్షన్, షుగర్ వంటి రుగ్మతలు మనల్ని వెంటాడుతాయి. హైపర్ టెన్షన్ వ్యాధి కాదు. ఒక రుగ్మత అని మనలో చాలా మందికి తెలియదు. జీవనశైలి మార్పులతో హైపర్‌టెన్షన్‌ని నివారించవచ్చని ప్రముఖ ఆయుర్వేద వైద్య నిపుణులు డాక్టర్ ప్రతాప్ చౌహాన్ 'కులాస'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలియజేశారు. ఆ వివరాలేంటో తెలుసుకుందాం..

హైపర్‌టెన్షన్ సైలెంట్ కిల్లర్

అసలు హైపర్‌టెన్షన్ అంటే ఏమిటి?

ఒత్తిడి. ఈ ఒత్తిడి వల్ల మనిషి జీవితంలో నాణ్యత తగ్గిపోతుంది. ఒత్తిడిని ఎదుర్కొనే క్రమంలో ప్రకృతికి దూరంగా వెళ్లిపోతున్నాం. ఎప్పుడైతే ప్రకృతికి మనం ఎంత దూరం వెళ్లిపోతామో రుగ్మతలు, వ్యాధులు మనకు అంత దగ్గరవుతాయి. అలాంటి వాటిలో హైపర్‌టెన్షన్ ఒకటి. హైపర్‌టెన్షన్‌ని ఆయుర్వేదంలో రక్తపోటు అంటారు. రక్తనాళాల్లో ఒత్తిడిపెరిగితే హైపర్‌టెన్షన్ వచ్చినట్టే. వ్యక్తి వయసును బట్టి రక్తపోటు నమోదవుతుంది. స్త్రీలలో కంటే పురుషుల్లో హైపర్‌టెన్షన్ వచ్చే అవకాశాలు మెండుగా ఉన్నాయి. వారి మానసిక, శారీరక కార్యకలాపాలను బట్టి హైపర్‌టెన్షన్ ఉంటుంది. కుటుంబ చరిత్ర ఆధారంగా కూడా ఇది వస్తుంది. మనం తీసుకునే ఆహారం బట్టీ హైపర్‌టెన్షన్ తగ్గడం లేదా పెరగడం జరుగుతుంది.

హైపర్‌టెన్షన్ నిశ్శబ్ద హంతకి అని చెప్పొచ్చు. ప్రపంచ జనాభాలో 15 నుంచి 37శాతం మంది ఈ రుగ్మతకు ప్రభావితులవుతున్నారు. ఇది ఆందోళనకర పరిణామం. నిర్ధారణ జరగకపోతే చికిత్స ప్రారంభించడం సాధ్యం కాదు. కాబట్టి ప్రతి ఒక్కరూ హైపర్‌టెన్షన్‌ని ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఉండాలి. గుండె వ్యాధి, కిడ్నీలు వైఫల్యం చెందడం హైపర్‌టెన్షన్ వల్లేనని గమనించాలి.

హైపర్‌టెన్షన్ కారణాలు

అనారోగ్య ఆహారం తీసుకోవడం, శారీరక శ్రమ లేని జీవనశైలి వల్ల నేడు హైపర్‌టెన్షన్ వచ్చే ప్రమాదముంది. పూర్వం రోజుల్లో ఇంట్లో వండిన ఆహారపదార్థాలనే తినేవారు. ఇప్పుడు ఫాస్ట్‌ఫుడ్‌కి అలవాటవుతున్నారు. ఇంట్లో వంటి చేసుకునే ఓపిక తగ్గిపోయింది. వారంతాల్లో ఫ్యామిలీతో కల్సి హోటల్స్‌కు వెళ్లి భోజనాలు చేస్తున్నారు. హోటల్స్‌లో చేసే వంటల్లో ఉప్పు వినియోగం ఎక్కువే. హైపర్‌టెన్షన్ రావడానికి ప్రధాన శత్రువు ఉప్పు అని గమనించాలి. ఆహారపదార్థాలు చెడిపోకూడదన్న ఉద్దేశ్యంతో రసాయనాలను వినియోగిస్తున్నారు. దీనివల్ల జీర్ణ సంబంధ సమస్యలు ప్రారంభమవుతాయి. అజీర్ణం వల్ల విషపదార్థాలు ఉత్పత్తి అవుతాయి. ఈ విషపదార్థాలు హైపర్‌టెన్షన్‌కి దారితీస్తాయి. మనం తీసుకునే ఆహారం జఠరాగ్ని వల్ల వెంటనే జీర్ణమవుతుంది. జఠరాగ్ని న్యూట్రియంట్ ప్లాస్మాను ఉత్పత్తి చేస్తుంది. ఈ న్యూట్రియంట్ ప్లాస్మా శరీర కణజాలానికి అవసరం. దీనివల్ల ఆరోగ్యకర రక్తం శరీరంలోని వివిధ భాగాలకు సరఫరా అయ్యేటట్లు చేస్తుంది.

హైపర్‌టెన్షన్‌కి ఆయుర్వేద చికిత్స

హైపర్‌టెన్షన్ ఎందుకు వచ్చిందో కారణం తెలుసుకుంటే చికిత్స చేయడం అంత సులభంగా వస్తుంది. సమస్య మూలాలు తెలుసుకోవడం ద్వారా హైపర్‌టెన్షన్‌ని నిర్మూలన చేయడం సాధ్యమవుతుంది. మనసు ఉపశమనం పొందే టెక్నిక్స్ తెలుసుకోవాలి. యోగా, ధ్యానం వల్ల మనసు ఉపశమనం పొందుతుంది. ప్రాణాయామం వల్ల శరీరానికి ఆక్సిజన్ ఎక్కువ మోతాదులో అందుతుంది. మెదడుకి కావాల్సినంత ఆక్సిజన్ అందితే మనసు ఉపశమనం పొందుతుంది.

హైపర్‌టెన్షన్‌ని తగ్గించే చిట్కాలు

- మూడునాలుగు వెల్లుల్లి రసం తాగాలి. 10-12 తులసి ఆకులను తినాలి. కొద్దిపాటి గోధుమ గడ్డి నమలాలి. ప్రతిరోజు ఇలా చేయడం తప్పని సరి.
- ఒర టీ స్పూన్ ఉల్లిగడ్డ జ్యూస్‌లో అంతే మోతాదులో తేనె కలిపి తాగాలి. ప్రతిరోజు ఒకసారి వారంరోజులపాటు ఆచరించాలి. వారంరోజుల్లో మీకు తేడా కనిపిస్తుంది. ఇలా తేడా కనిపిస్తే మరికొన్ని రోజులు కొనసాగించాలి.
- రాగి బిందెలో మంచినీటిని తెల్లారి లేచిన తర్వాత పరగడపున తాగాలి. మూడునాలుగు గ్లాసులు ఉదయం పూట తాగాలి.
- ంండుమూడు వెల్లుల్లి రెబ్బలను ప్రతిరోజు నమలాలి. వెల్లుల్లి పల్స్ రేట్‌ను తగ్గిస్తుంది. గుండె కొట్టుకునే వేగాన్ని బ్యాలెన్స్ చేస్తుంది.
- నాలుగు తులసి ఆకులు, రెండు వేపాకులు, నాలుగు టీస్పూన్ నీటిలో మిక్స్ చేయాలి. తర్వాత తినాలి.

ఇలా ప్రతిరోజు తీసుకోవాలి. నెలరోజుల వ్యవధిలో పురోగతి కనిపిస్తుంది.

- గ్లాసు నిండా కారెట్ జ్యూస్, బీట్‌రూట్, కీరా, బొప్పాయిని ఉదయం పూట తీసుకోవాలి.
- ఒక గ్రామ్ వెల్లుల్లి పేస్ట్‌ను మజ్జిగలో కలిపి తాగాలి. ప్రతిరోజు రెండుపూటలా తాగాలి.
- పుచ్చకాయ విత్తనాలను 10 గ్రాముల వరకు తీసుకుని దంచాలి. రెండు కప్పుల నీటిలో ఈ పౌడర్ ను కలపాలి. 15 నిమిషాలు మరగనివ్వాలి. ఈ ద్రావకాన్ని ప్రతిరోజు ఉదయం సాయంత్రం వేళల్లో తీసుకోవాలి.

ఉపశమనానికి వనమూలికలు

బ్రహ్మి

ఒత్తిడిని తగ్గించడంలో ఈ వనమూలిక అద్భుతమైన ఔషధం. ఒత్తిడిని తగ్గించే హార్మోన్‌ను విడుదల చేసే విధంగా ఈ ఔషధం పనిచేస్తుంది. అంతేకాదు ఏకాగ్రతను పెంచుతుంది. బ్రహ్మి ఆకులతో తేనీరు పెట్టుకుని తాగాలి.

భ్రింగరాజ్

భ్రింగరాజ్ తేనీరు శరీరంలో ఉన్న విషపదార్థాలను విసర్జించడానికి దోహదపడుతుంది. మెదడును శక్తివంతం చేస్తుంది. అంతేకాదు ఆక్సిజన్‌ను పెంచుతుంది. దీనివల్ల శరీరంలోని అన్ని భాగాలకు రక్తం ద్వారా ఆక్సిజన్ అందుతుంది. భ్రింగరాజ్ ఆయిల్‌తో పుర్రెమీద మసాజ్ చేస్తే రిలాక్స్‌గా ఉంటుంది. మనసులో ఆందోళన దూరమవుతుంది.

జఠామాంసి

జఠామాంసి అనేది ఒత్తిడి, అలసటను తగ్గించే అద్భుతమైన ఔషధం. విషపదార్థాలను విసర్జించడానికి, మనసు రిలాక్స్ గా ఉండటానికి జఠామాంసిని మించిన ఔషధం లేదని చెప్పాలి. రక్తనాళాల్లో ఉన్న పూడికలను తొలగిస్తుంది. ఒక టేబుల్ స్పూన్ జఠామాంసి తీసుకుంటే అందులో సగం టీ స్పూన్ హింగ్ కలపాలి. చిటికెడు లోహభస్మ కలపాలి. మెలకోలిక్ డిప్రెషన్ వ్యాధికి ఈ ఔషధం బాగా పనిచేస్తుంది.

అశ్వగంధ

అశ్వగంధ వల్ల నిద్ర బాగా పడుతుంది. నిద్ర బాగా పడితే హైపర్‌టెన్షన్ తగ్గిపోతుంది. అశ్వగంధ వల్ల శక్తి నిల్వలు పెరుగుతాయి. ప్రతిరోజు 1-2 టేబుల్ స్పూన్ అశ్వగంధ వేరు పౌడర్‌ను తాగితే ఒత్తిడి, ఆందోళన దూరమవుతుంది.

వచ్చ

వచ్చ అనేది అనేక మానసిక రుగ్మతలకు ఔషధంగా పనిచేస్తుంది. మనసు రిలాక్స్ గా ఉంటే హైపర్‌టెన్షన్ దూరమవుతుంది. భోజనం చేసిన గంట రెండుగంటల తర్వాత ఒక టేబుల్ స్పూన్ వచ్చ పౌడర్‌ను నీటిలో కలిపి తీసుకోవాలి. నుదుటిమీద కూడా వచ్చ పౌడర్ పేస్ట్ ను రాసుకుంటే ఉపశమనం లభిస్తుంది.



డాక్టర్ ప్రతాప్ చౌహాన్
ఆయుర్వేద వైద్య నిపుణులు

కీళ్ల నొప్పులకు ఆయుర్వేద చికిత్స



కీళ్ల నొప్పులు ఈ మధ్యకాలంలో అతిచిన్న (30-40) వయస్సులోనే మొదలవుతున్నాయి. ప్రస్తుత జీవన విధానంలో అనేక మార్పులు ఇందుకు ప్రధాన కారణాలు. ముఖ్యంగా ఆహార అలవాట్లలో మార్పులు, సరైన సమయంలో భోజనం చేయకపోవటం, పాస్ట్ ఫుడ్ ఎక్కువగాతినటం, పోషక విలువలు కలిగిన ఆహారం తినకపోవటం, వ్యాయామం చేయకపోవడం కూడా ఇందుకు కారణాలుగా చెప్పవచ్చు. ఈ సమస్య ప్రత్యేకంగా మధుమేహం, స్థూలకాయం, విటమిన్ డి, కాల్షియం, ప్రోటీన్‌లోపం వల్ల కూడా ఈ వ్యాధి వస్తుంది. జీవన విధానంలో కొన్ని రకాలైన మార్పుల వల్ల ప్రధానంగా చెప్పాలంటే అధిక బరువులు మోయటం వల్ల మధ్య వయస్సుకి వచ్చిన తర్వాత కూడా క్రింద కూర్చోవటం ఇలాంటి ఈ సమస్యకు కారణం.

లక్షణాలు



కీళ్లలో సమస్య ఉన్నప్పుడు మోకాళ్లు విపరీతమైన నొప్పిని కలిగిస్తుంది. వాపు, బిగుతుగా పట్టేసినట్టు ఉండటం, నడవడానికి ఇబ్బందిగా ఉంటుంది.చిన్న చిన్నగా కీళ్లు దాని రూపాన్ని కోల్పోవటంతో కాలు యొక్క నిర్మాణంలో కూడ తేడా కనిపిస్తుంది. సకాలంలో దీనికి చికిత్స తీసుకోకపోతే అంగవైకల్యం కలిగే అవకాశం ఉంది. కీళ్లలో అరుగుదల, నష్టం ఎక్కువైనా తరువాత కీళ్లలో కదలిక తగ్గుతుంది. కండరాల పటుత్వంలో అసమానతలు ప్రారంభమవుతాయి. మెట్లు ఎక్కడం, దిగటం వంటి పనులు చెయ్యటం కష్టంగా ఉంటుంది. ఇండియన్ టాయిలెట్స్ ఉపయోగించటం పెద్ద సమస్యగా మారుతుంది.

ఆయుర్వేద చికిత్సా విధానం

ఆయుర్వేదంలో కీళ్ల నొప్పికి చక్కని చికిత్స విధానాలున్నాయి. మన ఆయుర్వేదంలో మోకాళ్లనొప్పికి జానువస్తి, యెలకిడి, పిండస్వేదం మొదలగు చికిత్సల ద్వారా మోకాలు మార్పిడి శస్త్రచికిత్సలు అవసరం లేకుండా, మోకాలు నొప్పులను నివారించవచ్చు.



డాక్టర్ జి క్రాంతికుమార్
కేరళ ఆయుర్వేద పంచకర్మ సెంటర్
రాజమండ్రి
9491888376



నిద్రతో ఆరోగ్యం

రోజుకు కనీసం ఆరుగంటల నిద్ర వల్ల ఆరోగ్యంగా ఉండొచ్చు. నిద్రలేమి వల్ల రక్తనాళాల్లో కొవ్వు పేరుకుపోవడానికి ఎక్కువ అవకాశాలున్నాయి. గుండె సంబంధ వ్యాధులు రావడానికి కూడా నిద్రలేమి ప్రధాన కారణం అని రూఢీ అయ్యింది. నిద్రలేమి వల్ల అలసట, శక్తితగ్గిపోవడం, ఏకాగ్రత కుదరకపోవడం, మనసు కకావికలం కావడం, పిల్లలు స్కూళ్లలో ప్రతిభాపాటవాలు కనబర్చలేరు. పిల్లలు పరీక్షలు రాసేముందు రాత్రి సరిపడినంత నిద్ర పోవాలి. నిద్ర సరిపోకపోతే మాత్రం పరీక్షల్లో రాణించలేరు. వారానికి మూడు రోజులు నిద్ర సరిగ్గా పట్టకపోతే ఇన్‌సోమ్నియా వ్యాధిగా పరిగణించాల్సి ఉంటుంది. పనివేళలు మారిపోవడం, అనారోగ్యకర అలవాట్ల వల్ల ఇటువంటి రుగ్మతలు వచ్చే అవకాశం ఉంది. ఇన్‌సోమ్నియా పిల్లల్లో కంటే పెద్దల్లో ఎక్కువగా కనిపిస్తుంది. ప్రపంచ జనాభాలో 30శాతం మంది నిద్రలేమితో బాధపడుతున్నారని పరిశోధనల్లో వెల్లడైంది.

నిద్రలేమిని వ్యాధి క్రింద పరిగణించకూడదు. ఎందుకంటే ఇదొక రుగ్మత. నిద్రలేమి వల్ల ఒత్తిడి పెరుగుతుంది. డిప్రెషన్ రావడానికి నిద్రలేమి ఒక కారణంగా నిలిచింది. ఆర్థికకారణాల వల్ల, ప్రయాణాలు నిర్ణీత వేళల్లో కాకుండా రాత్రుల్లో జరపడం వల్ల, శారీరక శ్రమ లేని జీవనశైలి, రాత్రిపూట పనిచేయడం వల్ల నిద్రలేమి వస్తుంది.

స్థూలకాయులు, గుండె సంబంధ వ్యాధులు రావడానికి ముందే నిద్రలేమి వస్తున్నట్లు పరిశోధనలో తేలింది. మహిళల్లో రుతుచక్రం నిలిచిపోవడం జరుగుతుంది. అంటే 50 ఏళ్లకు ముందే మెనోపాజ్ వచ్చేస్తుంది.

ఇన్‌సోమ్నియా ఉన్నవారికి ప్రత్యేక లక్షణాలు కనిపిస్తాయి. రాత్రంతా జాగారం చేస్తారు. నిద్రపోయినట్టు తాజాగా అనుభూతి పొందరు. నిద్రపట్టడానికి గంటలతరబడి బెడ్ మీదే ఉంటారు.

నిద్రపట్టడానికి అనుకూల వాతావరణం ఉండాలి. గదిలో వెలుతురు తక్కువగా ఉండాలి. కెఫెన్ వినియోగించకూడదు. కాఫీ తాగడంవల్ల నిద్ర పట్టకపోవచ్చు. రాత్రి పడుకునే ముందు వ్యాయామం చేయకూడదు. ఇలా చేయడం వల్ల నిద్ర పట్టదు. టీవీలకు అతుక్కుపోకూడదు. బ్లూ లైట్ వల్ల నిద్ర రావడం ఆలస్యం అవుతుంది. కాబట్టి పడుకోవడానికి గంటముందే టీవీలను కట్టేయాలి. మందులను వాడే అలవాటు మంచిదికాదు. అయితే యోగా, ధ్యానం వంటివి చేయాలి.



- డాక్టర్ రాహుల్ అగర్వాల్
జనరల్ ఫిజిషియన్

హెల్త్‌కేర్ సర్వీసుల వేదిక 'యూకేర్'

భారతదేశంలోనే అగ్రశ్రేణి ప్రివెంటివ్ హెల్త్ కేర్ సర్వీసుల ప్రొవైడర్ 'యుకేర్' వినియోగదారులకు సురక్షితమైన డిజిటల్ ప్రివెంటివ్ హెల్త్ కేర్ సేవలను అందుబాటులోకి తెచ్చింది. ముంబై ప్రధాన కార్యాలయంగా సేవలందిస్తున్న యూ కేర్ ఫిట్ బిట్ (ఈసీజీ మిషన్) యాప్ అందుబాటులో ఉంది. 24 గంటల అంబులెన్స్, రాయితీతో కూడిన డయాగ్నసిస్ సేవలందిస్తోంది. సబ్ స్క్రైబర్లకు భద్రత కల్పిస్తూ వయో వృద్ధులకు రైడ్ బుక్ చేస్తుంది. ముంబై, ఢిల్లీ-ఎన్‌సీఆర్, హైదరాబాద్, బెంగుళూరు, చెన్నయ్, కోల్‌కత్తా, అహ్మదాబాద్, పుణె నగరాల్లో సేవలందిస్తోంది. కేంద్రీకృతమైన సేవలందిస్తున్న యూకేర్ వచ్చే ఏప్రిల్ నెలాఖనాటికి దేశంలోని అన్ని రాష్ట్రా ల రాజధానులకు విస్తరించాలని లక్ష్యంగా ముందుకు వెళుతోంది. యూ కేర్ భీమా పథకంలో సభ్యుడిగా చేరిన వారం రోజుల్లోనే ఫ్రీఫిట్ బిట్, ఈసీజీ మెషిన్ ఒక వెల్‌కమ్ కిట్‌గా అందజేస్తుంది. బీమా వసతి కల్పిస్తూ ఆరోగ్య పరీక్షలను ఆయా జగరాల్లోని ల్యాబొరేటరీల్లో తనిఖీ చేసేందుకు రాయితీలు కల్పిస్తోంది.

యూ కేర్ వ్యవస్థాపకుడు, మేనేజింగ్ డైరెక్టర్ విక్రాంత్ గుగ్నానీ మాట్లాడుతూ ఉమ్మడి కుటుంబాలు చిన్న కుటుంబాలుగా విడిపోయిన తర్వాత ఉరుకులు, పరుగుల జీవితంలో ప్రివెంటివ్ హెల్త్ కేర్ సొల్యుషన్స్ అందుబాటులోకి తెస్తున్నామని తెలిపారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్‌ఓ)నివేదిక ప్రకారం 25శాతం మంది భారతీయులు 70 సంవత్సరాలు దాటిన తర్వాత జీవనశైలి సంబంధ వ్యాధులతో.. గుండె జబ్బులతో మరణిస్తున్నారు. ఒక విజన్‌తో ప్రివెంటివ్ హెల్త్ కేర్ సేవలను అందుబాటులోకి తెస్తున్నాం. ఒత్తిళ్లకు దూరంగా ప్రజలంతా జీవనం సాగించాలన్నదే యూ కేర్ లక్ష్యం అని చెప్పారు.


పంటి నిర్లక్ష్యం గుండెకు ముప్పు



వచ్చే ఐదేళ్లలో ఊబకాయం, గుండె సంబంధ సమస్యలు ఆరోగ్యానికి పెద్ద ముప్పుగా పరిణమించాయి. తక్షణం వైద్య నిపుణులు జోక్యం చేసుకోకపోతే ఈ సమస్యలు ఊబకాయం, గుండె సంబంధ ఆరోగ్య సమస్యలకు దారితీస్తాయని భారతదేశంలో డెంటల్ కేర్ చెయిన్ 'క్లోవ్ డెంటల్' పేర్కొంది. నోటి పరిరక్షణకు నాణ్యమైన సేవలందిస్తూ సామాజిక నిబద్ధతను పటిష్ట పరిచేందుకు చర్యలు చేపడుతోంది. ఏడు సంవత్సరాల చరిత్ర గల ఈ గ్రూప్ 12 రాష్ట్రా ల్లో సేవలు అందిస్తుంది. తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంలో 45 క్లినిక్‌లు కలిగి ఉంది. తాజాగా 300వ క్లినిక్‌ను ప్రారంభిస్తోంది.


దేశ రాజధాని నగరంలో మారుమూల ప్రాంతంలో క్లోవ్‌డెంటల్ తన 300 క్లినిక్‌ను ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో క్లోవ్ డెంటల్ సీఈవో లూయిస్ షకినోవ్‌స్కీ, లెఫ్టినెంట్ జనరల్ డాక్టర్ విమల్ ఆరోరా, బోర్డు డైరెక్టర్ డాక్టర్ బాసిల్ మౌకారిమ్, డాక్టర్ కిరణ్ అరోరా, ఓలివర్ పెరియర్, డాక్టర్ నితిన్ దోషితో పాటు 350 దంతవైద్యులు పాల్గొన్నారు. డాక్టర్ విమల్ అరోరా స్పందిస్తూ దంత వైద్య శాస్త్ర పరిధిలో నాణ్యమైన మౌలిక వసతుల లేమి, దంతవైద్యులకు సరిపడా శిక్షణ లేమి పెద్ద సవాళ్లుగా నిలిచాయి.

డబ్ల్యుహెచ్‌ఓ సిఫారసుల ప్రకారం ప్రజలు, దంతవైద్యుల మధ్య 1, 7500 నిష్పత్తి ఉండాల్సి ఉండగా, 10,271 మందికి ఒక దంతవైద్యుడు మాత్రమే ఉన్నారు. డాక్టర్ సింగ్ స్పందిస్తూ అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా దంతవైద్యాన్ని అందుబాటులోకి తేవడానికి మౌలిక వసతుల లేమి ఉన్నదన్నారు. క్లోవ్ డెంటల్ నిరంతరాయం అవిశ్రాంతంగా వైద్య సేవలను అందుబాటులోకి తేవడానికి ప్రయత్నిస్తున్నదన్నారు. పొగాకు సంబంధ క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న వారు 2020 నాటికి మొత్తం క్యాన్సర్ బాధితుల్లో 30శాతం, అంతర్జాతీయంగా భారత ఉపఖండంలో మూడోవంతు క్యాన్సర్ బాధితులు ఉన్నారు. ప్రతి నెలా 30వేల రోగులకు వైద్య చికిత్స అందజేస్తున్నామని డాక్టర్ సింగ్ తెలిపారు. క్లినిక్ సేఫ్టీ పారదర్శకత, నైతిక విలువలు, వినియోగదారుడికి సేవలందించడమే ప్రాధాన్యంగా ముందుకు సాగుతున్నామని చెప్పారు.




కలలు తీరే ఆస్కార్‌మెవరికో...

ఈ నెల 24న ఆస్కార్ వేడుక



అమీ ఆడమ్స్

ఆస్కార్...సినీ ప్రపంచపు కలల పురస్కారం. జీవితంలో ఈ గౌరవాన్ని ఒక్కసారైనా అందుకోవాలని ఉవ్విళ్లూరని నటీనటులు, సాంకేతిక నిపుణులు ఉండరు. ఏటా జరిగే ఆస్కార్ వేడుకల్లో అవార్డ్ గోస్ టూ...అని పిలిచే సందర్భం తమకు దక్కాలని అంతా కోరుకుంటారు. ఈ సంతోష సమయం అతి త్వరలో రాబోతోంది. ఈ నెల 24న హాలీవుడ్ డాల్బీ థియేటర్‌లో ఆస్కార్ పురస్కార వేడుకలు జరగనున్నాయి. ఇప్పటికే నామినేషన్స్ ప్రకటించారు. వీటిలో ఆస్కార్ ఆస్కారమెవరికో చూద్దాం...

ఉత్తమ సినిమా పోటీలో బ్లాక్ పాంథర్, బ్లాకన్స్ మాన్, బొహిమినీయన్ రాప్సొడీ, ద ఫేవరేట్, గ్రీన్ బుక్, రోమా, ఎ స్టార్ ఈజ్ బార్న్ లాంటి చిత్రాలున్నాయి. రోమా ఈ పరుగులో ముందుంది. అత్యధిక






అల్ఫాన్సో క్యూరన్


బ్రాడ్లీ కూపర్


యార్గోస్


క్రిస్టియన్ బాలే





91వ అకాడెమీ అవార్డుల కోసం హాలీవుడ్ సిద్ధమవుతోంది. ఈ నెల 24 ఆస్కార్ పురస్కార ప్రదానోత్సవం వైభవంగా జరగనుంది. ఈ సారి కార్యక్రమ వ్యాఖ్యాతలుగా ఏ స్టార్ ఈజ్ బార్న్ చిత్ర జంట లేడీ గ్యాగ, బ్రాడ్లీ కూపర్ వ్యవహరించనున్నారు. గతేడాది ప్రేక్షకుల్ని మెప్పించిన చిత్రాల్లో ఉత్తమ సినిమాలను ఆస్కార్‌లకు ఎంపిక చేయనుంది కమిటీ. ఇప్పటికే నామినేషన్స్ ప్రకటించారు. వాటిలో అల్ఫాన్సో క్యూరన్ రోమా, యార్గోస్ లుంథిమాస్ ద ఫేవరైట్ పదేసి విభాగాల్లో నామినేట్ అయ్యాయి. వీటిలో ఉత్తమ చిత్రంతో పాటు ఉత్తమ నటి, నటుడు, దర్శకుడు వంటి కీలక విభాగాలు ఉన్నాయి. ఇక ఎనిమిదేసి నామినేషన్స్‌తో ఏ స్టార్ ఈజ్ బార్న్, వైస్ చిత్రాలు పోటీలో ముందున్నాయి. నామినేషన్స్ చూస్తే ఏ విభాగంలో ఎవరు, ఏ సినిమా ఆస్కార్ గెల్చుకుంటుందో అని చెప్పే ఎర్లీ ప్రెడిక్షన్స్ వచ్చేశాయి. వాటి ప్రకారం చూస్తే ఉత్తమ దర్శకుడి పోటీలో ఆల్ఫాన్సో క్యూరన్ ముందున్నారు. ఆయన రూపొందించిన నెట్ ఫ్లిక్స్ చిత్రం రోమా ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంది. 70వ దశకపు మెక్సికన్ మధ్య తరగతి జీవితాన్ని క్యూరన్ తెరకెక్కించిన విధానం అద్భుతంగా సాగింది. ఇక పీరియడ్ డ్రామాగా ద ఫేవరేట్ చిత్రాన్ని తెరకెక్కించిన దర్శకుడు యార్గోస్ లుంథిమస్ కూడా ఉత్తమ దర్శకుడిగా ఆస్కార్ అందుకునే అవకాశాలున్నాయి.

నామినేషన్స్ అందుకున్న ఎ స్టార్ ఈజ్ బార్న్ తో ఉత్తమ చిత్రం విభాగంలోనూ రోమా పోటీ పడుతోంది. రోమా ఉత్తమ చిత్రంగా ఆస్కార్ అందుకుంటే...ఈ ఘనత సాధించిన ఆంగ్ల భాషేతర చిత్రంగా చరిత్ర సృష్టిస్తుంది. మెక్సికన్ భాషలో రోమా రూపొందింది.

ఉత్తమ నటుడు విభాగంలో వైస్ చిత్రంలో నటించిన క్రిస్టియన్ బాలే ముందున్నారు. ఏ స్టార్ ఈజ్ బార్న్ చిత్ర నటుడు బ్రాడ్లే కూపర్ కూడా గట్టి పోటీనిస్తున్నారు. అమెరికన్ ఉపాధ్యక్షుడు డిక్ చెనీ జీవిత కథతో వైస్ సినిమా తెరకెక్కింది. చెనీ పాత్రలో క్రిస్టియన్ బాలే బాగా నటించాడనే ప్రశంసలు దక్కాయి.

ఉత్తమ నటి విభాగంలో గ్లెన్ క్లోజ్, లేడీ గాగ, ఆక్టీవియా కాల్మన్, మెల్లిసా మెకార్తీ...ద వైఫ్ చిత్రంలో అద్భుత నటన కనబర్చిన గ్లెన్ క్లోజ్ పోటీలో ముందుంది. ఈమెకు ఉత్తమ నటిగా ఆస్కార్ దక్కుతుందని ముందస్తు అంచనాలు చెబుతున్నాయి. గ్లెన్ క్లోజ్ ఆరు సార్లు ఆస్కార్‌కు నామినేట్ అవడం ఆమె నట ప్రతిభను చూపిస్తోంది. ఏ స్టార్ ఈజ్ బార్న్ నటి లేడీ గాగకు కూడా ఆస్కార్ అందుకునే ఆస్కారం కనిపిస్తోంది.

ఉత్తమ సహాయ నటి పురస్కారానికీ గట్టి పోటీ నెలకొంది. ఇఫ్ బీల్ స్ట్రీట్ కుడ్ టాక్ అనే చిత్రంలో నటించిన తార రెజీనా కింగ్ ఆస్కార్ గెల్చుకుంటుందని అంచనాలు చెబుతున్నాయి. ద ఫేవరేట్ చిత్రంలో నటించిన ఇద్దరు నాయికలు ఎమ్మా స్టోన్, రాచెల్ వైజ్ లో ఒకరు ఆస్కార్ దక్కించుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ఇక ఉత్తమ యానిమేటెడ్ ఫీచర్ విభాగంలో స్పైడర్ మ్యాన్ - ఇంటో ద స్పైడర్ వెర్స్ ఆస్కార్ పోటీలో ముందుండగా...బెస్ట్ విజువల్ ఎఫెక్ట్ విభాగంలో అవేంజర్స్ ఇన్ఫినిటీ వార్ ఆస్కార్ అందుకునేలా కనిపిస్తోంది.


లేడీ గగా


ఎమ్మాస్టోన్

ప్రశ్నిస్తా అంటున్న విద్యార్థి నాయకుడు

నటుడు, దర్శకనిర్మాత పి.సత్యారెడ్డి తన తనయుడు మనీష్‌బాబుని హీరోగా పరిచయం చేస్తూ నిర్మిస్తున్న చిత్రం ప్రశ్నిస్తా. జనం ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై రాజా వన్నెంరెడ్డి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం లోగో ఆవిష్కరణ కార్యక్రమం హైదరాబాద్‌లో జరిగింది. దీనికి అతిథిగా విచ్చేసిన నిర్మాత బెల్లంకొండ సురేష్ మాట్లాడుతూ, నా ఆప్తమిత్రుడు సత్యారెడ్డి మంచి కథాచిత్రాలు తీశారు. వారి అబ్బాయి పరిచయం కాబోయే ఈ చిత్రం అందరూ అనుకునేవిధంగా రూపొందాలి అని ఆకాంక్షించారు. మరో అతిథి సి.కల్యాణ్ మాట్లాడుతూ, హీరోకి కావాల్సిన అన్ని లక్షణాలు మనీష్‌లో ఉన్నాయని, అతనిని హీరోగా చెయ్యమని లోగడ సత్యాకు చెప్పాను. అది ఈ రోజు వాస్తవరూపంలోకి రావడం సంతోషదాయకం. కాంబినేషన్ కన్నా కంటెంట్‌ని నమ్ముకుని సినిమా చేస్తే...మరిన్ని మంచి చిత్రాలు చేయొచ్చు అని అన్నారు. నిర్మాత సత్యారెడ్డి మాట్లాడుతూ, ఆ రోజు కల్యాణ్‌గారు అన్న మాట నిజమైంది. సమాజంలో జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలు, ప్రభుత్వ పాలసీల మీద ఒక విద్యార్థి నాయకుడు ఏ విధంగా పోరాడాడు? ఎలా ప్రశ్నించాడు అన్నదే ఈ చిత్రకథ. మా అబ్బాయి మనీష్‌ని ఆదరించాలని ప్రేక్షకులకు విజ్ఞప్తి చేస్తున్నా అని అన్నారు. దర్శకుడు రాజా వన్నెంరెడ్డి మాట్లాడుతూ, ఈ చిత్రంలో పెద్ద పెద్ద డైలాగ్స్‌ను మనీష్ చెప్పాడు. తన పాత్రలో గొప్ప నటనను కనబరిచారు. నేటి ట్రెండ్‌కి తగ్గట్టుగా ఈ సినిమా ఉంటుంది. సత్యారెడ్డి క్వాలిటీకి వెనుకాడకుండా ఈ సినిమాను నిర్మించారు అని అన్నారు. హీరో మనీష్‌బాబు మాట్లాడుతూ, అంచనాలకు తగ్గట్టుగా ఈ చిత్రం ఉంటుందని అన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో అక్షిత, హసీనా మస్తాన్ మీర్జా తదితరులు పాల్గొన్నారు.


మనీష్‌బాబు, హసీనా మస్తాన్ మీర్జా



నిఖిల్, లావణ్య త్రిపాఠి జంటగా నటిస్తున్న చిత్రానికి 'అర్జున్ సురవరం' అనే టైటిల్ ఖరారు చేశారు. తొలుత ఈ సినిమాకు 'ముద్ర' అని పేరు పెట్టారు. తాజాగా ఈ పేరు మార్చారు. కొత్త టైటిల్ లోగో విడుదల కార్యక్రమంలో నిఖిల్, లావణ్య త్రిపాఠి, చిత్ర దర్శకుడు సంతోష్, నిర్మాతలు పాల్గొన్నారు. యూరప్‌లో చివరిపాట చిత్రీకరణతో షూటింగ్ పూర్తిచేసినట్టు వారు చెప్పారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయని, మార్చి 29న సినిమాను విడుదల చేస్తామని వారు తెలిపారు. నిఖిల్ ఈ చిత్రంలో పాత్రికేయునుగా నటిస్తున్నారు. వెన్నెల కిషోర్, పోసాని కృష్ణమురళి, నాగినీడు, ప్రగతి, సత్య, తరుణ్ ఇతర పాత్రధారులు. టిఎన్.సంతోష్ దర్శకత్వంలో కావ్య వేణుగోపాల్, రాజ్ కుమార్ నిర్మిస్తున్నారు. బి.మధు సమర్పిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం: శ్యామ్, ఛాయాగ్రహణం: సూర్య.

ఎస్పీ బాలుకు మాతృవియోగం



ప్రముఖ గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం తల్లి శకుంతలమ్మ (89) కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంగా బాధపడుతున్న ఆమె ఈ రోజు ఉదయం తుదిశ్వాస విడిచారు. ప్రస్తుతం ఎస్పీ బాలు లండన్‌లో ఉన్నారు. అక్కడికి కచేరీల పని మీద వెళ్లారు. తల్లి మరణ వార్త తెలుసుకున్న బాలు..వెంటనే భారత్ బయలుదేరారు. సోమవారం సాయంత్రం ఆయన స్వదేశం చేరుకుంటారు. మంగళవారం శకుంతలమ్మ స్వస్థలమైన నెల్లూరులో అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

ఊరి కోసం సీమరాజ ఏం చేశాడు?


సాయికృష్ణ పెండ్యాల

రాజ కుటుంబానికి చెందిన ఓ కుర్రాడు ఆ ప్రతిష్టకు భిన్నంగా మెలుగుతుంటాడు. తన తాతయ్య హితబోధతో తన పద్ధతిని మార్చుకుని రాజసంగా బతకాలని నిర్ణయించుకుంటాడు. అందులో భాగంగా పేదలకు జరిగే అన్యాయాలను ప్రతిఘటిస్తూ... సీమరాజ కాస్తా నరసింహరాజుగా ఎలా రుద్రావతారం దాల్చాడు అన్న ఇతివృత్తంతో తమిళంలో రూపొందిన సీమరాజ చిత్రం ఇప్పుడు తెలుగు ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. శివకార్తికేయన్, సమంత నాయకానాయికలుగా పొన్‌రామ్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రాన్ని సాయికృష్ణపెండ్యాల తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు. ఈ నెల 8న ఈ చిత్రం విడుదలకానున్న సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లోని పాత్రికేయులతో నిర్మాత సాయికృష్ణ ముచ్చటించారు. నిర్మాతగా అభిరుచి గల చిత్రాలను అందించాలన్న తలంపుతో దండుపాళ్యం-3, కురుక్షేత్రం, మారి-2 వంటి చిత్రాలను తెలుగులో అనువదించాను. ఆ క్రమంలోనే ఇది నా నాలుగవ చిత్రం.

ఊరికి న్యాయం చేయడం కోసం...రైతుల భూములను తిరిగి ఇప్పించడం కోసం సీమరాజ అనే కుర్రాడు ఏం చేశాడన్న ప్రధానాంశంతో ఈ చిత్రం సాగుతుంది. ఇందులో ఐదు పాటలు, ఆరు ఫైట్స్ ఉన్నాయి. సమంతకు ఈ చిత్రంలో ఓ ఫైట్ కూడా ఉంది. డి.ఇమాన్ సంగీతం, బాలసుబ్రమణియన్ ఛాయాగ్రహణం చిత్రానికి నిండుదనాన్ని తీసుకుని వచ్చాయని అన్నారు.

ముఖ్యమంత్రి ఎవరు?

సమకాలీన రాజకీయ అంశాల నేపథ్యంలో రూపొందుతున్న చిత్రం 'నేనే ముఖ్యమంత్రి'. దేవీప్రసాద్, వాయు తనయ్, శశి, సుచిత్ర ప్రధాన పాత్రధారులు. మోహన్ రావిపాటి దర్శకుడు. అట్లూరి నారాయణరావు, ఆలూరి సాంబశివరావు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. అన్ని కార్యక్రమాలు పూర్తిచేశారు. ఇదే నెల 8న విడుదలకు సిద్ధమైంది.

నిర్మాతలు మాట్లాడుతూ "మా సినిమాలో సమకాలీన రాజకీయాల గురించి చర్చించడం జరిగింది. అన్ని వర్గాలకు నచ్చే సినిమా అవుతుంది. సన్నివేశాలు, సంభాషణలు అందరినీ ఆలోచింపజేసే విధంగా ఉంటాయి. ఆర్టిస్టుల ప్రతిభతో పాటుగా సంగీతానికి కూడా మంచి ప్రాధాన్యత ఉంది. కాన్సెప్ట్ నచ్చి ఈ సినిమా నిర్మించాం. ప్రేక్షకులకు కూడా నచ్చుతుందన్న నమ్మకంతో ఉన్నాం అన్నారు. సినిమా బాగా వచ్చింది. ఇప్పటికే విడుదలైన పాటలకు మంచి స్పందన లభిస్తోంది. ఈ నెల 8న సినిమాను విడుదల చేస్తున్నాం" అని చెప్పారు. ఈ చిత్రానికి సంగీతం: ఫణి కల్యాణ్, ఛాయాగ్రహణం: కమలాకర్, రచనా సహకారం: హిరణ్మయి, సత్యబేబీ, రచన దర్శకత్వం: మోహన్ రావిపాటి.


దేవీప్రసాద్